

# నా స్మృతిలో చెగువేరా

ఫైడల్ కాస్ట్రో

ప్రజాశక్తి బుక్‌హౌస్

అనువాదం :
ఆర్.బి. జంధ్యాల
తెలకపల్లి రవి

ప్రచురణ సంఖ్య : 955
ప్రథమ ముద్రణ : ఆగస్టు, 2005
ద్వితీయ ముద్రణ : జులై, 2006

వెల : రు. 40/-

టైటిల్ : శ్రీరాం కారంకి

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి
హైదరాబాద్-20. ఫోన్ : 27660013

బ్రాంచీలు
హైదరాబాద్, విజయవాడ,
విశాఖపట్నం, తిరుపతి, ఖమ్మం,
హన్మకొండ, నల్గొండ, గుంటూరు

ముద్రణ
ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, హైదరాబాద్



# వీర యోధుడు...

ప్రథమ సోషలిస్టు రాజ్య స్థాపనకు దారితీసిన అక్టోబరు విప్లవంతో గాని, ప్రపంచపు రూపురేఖలు మారడానికి దోహదపడిన చైనా విప్లవంతో గాని ఆయనకు ప్రత్యక్షంగా సంబంధం లేదు. కాని ఆయన పేరు విశ్వవ్యాపితంగా విప్లవం అన్న మాటకు ప్రతీకగా ప్రేరణగా నిలబడింది. ఒక్కమాటలో చెప్పాలంటే విప్లవం అన్న మాట వినపడగానే ఆయన స్ఫురద్రూపం కళ్లలో కదలాడుతుంది. కదిలిస్తుంది. ఆయనే ఎర్నెస్టో చే గువేరా. జాషువా అన్న విశ్వనరుడూ, మార్క్స్ వూహించిన శ్రామికవర్గ అంతర్జాతీయ విప్లవకారుడూ ఆయన. సామ్రాజ్యవాదానికి సింహస్వప్నం, స్వచ్ఛమైన సామ్యవాద వ్యక్తిత్వానికి సజీవ తార్కాణం ఆయన.

ఈ పుస్తకం చే జీవితాన్ని, పోరాటాన్ని, వీర మరణాన్ని, అనంతర పరిణామాలను కళ్లకు కట్టినట్టు చిత్రించే అపురూప గ్రంథం. దీన్ని మనకు అందించింది కూడా ఎవరో కాదు - నాయకుడుగా, సహచరుడుగా చే ను నడిపించి లాటిన్ అమెరికాలో అరుణతార వెలిగించిన ఫైడెల్ కాస్ట్రో. చే విశిష్ట జీవితంలాగే వీరమరణం కూడా ప్రపంచ సంచలనమై అనేక కథలూ, కట్టుకథలకు దారితీసినపుడు కఠోర సత్యాలను వెల్లడిచేస్తూ కాస్ట్రో చేసిన ప్రసంగాలు, రచనలు, ఇంటర్వ్యూల సంకలనం ఇది.

ఎర్నెస్టో గువేరా డి లా సెర్నా 1928లో అర్జెంటీనాలోని రోసిరోలో జన్మించాడు. బ్యూనస్ ఎయిర్స్‌లో వైద్య విద్య అభ్యసించాడు. చదువు పూర్తయ్యాక లాటిన్ అమెరికా అంతటా పర్యటించాడు. 1954లో గ్వాటిమాలా చేరుకున్నాడు. అప్పుడు అక్కడ ప్రజలెన్నుకున్న జాకబ్ అర్బెంజ్ ప్రభుత్వం పాలన చేస్తున్నది. అక్కడ సాగే ప్రజా కార్యాచరణలో చే పాలు పంచుకున్నాడు. ఆ ప్రజాస్వామిక చైతన్యం సహించలేని అమెరికా సిఐఎ ప్రోద్బలంతో ఆ ప్రభుత్వాన్ని కూలదోసిన తీరు గువేరా ప్రత్యక్షంగా చూశాడు. తన ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లడంతో తప్పనిసరి పరిస్థితుల్లో మెక్సికో సిటీ వెళ్లాడు. నియంత బాటిస్టాను కూలదోసేందుకై పోరాడుతున్న క్యూబా విప్లవకారులతో అక్కడే పరిచయమైంది. 1955 జులైలో గువేరా కాస్ట్రోను కలుసుకున్నాడు. కాస్ట్రో వ్యక్తిత్వం, వ్యూహరచన అతనికి ఎంతగానో నచ్చాయి. వారితో పాటు పోరాటంలో చేరాడు. క్యూబన్లే అతనికి చే అని పేరు పెట్టారు. అర్జెంటీనాలో ఆత్మీయులను ప్రేమగా పిలిచే పేరు అది. 1955 ఆగష్టు19న గువేరా హిల్డా గడేయా అనే పెరూ ఆర్థికవేత్తను వివాహం చేసుకున్నాడు. కొద్దిమంది సన్నిహితులు మాత్రమే ఆ వివాహానికి హాజరైనారు.

అక్కడి నుంచి గువేరా క్యూబా విప్లవకారులతో కలసి బయలుదేరాడు. గ్రాన్మా యుద్ధనౌకలో క్యూబా చేరి సెరియా మెస్త్రా పర్వత శ్రేణులు చేరుకున్నారు. అక్కడి నుంచి నెమ్మదిగా క్యూబా అంతటికీ తమ కార్యకలాపాలు విస్తరించారు. మొదట్లో దళం డాక్టర్‌గా ప్రవేశించిన చే 1957 జులై నాటికి దాని మొదటి కమాండర్ అయ్యాడు. 1958 సెప్టెంబరులో చే కామిలో సైన్‌ఫ్యూజియస్‌ల నాయకత్వంలో సెర్రియామెస్త్రా నుంచి రెండు దళాలుగా బయలుదేరారు. నియంత సైన్యాల భీకర దాడిని తట్టుకుని దేశంలో చాలా భాగంలోకి విస్తరించారు. 1958 డిసెంబర్ చివరకు తిరుగుబాటు సేనలు శాంతా క్లారా పోరాటంలో విజయం సాధించారు. ఇది గొప్ప మూలమలుపులాంటి విజయం.

1959 జనవరి మొదటి తేదీన విప్లవ ప్రభుత్వం ఏర్పడ్డాక చే గువేరా కీలకమైన బాధ్యతలు చేపట్టాడు. 1959 సెప్టెంబరులో జాతీయ భూ సంస్కరణల సంస్థలో పరిశ్రమల విభాగం అధిపతి అయ్యాడు.అదే నవంబరులో జాతీయ బ్యాంకు అధ్యక్షుడైనాడు. 1961 ఫిబ్రవరిలో పరిశ్రమల శాఖ మంత్రి అయ్యాడు. ఆయన రాజకీయంగానూ క్యూబా పీపుల్స్ పార్టీ కేంద్రంలో కీలక బాధ్యతలు నిర్వహించాడు. అదే 1965 తర్వాత క్యూబా కమ్యూనిస్టు పార్టీగా మారింది.

గువేరా క్యూబా తరఫున అంతర్జాతీయ వేదికలపై ప్రాతినిధ్యం వహించారు. ఐక్యరాజ్యసమితి తదితర సంస్థలలో ప్రసంగించారు. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా గళమెత్తి గర్జించారు.

క్యూబా విప్లవ ప్రభుత్వం అనేక మౌలిక సంస్కరణలు ప్రారంభించింది. నియంతృత్వ ప్రభుత్వ నిర్బంధ యంత్రాంగం కూల్చివేయబడింది. ఇవి అమలు కావడం అమెరికాకు ఏ మాత్రం ఇష్టం లేదు. వారు క్యూబాపై రకరకాలుగా దుష్ప్రచారాలు సాగించారు.నూతన ప్రభుత్వం కమ్యూనిస్టుల చొరబాటుకు గురవుతున్నదనేది ఆ ప్రచారంలో ప్రధానమైంది. గువేరా, రావుల్ కాస్ట్రో వారి దాడికి ప్రత్యేక లక్ష్యంగా వుండేవారు. గువేరా పుట్టుకరీత్యా క్యూబన్ కాదనే అంశాన్ని అడ్డం పెట్టుకుని ప్రత్యేకంగా దాడి చేస్తుండేవారు. (వాస్తవానికి క్యూబా విప్లవానికి చేసిన అసాధారణ సేవలను దృష్టిలో పెట్టుకుని క్యూబా ప్రభుత్వం 1959 ఫిబ్రవరి 9న గువేరాకు క్యూబా పౌరసత్వం జారీ చేసింది) అయినా అమెరికా పత్రికలు రభస చేస్తూనేవున్నాయి. చే ను భూ సంస్కరణల విభాగంలో నియమించినప్పుడు దేశంలోని మితవాద పత్రిక 'ఎల్ డైరోడీ లా మారినా'లో వరుసగా దాడి సాగితే కాస్ట్రో దాన్ని శక్తివంతంగా తిప్పికొట్టాడు. ఎవరు ఎలాంటివారో ఎవరు వెన్నుపోటుదారులో మాకు బాగా తెలుసునని, చే ఇచ్చిన బాధ్యతను అపారమైన ధైర్యసాహసాలతో అంకితభావంతో నెరవేర్చే కామ్రేడ్ అని కాస్ట్రో టీవీ ఇంటర్వ్యూలో చెప్పాడు.

మళ్లీ చేను 1959 నవంబరు 29 న జాతీయ బ్యాంకు అధ్యక్షుడుగా నియమించినపుడు అమెరికా పత్రిక "యుఎస్ న్యూస్ అండ్ వరల్డ్ రిపోర్ట్" "కాస్ట్రో వెనక ఎర్ర నియంత" అంటూ విషం కక్కింది.

"ఫైడెల్ కాస్ట్రో, అతని సోదరుడు రావుల్ కాస్ట్రోల వెనక నిలబడింది ఎవరో చూడండి. అతనే క్యూబాలో నిజమైన ఎర్ర నియంత. (చే) గువేరా కాస్ట్రో క్యూబా ప్రభుత్వపు



నిజమైన ఆలోచనాదారు. అతను క్యూబన్ కాదు అర్జెంటీనియన్. స్వతహాగా ఆవేశపరుడైన లాటిన్ అమెరికన్‌కాదు. కరుడుగట్టిన కమ్యూనిస్టు.

"గువేరాకు సంబంధించినంతవరకూ కాస్ట్రో క్యూబా కేవలం ఒక అడుగు మాత్రమే. క్రమేణా అతను లాటిన్ అమెరికానంతటినీ ఎర్ర దురాక్రమణ చేయాలనుకుంటున్నాడు.

"వేగంగా సాగుతున్న ఈ కాలంలో అమెరికాపెట్టుబడులనూ స్తంభింపచేసిన ఈ తరుణంలో అన్ని అదుపు చేస్తున్నది. ఫైడెల్ కాని, రావుల్ కాని కాదు, గువేరానే. గువేరాను అంతర్జాతీయ కమ్యూనిస్టు ఏజంటుగా చెబుతారు. అతను క్యూబా ఆర్థిక వ్యవస్థను నడిపించే వనరులు కనుగొనాల్సి వుంది. అతను మిగిలిన హోదాలతో పాటు క్యూబా జాతీయ బ్యాంకు చైర్మన్‌గా కూడా వున్నాడు. కార్పొరేట్ బ్యాంకు అయినా, ప్రైవేటు బ్యాంకు అయినా అన్ని ఖాతాలపైనా అతని హస్తం వుంటుంది. క్యూబా వనరులను ఎలా ఉపయోగించాలనేదానిలో అంతిమ నిర్ణయం అతనిదే.

"గువేరాకు సంబంధించినంతవరకూ క్యూబా అనేది కేవలం ఒక సంఘటన మాత్రమే. అక్కడ అతను అతని కమ్యూనిస్టు సహచరులు తమ నిజమైన లక్ష్యంగా పెట్టుకున్నదానిలో అదో చిన్నభాగం. వారి ఉద్దేశ్యంలో ఈ లక్ష్యం ఏమంటే క్యూబాను లాటిన్ అమెరికా అంతటినీ ఆక్రమించుకోవడానికి ఒక స్థావరంగా చేసుకోవాలనేది. .."

ఈ రాతలపై కాస్ట్రో తీవ్రంగా స్పందించాడు. 1959 డిసెంబరులో జాతీయ పంచదార కార్మికుల మహాసభలో మాట్లాడుతూ ఆక్రమ పద్ధతులలో సంపదలు పోగుపోసుకునేవారికి, విదేశీ శక్తులకు మార్గాలు మూసేసేందుకే చే ను నియమించామని ప్రకటించారు. మా అర్థిక వ్యవస్థను కాపాడుకోవడానికి, దేశాన్ని రక్షించుకోవడానికి ఈ నిర్ణయం జరిగిందన్నారు.

అయితే నిరంతర విప్లవకారుడైన చే గువేరాకు విప్లవ విజయానంతర క్యూబా ప్రభుత్వ వ్యవస్థలో భాగంగా కొనసాగడం సంతృప్తినివ్వలేదు. విజయం లభిస్తే తను మరో లాటిన్‌అమెరికా దేశానికి వెళ్లి విప్లవంలో పాల్గొంటానని ముందే కాస్ట్రో దగ్గర మాట తీసుకున్నాడు. అందుకే ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించిన తర్వాత 1965 మార్చి 14న గువేరా క్యూబా తిరిగొచ్చాడు. ఆ పైన కొద్ది రోజులకే ప్రజల దృష్టిలో కనపడకుండా పోయాడు. 1965లో ఆఫ్రికా వెళ్లి అక్కడ కాంగోలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో పాల్గొన్నారు. (కాంగోలో పాట్రిస్ లుముంబా నాయకత్వాన ప్రగతిశీల ప్రభుత్వ మేర్పడితే అమెరికా దాన్ని కూలదోసి ఆయనను హత్యచేయించింది). ఐరాసలో తను ప్రస్తావించిన కాంగోకే వెళ్లి పోరాటంలో పాల్గొన్నాడు. అప్పుడే ఆయన ఆచూకిపై అనేక రకాల కట్టుకథలు ప్రబలాయి. వాటిని 1965 జూన్ 16న ఒక సభలో కాస్ట్రో తోసిపుచ్చారు. గువేరా కనిపించడం లేదంటే అందుకు ఆయన కారణాలేవో ఆయనకు వుంటాయని కాస్ట్రో అన్నారు. అతన్ని గురించి వార్తలు రావడం లేదంటే అతనెప్పుడూ ప్రచారం కోరుకున్న మనిషి కాదని గుర్తు చేశారు. గువేరా ఆరోగ్యం బాగాలేదని కథలు రావడం అలా జరగాలనుకునే వారి కోర్కెను బయటపెడుతుందని కాని అలాంటి పరిస్థితేమీ లేదని స్పష్టం చేశారు.

1965లో కాంగో చేరిన చే గువేరా టాంజానియాకు, తూర్పు యూరప్‌లోని సోషలిస్టు దేశాలకు వెళ్లివచ్చాడు. 1965 డిసెంబరులో రహస్యంగా క్యూబా తిరిగొచ్చి

కాస్ట్రో సలహాపై విప్లవ దళం సమకూర్చుకుని ప్రత్యేక శిక్షణ పొందాడు..1966 నవంబరులో మారువేషంలో ఐరోపా మీదుగా బొలీవియా బయిలుదేరి వెళ్లాడు. బొలీవియా వెళ్లేముందు ఆసియా ఆఫ్రికా లాటిన్ అమెరికా ప్రజల సంఘీభావ సంస్థను ఉద్దేశించి చే ఒక సందేశం పంపించాడు. 1966 జనవరిలో జరిగిన మహాసభలో ఏర్పడిన ఈ సంస్థకు రాసిన లేఖలో గువేరా వియత్నాం పోరాటానికి సంఘీభావం తెల్పాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పాడు. 1967 జులై ఆగష్టులో హవానాలో జరిగిన సంస్థ మహాసభలో ఆ లేఖను ప్రముఖంగా వినిపించారు. గువేరాను తమ గౌరవాధ్యక్షుడుగా ఎన్నుకున్నారు. తర్వాత దాన్ని ప్రముఖంగా అంతర్జాతీయ పత్రికలలో ప్రచురించారు కూడా.

చిలీ, అర్జెంటీనా, పరాగ్వే సరిహద్దులో గెరిల్లా స్థావరం ఏర్పరచుకున్న చే బొలీవియా సైనిక ప్రభుత్వంపై 11 మాసాల పాటు విప్లవ పోరాటం సాగించాడు. ఆయన దళంలోని యాభై మందిలో 17 మంది క్యూబన్లు వుండేవారు. చే ఎక్కడ వుండి పోరాడుతున్నది పెద్దగా తెలియదు. అతన్ని ఎక్కడెక్కడో చూశామంటూ కథలు వచ్చేవి. పెరూ, కొలంబియా, గ్వాటిమాలా, ఆఖరుకు వియత్నాంలో కూడా చే కనిపించినట్టు చెప్పేవారు.

అమెరికా శిక్షణ పొందిన బొలీవియా సైన్యాలు 1967 అక్టోబరు 8న గువేరాను పట్టుకున్నాయి. ఆ మరుసటి రోజున క్రూరంగా చంపేశాయి.

## 2

గువేరాను క్యూబా విప్లవంవైపు ఆకర్షించి కీలక బాధ్యతలు అప్పగించిన కాస్ట్రో అతనికంటే రెండేళ్లు మాత్రమే పెద్ద. 1926 ఆగష్టు 13న జన్మించిన కాస్ట్రో యూనివర్సిటీలో చదువుతూ వుండగా రాజకీయ పోరాటాల వైపు ఆకర్షితుడైనాడు. అప్పట్లో ఆర్తడాక్స్ పార్టీగా పిలవబడిన క్యూబా పీపుల్స్ పార్టీలో పనిచేస్తూ దాని నాయకునిగా ఎదిగారు. డొమినికన్ దేశంలోని ట్రోజిల్లో నియంతృత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం చేసేందుకు ముందుకొచ్చాడు. కొలంబియాలోనూ సామ్రాజ్యవాద వ్యతిరేక విద్యార్థి మహాసభలోనూ, బొగోటాలో జరిగిన ప్రజా వెల్లువలోనూ పాల్గొన్నాడు.

1952 మార్చి 10న క్యూబాలో బాటిస్టా నాయకత్వాన సైనిక కుట్ర జరిగింది. అప్పటి నుంచి కాస్ట్రో విప్లవ తిరుగుబాటుకు సన్నాహాలు చేయసాగాడు. శాంటియాగా డి క్యూబాలోని మంకాడా ఆయుధాగారంపై 1953 జులై 26న చేసిన దాడి విఫలమై వారు పట్టుపడ్డారు. కాస్ట్రోను మరో పన్నెండుమందితో సహా పట్టుకుని విచారణ జరిపారు. 60 మందికి పైగా విప్లవకారులను హతమార్చారు. ఆ సందర్భంగానే కాస్ట్రో చరిత్ర నన్ను నిర్దోషిగా నిరూపిస్తుంది అంటూ చరిత్రాత్మకమైన ప్రసంగం చేశాడు. అది విస్తృతంగా పంపిణీ జరిగి ఒక విప్లవ పత్రంగామారింది. కాస్ట్రో బృందానికి 15 సంవత్సరాలు జైలుశిక్ష విధించబడినా ప్రజల ఒత్తిడి ఫలితంగా 22 మాసాలలోనే విడుదలైనారు. తర్వాత 1955లో మెక్సికో వెళ్లినపుడు కాస్ట్రోకు గువేరా పరిచయమయ్యాడు. గువేరాకు క్యూబన్లతో సంబంధం కూడా అనుకోని రీతిలో జరిగింది. వాస్తవానికి అతను గ్వాటిమాలాలో వున్నప్పుడే క్యూబా విప్లవంపై ఆసక్తిపెంచుకున్నాడు. కాస్ట్రో బృందంలో నికో అనే యోధుడుండేవాడు. ఆరడుగుల నికో



అంటే అందరికీ తగని అభిమానం. వెనకబడిన కుటుంబం నుంచి వచ్చిన నికో పెద్దగా చదవగలిగే వాడు కాదు. మవానా రేవులో కూలీగా బరువులు మోస్తూనే విప్లవభావాలు తెలుసుకునేవాడు. గ్వాటిమాలాలో వుండగానే చేతో క్యూబా విప్లవం గురించి మొదటగా మాట్లాడింది ఈ నికోనే. (ఇతను గ్రాన్మా ప్రస్థానం తర్వాత 1956 డిసెంబరు 6న మరణించాడు)

గ్వాటిమాలాలో జాకోబ్ అర్బెంజ్ ప్రభుత్వాన్ని కుట్రతో కూలదోసిన తర్వాత గువేరా మెక్సికో చేరుకున్నాడు. పది మాసాల తర్వాత అక్కడే కాస్ట్రోనుకలుసుకున్నాడు. తను మొదట రావుల్ కాస్ట్రోను ,తర్వాత క్యూబా విప్లవ నేతను కలుసుకున్నానని చే రాసుకున్నాడు. ఆ రాత్రంతా ఫైడెల్ కాస్ట్రోతో గువేరా సంభాషణలు కొనసాగాయి. సూర్యోదయమైంది. వాస్తవానికి ఎవరూ ఏ మాత్రం నచ్చజెప్పనవసరంలేకుండానే తాను క్యూబా విప్లవంలో చేరేందుకు అనుకూలంగా వున్నాడు. కాని కాస్ట్రో నాయకత్వ లక్షణాలు అతని విశ్వాసాన్ని మరింత పెంచాయని తర్వాత కాలంలో ఒక ఇంటర్వ్యూలో స్వయంగా చెప్పాడు. కాస్ట్రో ఈ కార్యకలాపాలన్ని ఎంతో నిశ్శబ్దంగా ఎలాటి ప్రచారం లేకుండా చేసుకుపోయాడు. గువేరా స్వభావమూ అదే.

## 3

గువేరా ఒక్కసారిగా అదృశ్యమైనపుడు దానిపై రకరకాల కథలు ప్రచారంలోకి వచ్చాయి. క్యూబాకు ఆగర్భ శత్రువైన అమెరికా పత్రికలు ఇందులో ముందున్నాయి. వారిద్దరి మధ్యా విభేదాలు వుండడం వల్లనే గువేరా వెళ్లిపోయాడని, అతని ఆచూకీ అంతుపట్టడం లేదని ఏదేదో రాశాయి. తొలిదశలో అతని క్షేమం దృష్ట్యా క్యూబా ప్రభుత్వం మౌనం పాటించింది. అన్నీ భరించింది. చివరకు 1967లో అతను హత్యగావించబడ్డాడని నిర్ధారించుకున్న తర్వాతనే కాస్ట్రో అందుకు సంబంధించిన పూర్తి వాస్తవాలు బయట పెట్టాడు. వాటిలోనే ఆయన చే వ్యక్తిత్వ విశిష్టతకు నివాళులర్పించారు. అదే సమయంలో గెరిల్లా యుద్ధంలో చే అనుసరించిన పద్ధతులలో కొన్ని లోపాలను చూపడానికి కూడా కాస్ట్రో సంకోచించలేదు. వాటిని, తర్వాత వివిధ దశలలో చే గురించి చేసిన ప్రసంగాలను కలిపి ఈ పుస్తకం రూపొందింది. దీనికి డేవిడ్ డెష్మ్యాన్ సంపాదకుడుగా వ్యవహరించారు. ఇంగ్లీషులో జీసస్ మోనాంటే ముందుమాట రాశారు. వాటన్నిటి సారాంశమే ఈ ఉపోద్ఘాతం.

చే రచనలలో కొన్ని ఇప్పటికే తెలుగు పాఠకులకు అందజేశాము. అలాగే కాస్ట్రో తొలిజీవితం, క్యూబా కొనసాగుతున్న విప్లవం అన్న పుస్తకం కూడా ప్రచురితమైనాయి. చే గురించిన కాస్ట్రో స్మృతులు అన్న పుస్తకం ఇప్పుడు వెలువడుతున్నది. ప్రపంచ ప్రసిద్ధమైన బొలీవియాడైరీ కూడా త్వరలోనే వస్తుంది. ఇవన్నీ ఆ విప్లవ నేతలను, క్యూబాను అర్థం చేసుకోవడానికి దోహదపడగలవని ఆశిస్తున్నాము.

**- ప్రజాశక్తి బుక్‌హౌస్**

# 1

**1965** ప్రాంతంలో చేగువేరా అదృశ్యం అవటం గురించి పుకార్లు ఎక్కువయ్యాయి. విప్లవకారుల్లో చీలికలు తెచ్చేందుకై రసవత్తరమైన కథలు పుట్టుకొచ్చాయి. ప్రచారం చేశారు. కాస్ట్రో-గువేరాల మధ్య సంబంధాలు బెడిసికొట్టాయని ఆరోపణలు వచ్చాయి. కాస్ట్రో గువేరా నోరు నొక్కేశాడని, దేశం నుంచి పంపేశాడని, చంపివుండొచ్చని కూడా నిందలు వేయసాగారు. ఉన్నది ఉన్నట్లు నివేదించడం అనే పేరుతో ఈ ఆరోపణలు కొన్ని వామపక్షాల్లోనూ ప్రతిధ్వనించాయి.

1965 సెప్టెంబరు 28న జరిగిన ఓ మహా ప్రదర్శనలో కాస్ట్రో ఒక ప్రకటన చేశాడు. చే గువేరా క్యూబా వదిలి వెళ్ళేముందు తనకు రాసిన ఉత్తరాన్ని ఇంకో కొద్ది రోజుల్లోనే బహిర్గతం చేయనున్నట్టు ఆ ప్రకటన. కాస్ట్రో మాటల్లోనే "ఆ సందర్భంలోనే ఎర్నెస్టో గువేరా గురించి నేరుగా ప్రజలతోనే మాట్లాడుతాం". "మన శత్రువు ఎన్నో పుకార్లను ప్రచారం చేశాడు. ఒకసారి చే ఇక్కడ ఉన్నాడంటాడు. ఇంకోసారి ఎక్కడో ఉన్నాడంటాడు. మరోసారి చనిపోయి ఉంటాడంటారు. తను ఒకోసారి కంగారు పడతాడు. మనల్ని కంగారు పెడతాడు. ఇదంతా డొంకతిరుగుడుగా ఉంది. ఎర్నెస్టో గువేరా పత్రం ఒకటి మేము బహిర్గతం చేస్తాం. కొద్ది నెలలుగా గువేరా ఏమయ్యాడన్న విషయాన్ని అదే తెలియజేస్తుంది. ఆ రోజునే నెనెంతో చెబుతాను. (లేదు ఇప్పుడే చెప్పాలి. ఇప్పుడే చెప్పాలి - సభలో కేకలు). ఇప్పుడా! వద్దు. ఎందుకంటే ఆ పత్రాన్ని నా వెంట తెచ్చుకోలేదు కూడా. ఇప్పుడు ప్రకటన మాత్రం చేస్తున్నాను. ఆ రోజు పత్రాన్ని చదువుతాం. అందులోని కొన్ని విషయాల గురించి చర్చిస్తాం కూడా."

మూడు రోజుల తర్వాత కొత్తగా ఏర్పడే క్యూబా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యులను టెలివిజన్ ద్వారా పరిచయం చేసే సభ గురించి కాస్ట్రో చెబుతున్నాడు. ఆ కమిటీలో గువేరా పేరు లేకపోవటం కూడా అపార్థాలకి దారితీసింది. 1965 అక్టోబరు మూడున కాస్ట్రో ఉపన్యాసంలో భాగాలు ఇవి. ఆ రోజు గువేరా కుటుంబ సభ్యులు కూడా కాస్ట్రో ఉపన్యాసం విన్నవారిలో ఉన్నారు

సమయంలో మనం చదువుకోవటానికే. ఇంకా ఖచ్చితంగా చెప్పాలంటే ఈ సంవత్సరం ఏప్రిల్ ఒకటవ తేదీన అది అందించబడింది. అంటే ఆరు నెలలా రెండు రోజులు ముందన్నమాట, వినండి.

హవానా

ఫైడల్

ఈ క్షణంలో నాకు అనేక విషయాలు గుర్తుకు వస్తున్నాయి. మేరియా అంటోనియా ఇంట్లో ఆనాడు మనం కలుసుకున్నాం. నీవు ప్రతిపాదించిన వెంటనే నీతో రావడానికి అంగీకరించాను. ఆ సన్నాహాలలో మనం ఎన్నో ఆందోళనలకు గురయ్యాము. ఒక రోజు, నీవు చనిపోతే ఎవరికి తెలియచేయాలి? అని వారు అడిగారు. అలాంటి దానికి నిజంగా అవకాశం ఉందన్న ఆలోచన మనల్నందరినీ కదిలించింది. ఆ తర్వాత అది నిజమేనని తెలిసింది. విప్లవంలో ఎవరయినా విజయం సాధించవచ్చు. ప్రాణాలయినా కోల్పోవచ్చు. (అది నిజమైన విప్లవమయితే). మన విప్లవం విజయం సాధించే మార్గంలో కామ్రేడ్స్ అనేక మంది నేలకొరిగారు.

ఇప్పుడు మనకు ప్రతి విషయం అంత నాటకీయంగా కనిపించడంలేదు. ఎందువల్లనంటే మనం మరింత పరిణత సాధించాం. కాని అప్పటి పరిస్థితి ఇప్పుడు పునరావృతమవుతున్నది. క్యూబా విప్లవంలో నా వంతు బాధ్యతను నిర్వర్తించానని భావిస్తున్నాను. నీకు, కామ్రేడ్స్‌కు, ఇప్పుడు నా వారిగా మారిన మీ ప్రజలకు వీడ్కోలు చెబుతున్నాను.

పార్టీలో నాయకత్వ స్థానానికి, మంత్రిపదవికి, సైన్యం కమాండర్ హోదాకు, నా క్యూబా పౌరసత్వానికి ఇప్పుడు లాంఛన పూర్వకంగా రాజీనామా చేస్తున్నాను. చట్టపరంగా ఇప్పుడు క్యూబాతో నాకు ఎట్టి బంధం లేదు. క్యూబాతో నన్ను కట్టిపడవేసే బంధనాలు ఇప్పుడు వేరే స్వభావం కల్గినవి. ఒక పదవిని, హోదాను వదిలి వేసుకున్నట్లుగా అవి వదిలివేసుకునేవి కాదు.

గతాన్ని గుర్తు తెచ్చుకున్నప్పుడు విప్లవ విజయాన్ని పటిష్టం చేయడంలో తగినంత అంకిత భావంతో, విశ్వాసంతో పని చేశాననే నాకనిపిస్తుంది. నేను ఒకే ఒక్క తీవ్రమైన తప్పిదం చేశాను. సియర్రా మాయెస్త్రాలో మనం మొట్టమొదటిసారిగా కలుసుకున్నప్పుడే నీపట్ల మరింత విశ్వాసాన్ని ఉంచకపోవడం, ఒక నాయకునిగా, విప్లవకారునిగా నీలోని లక్షణాలను త్వరితంగా అర్థం చేసుకోలేకపోవడం - ఇదే నేను చేసిన ఆ పొరపాటు.

క్యూబాలో నేను అద్భుతంగా గడిపాను. నీ పక్షాన ఉన్నందుకు, ఆనాటి విచారకరమైన కరేబియా సంక్షోభంలో మన ప్రజలతో ఉన్నందుకు నేను గర్వపడుతున్నాను.



అతి కొద్ది మంది రాజనీతిజ్ఞులు మాత్రమే ఆ రోజుల్లో నీవు వ్యవహరించిన విధంగా వ్యవహరించగలరు. ఏ మాత్రం సంకోచించకుండా నీ వెంటనడిచినందుకు నేనెంతో గర్వపడుతున్నాను. నీ ఆలోచనా పద్ధతులతోను, ప్రమాదాలను పసిగట్టడం, వాటి గురించి అంచనా వేయడంతోను, నీవు అనుసరించిన సూత్రాలతోను నేను సగర్వంగా ఏకీభవించాను.

ప్రపంచంలోని ఇతర దేశాలు కాస్తోకూస్తో నేను చేయకలిగిన కృషిని కోరుతున్నాయి. దాన్ని చేయగలను. క్యూబాకు అధినేతగా బాధ్యతలు నిర్వహించాల్సిన నీకు అలాంటి అవకాశం లేదు. మనం విడిపోయే సమయం ఆసన్నమయింది.

మిమ్మల్ని వదిలివెళ్తున్నందుకు సంతోషంగాను, విచారంగానూ ఉంది. ఈ దేశ నిర్మాణంలో పాల్గొన్న ఒక వ్యక్తిగా నా స్వచ్ఛమైన ఆశయాలను, నా ప్రియాతి ప్రియమైన వారిని ఇక్కడ వదిలివెళ్తున్నాను. నన్ను తమ పుత్రునిగా చూసుకున్న క్యూబా ప్రజలను వదిలి వెళుతున్నాను. ఈ భావనలే నా స్ఫూర్తిని కొంత గాయపరుస్తున్నాయి. మీరు నాకు బోధించిన విశ్వాసాన్ని, ప్రజల విప్లవ స్ఫూర్తిని, అత్యంత పవిత్రమైన బాధ్యతలను నెరవేర్చాలన్న భావనలను, సామ్రాజ్యవాదం ఎక్కడ ఉన్నా దానికి వ్యతిరేకంగా పోరాడాలన్న దృఢదీక్షను -నాతో తీసుకెళ్తున్నాను. ఈ ఆలోచనే నన్ను సేద తీరుస్తున్నది. లోతైన గాయాలను మాన్పివేస్తున్నది.

క్యూబాకు సంబంధించి అన్ని బాధ్యతల నుండి వైదొలగానని చెబుతున్నాను. క్యూబా విప్లవ ఉదాహరణ నుండి ఉద్భవించిన బాధ్యత ఒక్కదాన్ని మాత్రమే నాతో కలిగి ఉన్నాను. నా చివరి ఘడియలు వేరే దేశాల్లో సంభవించినట్లయితే, ఆ సమయంలో నేను తలచుకునేది క్యూబా ప్రజల్ని, ముఖ్యంగా నిన్ను మాత్రమే నీ బోధనలకు, నీ ఆదర్శానికి కృతజ్ఞతలు. చివరి వరకు నేను వాటిపట్ల విశ్వాసంతో ఉంటాను.

మన విప్లవం అనుసరించిన విదేశాంగ విధానంతో నేను సంపూర్ణంగా ఏకీభవించాను. ఇక ముందు కూడా దాన్ని కొనసాగిస్తాను. నేనెక్కడ ఉన్నా క్యూబా విప్లవకారునిగా నా బాధ్యతను విస్మరించను. దానికి అనుగుణంగానే నడుచుకుంటాను. నా పిల్లలకు, భార్యకు ఎలాంటి ఆస్తి వదిలి వెళ్ళనందుకు నేను సిగ్గుపడటంలేదు, సంతోషపడుతున్నాను. వారి కోసం నేనేమీ అడగటంలేదు. ప్రభుత్వమే వారి జీవనానికి తగినంత లభించేలా చూస్తుంది. అవసరమైన విద్యను అందిస్తుంది.

నీకు, మన ప్రజలకు చాలా చెప్పాలని ఉంది. కాని అది అనవసరం. వారు ఏం చేయాలో మాటల ద్వారా వ్యక్తం చేయలేను. నోట్ పుస్తకంలో పేజీలు అట్టిపెట్టడమే మంచిదని భావిస్తున్నాను. హాస్టా లా విక్టోరియా సియంప్రె! పాట్రియా ఓముయర్టె!

మీకు ప్రగాఢ విప్లవాభివందనాలు.

విప్లవకారులకు ఉద్వేగాలుండవని, బండబారి వుంటామని సున్నితమైన ఆలోచనలు

ఉండవని మాట్లాడేవారుంటే అటువంటి వారికి ఈ లేఖను వాటన్నిటికి ఉదాహరణగా చూపుతున్నాను. ఎంతో స్వచ్ఛంగా, ఉద్వేగంగా, సున్నితంగా ఉన్న ఈ విప్లవకారుడి అంతరంగాన్ని చూడమని సలహా ఇస్తున్నాను.

మనందరి తరఫున ఈ సమాధానం ఇస్తున్నాను.

కామ్రేడ్ గువేరా,

"బాధ్యత మమ్మల్ని కలవరపెట్టడంలేదు. మేము విప్లవానికి పూర్తి బాధ్యత వహిస్తున్నాం. బాధ్యతాయుతమైన విప్లవోద్యమాన్ని మా సర్వశక్తులతో ముందుకు తీసుకెళతాం. అందులో నుండి వచ్చిన పరిణామాల్ని, బాధ్యతల్ని, ప్రమాదాల్ని మేము స్వీకరిస్తున్నాము. ఏడేళ్ళుగా ఇలాంటి పరిస్థితులతోనే సహజీవనం చేస్తున్నాము. సామ్రాజ్యవాదం ఉన్నంత కాలం, ప్రజలు పీడింపబడుతున్నంత కాలం, వలస రాజ్యాలు ఉన్నంత కాలం మేము ఈ ప్రమాదాల్లో జీవిస్తున్నట్టే. పరిస్థితులు అలా ఉన్నంత కాలం మేము మా బాధ్యతల్ని మౌనంగా మోస్తూనే ఉంటాం."

ఆ కామ్రేడ్ భావాల్ని గౌరవించటం మన బాధ్యత. ఈ స్వతంత్ర్యాన్ని ఈ హక్కునూ కూడా గౌరవించాలి. సంకెళ్ళు వేసేటటువంటి స్వతంత్రంకాదు మనకు కావలసింది. సంకెళ్ళు ఛేదించేందుకు రైఫిళ్ళు ఎక్కుపెట్టేటటువంటి స్వతంత్ర్యం కావాలి. అదే నిజమైన స్వేచ్ఛ.

ప్రెసిడెంట్ జాన్సన్, మేము కోరుకునేది అటువంటి స్వేచ్ఛనే. వియత్నాం, కాంగోలలో పని చేయటానికి సామ్రాజ్యవాదులు నియమించిన వారు, లేదా వారితోనే సహజీవనం చేయదలచిన వారు నిరభ్యంతరంగా క్యూబా వదిలిపోవచ్చు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడేవారు మాత్రమే ఇక్కడ ఉండవచ్చు. విప్లవవాదులపై పోరాటం చేసేవారు ఇక్కడ ఉండనక్కరలేదు. వెళ్ళిపోవచ్చు. అలా వెళ్ళేవారిపై ఎటువంటి నిషేధం లేదు.

మిస్టర్ జాన్సన్! ఇదో 'స్వతంత్ర' దేశం. ఇక్కడ అందరికీ అది వర్తిస్తుంది.

ఎర్నెస్టో ఉత్తరం ఇదొక్కటే అనుకోవద్దు. దీనితోపాటుగా ఆయా సందర్భాల్లో ఒక్కొక్కటీ బహిరంగంగా చదువుతాం. చాలా మంది కామ్రేడ్స్‌కు అభినందనలు తెల్పుతూ రాసిన ఉత్తరాలు, 'నా పిల్లలను', 'నా తల్లితండ్రులను' సంబోధిస్తూ రాసిన ఉత్తరాలు, ఇతర కామ్రేడ్స్‌కు, తన పిల్లలకు, తన తల్లితండ్రులకు రాసిన ఉత్తరాలు కూడా ఉన్నాయి. ఎవరికి సంబంధించిన ఉత్తరాలు వారికి అందజేస్తాము. ఆ ఉత్తరాల్ని విప్లవానికి బహుకరించవలసిందిగా వారిని కోరతాము. ఎందుకంటే ఈ పత్రాలు చరిత్రకు సాక్ష్యాలు. ఇంకా చెప్పాలంటే చరిత్రలో ఇవి భాగాలు.

ఈ వివరణ సరిపోతుందనుకుంటాము. మిగిలింది. ఏదైనా ఉంటే అది శత్రువులనే కలవరపెడుతుంది. మనం దేశం కోసం, ప్రపంచం కోసం చేయవలసిన పనులు, కర్తవ్యాలు చాలా ఉన్నాయి. వాటిని తప్పకుండా నిర్వర్తిస్తాము.



# 2

**బొలీవియాలో చే మరణించాడని వినవస్తున్న విభిన్న కథనాలపై 1967 అక్టోబరు 15న క్యూబా టెలివిజన్‌లో కాస్ట్రో చేసిన ప్రసంగం.**

అక్టోబరు 9వ తేదీ నుండి బొలీవియా నుండి వస్తున్న వార్తలు, మన పత్రికల్లో వస్తున్న వార్తలు మీరు చూస్తూనే ఉన్నారు. అందు గురించే ఇప్పుడు మిమ్మల్ని కలిశానని కూడా మీకు తెలుసు.

బాధతో కూడినదైనా మీతో ఓ నిజం చెప్పక తప్పటం లేదు. మనకు వస్తున్న వార్తల్ని బట్టి కమాండర్ ఎర్నెస్టో గువేరా మరణించాడని ధృవీకరించుకున్నాము. ఇంతకుముందు కూడా ఆయన మరణానికి సంబంధించి కొన్ని కథనాలు రాకపోలేదు. అటువంటి వాటిని నిరాధారమైనవిగా పసిగట్టటం చాలా తేలిక.

కాని అక్టోబరు 9న వచ్చిన తంతి సమాచారం చూశాక కలత చెందాము. కానీ ఇప్పటికీ ఏదీ ఖచ్చితంగా లేదు. 10వ తేదీన కూడా తెంపరలుగా వార్తలొస్తూనే ఉన్నాయి. కాని అవి పొంతనలేకుండా ఉన్నాయి. ఉదాహరణకు అతని ఎడమచేతిపై గాయపు మచ్చ వుందని రాశారు. కానీ అతని ఎడమచేతిపై మచ్చ ఉన్నట్లు ఎవరికీ గుర్తులేదు. మెడపైన, కాలిపైన గాయపు మచ్చలున్నాయని మాత్రం గుర్తుంది. ఎందుకంటే ఓ పోరాటంలో బుల్లెట్ గాయం వల్ల ఏర్పడ్డవి అవి. ఇంకోసారి ప్రమాదంలో గాయపడటంవల్ల మొహంపై మచ్చ ఏర్పడింది. కానీ ఈ వివరాలేవీ వారు పేర్కొనలేదు. కొన్ని పరస్పర విరుద్ధమైన అంశాలు ఆ కథనాల్లో వున్నాయి. పైగా బొలీవియా నుంచి వచ్చే సమాచారమంటేనే అపనమ్మకం ఏర్పడిన స్థితి. అందుకే మాలో ఎవరమైనా 10వ తేదీన మధ్యాహ్నం వచ్చిన సమాచారంపై అనుమానాలు తీవ్రంగానే వ్యక్తం చేసేవాళ్ళం.

తరువాత కొన్ని సూచనలు గోచరించటం మొదలయింది. అక్టోబరు 10 అర్థరాత్రికి అందిన మొదటి ఫొటోను చూస్తే మాత్రం మనలో చాలా మందికి పోలికలు సరిగా కనబడలేదు. అందుకే అది చే చిత్రమని మనమెవరమూ అంగీకరించలేదు.

ఈ వార్త గురించి తప్పుగానో లేదా పుకారు పుట్టించడానికి చేసిన ప్రయత్నంగానో మేము అనుకోలేదు. అలా అయితే పూర్తిగా భిన్నమైన ఫొటోలు విడుదల చేసేవారు. కాని దీంట్లో చే ఫొటోలో ఉన్న పోలికలు పూర్తిగా కొట్టిపారేసే విధంగా లేవు. ఇది ఎంత సున్నితమైన

విషయమంటే ఆ ఫొటో చే ఫొటో అని చెప్పలేము. కాదని చెప్పలేము.

ఈ ఫొటో (చూపిస్తూ) చూడండి – అంత స్పష్టంగా లేదు. టి.వి. కెమెరా వాళ్ళు సరిగా తీశారని నేననుకోను. కాని కొద్ది గంటల్లోనే ఇంకో ఫొటో వచ్చింది. అందులో తప్పు చేయడానికి వీల్లేకుండా కొన్ని పోలికలున్నాయి. అయితే మరీ అంత స్పష్టంగానూ లేదు. మేము చాలా మందిమి దాన్ని చూశాక ఈ వార్త నిజమే అయివుండవచ్చుననుకున్నాము. మొదటిసారి మమ్మల్ని నమ్మేలా చేసింది. ఇదిగో ఆ ఫొటో ఇదే.

తరువాత మూడవ ఫొటో వచ్చింది. (చూపిస్తూ) అందులో శరీరం మొత్తం ఓ స్ట్రెచర్‌పై ఉంది. ఇదీ అస్పష్టంగానే ఉంది. పూర్తిగా నమ్మలేము.

మరుసటి రోజు ఇంకా చాలా ఫొటోలు రాసాగాయి. అందులోనిదే ఈ ఫొటో. చూడండి. ఇది చాలా స్పష్టంగా ఉంది. పేపర్‌పై ముద్రించినా కూడా స్పష్టంగా కనిపిస్తోంది.

ఇక్కడ మీకో విషయం వివరించాలి. మనం అంగీకరించామా లేదా అన్న విషయం పక్కన పెట్టి మొత్తం సంఘటనల్ని క్రోడీకరించి చూస్తే ఈ ఫొటో నిజమైనదని నమ్మవలసి వస్తోంది. కొద్దిగా వివరిస్తాను.

ఈ కొద్ది రోజుల్లో బయట నుండి వస్తున్న వార్తాపత్రికలు ఎక్కువగా ఫొటోలను ముద్రిస్తున్నాయి. ఇది చూడండి. కాగితంపై ముద్రించినందువల్ల స్పష్టత పోయింది. టీవీలో కనబటం కష్టం.

ఫొటోలతోపాటు సమాచారం కూడా ఎక్కువగా రాసాగింది. మొత్తం సమాచారం సేకరించి నిర్ధారించుకోవాలనే మా తపన. ఇందులో అనుమానాలకు తావుండరాదు. అన్ని ఫొటోలను, దేశ విదేశీ పత్రికలను సేకరించి బాగా పరిశీలించాలి.

తరువాత కొద్ది రోజులకే చే డైరీ (బొలీవియాలో రాసుకున్నది) స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. ఈ ఫొటోలో డైరీ కనిపిస్తుంది చూడండి. రెండు ఫొటోల్లో అవే (చూపిస్తూ)

అందుబాటులో ఉన్న నిజాలన్నింటినీ ఓ చోట క్రోడీకరించాకే మా అభిప్రాయం చెప్పాలని నిర్ణయించుకున్నాం.

అదే సమయంలో చే కుటుంబానికి సంబంధించిన సమస్య ఉదయించింది. చే తండ్రి, సోదరుడు అర్జెంటీనా నుండి బొలీవియా వెళ్ళటానికి తయారయ్యారు. వారు వెళ్ళివుంటే మనకు నిజం తెలిసే అవకాశం ఉండేది. వారు ప్రత్యక్షంగా చూసిన సమాచారం పంపుతారేమోనని కూడా వేచి చూశాము. వారు వెళ్ళారు కాని చే భౌతిక కాయాన్ని చూసే అవకాశాన్ని వాళ్ళకు ఇవ్వలేదు. ఈ వివరాలు మీకు తెలుసు.

అయినప్పటికీ మేము సున్నితమైన పరిస్థితిలో ఇరుక్కున్నాము. అర్జెంటీనా నుంచి వెళ్ళిన చే బంధువులు కూడా విచిత్రమైన పరిస్థితులనెదుర్కొన్నారు. మొదటి శవాన్ని భూమిలో పాతిపెట్టామన్నారు. తరువాత దహనం చేశామని చెప్పారు. అటువంటప్పుడు ఎవరి బంధువులైనా సరే ఆ వార్తను అసత్యమని అనుకోక తప్పదు. ఇక మా విషయానికి వస్తే చే మరణం నిజమేనని మాకు అప్పటికే తెలుసు. మా పరస్పర మిత్రుల ద్వారా అతని



బంధువులకు ఈ విషయం తెలిపే వరకూ మేమీ వార్త బహిర్గతం చేయదలచుకోలేదు. కాని మాకు తెలిసిన విషయం ఒకటుంది. చే తండ్రి, అతని బంధువులు ఇంకా చే బతికే ఉన్నాడని అనుకుంటున్నారు.

అది మామూలు వ్యక్తిగత విషయమయివుంటే మేము కూడా ఆ వార్తను నొక్కినొక్కి పరీక్షించేవారం కాదు. వారి అభిప్రాయానికి వ్యతిరేకమైన అంచనా బహిరంగంగా చెప్పేవారం కాదు. అదీకాక ఈ విషయం ప్రజల్లో ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్నది. ఇది ఓ అంతర్జాతీయ విషయం. ఇది మా ప్రజలపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తుంది. అందుకే ఈ విషయంపై మా అభిప్రాయాన్ని తెలియజేయటం మా బాధ్యతగా భావించాము.

ఏ చిన్న అనుమానం ఉన్నాసరే దాన్ని వ్యక్తం చేయటం మా విధి. అదో అసత్య సమాచారమని మేము భావిస్తే అది అసత్యమేనని ప్రకటించటం మా విధి. లేదా అది నిజమని మేం నిర్ణయించుకుంటే ఎన్నో ప్రశ్నలకూ సమాధానాలు వెతుక్కోవాలి.

అక్కడ నుండి వచ్చే సమాచారమంతా అతి కొద్ది మంది నడుపుతున్న ప్రభుత్వం నుండి వస్తున్నది. వారు ప్రజల్ని అణచివేసేవారు. సామ్రాజ్యవాదుల మిత్రులు. ఓ విప్లవ వ్యతిరేక, నిరంకుశ, ప్రగతి నిరోధక ప్రభుత్వపు సమాచారమది. ఏమైనా సరే ఆ వార్త నిజమేననడానికి కొన్ని సాక్ష్యాధారాలు కూడా మా దగ్గర ఉన్నాయి. ఏ విప్లవకారునికైనా ఇటువంటి పరిస్థితి బాధాకరమే.

ఈ వార్తపై లేనిపోని అనుమానాలను సృష్టించి వారేవైనా సాధిద్దామనుకున్నారేమోనన్న ఆలోచన కూడా వచ్చింది. పరిస్థితులెలా వున్నా సరే, వారేమనుకున్నా సరే నిజాన్ని చెప్పకుండా మమ్మల్ని ఏదీ ఆపలేదు. అటువంటి ఆలోచనలెవరికైనా ఉన్నా కూడా అవేవీ వారికి ఉపయోగపడవన్నది మా గట్టి నమ్మకం. అదో ఊహ మాత్రమే.

అటువంటి సందేహాస్పద స్థితిని కొనసాగనివ్వడంవల్ల ఏదైనా లాభం ఉన్నాసరే ఎటువంటి పరిస్థితిలోనూ మేము దాన్ని ఉపయోగించం. విప్లవం ఎప్పుడూ అసత్యాలను, అసత్యాలతో సహజీవనం చేయటాలను, నిజంపట్ల భయాలను తన ఆయుధంగా ఉపయోగించదు. మేము చెప్పే యదార్థం తెలుసుకోవటానికి దేశ విదేశాలలో ఉన్న విప్లవకారులందరూ ఎదురు చూస్తున్నారు. అలాగే మన ప్రజలు కూడా. వారికి అసత్యం ఎప్పుడూ తెలుపలేదనే విషయం కూడా వారికి తెలుసు. ఎటువంటి సత్యమైనా సరే ప్రజలకు నేరుగా చెప్పవలసి వస్తే ఖచ్చితంగా అలాగే చెబుతాము.

వార్తలు వెలువడుతున్నకొద్దీ ప్రజలు విప్లవ ప్రభుత్వం వైపు, పార్టీ (తమ పార్టీ) వైపు చూడసాగారు. ఏది సత్యమో, ఏది అసత్యమో ఖచ్చితంగా తెలుసుకోవడానికి వారు ఎంచుకున్న మార్గమిదే. అందుకే పరిస్థితులు ఎలా ఉన్నాసరే ముందే చెప్పినట్టు మా అభిప్రాయాన్ని తెల్పటం మా విధిగా తలచాము. కాని అతి సున్నితమైన విషయం ఒకటుంది. అదే అర్జెంటీనాలోని గువేరా బంధువులు తెల్పిన విషయాలు. ఎంతటి బాధ కలిగించేదైనా మేము ప్రకటించబోయే విషయం గురించి వారు మమ్మల్ని అర్థం చేసుకోవాలి. వారి

గురించి మేము ఆలోచించలేదని కాదు, అమర్యాదగా ప్రవర్తించామనీ కాదు. వారు అర్థం చేసుకోవాలి.

మరణవార్తను ధృవీకరించాలనే నిర్ణయించాము. చెదురుమదురుగా వున్న వార్తల్ని, నిజాల్ని, ఫొటోల్ని ఆధారం చేసుకొని మేమీ నిర్ణయానికి రాలేదు. కావలిస్తే ఫొటోలు సృష్టించడం పెద్ద పనికాదు. అవి ప్రభుత్వం పంపిన ఫొటోలే కాదు. బొలీవియాలో భౌతిక కాయం వద్ద పలువురు విలేకరులు తీసినవని. అందుకే ఆ ఫొటోల్ని కావాలని సృష్టించారనే అంశాన్ని నమ్మలేము.

ఇక్కడ ఇంకో ఊహాత్మక విషయం కూడా ఉంది. మైనంలో బొమ్మ తయారు చేసి ఉండవచ్చునేమో? ఇది ఎంత కష్టమో అంత అవాస్తవంగా కనిపిస్తున్నది.

అన్ని ఆధారాలతోపాటు దీన్ని కూడా విడిగా పరీక్షించాక అసాధ్యమేనని తేల్చాము. దీన్ని కూడా మొత్తం జరుగుతున్న దాంట్లో అంటే తెలుస్తున్న విషయాలు, వార్తలు ఇంకా ఇతర అంశాలతో కలిపి విశ్లేషించాలి.

ఉదాహరణకు చే దస్తూరి. అనుమానం లేకుండా అది అతనిదేనని చెప్పవచ్చు. ఎందుకంటే దాన్ని అనుకరించి రాయటం చాలా కష్టం. కష్టపడి అలా రాశారనుకున్నా చే వ్యక్తిత్వానికి, శైలికి దగ్గరగా రాయటం అసాధ్యం. అతనితో కలిసి తిరిగి, అతని గురించి బాగా ఎరిగి, అతనితో ఏళ్ళతరబడి సహజీవనం చేస్తే కాని అతనిలాంటి వాక్య నిర్మాణం, శైలి, భావ వ్యక్తీకరణ, ప్రతి విషయంపై అతను స్పందించే తీరు - ఇలా వీటిని అనుకరించటం సాధ్యంకాదు. అవి వదిలేసి వట్టి చేవ్రాలు సరిపోయేలా రాస్తే అయిపోదు. కాబట్టి అదీ అసాధ్యం.

ఒక వీరుడు మరణించాడని అతడి డైరీని చూసి చెప్పలేము. ఎందుకంటే అది ఎక్కడైనా పడిపోవచ్చు లేదా భద్రత దృష్ట్యా ఎవరికైనా ఇవ్వవచ్చు. అతణ్ణి చంపారనుకుంటున్న అక్టోబరు ఏడవ తేదీన మొదలైన పోరాటం వరకూ ఇది అతని దగ్గరే ఉంది. పోరాటానికి కొద్ది గంటల ముందు వరకూ అతను రాసిన విషయాలు అందులో ఉన్నాయి. అక్టోబరు ఎనిమిదవ తేదీన అది పోయి ఉండవచ్చు. ఆ రోజే ఈ సంఘటన జరిగింది.

ఇక్కడ ఇంకా కొన్ని ఆధారాల్ని గమనించాలి. ప్రపంచం నలువైపుల నుండి వస్తున్న వార్తా పత్రికల్లోని ఫొటోలను పరిశీలించాము. అందులో చే బొలీవియాలో ఉన్నట్లు స్పష్టమవుతుంది. ఈ ఫొటో చూడండి. ఇందులో చే తగిలించుకున్న సంచి అందులోని వస్తువుల్ని అతను సర్దుకునే విధానం, ఎం-2 రైఫిల్ కూడా మనం చూడవచ్చు. ఈ ఫొటో చూడండి, ఇందులో అతను ఓ కంచరగాడిదపై వెళ్తున్న ఫొటో యిది. నిటారుగా ఉన్న అతడిని ఏ అనుమానం లేకుండా గుర్తించవచ్చు. బహుశా ఫొటో తీస్తున్న వ్యక్తితో అతను ఏదో సరసంగా మాట్లాడినట్టున్నాడు. బహుశా శత్రువు యీ ఫొటోల్ని దొంగిలించినట్టుగా ఉంది. ఈ ఆధారాల్ని చూస్తే చే బొలీవియాలో ఉన్నట్టుగా స్పష్టమవుతుంది.

వార్తా పరంపరల్ని గమనిస్తే బొలీవియాలోకి గెరిల్లా దళాలు చాలా వచ్చినట్టున్నాయి. అందులో సామ్రాజ్యవాదుల ఏజెంట్లచే శిక్షణ పొందిన గెరిల్లా వ్యతిరేక



దళాలు కూడా ఉన్నాయి.

వీటన్నింటిని పరిశీలిస్తే చే మరణానికి సంబంధించి కొన్ని విషయాలు తెలుస్తాయి.

మా అభిప్రాయం ప్రకారం ఈ డైరీ, ఫొటోలు పూర్తిగా నిజమైనవే, వాస్తవికంగానైనా, సాంకేతికంగానైనా, ఏ విధంగా చూపినా వీటిని మోసంగా తయారు చేయటం అసాధ్యం. ఫొటోలు, డైరీ, వార్తలు రావటం అవి వచ్చిన పద్ధతి - ఇలా విశ్లేషిస్తే మేము తెలుసుకున్నదొక్కటే - సాంకేతికంగా ఇన్ని ఆధారాల్ని కల్పించడం కష్టమని.

కొద్దిగా లోతుగా పరిశీలిద్దాం. బొలీవియా పాలకుల్లో ఎన్నో స్పర్థలు, వర్గాలు, సమస్యలు ఉన్నాయి. కాబట్టి ఒక అసత్యం చెప్పాలన్నా అంగీకారం కుదరటం కష్టం. వారు ఓ అసత్యం చెబుతారు. ఒక వార్తను రాతపూర్వకంగా బయల్పరుస్తారు. కొద్ది మంది గెరిల్లాలను చంపామని ప్రకటిస్తారు. కాని చనిపోయిన గెరిల్లాలను మళ్ళీ చూపరు. అభివృద్ధి నిరోధక ప్రభుత్వాలు ఇటువంటి వార్తల్ని ప్రచారం చేయటం మామూలే. వాటిని ఎవ్వరూ పట్టించుకోరు. ఇది మనం గమనించాల్సిన ముఖ్య విషయం.

రెండవ విషయమేమంటే వారి వద్ద సాంకేతికపరమైన వనరులుకాని, అనుభవాలు కాని లేవు.

మూడవది - ఎంతటి అసత్యం చెప్పినా 10, 15 లేక 20 రోజుల్లో తెలిసిపోతుంది. అటువంటప్పుడు ఇలాంటి వార్తల్ని, సంఘటనల్ని కూర్చటం వారికి అవసరమా? దానివల్ల వారేమి సాధిస్తారు?

అదీకాక వారు కొంత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. 10-12 రోజుల క్రితం ఇలాంటి వార్తనే వదిలారు. కాని దానిపై కొద్ది గంటలు కూడా నిలువలేకపోయారు. మరుసటి రోజే అంటే కొద్ది గంటలకే దాన్ని ఖండించారు. అయితే ఇప్పుడు మాత్రం ఈ వార్తను చాలా దృఢంగా చెప్పుకొస్తున్నారు. అయినా ఎటువంటి ప్రకటనా చేయలేదు. మొదట వచ్చిన పుకార్లు జర్నలిస్టుల దగ్గర్నుండి, వివిధ చోట్ల నుండి వచ్చాయి. వారు ఏదైనా సాక్ష్యం దొరుకుతుందేమోనని చూశారు. దాని ఆధారంతో ధైర్యంగా ఓ ప్రకటన విడుదల చేద్దామని చూశారు. ఇదంతా మేం గమనిస్తూనే ఉన్నాం.

వస్తున్న వార్తల్ని ఎలా అన్వయించాలో మాకు కొద్దిగా అనుభవముంది. ఎలాగంటే వార్తల్ని బాగా గమనించటం, శైలిని, ఆ ప్రభుత్వ గణగణాకాల్ని, అందులోని కొందరి ప్రవృత్తిని కూడా పరిగణలోనికి తీసుకొని మేమందరమూ వార్తల్ని చదివేవారము. ఈ వార్తల్ని అన్వయించుకోవటంలో అవన్నీ మాకు సహాయపడ్డాయి. వారు ఆచితూచి అడుగేస్తున్నారని మేం పసిగట్టాము.

ప్రభుత్వాలన్నింటిలోకి దుర్బలమైన మూర్ఖమైనది బొలీవియా ప్రభుత్వమేనని చెప్పాలి. నిరాధారమైన, అసమగ్రమైన, అవివేకమైన ఈ సంఘటనను తీసుకొని దాన్ని విచారించాలనుకోవటం - అంతా మూర్ఖత్వమే.

బొలీవియాలో గెరిల్లా ఉద్యమం ఎలా ఉందంటే అక్కడ వారి ఉనికి కోసం, ఇతర విషయాల్లో ఎవరి సహాయమూ అందదు. కేవలం తమపైనే ఆధారపడాలి. అక్కడ ఉద్యమం

పతాక స్థాయికి చేరలేదు. ప్రభుత్వం ఓ అసత్యం చెబితే దాని ప్రభావంతో ఎనిమిది లేక పది రోజులు నెట్టుకు రావచ్చునని భావించే పరిస్థితి లేదు.

గెరిల్లాలు ఎలా ఉన్నారంటే వారు బలమైనవారే. అటువంటి వార్తలు విని అవి అసత్యాలుగా నిరూపణ అయినప్పుడు వారు నవ్వుకునేవారు. అటువంటి అసత్యవార్తలు ప్రభుత్వంపై ఉన్న ఏ కొద్దిపాటి ప్రతిష్టను, నమ్మకాన్నో దెబ్బతీసేవే తప్ప గెరిల్లాలపై ఎటువంటి ప్రభావం ఉండేది కాదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే అటువంటి వార్తల్లోని నిజాల్ని కనుక్కోవాలనుకోవటం ఓ హాస్యాస్పద చర్య. అటువంటి వార్త సృష్టించటం వెనుక ఉద్దేశం ఏమిటన్నదే నా ప్రశ్న. ఏ ఉద్దేశమూ లేదనేది మా అభిప్రాయం.

డైరీలో ఉన్న విషయాలు, అవి తెల్పే పరిస్థితులు, అందులో చెప్పిన ప్రదేశాలు, విడుదల చేసిన ఫొటోలు మనం చూడాలి. ఆ ఫొటోలు ప్రభుత్వం విడుదల చేసినవి కావు. జర్నలిస్టులు తీసినవి. ఈ వార్తలు వచ్చిన క్రమాన్ని చూస్తే ఈ వార్త ఓ చేదు నిజమని నిర్ణయించాల్సి వచ్చింది.

తాము ఎక్కువగా ప్రేమించే వ్యక్తి గురించి ఇలాంటి వార్త వింటే ఎవరైనా సరే అంగీకరించారు. ఇది సహజం. నిజం చెప్పాలంటే మేం మొదట చేసింది అదే. మా ప్రజల్లో, ప్రపంచమంతటా విప్లవకారుల్లో ఇటువంటి మనఃస్థితే ఉండింది.

అటువంటి భావావేశాలేకాక, బొలీవియా ప్రభుత్వంపై అణుమాత్రమైనా నమ్మకంగానీ, గౌరవంకానీ లేకపోవటం ఇటువంటి వార్తల్ని నిరాకరించటానికి కారణమయ్యాయి.

ఆ ప్రభుత్వంపై ఎంత అపనమ్మకమంటే అందులోని భాగస్వాములు, వారిలో మిత్రులైన యాంకీ సామ్రాజ్యవాదులు, అలాగే వారిలాంటివే ఇతర ప్రభుత్వాలు - ఇవి కూడా మొదట ఆ వార్తను పూర్తిగా నమ్మలేదు. ఎటూ చెప్పకుండా ఆచితూచి అడుగేశాయి. తరువాత కొన్ని సాక్ష్యాధారాలు లభించాక సహజంగానే వాటి అభిప్రాయంలో మార్పు కనబడింది. ఆ సాక్ష్యాధారాలు లభించేవరకూ బొలీవియా నుండి వస్తున్న వార్తల్ని ఎవరూ విశ్వసించలేదు.

కాని ఆ విషయంపై చర్చ జరుగుతూనే ఉంది. అనుమానాలూ అలాగే ఉన్నాయి. మనకున్న అనుమానమంతా అతడు మరణించాడా లేదా అనికాదు; అతణ్ణి ఏ విధంగా అంతం చేశారు? దానికి దారి తీసిన పరిణామాలు ఏవీ? అన్నదే.

మనలో ఎర్నెస్టో గువేరా గురించి ఎరిగినవారు, అతనితో సన్నిహితంగా మసలేవారు, అతని వ్యక్తిత్వం గురించి, అతని భావావేశాల గురించి బాగా తెలుసుకొనే వుంటారు. 'ఎరిగివుండినవారు' అనటంలేదు. ఎందుకంటే అతని గురించి భూతకాలంలో మాట్లాడటం ఇష్టంలేదు కాబట్టి. అంతటి రూపం, అంతటి గౌరవం, అంతటి వ్యక్తిత్వంగల వ్యక్తి గెరిల్లా గస్తీదళానికి సైన్యానికి జరిగిన పోరులో చనిపోయాడన్న విషయం ఊహించటమే కష్టం. ఇది సహేతుకంగా కనబడకపోయినా అంత అసాధారణమైనదేమీ కాదు. మాకు



తెలిసినప్పటి నుండీ చూస్తున్నాం; అతనిలోని అసాధారణ ధైర్యసాహసాలు, అపాయాన్ని ఆహ్వానించి చేసే పోరాటాలు, కష్టతరమైన, అపాయకర సమయాల్లోనూ తను సంసిద్ధంగా ఉండటం, ఆ సవాళ్ళను స్వీకరించటం - ఇవన్నీ. మా పోరాటాల్లో చాలాసార్లు అతను చేసిందదే. సియెరామస్త్రాలోనూ, లాస్ విలాస్‌లోనూ అతను ఈ విధంగానే ప్రవర్తించాడు.

చాలామార్లు అతణ్ణి రక్షించుకోవటానికి మేము ఏదో ఒక విధమైన చర్య తీసుకోవలసి వచ్చేది. ఒకటి రెండుసార్లు అతను చేద్దామన్న దాన్ని వ్యతిరేకించాం కూడా. విప్లవానికి చేయూతనిచ్చే అలాంటి పోరాటయోధుణ్ణి చిన్న చిన్న ప్రయోజనాలు చేకూర్చే పోరాటాల్లో ప్రాణాపాయం నుండి కాపాడాము. పెద్ద పోరాటాల్లో పాల్గొని అంతకంటే పెద్ద ప్రయోజనాల్ని తేగలవ్యక్తి అతను. లాస్ విలాస్‌ను ఆక్రమించే క్రమంలో ముందుండి పోరాటం జరిపే దళానికి అతణ్ణి కమాండర్‌గా ఉంచాం. అందుకే మొదటి ప్రయత్నంలోనే మేము సఫలీకృతమయ్యాము. ఏ పరిస్థితుల్లో ఎలా ప్రవర్తిస్తాడో అతడి గురించి తెలిసిన వారికి బాగా ఎరుకే.

అతడి స్వభావం, అపాయకర సందర్భాల్లో అతననుసరించే విధానం గురించి తెలిసిన మేము ఏ పోరాటంలో ఎప్పుడు ప్రాణం మీదికి తెచ్చుకుంటాడోనని భయపడేవాళ్ళం. కనీసమైన జాగ్రత్తలు కూడా తీసుకోడని అందరికీ తెలుసు. శత్రువు పరిసరాల్లో ఎక్కడ ఉన్నాడోనన్న సమాచారం తెలుసుకొనే గస్తీ దళాల్లో ఎన్నోసార్లు ముందుండి కదిలాడు.

మరో పక్క తాను చేపట్టిన పోరాటం విప్లవానికి ఎంత ముఖ్యమో కూడా అతనికి బాగా తెలుసు. ఉదాహరణలతో పోల్చలేని, మనుషులకుండవలసిన యోగ్యతాపరమైన విలువలు, వీటి గురించి బాగా తెలిసిన వాడు కాబట్టి అతను ఆ విధంగా ఆలోచించటమేకాక ఆచరించేవాడు కూడా. ఇది అతని వ్యక్తిత్వంలోని ఓ లక్షణం.

గొప్ప గొప్ప ప్రజావిజయాల్లో ముందుండి చూసే అధికారిగా కాక వాటిని సృష్టించే వాడిగానే ఆయన్ని చూడటం మాకిష్టం. కాని అటువంటి విలక్షణమైన వ్యక్తిత్వం, స్వభావం, గుణగణాలు గల వ్యక్తి కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ప్రతిసారీ స్పందిస్తూ ముందుండి పోరాడే యోధుడిగానే ఉంటాడు తప్ప పెద్ద గొప్ప విజయాల్ని వీక్షించే వాడిగా సృష్టించేవాడిగా ఉండలేదు. అయినా సహజంగానే ఇటువంటి యోధులు గొప్పగొప్ప విజయాల్ని సృష్టించేవారే.

చే ను ఇవేవీ ప్రభావితం చేయలేదు కాని అతడంటే ఎంతో ఆప్యాయతకల మేము అతడి నుండి ఎక్కువ ప్రభావాన్నే ఆశిస్తాము. వేరే విధంగా మేమతడిని చూడలేము.

అటువంటి వ్యక్తిత్వం, హృదయం, అంతటి నిజాయితీకల వ్యక్తిని భౌతికంగా లేకుండా చేశారంటే ఎటువంటి వారైనా దుఃఖిస్తారు.

ప్రస్తుతం ఎర్నెస్టో గువేరాపై నా అభిప్రాయాలు, భావాలు, ఆలోచనలు చెప్పదలచుకోలేదు. మనకు వస్తున్న వార్తలను విశ్లేషించి వాటిని అన్వయించి చెప్పడానికి మాత్రమే ఈ ప్రసారాన్ని పరిమితం చేస్తున్నాను. గెరిల్లా దళం నుండి విడివడి చేసినటువంటి ఈ పోరాటంలో ముందుండి ప్రాణాలర్పించిన వారిలో అతడుంటాడంటే ఎవరూ పెద్దగా ఆశ్చర్యపోరు. అపాయానికి దగ్గరగా అతను చాలాసార్లు వెళ్ళాడు. అటువంటి పరిస్థితుల్లో

ఏం జరుగుతుందో తెలుసుకోవాలంటే లెక్కల్లోని సూత్రాలను అన్వయించాల్సిందే. ఇటువంటిది జరుగదని మేమనుకోలేదు. పరిస్థితుల్ని అంచనా వేస్తున్నాము.

ఆ సంఘటన చుట్టూ ఎటువంటి పరిస్థితులు ఉన్నాయి? అంతటి భారీ సమీకరణతో అత్యధికబలగాలతో శత్రువులు ఎలా కదిలారు?

ఉదాహరణకు కొన్ని నిజాలు అక్కడి పరిస్థితిని వివరిస్తాయి. అటువంటి ప్రశ్నలకు సూటిగా సమాధానం ఓ ప్రకటన ద్వారా విడుదల చేయలేము. ఎందుకంటే మన దగ్గర ఉన్న సమాచారమంతా అక్కడి నుండి వస్తున్న వార్తల్ని సేకరించి, వాటిని ఎన్నుకొని, విశ్లేషించినదే. కాని సెప్టెంబరు 29 నాటి వార్త చూడండి.

"ఒక ఉన్నత సైన్యాధికారి ధృవీకరించిన సమాచారం ప్రకారం అర్జెంటీనా - క్యూబా విప్లవకారుడు ఎర్నెస్టో చే గువేరాను బొలీవియాకు 128 కి.మీ. దూరంలో కల అడవిలోని లోయలో దిగ్బంధనం చేశారు.

అంతకంటే వివరాలివ్వటానికి వారు నిరాకరించారు. అతడు అసోసియేటెడ్ ప్రెస్‌తో ఈ రోజు చెప్పిన దాని ప్రకారం దట్టమైన ఆ అడవి ప్రాంతానికి ఓ ముఖ్యమైన చర్య చేపట్టడం కోసం గత కొద్ది రోజులుగా సైన్యాన్ని పంపటం జరిగింది.

అదే ప్రదేశానికి అడవిలో పోరాడే సరంజామాతో ఇంకో 800 ట్రూపుల సైన్యం శాంతాక్రజ్ నగరం నుంచి ఈ వారం మొదట్లో బయలుదేరింది.

రెగిస్ డిబ్రే విచారణ జరుగుతున్న ఈ నగరం నాల్గవ ఆర్మీ డివిజన్‌కు ముఖ్య కేంద్రం. శాంతాక్రజ్ ఎనిమిదవ డివిజన్‌కు ముఖ్య కేంద్రం.

ఒక దళం బుధవారం ఎడమ క్యామిరి నుండి బయలుదేరింది. మరొకటి ఈ రోజు మధ్యాహ్నం బయలుదేరటానికి సిద్ధంగా ఉంది.

నమ్మదగ్గ ఓ మిలిటరీ సమాచారం ప్రకారం 1500 మంది సైనికులు గువేరా వేటలో పాల్గొంటున్నారు.

"గువేరా సజీవంగా ఉన్నాడని మా దగ్గర ఖచ్చితమైన సమాచారం ఉంది. సైన్యం కూడా అతని చుట్టూ మోహరించి ఉంది" - సమాచారమిచ్చిన వారు దీని ఆధారాలు చెప్ప నిరాకరించారు.

వారు చెప్పిన ప్రకారం రెండుకొండల మధ్య కల లోయ వద్ద కమ్యూనిస్టు గెరిల్లాలను చుట్టుముట్టారు. కొండల గురించిన వివరాలు మాత్రం చెప్పలేము.

ఈ సమాచారాన్ని ధృవీకరించలేము.

లోయ నుండి బయటకొచ్చే మార్గాలు చాలా ఇరుకుగా ఉన్నాయి. అవి బొలీవియా సైన్యం ఆధీనంలో ఉన్నాయి. అడవిలో పోరాడే ప్రత్యేక దళమది. అందులో ఎక్కువ మంది అమెరికా వారి వద్ద శిక్షణ పొందిన వారు. వియత్నాంలో పని చేసిన వారు కూడా అందులో కొందరున్నారు.

లోయ పక్క భాగాలు, దిగువ భాగాలు చాలా దట్టంగా ఉన్నాయి. కాని పై భాగం అడ్డంకులేవీ లేకుండా వేలాడుతూ ఉన్నాయి.



'అడవిలో పహారా కాస్తున్న సైన్యం ఈ వారం మొదట్లో అక్కడ సంబంధమేర్పరచుకుంటారని అనుకుంటున్నాము" వారు చెప్పిన మాట ఇది.

అంటే 29వ తేదీన వారు ఆ ప్రదేశం గురించి మాట్లాడటం, కొండల గురించి లోయ గురించి, కొండల నడుమ ఇరుకైన ప్రదేశం గురించి చెప్పటం, ఏ దిశలో వెళ్ళాలో చెప్పటం, ఆ ప్రాంతాన్ని విడువలేకపోవటం ఎందుకంటే అటుపై గుబురైన ప్రాంతంలేదు కాబట్టి.

ఈ వార్త చూడండి. ఎంతో ఉత్సుకత కలుగజేస్తుంది. ఎందుకంటే సంఘటన జరిగిన ప్రదేశాన్ని గురించి తెలుపుతుంది. వార్త పంపిన ప్రతిసారీ ఈ వివరణ ఉంది. ఆ ప్రదేశంలో కమాండర్ ఎర్నెస్టో చె గువేరా నేరుగా నేతృత్వం వహించిన గెరిల్లా దళం ఉందని రాశారు. అతడు అక్కడే ఉన్నాడని అంతగా ఎలా చెప్పగలరు?

ఈ వార్త చూడండి. గెరిల్లా దళం నుండి వేరుపడిన సైనికుడి గురించి ఉంది. సెప్టెంబరు 30వ తేదీన వచ్చిన వార్త ఇది :

> "కాస్ట్రో-కమ్యూనిస్టు విప్లవనాయకుడు ఎర్నెస్టో చే గువేరా తీవ్రంగా అస్వస్థతకు లోనయ్యాడు. గట్టి కాపలాతో అతడిని గెరిల్లా దళాలు స్ట్రెచర్‌పై తీసుకెళ్ళాయి. ఈ రోజు ఆయిల్ కేంద్రం నుండి అందిన సమాచారం ఇది."
>
> ఈ సమాచారం పూర్వపు బొలీవియా గెరిల్లా ఆంటోనియో రోడ్రిగేజ్ ఫ్లోర్స్ గురించి రాయబడింది. ఆయుధాలు స్వాధీనం చేసి ప్రభుత్వానికి లొంగిపోతే వారి గురించి ఇక ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుదన్న అధికారుల ప్రకటనతో అతను తనకు తానే లొంగిపోయాడు.

సెప్టెంబరు 25-30 మధ్యలో ఈ వేర్పాటు జరిగింది. గెరిల్లాల నుండి వేరుపడిన వారి ప్రవర్తన ఒకేలాగ ఉంటుంది. అతడు శత్రువుకు వెంటనే సమాచారమంతా ఇస్తాడు. అది వారికెంతగానో ఉపయోగపడుతుంది. ఎటువంటి నైతిక సంకోచంగానీ, దేనిపైనా ఎటువంటి బాధ్యత కానీ ఉండదు. ఎందుకంటే విప్లవంపై నమ్మకం సన్నగిల్లి ఉంటుంది. లేదా కపట విప్లవవాదులై ఉండి విప్లవంతోనే ఆడుకుంటారు. ఇలా గెరిల్లా దళం నుండి వేరుపడటం మామూలే - మన విప్లవ యుద్ధంలో కూడా ఇలాంటి వేర్పాట్లు జరిగాయి. ఇలా జరగటం మామూలే. ఇందులో కొత్తేమీ లేదు.

గెరిల్లాలుగా చేరతామని చాలా మంది గెరిల్లా క్యాంపులకు వచ్చిన సందర్భాలున్నాయి. ఎంత పెద్ద సంఖ్యలో వస్తారంటే ఉన్న ఆయుధాల కంటే వారే ఎక్కువగా ఉంటారు. ఇలా వచ్చిన వారిలో చాలా మంది తరువాత ఎంతో ప్రధాన పాత్ర వహిస్తారు. వారు గొప్ప సైనికులే కాక గొప్ప విప్లవకారులై ఉంటారు.

మన గెరిల్లా సైన్యంలో చేర్చుకోవటానికి మనమెలాంటి కార్యాలయాన్ని కాని, అటువంటి ఏర్పాటు కాని చేయము. మన సమస్యంతా ఎంత మంది చేరారు. మనమెందరికి ఆయుధాలు ఇవ్వగలిగామనేదే. మన దగ్గరకొచ్చే వారిలో 95 శాతం పైన సొంతంగా

నిర్ణయం తీసుకొని వచ్చిన వారే. మిగతా వారు అంటే చాలా కొద్ది మంది మాత్రమే ఓ పద్ధతి ప్రకారం పంపబడ్డారు. మన సైన్యంలో వారు కూడా ఉంటారు.

నిజం చెప్పాలంటే కొద్ది మంది తామే ఉత్తేజితులై వస్తారు. గెరిల్లా పోరాటాలపై వారికి ఎటువంటి అభిప్రాయం కానీ, అందులో వున్న త్యాగాలు కానీ, తెలియవు. ఎక్కువగా నడువవలసిన వచ్చినప్పుడు, పర్వతాలు ఎక్కవలసి వచ్చినపుడు అవకాశం కోసం వారు చూస్తుంటారు. పిరికిగా గెరిల్లా దళం నుండి విడివడతారు. వదిలి వెళ్ళిన వారెవరైనా ద్రోహులుగా మారతారు. ఒక వేళ శత్రువుల చేతిలో పడితే వారికి సమాచారమంతా ఇస్తారు. విడివడటానికి సంబంధించిన పూర్తి సమాచారంతో వారికి ఓ పూర్తి నివేదికను కూడా ఇస్తారు.

అందులో అనారోగ్యం గురించి ప్రస్తావించారు. బహుశా చే కు ఏదైనా తాత్కాలిక అస్వస్థత కలిగి వుంటుందనుకోవాలి.

డైరీలోని ఒక పేజీని ప్రచురించారు. సెప్టెంబరు ఒకటవ తేదీ నాటి డైరీ ఫోటో ప్రతి ఇలా ఉంది :

> "కొన్ని సంఘటనల తరువాత త్వరగా కంచరగాడిదల మీది నుండి దిగాము. ఒకతను కిందపడ్డాడు కూడా. డాక్టర్ ఇంకా కోలుకోలేదు. నేను మాత్రం త్వరగా కోలుకుంటున్నాను. చక్కగా నడవగలుగుతున్నాను. కంచరగాడిదను బాగా నడుపుతున్నాను."

అతను ఇంకా కొన్ని వివరాలు రాశాడు.

సెప్టెంబరు ఒకటి నాటికి తను కోలుకుంటున్నట్టు రాశాడు. చనిపోవటానికి రెండు రోజుల ముందు మంచి ఆరోగ్యవంతుడు మాట్లాడినట్టుగానే ఉంది. ఇంకో విధంగా చెప్పాలంటే ఆ సమయంలో అతను అనారోగ్యంగా ఉన్నాడన్నది నిజంకాదు.

అంతకుముందున్న నలత గురించో లేక ఇంకేదైనా విడివడిన గెరిల్లా చెప్పివుంటాడు. గెరిల్లా దళాలు ఎక్కడున్నాయన్న విషయం తెలియజేయటానికే శత్రువు ఎక్కువ ఉత్సాహం చూపిస్తున్నాడు. లేదంటే వారు ఎక్కడున్నారో తెలుసుకోవాలనుకుంటున్నాడు. సెప్టెంబరు 29వ తేదీన అంతటి బలగాలను మోహరించటాన్ని బట్టే మనకు విషయం అర్థమవుతుంది.

గెరిల్లాల నుండి విడివడిన వ్యక్తి గురించి సెప్టెంబరు 30వ తేదీన ప్రచురించారు. చూస్తే అతను 3-4 రోజులుగా శత్రువుల చేతిలో ఉన్నట్టుంది. వారు వెంటనే తమ బలగాలను కదిలించినట్టున్నారు. విప్లవాన్ని అణచివేయటానికి ఏ చిన్న అవకాశం వచ్చినా తమ బలగాల్ని వెంటనే కదిలిస్తారు. అయితే ఇటువంటి బలగాలు తమ సమయాన్నంతా నిరర్థకంగా ఖర్చు చేస్తాయి. గెరిల్లాలుండే ప్రదేశం గురించి వారికి తెలుసన్నది నిర్వివాదాంశం. అందుకే వారు అంత నమ్మకంతో ఉన్నారు. పెద్ద సంఖ్యలో తమ బలగాలను తరలించి వరుస దాడులు నిర్వహించి గెరిల్లాలపై యుక్తిగా విజయం సాధించాలన్నది వారి ఆశ.

అక్టోబరు ఏడునాటి ఓ ఆశ్చర్యకరమైన అంశంతో 'న్యూయార్క్ టైమ్స్' పత్రిక ఓ అంశం ప్రచురించింది. అదేమిటంటే : 'చే గువేరా చివరి క్షణాలు?' ప్రచురించింది అక్టోబరు



ఎనిమిదవతేదీ అంటే పోరాటం జరిగిన రోజు ఉదయం. ఆ వార్త ఇలా ఉంది : సైన్యం నివేదికల ప్రకారం ఒకప్పటి క్యూబన్ మేజర్ తన 16 మంది గెరిల్లాలతో సహా గత రెండువారాలుగా లోయలో చిక్కుబడి ఉన్నాడు. గెరిల్లాలు పూర్తిగా అలసిపోయి ఉన్నారు. లోయచుట్టూ సైన్యం పహారా కాస్తోంది. అందులో నుండి గువేరా ప్రాణాలతో బయటపడలేదని సైన్యం విశ్వసిస్తోంది.

క్యామిలి మిలిటరీ పోస్టుకు వాయువ్యంగా 120 మైళ్ళ దూరంలో గల లోయలో అనూహ్యంగా గువేరా చిక్కుకున్నాడు. ఈ భూగోళార్థంలో సాయుధ విప్లవం ఎలాంటి పరిస్థితిలో ఉన్నదీ ఈ సంఘటన చెప్పకనే చెబుతుంది.

అలా చెబుతూ పోయారు. ఇంకో విధంగా చెప్పాలంటే 29 సెప్టెంబరు నాటి వార్త సైన్యం కదలికల గురించి, వేర్పాటువాదుల గురించి చెబుతుంది. మిలిటరీతో సంబంధంగల విదేశీ పత్రికలు 30వ తేదీన కూడా అదే వార్తను మళ్ళీ ప్రచురించారు. వారు లోయ గురించి, దానికి ఎలాటి రక్షణలేదన్న విషయం గురించే ఎక్కువగా రాశారు.

వారు ఆశిస్తున్నది నెరవేరుతుందన్న నమ్మకానికి ఇదో నిదర్శనం. అయితే అది జరిగి తీరుతుందని అనుకోవలసిన పని లేదు. అక్కడ వరుసగా జరుగుతున్న సంఘటనలు, ఆ లోయ కొలతలు, దాని పొడవు వెడల్పులు, ఇలా అన్ని విషయాల గురించి తెలిస్తే కాని వారి నమ్మకం నిజమైనదీ లేనిదీ బేరీజు వేయలేము. ఎందుకంటే తాము గెరిల్లాలను చుట్టుముట్టామని ఎప్పుడూ చెబుతూనే ఉంటారు.

ఉదాహరణకు వారు మమ్మల్ని చుట్టుముట్టామని చెబుతారు. నిజమే. అయితే మా ముందు వరిపొలాలు, వెనుక పక్క సముద్రం ఉన్నాయి. ఒక నిర్ణీత కాల వ్యవధి వరకు మేము 10 కి.మీ. వెడల్పుగా 20 కి.మీ. దూరం వరకు మా కార్యక్రమాలు సాగిస్తుంటాము. అప్పుడప్పుడు అంతకంటే దూరం కూడా వెళతాం. ఈ మధ్య మాపై జరిగిన దాడిని కలుపుకొని 1957-58 మధ్య వరకూ ఎక్కువ మంది సైనికులు పాల్గొన్నారు. ఇంతకు ముందు చెప్పినటువంటి ప్రాంతాల్లోనే అవి జరిగాయి. ఆ ప్రాంతం మాకు బాగా తెలిసినదే. మేము 300 మంది దాకా ఉన్నాము.

సాధారణంగా గెరిల్లాల చుట్టూ ఏదో ఒక రకమైన సైన్యం ఎప్పుడూ ఉండనే ఉంటుంది. ఇది వారి ఎత్తుగడలో భాగమే. వారు అన్ని వైపులా చుట్టుముడితేనే ప్రమాదం. ఎన్నోసార్లు అటువంటి సందర్భాల్లో సైతం వారి పథకాన్ని ఛేదించటం జరుగుతుంది. అందుకే వారు చెబుతున్న ప్రదేశంలో ప్రమాదం ఏ మేరకు పొంచివుందో చెప్పటం కష్టం. దానిపై ఏ అభిప్రాయమూ చెప్పలేము.

వారు చెప్పే విషయం ద్వారా తంతి వార్తల ద్వారా తెలిసిందేమిటంటే సైన్యం పెద్ద సంఖ్యలో ఆ ప్రాంతంలో మోహరించి ఉంది. ఇదంతా వారి నమ్మకాన్ని తెలియచేస్తుంది. ఆ ప్రాంతంలో పోరు జరిగిందని కాని, గెరిల్లాలు విరమించుకున్నారని లేదా వ్యూహం మార్చుకున్నారనిగానీ ఏమీ చెప్పలేము. అయితే పోరాటానికి ముందు ఆ ప్రాంతంలోని పరిస్థితులు, అక్కడ మోహరించి వున్న సైన్యం గురించి మాత్రం వివరణ దొరుకుతుంది.

పోరాటానికి రెండు వారాల ముందు నుండే అక్కడ సైన్యం మోహరించి ఉన్నందువల్ల పరిస్థితి గురించి వారిలో ఉన్న ఆనందం ద్యోతకమవుతుంది. నిజంగా ఆ ప్రాంతంలో పరిస్థితి ఎలా ఉంది. మనకు తెలియదు. ఆ ప్రాంతానికి ఉన్న నైసర్గికపరమైన చిక్కులు ఏమిటి? పక్కనున్నటువంటి ప్రాంతాలు ఏవి? ఇవీ మనకు తెలియవు. దట్టమైన అడవీ ప్రాంతమో, నదీ ప్రాంతమో, ఎక్క వీలులేని కొండ ప్రాంతమో, ఇలాంటి విషయాలు కూడా మనకు తెలియవు. విడివడిన గెరిల్లా ఇచ్చిన సమాచారం ప్రకారం సైన్యాన్ని అక్కడికి పంపారంతే.

తరువాత వచ్చిన సమాచారాల ద్వారా కూడా పోరాటం జరిగిందని తెలుస్తుంది. అది దట్టమైన అటవీ ప్రాంతమని, ప్రమాదకరమైన లోయలున్నాయని, లోయ నలువైపులా ఎటూపోలేని విధంగా ఉందని ప్రతివార్త తెలుపుతుంది.

అక్టోబరు 6, 7 తేదీల్లో రాసిన డైరీలో కూడా ఇలాంటి వర్ణన ఉంది. 6వ తేదీ నాటి డైరీ పేజీలో ఇలా ఉంది. "పహారా కాస్తున్న సైన్యం దగ్గరలో ఉన్న ఇంటిని కనుగొన్నాయి. అది కూడా..." కాని ఫొటో ప్రతి అంత సరిగా కనబడటంలేదు. చే గువేరా చేతి రాత చిన్నగా ఉండి చదవటానికి కష్టంగా ఉంటుంది. అందులో ఈ ప్రతిలో మరకలున్నాయి.

"... దూరంగా ఇరుకైన కొండ ప్రాంతం. అక్కడ నీరు కూడా ఉంది మేము...".

"... తరువాత మేమందరమూ వండుకున్నాము..."

"పైన కొండ ముందుకొచ్చి కప్పులాగా ఉంది... నేను..."

ఇంకా ఇలా ఉంది "పొద్దుటి ఎండలో ఆ ప్రదేశానికి దగ్గరగా వెళ్ళాము... అవి ఇరుకైనవి". మళ్ళీ కొన్ని పంక్తులు కనబడలేదు.

మళ్ళీ ఇలా ఉంది. 'వంట చేసుకోవడానికి చాలా సమయం పడుతోంది. అందుకే మేము దగ్గర్లోని పర్వతాల మధ్యనున్న ఇరుకైన లోయవద్దకు వెళదామనుకున్నాము. అక్కడో చిన్న నది కూడా ఉంది. అక్కడి నుండి ఎప్పుడూ పోవాలో... ఏ దిశగా వెళ్ళాలో నిర్ణయించుకోవాలి".

ఇంకా ఇలా ఉంది : "క్రజ్ డెల్ సుర్ రేడియో ప్రసారం చేసిన ఓ ఇంటర్వ్యూలో.... వారు, ఈసారి ఆర్లాండోను తీసివేయగా..." ఈసారి తెలివి ప్రదర్శించారు. ఇంతకు ముందు లొంగిపోయిన బొలీవియన్ గురించి చెబుతున్నారు. అతను అధికారులకు లొంగిపోయాడన్నారు. తరువాత ఖైదీగా పట్టుకున్నామన్నారు. ఇంతకు ముందున్నట్టుగా ఇందులోని సమాచారం అంత స్పష్టంగా లేదు. ఇంకా ఇలా రాసి వుంది :

"చిలియన్ రేడియో ఓ ప్రసారంలో... ఆ ప్రాంతంలో 1800 మంది సైనికుల్ని మోహరించారు".

అక్టోబరు ఏడున రాసింది ఇలా ఉంధి. "ఈ రోజుకు గెరిల్లా పోరాటం మొదలై 11 నెలలు పూర్తయింది. ఇంత వరకూ ఎటువంటి అవరోధాలు ఎదురు కాలేదు" దీన్ని బట్టి చూస్తే అతని అంచనా ప్రకారం ఈ 11 నెలలు అంత కష్టమైనవి కావు. ఆ కాలం అంత అపాయకరమైనది కాదని అతని ఉద్దేశం. ఇది మనం గమనించాలి.



డైరీలో ఇలా ఉంది : "గొర్రెలు పెంచుకునే ఓ ముసలావిడ 12.20 గంటల ప్రాంతంలో మేము బసచేసిన లోయ ప్రాంతానికి వచ్చింది. ఆమెను బంధించవలసి వచ్చింది. సైనికుల గురించిన సరైన సమాచారం ఇవ్వలేకపోయింది. తనకేమీ తెలియదని పదేపదే చెప్పింది. ఈ ప్రాంతానికి తానిప్పుడే వచ్చానన్నది. అటుగా వెళ్ళేదారుల గురించి మాత్రం చెప్పింది. ఆమె చెప్పే ప్రకారం మేము హిగువేరా కు 3.5 మైళ్ళ దూరంలో జాగే కు మైలు దూరంలో, పుసారాకు దాదాపు 18 మైళ్ళ దూరంలో ఉన్నామని తెలిసింది. 1.20 ప్రాంతంలో..." ఇక్కడ అతనో పేరు ప్రస్తావించాడు. "అనీసిటోతోపాటు... ఆ ముసలావిడ ఇంటికి వెళ్ళారు. ఆమె కూతురు మంచంపట్టి ఉంది. వారామెకు 50 పిసోలిచ్చి ఎవరికీ ఏమీ చెప్పనని ప్రమాణం చేయించుకున్నారు. ఇంత చేసీ ఆవిడ మీద ఎవ్వరికీ నమ్మకంలేదు. అక్కడి నుండి మా ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంది. మేము వెళుతున్న ప్రదేశాల్లో చాలా గుర్తులు వదలి వెళ్తున్నాం. వాగు దగ్గర్లోని బంగాళాదుంప తోటలు మినహాయిస్తే అక్కడ ఇళ్ళే లేవు. ఇదంతా రెండు వృక్షరహిత పీఠభూముల మధ్యలో ఉంది" – చూస్తుంటే ఆ రెండు పీఠభూములు చెట్లు లేని కొండ ప్రాంతంలో ఉన్నట్టున్నాయి – "... అందుకే ఆ దిశగానే మేము ప్రయాణం కొనసాగించాము."

ఇక్కడ కొన్ని విషయాలు పూర్తిగా అర్థం కావు. డైరీలో ఇలా ఉంది. "250 మంది విప్లవకారులున్నట్టు సైన్యానికి తెలిసిపోయింది" పేజీ అక్కడితో ఆగిపోయింది.

చెప్పినదాన్నిబట్టి చూస్తే ఆ ప్రాంతం వారు రాత్రి ప్రయాణించవలసిన ప్రాంతంతో దాదాపు పూర్తి పోలికలు కలిగి ఉంది. చెట్లులేని కొండ ప్రాంతం ఈ లోయకు ఆనుకొని వుందని మనకు కనిపిస్తుంది. అతడు రాసిన చివరి విషయం అదే దాదాపు తెల్లవారుతున్నట్టుగా వుంది. "శుక్లపక్ష చంద్రుడు వెదజల్లే వెన్నెల్లో మేము పదిహేడుగురము వెళ్తున్నాము. మా ప్రయాణం చాలా ప్రమాదకరంగా ఉంది. మేము చాలా గుర్తులు వదిలి వెళ్తున్నాము..."

అందులో ఉన్న మర్మాన్ని అర్థం చేసుకోవటానికి మేము ప్రయత్నించాము. కొన్ని చోట్ల వాడిన పదాలకు అర్థాల్ని మేమే ఊహించవలసివచ్చింది. న్యూయార్క్ టైమ్స్ పత్రికలో సెప్టెంబరు 29న వచ్చిన తంతి వార్తలో తెల్పిన ప్రదేశానికి డైరీలో ప్రస్తావించిన ప్రదేశానికీ చాలా దగ్గరి పోలికలున్నాయి.

ఆ రోజు వారు ఒకే లోయ గురించి చెప్పారు. ఇక్కడ వారు వివిధ లోయల గురించి, దూరదూరంగా ఉన్న కొండల గురించి, చెట్లులేని కొండ ప్రాంతాల గురించి, దాటలేనట్టుగా చెబుతున్నారు. వారి వద్ద రెండు అవకాశాలు మాత్రమే ఉన్నాయి. ఒకటి లోయలు దాటి వెళ్ళటం. రెండు ఎత్తుగా ఉన్న ప్రదేశం గుండా వెళ్ళటం. అయితే రెండవదాన్లో కనపడకుండా వెళ్ళటం పూర్తి అసంభవం.

చూస్తే గెరిల్లాలు కొత్త ప్రదేశంలో ఉన్నట్టున్నారు. అక్టోబరు ఏడవ తేదీన రాసిన డైరీలో ఇది స్పష్టంగా ఉంది. చే వెంట ఇంకో పదహారుగురు ఉన్నట్టుంది. ఎందుకంటే "మేము 17 మందిమి వెళ్ళాము" అని చెప్పాడు కాబట్టి. ఒక్కో ప్రదేశానికి ఎంతెంత

దూరంలో ఉన్నారో కూడా చెబుతున్నారు. వారు ఉన్న ప్రదేశం గురించి సరిగా చెప్పటానికి ప్రయత్నించటమేకాక వారు ఏ దిశగా వెళ్ళాలన్న దానిపై ఆలోచిస్తున్నట్టు కూడా తెలుస్తున్నది.

డైరీని బాగా గమనిస్తే మొదట, తరువాత వచ్చిన వార్తల్లోని సారూప్యత బాగా కనిపిస్తుంది. అక్కడి పరిస్థితులు, ఓ వేర్పాటు వాది ఉండటం, వారు ఎంత మంది ఉన్నదీ, ఎక్కడ ఉన్నదీ ఇలాంటివన్నమాట.

వారు కొత్త ప్రదేశానికి వెళ్ళారన్నది నిజం. గెరిల్లా గస్తీదళంకాని, సైన్యంకాని ఎన్ని ఫొటోలు, భౌగోళిక పటాలు చేతిలో ఉన్నా స్వయంగా దిగితే కాని ఓ ప్రదేశాన్ని కనుగొనలేవు. నిజానికి ఏ గెరిల్లా గస్తీ దళమైనా ఒంటరిగా ఇటువంటి మారుమూల ప్రాంతానికి వెళితే ఇక ఆగిపోవలసిందే. లేదా బాగా గుబురుగా ఉన్న ప్రదేశానికి వెళితే అది పోరాటానికి ఎంత అనువుగా ఉన్నాసరే మెల్లిగా జారుకొని వేరే ప్రాంతానికి వెళ్ళవలసిందే. మాకు సియెరామస్త్రాలో మొదట ఇలాగే జరిగింది. మొదట గస్తీ దళాన్ని పంపి ఆ ప్రాంతం గురించి బాగా తెలిశాకే అందరం కదిలేవారం.

అది మారుమూల ప్రాంతమో, నిజంగానే ఇతర ప్రాంతాలతో సంబంధం లేకుండా ఉందో మనకు తెలియదు. అక్కడ ఒకే లోయ ఉన్నదా, వరుసలోయలున్నవా, దాట వీలులేని ప్రాంతమా, ఒకే రాత్రిలో దాటలేనటువంటి ప్రదేశమా, ఇలాంటివేవీ మనకు తెలియదు. ఈ ప్రగతి నిరోధక సైన్యాలు ఇటువంటి ప్రాంతాలుంటాయనే నమ్మకంతోనే ఎప్పుడూ మురిసిపోతూ ఉంటాయి. ఎక్కువసార్లు అలా జరుగదు. ఒక వేళ పోరాటం జరిగినా ఇటువంటి ఫలితమే వస్తుందనీ చెప్పలేము.

తమ దగ్గరున్న సమాచారంతో సైనిక దళాలు పెద్ద ఎత్తున కదిలాయన్నది సుస్పష్టం. వారికి అనుకోకుండా గెరిల్లా దళాలు ఎదురుపడటం ఇంకా ఊతాన్నిచ్చింది. ఒక వేళ అనుకోకుండా పోరాటం జరిగితే చే ను వధించటానికే ఎక్కువ అవకాశాలుంటాయి. ఎందుకంటే పోరాట సమయంలో అతను ఎటువంటి మనస్తత్వంతో ఉంటాడో మీకు ముందే చెప్పాను.

గెరిల్లాలు కాని, సైన్యంకాని దాక్కోవటం జరుగలేదని బాగా తెలుస్తున్నది. పోరాట సమయంలో చే వారితో తలపడివుంటాడు. వారు చెప్పే దాని ప్రకారం, కనిపించే పరిస్థితులు ప్రకారం కనిపిస్తున్న కొన్ని వివరాల ప్రకారం చే అందరి కంటే (ఇతర గెరిల్లాల కంటే) కొన్ని మీటర్లు ముందుకు వచ్చి పోరాడినట్టు కనిపిస్తుంది. అతని సహజగుణానికి తగ్గట్టుగానే ముందుకొచ్చి పోరాటం చేసినట్టు పరిస్థితులు తెలియజేస్తున్నాయి. అప్పుడే అతడు తీవ్రంగా గాయపడ్డట్టుగా ఉంది. ఎవరూ లేని ప్రదేశంలో చాలా సేపు పడ్డట్టుగా ఉంది. అతడు గాయపడడం చూసి రగిలిన కామ్రేడ్లు అపాయం పసిగట్టి చాలాసేపు పోరాటం చేసినట్టు స్పష్టమవుతుంది. కొన్ని నివేదికల్లో నాల్గు గంటలు పోరాటం జరిగినట్టుగా ఉంది. ఇంకొందరు ఐదు లేక ఆరు గంటలు జరిగిందంటున్నారు. సాధారణ పరిస్థితుల్లో ఇంత సేపు పోరాటం జరుగదు.

శత్రు సైనికుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు ఏ గెరిల్లా దళమైనా ఇంత సేపు



పోరాటం జరుపదు. సమయం చిక్కితే శత్రు సైన్యం గెరిల్లాలను చుట్టు ముడుతుంది. ఎంతో రగిలిపోతేకాని ఇటువంటివి జరుగవు. గెరిల్లాల వద్ద వున్న మందుగుండు కూడా అయిపోతుంది. మనం గమనంలో ఉంచుకోవలసిన ముఖ్య విషయమిది.

గెరిల్లా పోరాటాల్లో అనుభవం ఉన్న వారెవరికైనా వస్తున్న వార్తల్ని చూస్తే అక్కడ ఏం జరిగింది ఇట్టే తెలిసిపోతుంది. శత్రు సైనికులు పొంచివుంటే ఏం జరుగుతుందో మీకు తెలుసు. ఇక్కడ ఎటువంటి పొరపాటుకు తావులేదు. ఇటువంటి పోరాటాల్లో ముందుగా వచ్చిన సైనికులు చనిపోతారు. ఇంకొద్దిమందిని కూడా కోల్పోవలసి వస్తుంది. అక్కడ ఉన్న గెరిల్లాల సంఖ్యను బట్టి వారు ఆయుధాలను కోల్పోవటం కూడా జరుగుతుంది.

అలాగే గెరిల్లా దళాలైనా పొంచి వుండి ఇటువంటి పోరాటం చేస్తే వారు కోల్పోయేవారి సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటుంది. ఎందుకంటే శత్రు సైనికుల సంఖ్యతో పోలిస్తే వారి సంఖ్య ఎలాగూ తక్కువగానే ఉంటుంది కాబట్టి. ఇదో యుద్ధనీతి.

అదే నిజమై ఇరువైపుల వారు పొంచి ఉండక చాలాసేపు పోరాటం జరిగివుంటే ఖచ్చితంగా అసాధారణమైందేదో జరిగివుంటుంది.

సైనిక నివేదికల ప్రకారం చాలా మంది సైనికులు గాయపడటం, చనిపోవటం జరిగింది. చనిపోయిన 10 మందిలో మొదట ఐదుగురు గెరిల్లాలున్నారన్నారు. ఇది విచిత్రంగాను బాగా ఆందోళన కలిగించేదిగాను కనిపిస్తోంది. మొదట్లో వచ్చిన నివేదికల్లో మొదటగా గాయపడిన వారిలో చే ఉన్నాడని, తటస్థ ప్రాంతాలలో అతనున్నాడని చెప్పారు. ఇటువంటి పరిస్థితుల్లోనే గెరిల్లా దళం చాలాసేపు పోరాటం చేస్తుంది. చూస్తే మధ్యాహ్నం నుండి రాత్రి దాకా పోరాటం జరిగినట్టు పరిస్థితులు తెలియజేస్తున్నాయి! బాగా పరిశీలించండి. ఎందుకంటే సాధారణంగా ఓ వర్గం పొంచివుంటే ఫలితం ఎలా వుంటుందో స్పష్టంగా తెలుస్తుంది. అయితే పరిస్థితులపై పట్టుకలిగి వుండి ఎక్కువ సంఖ్యలో సైనికులు, ఎక్కువగా మందుగుండు సామాగ్రి కలిగి తమను చుట్టుముట్టగలిగి ఉన్న సైన్యంతో గెరిల్లాలు ఐదారు గంటలు పోరాటం చేయలేరు.

గెరిల్లా పోరాటాల గురించి తెలిసిన వారెవరైనా ఈ సందర్భంలో ఏదో ఒక వర్గం పొంచివుండి పోరాటం చేశారని అనుకోరు. గెరిల్లా పోరాట లక్షణం కనిపించదిక్కడ. అయితే చే గాయపడటమే ఇక్కడ జరిగిన అసాధారణ పరిణామం అయితే అతని కామ్రేడ్లు మానవాతీతమైన ప్రయత్నం చేసి ఎంతో సాహసంతో ప్రతిదీ ఫణంగా పెట్టారు. పోరు ఏ మాత్రం ఆపకుండా శత్రువుల్లో 10 మందిని మట్టుపెట్టారు. ఇవి వారిచ్చిన లెక్కలే. ఇంకా ఎక్కువగా కూడా ఉండవచ్చు.

పరిస్థితులపై ఓ నిర్ధారణకు రావటంలో మేము పరిగణనలోకి తీసుకున్న ముఖ్య అంశాల్లో ఇదీ ఒకటి.

నేను ముందే చెప్పినట్టు అందరిలో చర్చ జరుగుతున్న ప్రశ్న ఒకటే - తరువాత ఏం జరిగిందని. చే వెంటనే మరణించాడా లేక గాయపడ్డ తరువాత వారికి చిక్కి కొన్ని గంటలు తరువాత మరణించాడా? ఈ ప్రశ్నపై చర్చ ఇంకా జరుగుతోంది.

చే గురించి మాకు బాగా తెలుసు. అతను పూర్తి స్పృహ కోల్పోతేకాని, పూర్తిగా గాయపడితే, అచేతనుడైతేకాని, తన ఆయుధాన్ని కోల్పోతేగాని, తనను తాను అంతం చేసుకోలేని పరిస్థితిలో తప్ప వారికి బందీగా చిక్కడు. అతని గురించి తెలిసినవారెవరూ ఈ విషయంలో కొద్దిగా కూడా సంశయించరు.

ఇంకా చాలా వుంది. శత్రువుకాని, శత్రువుకు చెందిన అధికారులు కాని ఏకగ్రీవంగా చే కు గల అసాధారణ ధైర్యాన్ని, అతడి గుణగణాల్ని, అపాయమంటే అతని నిర్లక్ష్యాన్ని కొనియాడారు. ఎలా చెప్పొచ్చునంటే వీటిపై వ్యతిరేకంగా ఎవరూ ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అందుకే అతణ్ణి బందీగా పట్టుకున్నారంటే నమ్మలేము. పూర్తిగా గాయాలతో స్పృహ కోల్పోయి నిర్మానుష్య ప్రదేశంలో ఉన్నప్పుడే ఇది జరిగి వుంటుంది. అతను బతికుండగానే బందీని చేయటం ఏ విధంగానూ సాధ్యం కాదు.

ఈ విషయంపై ఏమి జరిగిందనే దానిపై మొత్తంగా గందరగోళాలు, వైరుధ్యాలు ఏర్పడ్డాయి. అదే అక్కడి అభిప్రాయాలను తరువాత జరిగిన సంఘటనలను వివరిస్తుంది. నా దగ్గర వున్న పత్రికలన్నీ తీసుకురావాలంటే కుదరదు. ఎందుకంటే అవి కట్టలు కట్టలుగా ఉన్నాయి. అధికారికంగా ఒక్క ప్రకటన కూడా వెలువడకముందే ఎన్నో పుకార్లు రాసాగాయి. వాటి సారాంశం - చే చనిపోయాడనో, గాయపడ్డాడనో లేదా గాయపడి దొరికాడనో. మొదట్లో వచ్చిన నివేదికల ప్రకారం అతణ్ణి బందీగా తీసుకున్నారని ఉంది.

తరువాత అధికారిక ప్రకటనలు రావటం మొదలయింది. ఉదాహరణకు అక్టోబరు 10వ తేదీ నాటి ఈ తంతి వార్త చూడండి :

"బొలీవియా సైన్యానికి చెందిన అత్యున్నత అధికారి ఒకరు ప్రకటించిన దాని ప్రకారం అర్జెంటీనా క్యూబా గెరిల్లా నాయకుడు ముందు రోజు తీవ్రంగా గాయపడ్డంవల్ల బొలీవియాలో నిన్న మృతి చెందినట్టు ధృవీకరించబడింది".

"చే తానేనని, బొలీవియా గెరిల్లాలు విఫలం చెందినట్టు, ఒప్పుకున్నారని సైనిక ప్రధానాధికారి జనరల్ ఆల్‌ఫ్రెడో ఒవాండో ప్రకటించారు." గెరిల్లాలను దాదాపు తుడిచిపెట్టినట్లు జనరల్ చెప్పారు.

చే అలా చెప్పివుంటాడని ఎవరూ నమ్మలేదు. దాపరికం లేని అతని మనస్తత్వం గురించి, అతని నిజాయితీ గురించి తెలిసిన మేము అతను మాట్లాడగలిగే స్థితిలో వున్నా శత్రువును సంతోషపెట్టే ఎటువంటి మాటా చెప్పడని మాకు తెలుసు. నిజానికి పరిస్థితులెలా వున్నా అతను శత్రువుకు రుచించని మాటలే చెబుతాడు.

కాని అతను చెప్పిన దాని ప్రకారం గాయపడ్డ చే మరుసటి రోజు మృతి చెందాడని వుంది. అత్యున్నత అధికారులు కూడా అదే సంఘటనా క్రమాన్ని ధృవీకరించారు. తరువాత ఆ ప్రాంత సైనికాధికారి చిత్రంలోకి వచ్చి చెప్పింది ఇలా ఉంది : "ఎల్ యూరో అనే లోయవద్ద జరిగిన పోరాటంలో సైనికులు ధైర్యంగా పోరాడారు. 50 మీటర్ల దూరం నుండి నువ్వానేనా అన్నట్టుగా తలపడ్డారు".

జెనిటా చెప్పిన ప్రకారం "గువేరా తీవ్రమైన గాయాలతో వుండి ప్రాణాలతో దొరికాడు."



"తనను బందీలుగా పట్టుకున్న వారితో గువేరా ఏదైనా మాట్లాడాడా అన్న విషయంపై జెనిటోతో ఒవాండో వ్యతిరేకించాడు. గువేరా ఏదైనా చెప్పటానికి అసలు సమయమే లేదని ధృవీకరించాడు".

ఒవాండో చెప్పిన దాని ప్రకారం తీవ్రంగా గాయపడ్డ చే ను బంధించారు. ఇంకో అధికారి ఒకరు దీన్ని ధృవీకరించాడు. తాను ఓటమిని అంగీకరించాడని చే చెప్పినట్టు ఒవాండో చేసిన ప్రకటనను ఇంకో అధికారి నిరాకరించాడు. అసలు చే ఒక్క మాట కూడా మాట్లాడలేదని రూఢిగా చెప్పాడు.

అయితే కొద్ది రోజుల తరువాత అతను తనపై అధికారి మాటలతో ఏకీభవించాడు. చే చనిపోయే ముందు ఏదో చెప్పినట్టు ఒవాండో లాగే చెప్పాడు. ఎందుకంటే అప్పటికే తనపై అధికారితోగల విరోధం బయటపడింది కాబట్టి. ఇద్దరు చెప్పిన దానిలోనూ ఓ సారూప్యత ఉంది. అదేమంటే చే బతికున్నప్పుడే పట్టుబడినట్టుగా చెప్పటం.

వారు చెప్పేది ఎంత అర్థరహితంగా ఉన్నా అది చే వ్యక్తిత్వానికి ఎంత మాత్రమూ హానికరం కాదు. ఎందుకంటే అతని నిజాయితీని, ధైర్యాన్ని, ఇంకా ఇతర సద్గుణాలను వారే అంగీకరించారు.

"నా పేరు ఇది లేదా అది" అని మాత్రమే చే చెప్పివుండవచ్చు. అతని వ్యక్తిత్వానికి సరిపోయేది అదే. అతను ఏమి చెప్పివుండవచ్చు? వారు ఏమి విన్నారు?

పట్టుబడినప్పుడు బతికే వున్నాడన్న విషయంపై ఇద్దరూ ఏకీభవించారు. అయితే మొత్తంగా జరిగిన సంఘటనలను క్రోడీకరించే పనిలో ఈ ప్రకటనలే ముఖ్యంగా పరిగణనలోనికి తీసుకున్నాము. అప్పుడే గాయపడ్డ అతణ్ణి బందీని చేసి కాల్చి చంపారన్న వాదన వచ్చింది. వేరే మాటల్లో చెప్పాలంటే గాయపడ్డ అతడికి ఉపశమనం కలిగించటం కానీ, బతికించాలన్న ఏ చిన్న ప్రయత్నంకానీ చేయలేదు. అతనికి చికిత్స చేశారనడానికి ఎటువంటి ఆధారమూ లేకపోగా చంపటానికి చేసిన ప్రయత్నాలు మాత్రం బాగా తెలుస్తున్నాయి. గాయపడ్డ బొలీవియా సైనికులు విప్లవకారులకు చిక్కినప్పుడు వారికి వైద్యం చేసి జాగ్రత్తగా చూసుకొని వదలిపెట్టిన సందర్భాలనేకం ఉన్నాయి. ఇంత చేసీ వారి నిర్వాకం చూడండి. విదేశీ తొత్తులైన ఆ అధికారుల నుండి, ప్రభుత్వం నుండి, కిరాయి సైన్యం నుండి మనం ఏమి ఆశించగలం?

గాయపడ్డ చే కోలుకుంటాడని ఎవరూ హామీ ఇవ్వలేదు. ఎందుకంటే అంత తీవ్రంగా గాయపడ్డాడు. అతను బతికే వుండేవాడని ఎవరూ చెప్పలేరు. అతని ప్రాణాన్ని రక్షించడానికి ఏ చిన్న ప్రయత్నమూ చేయలేదు. దీన్ని బట్టి చూస్తే అతడిని చంపాలనే అనుకున్నారని తెలుస్తుంది.

అయితే ఇన్ని విరుద్ధమైన అంశాలు ఎలా వచ్చాయి. పుంఖానుపుంఖాలుగా వస్తున్న విశేషాలు ఇప్పుడు తేటతెల్లమవుతున్నాయి. ఎలాగంటే వైద్యులు, గాయపడ్డ సైనికులు వ్యాఖ్యానించటం మొదలయింది. ఉదాహరణకు నిన్న అందిన తంతి వార్త చూడండి :

ఇద్దరు డాక్టర్లలో ఒకరయిన డాక్టర్ మార్టినెజ్ కాస్ట్రోను ఇంటర్వ్యూ చేశారు.

అతణ్ణి శవ పరీక్ష చేశారా అని అడిగారు. దానికతడు "లేదు మేము మామూలుగా పరీక్షించామంతే. మరణించి దాదాపు అయిదు గంటలు అయివుంటుంది, ఎందుకంటే శరీరం ఇంకా కొద్దిగా వేడిగా ఉంది" అని సమాధానమిచ్చాడు.

అంటే భౌతికకాయం వెల్లిగ్రాండె ఆసుపత్రికి అక్టోబరు 9వ తేదీ సాయంకాలం 5 గం॥లకు వచ్చి వున్నట్లయితే మరణం అదే రోజు మధ్యాహ్నం 12 గం॥లకు సంభవించి ఉంటుంది.

శరీరంపై బుల్లెట్ గాయాలు కనబడ్డాయని, అవి కాళ్ళలో ఐదు, గొంతులో ఒకటి, ఛాతీలో ఒకటి, ఛాతీకింద ఒకటి ఉన్నట్టు వైద్యుడు చెప్పాడు. బుల్లెట్లు గుండెలోకి, ఊపిరితిత్తిలోకి దూసుకుపోయయని చెప్పాడు. "అన్నిటికంటే బలమైన గాయం అదే" అని డాక్టర్ చెప్పాడు.

శరీరాన్ని అతనికి అప్పగించినపుడు అది ఎవరిదో ముఖ్యమైన వ్యక్తిదేనని అతనికి చెప్పారు. మంచి స్థితిలో ఉన్న కాళ్ళను చూసి ఈ అభిప్రాయానికొచ్చారు. ఎక్కువగా నడిచే అలవాటులేదనే అభిప్రాయం కూడా కలిగింది.

భౌతికకాయం వైద్యునికి అప్పగించే సమయానికి కొద్ది గంటలు ముందు మాత్రమే చనిపోయినట్టు తెలుస్తుంది. ఎందుకంటే శరీరం ఏ మాత్రం బిగుసుకుపోలేదు. అలాగే ఒవాండో, ఇతర ఉన్నతాధికారులు, కల్నల్ జెంటినో, ఇంకా ఇతరులు చే ను బతికుండగానే పట్టుకున్నామని. చెబుతున్నారు. వైద్యులుకాని, ఏపాటి వైద్య పరిజ్ఞానం ఉన్నవారెవరైనా సరే ఓ విషయం అంగీకరిస్తారు. అదేమంటే గుండెలోకి, ఊపిరితిత్తుల్లోకి బుల్లెట్ దూసుకుపోతే ఎవరైనాసరే కొద్ది నిముషాలకంటే ఎక్కువ సమయం బతుకరని. అప్పుడే అన్ని అనుమానాలు ఉద్భవించాయి.

ఇంటర్ ప్రెస్ నుండి వచ్చిన ఈ వార్తను చూడండి :

లాపాజ్ - పోయిన ఆదివారంనాటి పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన ఎర్నెస్టో చే గువేరా మరణానికి సంబంధించి సాగుతున్న విచారణ ఓ విచిత్రమైన మలుపు తిరిగింది. అతని శరీరాన్ని పరీక్షించిన వైద్యుడు జోస్ మార్టినెజ్ చెప్పిన ప్రకారం అర్జెంటీనా విప్లవకారుడి భౌతికకాయం సోమవారం మధ్యాహ్నం పరీక్ష చేశానని అప్పటికి 5 గం॥ ముందు మాత్రమే అతను మరణించివుంటాడని అతను పేర్కొన్నాడు.

ఇద్దరు గెరిల్లాలతో సహా అతణ్ణి పట్టుకొని చావుదెబ్బ తీసినట్టు వస్తున్న సమాచారం సరియైనదేనని తెలుస్తున్నది. సైన్యానికి సంబంధించిన గెరిల్లా వ్యతిరేక కూటమిలోని జర్నలిస్టులు కూడా ఇదే సమాచారాన్ని అందించారు. కొందరు అధికారులు కూడా ఈ తిరుగుబాటుకు నాయకత్వం వహిస్తున్న వ్యక్తి మరణంపై అనుమానాలు వ్యక్తం చేశారు.

సైన్యానికి చెందిన ఓ ఉన్నతాధికారి అతి గోప్యంగా ఇచ్చిన సమాచారం ప్రకారం చే ఎల్ యూరోలో జరిగిన పోరాటంలో గాయాలవల్ల చనిపోలేదు. గెరిల్లా నాయకుడు హిగ్రేస్‌లో మ. 1. 15 గంటలకు చనిపోయాడు. పోరాటం ముగియకమునుపే అతణ్ణి తీసుకుపోయారు.



చే కాళ్ళలో గాయాలయ్యాయని కూడా అవే సైనిక వర్గాలు తెలిపాయి.

తరువాతి వాక్యాన్ని మనమే అన్వయించుకోవాలి. ఎందుకంటే అది చినిగిపోయి ఇలా ఉంది "కాని ఒక బుల్లెట్ అతని రైఫిల్‌ను తాకి అది పని చేయకుండా..."

దీన్ని బట్టి తెలిసేదేమిటంటే బాగా గాయపడ్డ చే తన రైఫిల్ పని చేసే దాకా అంటే చివరికంటా పోరాటం సాగించాడు. అది సంభవమే. ఎందుకంటే ఎంత గాయపడ్డాసరే శత్రువుతో పోరాటం అతనికి కొత్తేమీ కాదు. పోరాటయోధుల్లో చాలా మంది రైఫిళ్ళను కూడా నాశనం చేశారు.

అందులో ఇంకా ఇలా ఉంది :

"అతని ఎమ్-12 రైఫిల్‌ను బుల్లెట్ తాకిన తరువాత అతణ్ణి, ఇంకో ఇద్దరు అనుచరులను బందీలుగా తీసుకున్నారు. వారు కూడా తీవ్రంగా గాయపడ్డారు. సోమవారంనాటి విచారణలో ఒక్క ప్రశ్నకు కూడా గువేరా సమాధానం చెప్పలేదు."

చే గురించి పూర్తిగా తెలిసిన మేము అతను అలాగే చేసి వుంటాడనుకుంటాము. అతని స్వభావానికి ఇది దగ్గరగా ఉంది.

ఇంకా ఇలా ఉంది "... ఒక్క ప్రశ్నకు కూడా సమాధానమివ్వకుండా తనను బంధించిన వారికేసి చీత్కారభావంతో చూడసాగాడు" "మిగిలిన ఇద్దరు గెరిల్లాలు కూడా హిగ్రేస్ లో అదే రోజు చంపబడ్డారు."

ఆ వార్తా సంస్థ చెప్పిన ప్రకారం అతను ఎలా గాయపడింది. గాయపడ్డా కూడా ఎలా పోరాటం చేసింది. మొదలైన విషయాలు నమ్మే విధంగా ఉన్నాయి.

ఇంకో వార్త చూడండి : "ఒక ఇంటర్వ్యూలో డా. జోస్ మార్టినెజ్ కాసో చెప్పిన దాని ప్రకారం గుండెలో, ఊపిరితిత్తిలో తీవ్రంగా తూట్లు పడ్డాయి, అయితే అతణ్ణి పరీక్షించినపుడు...." అదే వార్తాంశం. ఆ సంస్థ ఇంకా ఇలా చెప్పింది "గాయపడ్డ నలుగురు సైనికులు చెప్పిన దానికి మార్టినెజ్ చెప్పిన దానికి అన్వయం కుదిరింది..."

ఆహ్.. డాక్టరుకు సైనికులు చెప్పిన ప్రకారం గువేరా తమ వైపుకు పురోగమిస్తుండగా కాల్చబడ్డాడు.

ఇంకా ఇలా వుంది "నలుగురు సైనికులు చెప్పినది, మార్టినెజ్ చెప్పినది ఒకేలా ఉన్నాయి. ఆ నలుగురి కథనం ప్రకారం పోరాటం తరువాత గువేరా ప్రాణాలతోనే వున్నాడు" వారిలో తబోడా అనే సైనికుడు గువేరాను కాల్చినపుడు అక్కడే వున్నాడు. అతను ఇలా చెప్పాడు. "గువేరా పోరాటంలో బాగా గాయపడ్డాడు. అప్పటికింకా బతికేవున్నాడు".

మొదట చెప్పిన విషయాన్ని బలపరుస్తూ తరువాత పుంఖానుపుంఖంగా వస్తోన్న ప్రకటనలన్నింటిలోనూ చే ను గాయపడ్డ తరువాత బందీగా తీసుకున్నట్టుగా ఉంది. సైనికులపైకి దూసుకెళ్తున్నప్పుడు గాయపడటం అతనికి సర్వసాధారణం. గాయపడ్డాక కూడా పోరు సాగించటమనేది అతని వ్యక్తిత్వంలోని ఓ (గుణం) లక్షణం. అతని శ్వాస మిగిలివుండగానే పట్టుబడ్డాడంటే అతని ఆయుధాన్ని నాశనం చేసైనా వుండాలి లేదా అతను తీవ్రంగా గాయపడి వుండాలి. వారు ప్రశ్నించటం, అతడు వారివైపు నిర్లక్ష్యంగా, అంతకంటే

చీత్కారంగా చూడటం ఇవన్నీ అతని స్వభావానికి తగ్గవే అలాగే అతను పోరాటంలో చనిపోవడమైనా.

అతను పోరాడుతూ చనిపోయాడా లేదా గాయపడ్డవాణ్ణి చంపారా అన్నది ముఖ్యం కాదు. అతడు ప్రాణాంతకంగా గాయపడ్డాడా? అవే అతని మరణానికి దారితీశాయా అన్నదే ముఖ్యం.

ఈ అంశంపైనే పెద్ద వివాదం చెలరేగింది, అయితే ఆ ప్రశ్నకు పూర్తిగా కాకపోయినా కొద్దిగానైనా సమాధానం తరువాత ఏం చేశారన్నది చూస్తే తెలుస్తుంది.

తరువాత వచ్చిన వార్తలు :

అక్టోబరు 11వ తేదీ రిపబ్లిక్ అధ్యక్షుడు జనరల్ రినే బారియంటాస్ యునైటెడ్ ప్రెస్ ఇంటర్నేషనల్‌కు ఈ రాత్రి ఇచ్చిన సమాచారం ప్రకారం ఎర్నెస్టో చే గువేరా భౌతిక కాయాన్ని బొలీవియన్ యాండిస్ లోగల ఒక రహస్య స్థలంలో ఖననం చేసినట్టు ఉంది. లాపాజ్‌కు తీసుకురావటంగానీ, ఇంకెవ్వరికీ చూపటం కాని జరుగదు.

"నేను చెప్పిన దాంట్లో మూర్ఖమైనదేమిటంటే అతని మృతదేహం బొలీవియాలోనే ఉంటుందనటం" – దేశాధినేత చెప్పిన మాటలివి.

అలా చెప్పటం సహజమే. ఎందుకంటే బొలీవియా నుండి అందిన చే డైరీలో ఒకచోట బారియెంటాస్‌ను మూర్ఖునిగా పేర్కొన్నాడు. అందుకే ఈ పెద్ద మనిషి డైరీలోని ఆ వ్యాఖ్యానానికి ప్రతీకారంగా ఈ మాటలన్నాడు. రహస్య ప్రదేశంలో అంటే అక్టోబరు 11వ తేదీ భౌతిక కాయాన్ని ఖననం చేసినట్టు ధృవీకరించారు. మరుసటి రోజే అంటే అక్టోబరు 12వ తేదీ నాటి వార్త చూడండి.

చే సోదరుడు రాబర్టో గువేరా జర్నలిస్టులకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన ప్రకారం సైనిక దళ ప్రధానాధికారి అల్‌ఫ్రెడో ఒవాండో తనకేమి సమాచారమిచ్చాడంటే క్యూబా – అర్జెంటీనా విప్లవకారుణ్ణి ఈ రోజు ఖననం చేశామని.

ఆ అంశాన్ని ప్రభుత్వ అధికారులు సవాలు చేశారు :

"అధ్యక్షుడు రెనె బారియంటాస్‌కు ఈ రోజు సాయంకాలం 5 గంటల వరకు ఎటువంటి సమాచరమూ లేదు" విదేశీ వ్యవహారాలు చూసే ఓ ప్రధానాధికారి చెప్పిన మాటలివి.

"అదే నిజమైతే మేము చాలా ఆశ్చర్యపోతున్నాము. ఎందుకంటే సైన్యం చివరి నిముషంలో తీసుకున్న అత్యవసర నిర్ణయం అయివుంటుంది. అధ్యక్షునికి కూడా తెలియకుండా చేశారంటే నమ్మటం కష్టం."

ఖననం చేశారని, మళ్ళీ బయటకు తీసి దహనం చేశారని, తరువాత దహనం చేశారని, ఒక చెయ్యి తీసివేశారని, వేలు కోశారని – ఇలా రకరకాల వార్తలు రాసాగాయి. ఒక దానితో ఒకటి పొంతన లేకుండా పరస్పర విరుద్ధంగా కూడా ఉన్నాయి.

వారి అధీనంలో ఉండగానే చే చనిపోయాడన్న విషయాన్ని గుప్తంగా ఉంచటానికై వారు పడుతున్న పాట్లు ఎవరైనా ఊహించగలరు. జరిగిన సంఘటనల్ని బాగా పరిశీలిస్తే



దొంగచాటుగా చావుదెబ్బ తీశారన్న విషయం. తెలిసిపోతుందనేది వారి భయం.

ఈ భిన్నమైన విషయాల కంటే కూడా వారు ఓ విషయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టుగా నాకనిపిస్తోంది. అదేమంటే మరణం తరువాత కూడా వారు చే అంటే భయపడటం. బతికున్నప్పుడు భయపడ్డట్టే అతను చనిపోయాక కూడా భయపడుతూ ఉన్నారు. చెప్పాలంటే ఇంకా ఎక్కువగానే. వారి ప్రవర్తన చూస్తుంటే ఈ భావం కలీగుతుంది. ఎందుకంటే అతని అవశేషాల్ని కూడా ఆ స్థలం నుండి మార్చారు కదా. ఆ ప్రాంతం ఓ పుణ్యతీర్థం అవుతుందని వారి భయం.

చరిత్ర హీనులమవుతామని వారికి తెలుసు. భౌతికంగా చే ను రూపుమాపటమనేది అనుకోని అదృష్టమని వారికి తెలుసు. అందుకే వారి ఆలోచనల్లో చే అవశేషాలు కాని, ఆ ప్రదేశం కాని ఇప్పుడు కాకున్నా భవిష్యత్తులోనైనా ఓ పుణ్యతీర్థం అవుతుందని భయం. అందుకే విప్లవానికి సంబంధించిన ఏ చిన్న గుర్తుకాని, స్థలం కాని ఉండటం వారికిష్టం లేదు. విప్లవాన్ని దెబ్బతీయటమే వారి పని. ఒక్కముక్కలో చెప్పాలంటే మరణం తరువాతే వారు చే అంటే ఎక్కువగా భయపడుతున్నారు.

నా అభిప్రాయంలో వారి ప్రవర్తన ఎలా ఉందంటే చివరి గుండు పేల్చిన విషయం రహస్యంగా ఉంచటం కంటే అతని అవశేషాల నుండి తప్పించుకోవటమే వారి ప్రథమ అంశంగా కనిపిస్తోంది. వారి భయమంతా చే కుటుంబీకులు భౌతిక కాయం కోసం గట్టిగా పట్టుబడతారని, ఏదో ఒక స్థలంలో ఖననం చేస్తారని, అది ఓ పవిత్ర స్థలంగా రూపు చెంది విప్లవకారులకు ఇష్టమైన ప్రదేశంగా మారుతుందనేదే వారి భయం. నా అభిప్రాయంలో వీటన్నింటి వెనుకా అదే అసలైన కారణంగా కనిపిస్తోంది.

సంఘటనలు జరిగిన విధానం, వార్తల్ని మేము విశ్లేషించిన పద్ధతి చే మరణానికి సంబంధించి ఆశ్చర్యకరమైన, పరస్పర విరుద్ధమైన సంఘటనలు వీటన్నింటిపైనా మా అభిప్రాయం కూడా అదే.

ఈ సమాచారం గురించి మాట్లాడటం మా విద్యుక్తధర్మంగా భావించాము. డొలాయమానంగా ఉంటే అది విప్లవానికి ఉపయోగపడవచ్చునేమోనన్న అంశాన్ని కూడా పక్కన పెట్టాము. ఆ ప్రశ్న నైతికమైనదిగా, మా సూత్రాలకి సంబంధించినదిగా మేము భావించాము. ప్రజల తరఫున, మొత్తంగా విప్లవకారుల తరఫున మా బాధ్యత స్వీకరించాము. ప్రజానీకానికి ఈ నిజం తెలియకుండా దాచితే వచ్చే అనిశ్చితి వల్ల, అనుమానం వల్ల వారికి కలిగే తప్పుడు నమ్మకంవల్ల లాభపడేది మరెవరో కాదు – సామ్రాజ్యవాదులే అనేది మా అభిప్రాయం.

సామ్రాజ్యవాదుల కొమ్ముకాస్తున్న బొలీవియాలోని కీలుబొమ్మ పాలకులు మేము ఆ వార్తను నమ్మకూడదని అనుకోవడంలేదు. ఆ వార్తను మేము నమ్మాలనే ఆ కీలుబొమ్మలు చేసే ప్రయత్నాలు స్పష్టంగా కనబడుతున్నాయి. ఎందుకంటే అందులో తాము పోషించిన పాత్ర గురించి, భాగస్వామ్యం గురించి చెప్పుకోవటమే వారి ఆశయం. అది మాకు తెలియజేయటమే వారి లక్ష్యం.

అయితే అనుమానం లేకుండా సామ్రాజ్యవాదులు ఎంతో మర్మంగా ఉండి చే ను నిర్మూలించాక అతని ప్రవర్తన వల్ల, అతణ్ణి ఉదాహరణగా తీసుకోవటం వల్ల, మొక్కవోని అతని దీక్షవల్ల, అతని వీరోచిత, విప్లవకర భావాల వల్ల కలిగే పరిణామాలను రూపుమాపటమే వారి ఏకైక కార్యక్రమమనుకోవటంలో ఎటువంటి సందేహం లేదు. అందుకే వారు అనిశ్చితి సృష్టించాలని, దాన్ని ఓ రహస్యంగా ఉంచాలని, ప్రజల్ని భ్రమలో ఉంచాలని భావిస్తున్నారు. ఐదు సం॥లు, పది, పదిహేను లేదంటే ఇరవై సం॥లు, అనిశ్చితిలో, భ్రమలో, అనుమానంలో ఉంటే అతణ్ణి ఓ నమూనాగా తీసుకోరనేది వారి లక్ష్యం. చే మరణం వల్ల బాధపడే వారెవరికైనా అటువంటి భ్రమకలిగితే ఎలా వుంటుందో ఊహించుకోవచ్చు. అతణ్ణి ఆరాధించే వారికి, ప్రపంచమంతటా విస్తరించిన విప్లవకారులకు ఈ స్థితి ఎలా ఉంటుందో తేలిగ్గా అర్థం చేసుకోవచ్చు.

చే ను భౌతికంగా తనకు అడ్డు తొలగించుకున్నానని సామ్రాజ్యవాదానికి తెలుసు. ఇప్పుడు దాని ఆశయమంతా ఒక్కటే. నిజాన్ని వీలైనంత రహస్యంగా కప్పి వుంచటం, భ్రమలో ఉంచటం, అతని ప్రభావం లేకుండా చూడటం - అయితే అది నెరవేరేది కాదు. ఎందుకంటే అది పరిస్థితుల్ని ఇంకో విధంగా తారుమారు చేస్తుంది. కథల్ని సృష్టిస్తుంది. ఎలాగంటే, అతణ్ణి 'ఇక్కడ చూశాము' 'అక్కడ చూశాము' లాంటివన్నమాట.

అల్లిన కథ ఏదైనా తరువాత నిజం కాదని తెలిస్తే మాకెటువంటి అభ్యంతరమూ లేదు. చే ఆదర్శానికి సంబంధించి ఊహాత్మక కథలు, రకరకాల వదంతులు వ్యాపించాయి. అందులో కొన్ని అమర్యాదకరమైనవి కూడా ఉన్నాయి. మేము వాటి గురించి పెద్దగా పట్టించుకోలేదు. మాకు నిజమేదో తెలుసు. నిజం నిప్పులాంటిది. దాగదు. తప్పుగా ప్రచారం చేసిన కథలు, విశ్లేషణలు - మంచికి కాని; చెడుకి గాని చేసినా అవి నిలువవు. దానిపై మాకు చింతలేదు.

అయితే అనవసరమైన భ్రమలు ఏర్పడే అవకాశం ఉందేమోనన్న విషయం మమ్మల్ని కలవరపరిచింది. చరిత్రలో విప్లవ సిద్ధాంతాలకు అనుకూలంగా, నిజాయితీగా, ధైర్యంగా, స్వార్థరహితంగా, ఉదాత్తంగా, ఎంతో ధీరోదాత్తుడుగా చెప్పుకోవలసిన ఓ వ్యక్తి గురించి ఇలా ఊహాజనితమైన కథల్ని ప్రచారం కానివ్వడంవల్ల అతని ప్రభావం క్షీణిస్తుంది.

చే మరణం విప్లవ శక్తులను నిరాశ పరుస్తుందని భుజాలు చరుచుకుంటున్న సామ్రాజ్యవాదులకు అది నిజంకాదని త్వరలోనే తెలియబోతున్నది. అతని ప్రభావం ఏమిటో వారికి బాగా తెలుసు. ఒక వ్యక్తిని భౌతికంగా రూపుమాపటం సాధ్యమే కాని చే లాంటి ఓ నమూనాను వారు ఏమీ చేయలేరు. వారికది సాధ్యపడదు కూడా! ఇదే వారిని బాగా కుంగదీస్తున్నదని అర్థమవుతుంది.

విశ్వవ్యాప్తంగా వార్తా పత్రికలన్నీ చే సత్ప్రవర్తనను గుర్తించాయి. కొన్ని వందల్లో ఏ ఒకటో అతని గురించి చెడుగా రాశాయి. సైద్ధాంతికంగా విపరీతమైన శత్రుత్వం కలవారు కూడా అతని సత్ప్రవర్తనను చూసి ప్రభావితం కాకుండా ఉండలేకపోయాయి. తన శత్రువులే తనను గుర్తించటం, గౌరవించటం, రోజూ చేతుల్లో ఆయుధాలు ధరించి తనను ఎదుర్కొనే



శత్రువులైతేనేమి, సైద్ధాంతికంగా తన శత్రువులైతేనేమి అతనిపై ప్రశంసల జల్లు కురిపించటం గౌరవించటం చూస్తే ఒకటి బాగా అర్థమవుతుంది. అది చే లాంటి అసమానమైన వ్యక్తికే. ఆదర్శాన్ని ఎవరూ ఎన్నటికి చెరిపివేయలేరని ఈ అంశమే సామ్రాజ్యవాదులను బాగా కలవరపెడుతున్నట్టుగా వుంది.

చే మరణవార్త ప్రపంచాన్ని అదిరిపడేట్టుగా చేసిందని యూరప్‌లోని రాజకీయ వాదులతోసహా పలువురు చెప్పటం చూస్తే అందులో వారికి ఎంతటి ఆసక్తి వుందో అర్థమవుతుంది. మన తరంలో జరుగుతున్న వాస్తవాలను గుర్తించేలా చేస్తుందీ విషయం.

మాకు అనుకూలించే విషయాన్ని కూడా పక్కకు పెట్టి నిజం చెప్పవలసిన అవసరం ఉందని పూర్తిగా విశ్వశించడమేకాకుండా ఎంతో దృఢంగా కూడా ఉన్నాము. వార్తా నివేదికలపై మా విశ్లేషణ చేయటం, మేము నిజమనుకుంటున్నది చెప్పటం, దోష నిరూపణ చేయటం - ఇవన్నీ విప్లవవాదులకు తెలియాలి. అనుమానాల్ని అడ్డుపెట్టుకొని అనిశ్చితి సృష్టించటం కాని లేక క్రియాశూన్యులను చేయటం కాని సామ్రాజ్యవాదం చేయబోతున్నదని మేము హెచ్చరిక చేస్తున్నాము.

చాలా మంది విప్లవకారులకు ఈ వార్తపై ఇంకా అనుమానాలుండవచ్చు. ఒప్పుకోకపోవచ్చు కూడా. అందువల్ల వారు బయటకు మాట్లాడకపోవచ్చు. అటువంటి అపనమ్మకం ఉన్న ఏ విప్లవకారుడైనా ఇటువంటి వార్తను నమ్మడు. విప్లవకారులందరికీ ఇంకా చెప్పాలంటే ప్రపంచంలో ఉన్న విప్లవ వాదులందరికీ క్యూబా విప్లవంపై పూర్తి విశ్వాసం ఉంది. ఆ విశ్వాసం నిజమని చెప్పటానికి విప్లవంపై మనకున్న నిజాయితీకి న్యాయం చేయటానికే మనమిప్పుడు ఇక్కడ కలిశాము. ఆ వార్త ఎంత చేదుదైనప్పటికీ, దగ్గరి బంధువుల్లో ఎన్ని అనుమానాలున్నప్పటికీ మన బాధ్యత మనం నెరవేర్చటంలో వెనక్కుపోము. ఇటువంటి వృథాభ్రమలు పెట్టుకోవటంవల్ల విప్లవకారులకు ఒరిగేదేమిటి? అందువల్ల సాధించేదేమిటి? పరిణామక్రమంలో సంభవించే ఫలితాలను ముఖ్యంగా ఇటువంటి దుస్సంఘటనలను స్వీకరించటానికి వారు సిద్ధంగా లేరా? విప్లవాల చరిత్రలో కాని, విప్లవవీరుల చరిత్రలోకాని ఇటువంటి ఘాతుకాలు కనిపించవా? అనుకోని ఇటువంటి సంఘటనల్ని, ఎదురుదెబ్బల్ని దాటుకొని విప్లవకారులు ముందుకు సాగలేరా? కుంగిపోకుండా నిలవలేరా? ఉట్టిగా నైతిక విలువల్ని, ఒక నమూనా విలువల్ని వల్లె వేయటమేనా వారికి తెలిసింది? శాశ్వతంగా నిలిచిపోయే మనుషుల కృషిని, విలువల్ని వారు నమ్మటం లేదా? క్షణభంగురమైన మానవ భౌతికత్వానికే ఎక్కువ విలువ ఇస్తున్నారా? అజరామరమైనటువంటి మానవ అనుభవాల్ని, నడవడికల్ని, నమూనాల్ని విప్లవకారులు ముందుగా గుర్తించటంలేదా? ఆ నమూనాలే చరిత్రలో మనుషుల్ని ఉత్తేజపరిచి మార్గం చూపటంలేదా?

మొదటి నుండి జరుగుతున్నది అదే. స్వతంత్రపోరాటాల్లో విప్లవాలకు మొదటి నుండీ పెద్ద దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. మార్టి, మాకియొల మరణాలు అటువంటివే. ఎన్నో విప్లవోద్యమాలకు ఇటువంటి దెబ్బలు తగిలాయి అవి ఎంత పెద్దదైనా తట్టుకొని

నిలబడి ముందుకు సాగుతున్నారు.

చే మరణంతో విప్లవ గమనానికి ఎంత దెబ్బ తగిలిందన్న విషయాల్ని ఎవరైనా కాదనగలరా? అతని అనుభవం, అతనిచ్చే స్ఫూర్తి, అతనికున్న పేరు, ప్రతీఘాత శక్తుల గుండెల్లో అతను కలిగించిన భయం - వీటిని ఎవరైనా అంచనా కట్టగలరా? మనిషి భౌతికంగా బతికివుండటం కాదు అతని నడవడిక ముఖ్యమని చే నమ్మినంతగా ఎవరూ నమ్మలేదు. ఈ విషయం మేము బల్లగుద్ది చెప్పగలం. అపాయానికి ఎదురుగా వెళ్ళే అతని మనస్తత్వం గురించి, అతని చర్యల గురించి ఇంతకంటే అర్థం చేసుకోవటం కాని, వివరణ ఇవ్వటంకాని సాధ్యంకాదు.

విప్లవ పురోగమనానికి చేటుతెచ్చే మన శత్రువుకు మనపై సైద్ధాంతికంగా దాడి చేసే అవకాశం ఇవ్వకూడదు. మనం ఏ మాత్రం సమయాన్ని చేజార్చుకోకూడదు. అది మనపై మానసికంగా ఆధిపత్యం ఇచ్చేలా చేయకూడదు. నిజాన్ని గుర్తించి, నిజంపైనే నిలబడి, చే ని ఓ నమూనాగా తీసుకొని దానివల్ల కలిగే అజేయమైన శక్తితో ఈ విప్లవ పురోగమనాన్ని బలోపేతం చేస్తూ మొక్కవోని దీక్షతో విప్లవాన్ని ముందుకు కొనిపోవాలి.

అంతటి కష్టతరమైన ఈ పనిని నేను మొదలుపెట్టాను. బహుశా ఈ విశ్లేషణ సంపూర్ణమైనదని నేననుకోవటంలేదు కూడా. చే తో దగ్గరగా మసలి, అతని వ్యక్తిత్వం గురించి తెలిసిన మేమందరమూ ఏ చిన్న అనుమానం లేకుండా ఏకగ్రీవంగా మీకు చెప్పిన ఈ అభిప్రాయానికే వచ్చాము.

ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశం ఈ తీర్మానాన్ని ఆమోదించింది.

"లాటిన్ అమెరికా ప్రజల స్వతంత్ర్యం కోసం పోరాడుతూ బొలీవియా స్వతంత్ర పోరాట సైన్యాధిపతిగా ఉంటూ చేస్తున్న పోరాటంలో వీరకమాండర్ ఎర్నెస్టో గువేరా చనిపోయినందుకుగాను;

క్యూబా స్వతంత్ర్య సమరంలోనూ, విప్లవాన్ని నిర్మించటంలోనూ, దాన్ని అభివృద్ధి పరచటంలోనూ అసాధారణమైన సేవలందించిన కమాండర్ ఎర్నెస్టో గువేరాను క్యూబా ప్రజలు ఎన్నటికీ గుర్తుంచుకుంటారనీ;

అతని నడవడిక ప్రజాపోరాటాలకు ఓ నిర్దిష్ట రూపమిచ్చి అంతర్జాతీయంగా సమైక్య పోరాటాలను మమేకం చేయటానికి ఉపయోగ పడుతుందనీ;

అలసట, హద్దులు లేని అతని విప్లవ ప్రస్థానం అతని కమ్యూనిస్టు భావజాలం, విజయం వైపు మాత్రమే చూసే అతని పోరాట స్ఫూర్తి, సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా లాటిన్ అమెరికా జాతీయ, సామాజిక స్వతంత్ర్యం కోసం తన ప్రాణాన్నే ఫణంగా పెట్టిన అతని దృఢ విశ్వాసం, వీరోచిత పోరాటం ఎప్పుడూ నిలిచే వుంటాయనీ;

"అందుకే ఇలా తీర్మానిస్తున్నాం;

"మొదటగా, 30 రోజులు ఈ తీర్మానాన్ని ఆలాపిస్తూ, జాతీయ జెండాను అవనతం చేస్తాం, ఈ అర్ధరాత్రి 12 గంటలతో మొదలు వరుసగా మూడు రోజులు ప్రభుత్వ వినోదాల్ని రద్దు చేస్తున్నాము."



"రెండు, చే వీరోచిత మరణం పొందిన అక్టోబరు 8వ తేదీని జాతీయ స్మారక దినంగా అంటే "వీరోచిత గెరిల్లా దినం"గా ప్రకటిస్తున్నాం."

"మూడు, చే జీవితం గురించి, అతణ్ణి, అతని ప్రవర్తనను ఓ నమూనాగా ముందు తరాల వారికి తెలిసే విధంగా ఎన్ని కార్యక్రమాలు వీలైతే అన్ని చేస్తాము."

ఇదే సమయంలో పార్టీ కేంద్ర కమిటీ ఈ విధంగా తీర్మానించింది:

"మొదటిది : కమాండర్స్ జువాన్ అల్మీడా, రామిరో వాల్డిన్, రోగీలో అసివిడో, అల్ఫాన్స్ జయాస్ మొదలైన వారి నేతృత్వంలో ఓ కమీషన్ ఏర్పాటు చేస్తున్నాము. ఎర్నెస్టో గువేరా జ్ఞాపకార్థం చేపట్టే కార్యక్రమాలను రూపొందించటమేకాక అతని పేరు శాశ్వతంగా నిలిచిపోయేలా ఈ కమిషన్ పని చేస్తుంది."

"రెండు : చే జ్ఞాపకార్థం బుధవారం, అక్టోబరు 18వ తేదీ సాయంత్రం 8 గంటలకు విప్లవ ప్లాజా వద్ద జరిగే సాంప్రదాయ సభలో ప్రజలందరూ పాల్గొని ఆ వీరోచిత మూర్తికి, మరువలేనటువంటి వ్యక్తికి నివాళులర్పిస్తారని పిలుపునిస్తున్నాము."

# 3

**అక్టోబరు 18, 1967 హవానాలోని రెవల్యూషన్ ప్లాజాలో చే గువేరా స్మృత్యర్థం నిర్వహించిన ర్యాలీలో ఫైడల్ కాస్ట్రో ఉపన్యాసం. దాదాపు 10 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు.**

జులై లేదా ఆగస్ట్, 1955లో నేను చే ను కలుసుకున్నాను. అతను గుర్తు చేసుకునేవాడు - అదేమంటే - భవిష్యత్తు గ్రాన్మా దాడిలో అతను సభ్యుడైపోయాడు. అందుకు అవసరమైన నౌకకాని, ఆయుధాలుకాని, సైన్యంకాని లేవు. ఆ విధంగా 'గ్రాన్మా' జాబితాలో రావుల్‌తోపాటు తొలి ఇద్దరిలో చే కూడా చేరాడు.

అప్పటి నుండి 12 సం॥లు గడిచిపోయాయి. ఎంతో చరిత్ర ప్రాధాన్యంగల ఈ 12 సం॥లు ఎన్నో పోరాటభరితమైనవి. ఈ సమయంలోనే ఎంతో ధైర్యంకల, విలువైన వారిని మృత్యువు కబళించింది. కాని ఇదే సమయంలో విప్లవ కాలంలో అందులో నుండి ఎందరో అసామాన్యులు ఉద్భవించారు. వారి మధ్యలో వర్ణించవీలు లేనటువంటి ఆప్యాయతానురాగాలు రూపొందాయి.

ఈ రాత్రి ఇక్కడ కలవడంలో ఓ ఉద్దేశం ఉంది. మనతో ఎంతో దగ్గరగా మెలిగినటువంటి, మనం ఎంతో ఆరాధించే అభిమానించే వ్యక్తి గురించి, మన విప్లవంలోని అసామాన్యమైన వ్యక్తి గురించి మన అనుభూతులను చెప్పుకోవటానికి వచ్చాము. అతని గురించి, అతనితోపాటు పోరాటంలో పాల్గొని నేలకొరిగిన వీరుల గురించి, ఎంతో మహత్తరమైన చరిత్రలో చెరపలేని పుటలు లిఖించిన అంతర్జాతీయ సైన్యం గురించి మన అనుభూతుల్ని తెల్పటం కోసం వచ్చాము.

తన వ్యక్తిత్వంతో, తన సహజత్వంతో తన గుణగణాలతో, తన స్నేహశీలతతో, కామ్రేడ్లీతత్వంతో ఎంతో సాదాగా కనపడే చే ను ఎవరైనా వెంటనే ఇష్టపడతారు. అతని ఇతర గుణగణాల గురించి కాని, తన విశిష్టతల గురించికాని తెలుసుకోకుండానే ఇదంతా జరిగిపోతుంది.

మొదటి రోజుల్లో అతను మా ట్రూపులో వైద్యుడు. అందుకే అతనితో స్నేహం, బాంధవ్యం పెరుగుతూ పోయాయి. సామ్రాజ్యవాదమంటే అతనికి ఒంటినిండా ద్వేషమే. దీనికి కారణం అతనికి రాజకీయ విద్య దాదాపు పూర్తవటమే కాదు గ్వాటిమాలాలో విప్లవాన్ని

అడ్డుకోవటానికి సామ్రాజ్యవాదులు దుర్మార్గంగా ఆ దేశంలోని విదేశీ తొత్తుల్ని ఉపయోగించుకోవటం, వారి కర్కశత్వాన్ని కళ్ళారా చూసే అవకాశం కలిగింది.

చే లాంటి వ్యక్తికి దీర్ఘమైన వాదనలు అవసరం లేదు. క్యూబా కూడా అటువంటి స్థితిలోనే ఉన్నదని, ప్రజలు ఆయుధాలు చేబూని పరిస్థితిని ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నారని అతను ఇట్టే గ్రహించాడు. అటువంటి ప్రజలు నిజమైన దేశభక్తితో, విప్లవ చైతన్యం స్ఫూర్తితో వున్నారని కూడా అతనికి బాగా తెలుసు.

1956 నవంబరు చివర్లో క్యూబా వైపు సాగుతున్న మాతో ఉన్నాడతను. ఆ ప్రయాణం నాకు బాగా గుర్తుంది. అతనికి కష్టమైంది. పరిస్థితుల ప్రభావంవల్ల వెంటనే బయలుదేరాల్సి వచ్చింది. ఆ తొందర్లో తనకు కావలసిన మందులను కూడా సమకూర్చుకోలేకపోయాడు. ప్రయాణం మొత్తంగా తీవ్రమైన ఆస్తమాతో బాధపడ్డాడు. ఎటువంటి ఉపశమనమూ లేదు. అయినా దాని గురించి ఎవ్వరితోనూ చెప్పుకోలేదు.

మా మొదటి ప్రస్థానం మొదలుపెట్టాం. మా మొదటి అపజయాన్ని కూడా రుచి చూశాము. అయితే మీకందరికీ తెలిసినట్టుగానే కొద్ది రోజుల్లో గ్రాన్మా దాడిలో పాల్గొన్న వారిలో కొందరము తిరిగి కలిశాము. మా గ్రూపు వైద్యునిగా చే కొనసాగాడు.

మేము మొదటి యుద్ధం గెలిచాము. చే మా సైన్యంలో ఒకడిగా ఉన్నాడు. సైనికుడిగానే కాక వైద్యుడిగా కూడా చే వ్యవహరించాడు. మేము మా రెండవ పోరాటంలో కూడా గెలిచాము. అందులో కూడా చే సైనికుడిగా ఎంతో ధైర్యసాహసాలు ప్రదర్శించాడు. అతనొక్కడే ఒంటి చేత్తో గెలిపించాడు. అతని సైనికపాటవాలు బాగా తెలిశాయి. మేము బలపడుతూ ముందుకెళ్ళాము. ఎంతో ముఖ్యమైన పోరాటాన్ని తరువాత చవిచూశాము.

పరిస్థితి చాలా కష్టంగా ఉంది. మా వద్ద ఉన్న సమాచారంలో కూడా చాలా తప్పులున్నాయి. చాలా పటిష్టమైన సైనిక బలగంపై పట్టపగలు దాడి చేయాల్సి వచ్చింది. సముద్రం పక్కగా ఉన్నాము. తీరా చూస్తే శత్రు సైన్యాలు మా వెనుకే ఉన్నాయి. ఎక్కువ దూరం కూడా కాదు. అటువంటి తికమక పరిస్థితిలో మా వాళ్ళను ఒక్కటే కోరదలచాము అదేమంటే – అపరిమితమైన సామర్థ్యంతో పోరాడమని.

ఆ సమయంలో కా॥ జువాన్ అల్మీడా అత్యంత ప్రమాదకరమైన దాడి మొదలు పెట్టాడు. అయితే తన ప్రక్కగా ఉండవలసిన సైన్యం ఓ ప్రక్క పూర్తిగా లేకపోగా ఇంకో ప్రక్క నామమాత్రంగా ఉంది. అందులో దూసుకెళ్ళి దాడి చేసే వారు ఒక్కరూ లేరు. పరిస్థితి పూర్తి ప్రమాదకరంగా తయారయింది. వైద్యునిగా సేవలందిస్తున్న చే ఆ సమయంలో ముగ్గురు లేక నలుగురు కామ్రేడ్లు కావలసిందిగా కోరాడు. ఒకరికి మిషన్‌గన్ కావాలన్నాడు కూడా. ఇంకేముంది క్షణాల్లో కదిలి అటువైపు దాడికి సమాయత్తమయ్యాడు.

ఆ సమయంలో చే ను ఒక పోరాట యోధునిగానే కాక గాయపడ్డ కామ్రేడ్లకు వైద్య సేవలందించే వైద్యునిగా కూడా చూశాము. అదే సమయంలో గాయపడ్డ శత్రు సైనికులకూడా వైద్యం చేశాడు.

ఆయుధాలన్నీ స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రదేశం ఖాళీ చేయవలసి వచ్చింది.



తిరుగు ప్రయాణంలో చాలా చోట్ల శత్రుసైనికులు వేధించారు. గాయపడ్డ మా కామ్రేడ్ల వెంట ఒకరు వుండి వారి ఆరోగ్య విషయాలు చూసుకోవలసి ఉండింది. ఆ పని చే చక్కగా చేశాడు. కొద్ది మంది మా సైనికులు సహాయంతో వారి బాగోగులు చూసుకోవటమేకాక, వారి ప్రాణాలు రక్షించి తిరిగి అందర్లోకి కలిపాడు.

అప్పటి నుండి అతను ఓ సమర్థవంతమైన, శౌర్యంగల నాయకుడిగా అత్యవసర సమయాల్లో, పోరాటాల్లో అడగకనే ముందుండేవాడు.

ఎల్ యూరో పోరాటం అలా ముగిసిపోయింది. అంతకుముందు జరిగిన ఓ పోరాటంలో కూడా అతను అలాగే ప్రవర్తించాడు. అదేమంటే ఓ విద్రోహ చర్యవల్ల ఓ చిన్న దళంగా ఉన్న మాపై శత్రువులు మెరుపు దాడి చేశారు. ఏమి జరుగుతుందో తెలిసే లోగానే చాలా విమానాలు మాపై బాంబులు వేయసాగాయి. అందుకే మేము వెనుదిరగవలసి వచ్చింది. కొద్ది దూరం ప్రయాణం చేశాం. పూర్తిగా బాల్యావస్థలో వున్న మా సైన్యంలో కొందరు వాళ్ళ కుటుంబాల్ని చూసివస్తామని కోరారు. అప్పటికి పెద్దగా క్రమశిక్షణ కూడా అలవడలేదు. పై నుండి బాంబులు పడుతూనే ఉన్నాయి. మా వారి వద్దనున్న రైఫిల్స్ పై ఇక ఆశ వదులుకోవాల్సి వచ్చింది. అయితే చే ఈ సమస్య లేవనెత్తటంతోనే సరిపెట్టుకోలేదు. పై నుండి బాంబుల వర్షం కురుస్తున్నా సరే అందరివద్ద నుండి రైఫిల్స్ తిరిగి రాబట్టుకుని ఒక చోటికి చేర్చాడు.

అతని ముఖ్యలక్షణం అదే : అపాయకర సన్నివేశంలో తానుగాతానే వెంటనే కార్యోన్ముఖుడు కావటం. సహజంగానే తోటి యోధులలో ఇది ప్రశంసా భావం కలిగిస్తుంది – అది రెండింతలౌతుంది. ఎందుకంటే మాతో పోరాడుతున్న వ్యక్తి ఇక్కడ పుట్టలేదు. అతనిలో గాఢమైన ఆలోచనలు, తన ఖండంలోని ఇతర ప్రాంతాల్లో జరిగే పోరాటాల గురించి కలలు కనటం. ఇతరుల ఆనందంలోనే తన ఆనందం చూసుకోవటం, స్వలాభాపేక్ష లేకపోవటం, ప్రతి విపత్కర పరిస్థితిలోనూ ప్రాణాన్ని పణంగా పెట్టి పోరాడటం.

ఆ విధంగా పోరాడినందువల్లే సియెరమస్త్రాలో రెండవ దళానికి కమాండర్‌గా, నాయకునిగా నియమితుడైనాడు. అప్పటి నుండే అతడు ఇంకా ఎదగడం ప్రారంభించాడు. తరువాతి కాలంలో అద్భుతమైన పోరాట యోధునిగా ఎదిగి యుద్ధంలో అత్యున్నత స్థానం పొందాడు.

చే ను మరే సైనికునితో పోల్చలేము. అలాగే ఇంకో నాయకునితో కూడా అతణ్ణి పోల్చలేము. సైన్యం విషయకంగా చెప్పాలంటే అతను అసాధారణ ప్రజ్ఞాపాటవాలు గల వ్యక్తి. అసాధారణమైన ధైర్య సాహసాలు ఉండటమే కాక అలాగే దూసుకుపోతాడు. గెరిల్లాగా చే తో వచ్చే చిక్కు అదే. ఎలా ఆయన దూసుకుపోయే తత్వం, ప్రమాదమంటే నిర్లక్ష్యం.

అతని మరణాన్ని బట్టి కొన్ని నిర్ధారణలు చేయవచ్చని శత్రువు నమ్ముతున్నాడు. యుద్ధ విద్యలో ఆరితేరినవాడు చే ! గెరిల్లా పోరాటంలో అతను పెద్ద కళాకారుడు! ఎన్నో సమయాల్లో లెక్కలేనన్ని మార్లు నిరూపించాడు కూడా. కాని రెండు అసాధారణ సందర్భాలలో ఇంకా బాగా నిరూపించాడు. ఒకానొక పోరాటంలో అతను ఓ శ్రేణికి నాయకత్వం

వహిస్తున్నాడు. వారి చుట్టూ వేల సంఖ్యలో శత్రుసైనికులు. అది పూర్తిగా మైదాన ప్రాంతం. పూర్తిగా కొత్తదీను. కామిలోతో కలిసి ఒక అసామాన్య విజయాన్నందించాడు. లాస్ విల్లాస్ ప్రావిన్స్‌లో కూడా మెరుపులాంటి సైనిక పోరాటం చేశాడు. సాంతాక్లారా నగరంపై చేసిన సాహసవంతమైన పోరాటంలో తామున్న శ్రేణిలో సైనికులు మూడు వందలకు లోపే వుంటారు. నగరం చుట్టూ ట్యాంకులతో, శతఘ్నులతో వేల మంది శత్రుసైనికులు మోహరించి ఉన్నారు. ఆ రెండు ఉదాహరణలు అతణ్ణి ఓ అసాధారణ నాయకునిగా, ఓ ఆచార్యునిగా, విప్లవ యుద్ధంలో ఆరితేరిన ఓ కళాకారునిగా మన మనసుల్లో ముద్ర వేస్తాయి.

అయితే అతని కీర్తివంతమైన, వీరోచితమైన మరణం తరువాత అతని సిద్ధాంతాలను, అతని గెరిల్లా యుద్ధ సూత్రాలను తప్పులుగా చూపటానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. అపాయకరమైన విప్లవ పోరాటంలాంటి రంగంలో ఉన్న కళాకారుడు మరణించవచ్చు - కానీ తన జీవితాన్ని, తెలివితేటల్ని త్యాగం చేసినటువంటి ఆ కళకు మరణం లేదు.

ఇక్కడ విచిత్రమైనదేమిటంటే అతను పోరాటంలో ప్రాణాలు కోల్పోవటం? అంతకంటే విచిత్రమైనదేమిటంటే ఎన్నో సందర్భాలలో మన విప్లవ పోరాటాల్లో ప్రాణాలకు తెగించిన సందర్భాలలో అతను చనిపోలేదు. పెద్దగా ప్రాముఖ్యతలేని చాలా సందర్భాల్లో అతను ముందుకురుకుతూ వుంటే అతణ్ణి రక్షించుకోవటానికి మేము ఎన్నో చర్యలు చేపట్టవలసి వచ్చేది.

అయితే పోరాటంలోనే అంటే తాను చేసిన ఎన్నో పోరాటాల్లో ఒకటైన ఈ పోరాటంలో ప్రాణాలర్పించాడు. పోరాటానికి ముందున్న పరిస్థితుల్ని కచ్చితంగా చెప్పడానికి మా వద్ద సరైన ఆధారాలు లేవు. అంతటి విపరీత పోరాటం ఎందుకు చేయవలసి వచ్చిందో కూడా మాకు తెలియదు. మేము మళ్ళీ నొక్కి వక్కాణిస్తున్నాము. గెరిల్లా పోరాటంలో అతని బలహీనతగా చెప్పదగిన అంశం అమితమైన దూకుడు. ప్రమాదాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం.

ఇటువంటి సందర్భంలోనే మేము అతనితో ఏకీభవించలేము. అతని జీవితంకాని, అతని అనుభవంకాని, అతనిలాంటి పరిణతి చెందిన నాయకుడుకాని, అతనిలాంటి పట్టుగలవాడుగాని ఒకటేమిటి - అతనిలోని ఏ గుణమైనా తీసుకోండి పోల్చలేనంతగా అతనికంటే విలువైనవి.

అతని నడవడి చరిత్రలోని వ్యక్తుల విలువలతో ప్రభావితం అయివుండవచ్చు. వారు నేలకొరిగితే విప్లవాలు ఆగిపోవు అన్న అంశం కాని, చరిత్ర గమనం నాయకుల మరణంతో ఆగదు అన్న అంశంకాని ఎక్కువగా అతణ్ణి ప్రభావితం చేసి ఉండవచ్చు.

నిస్సందేహంగా అది నిజం. ప్రజలపై, విలువలపై, ఆదర్శాలపై అతనికి ఎంతో నమ్మకం. "మీకు కొద్ది రోజులు ముందుగా నేను చెప్పినట్టే - ఎన్నో విజయాలను మలిచేవాడిగా, అతని ఆజ్ఞలో, అతని నాయకత్వంలో ఎన్నో అపూర్వ విజయాలను చూడాలనేది మన కోరిక. ఎందుకంటే అంతటి అనుభవజ్ఞులు, అంతటి శక్తిమంతులు,



నిరుపమానమైన అంతటి అసాధ్యులు మనకు చాలా అరుదుగా కనిపిస్తారు.

అతని ఆదర్శాన్ని మనం మనసారా ప్రశంసిస్తాము. ఓ నమూనాగా అతణ్ణి తీసుకుని ఎందరో అలా జీవించటానికి ప్రయత్నిస్తారని నమ్ముతున్నాం. అలాంటి వారు మళ్ళీ ఉద్భవిస్తారని ఆశిస్తున్నాం.

అన్ని విశిష్టతలు గల చే లాంటి వ్యక్తిని కనుగొనటం కష్టం. అవసరమైనప్పుడు ఉపయోగపడే విధంగా ఉండే అతని విలక్షణతను పెంచుకోవటం ఎవరికైనా కష్టమే. పోల్చడానికిలేని తమను దాటిపోవడం సాధ్యంకాని వారి జాబితాలో అతనుంటాడు. అయితే ఇటువంటి సామర్థ్యంగల వ్యక్తులవల్ల తిరిగి అలాంటి వారు అభివృద్ధి చెందే అవకాశ ముంటుందని చెప్పగలను.

చే లో ఒక పోరాటయోధుణ్ణే కాదు కార్యాలు చేయగల సమర్థుడు కూడా ఉన్నాడు. అతను ఏమి చేశాడు, ఏమి చేస్తూ ఉండినాడు, కొద్ది మంది మద్దతుదార్లతో అంతటి సైన్యాలను, యాంకీ సామ్రాజ్యవాదుల వద్ద శిక్షణ తీసుకున్న సైన్యం, సామ్రాజ్యవాదుల చేతుల్లో తొత్తులుగా ఉన్నటువంటి చుట్టు ప్రక్కల దేశాలు బలపరుస్తున్న సైన్యాలు - వీటిని ఎదుర్కోవటమే ఓ అసాధారణ సాహసం.

చరిత్రపుటలు తిరగేస్తే అంతటి తక్కువ సంఖ్యలో వున్న సహచరులలో అంతటి ప్రాముఖ్యతగల కార్యాలను సాధించిన, ఎంతో పెద్ద సైన్యాలను ఎదుర్కొన్న నాయకుడింకొకరు కనిపించరు. తనలో, తన ప్రజల్లో, మనిషి పోరాట శక్తిలో నమ్మకం ఉన్న వారి కోసం చరిత్రపుటల్లో వెదకవచ్చు కాని అటువంటి వారు మనకెవ్వరూ కనపడరు.

అతను నేలకూలాడు.

అతని ఆశయాలను, గెరిల్లా సూత్రాలను, సాయుధ విప్లవ పోరాటాల్లోని సిద్ధాంతాలను గెలిచానని శత్రువు నమ్ముతూ వున్నాడు. వారు సాధించినది ఏమిటి, అదృష్టం కలిసొచ్చి అతణ్ణి భౌతికంగా లేకుండా చేశారు. యుద్ధంలో యాదృచ్ఛికంగా శత్రువుపై ఓ విజయం సాధించారంతే. ఈ పోరాటంలో ఏ మేరకు వారిని అదృష్టం వరిస్తుందో, ఇంతకు ముందు చెప్పుకున్నటువంటి లక్షణాలయిన అమితమైన వీరావేశం, ప్రమాదమంటే నిర్లక్ష్యం ఇందుకు ఏ మేరకు దారితీశాయో కూడా చెప్పలేము.

మన స్వతంత్ర్య యుద్ధంలో కూడా ఇలాగే జరిగింది. డాస్ రియోస్ వద్ద జరిగిన యుద్ధంలో స్వతంత్ర దూత జోసఫ్ మార్టిని, పుంతాబ్రావ వద్ద జరిగిన పోరాటంలో వందల పోరాటాల అనుభవం వున్న (క్యూబా స్వతంత్ర్య పోరాటంలో) ఆంటోనియో మాకియోను వారు హతమార్చారు. లెక్కలేనంత మంది నాయకులను, ఎందరో దేశభక్తులను పోరాటాల్లో పొట్టనబెట్టుకున్నారు. అయినా మన క్యూబా పోరాటం ఆగిపోలేదు.

కొద్ది రోజులు ముందుగా చెప్పాము - చే మరణం విప్లవానికి పెద్ద దెబ్బ. ఎందుకంటే అది నిస్సందేహంగా అత్యంత అనుభవజ్ఞుడైన, సమర్థుడైన ఒక నాయకున్ని లేకుండా చేస్తుంది.

ఈ విజయాన్ని ఎక్కువగా చెప్పుకుంటే వారు పప్పులో కాలేసినట్టే. ఈ మరణం

అతని భావాలకు, అతని ఎత్తుగడలకు, అతని గెరిల్లా సూత్రాలకు, అతని సిద్ధాంతాలకు మరణమనుకుంటే అదో పెద్ద తప్పే. ఇప్పుడు చనిపోయింది ఎవరో వారు తెలుసుకోవాలి. ఏదో వారి అదృష్టవశాత్తు వారు పడవేసిన వ్యక్తి ఎవరో వారు తెలుసుకోవాలి. అతను ఎన్నోసార్లు ఎన్నో బుల్లెట్లను ఎదుర్కొన్న వ్యక్తి. ఒక సైనికుడిగా, ఒక నాయకునిగా వారి కంటే కొన్ని వేల రెట్లు బలమైన వ్యక్తి.

అయితే విప్లవకారులు ఈ ఘోర విపత్తును ఎలా తట్టుకోగలరు? ఈ నష్టాన్ని వారు ఏ విధంగా ఎదుర్కోబోతున్నారు. ఒక వేళ ఈ విషయంపై తన అభిప్రాయాన్ని చెప్పమంటే చే ఏమని చెబుతాడు? మూడు ఖండాలకు చెందిన లాటిన్ అమెరికన్ సంఘీభావ మహా సభకు పంపిన తన సందేశంలో ఈ విషయం గురించి ప్రస్తావించాడు. తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. అతని మాటల్లోనే చెప్పాలంటే - చావు తనను ఎక్కడైనా ఎదురై ఆశ్చర్యపరిస్తే అతను దాన్ని ఆహ్వానిస్తాడట - ఎప్పుడంటే తన యుద్ధ కేక పడవలసిన వారి చెవిలో పడినప్పుడు, తన రైఫిల్‌ను అందుకోవటానికి ఇంకెవరైనా చేయిసాచినప్పుడు.

అతని యుద్ధకేక ఒక్క చెవిన కాదు కొన్నివేల మంది చెవిలో పడింది! ఒక్క చేయి కాదు కొన్ని వేల చేతులు అతణ్ణే నమూనాగా తీసుకొని ఆయుధాలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నాయి! కొత్త నాయకులు తప్పకుండా ఉద్భవిస్తారు. అన్ని విప్లవాల్లో నుండి ఉద్భవించినట్టుగానే ఆ కేక విన్న చెవులకు, సాచిన చేతులకు బాసటగా నాయకులు అవసరమవుతారు, వస్తారు.

అయితే వారికి చే లాంటి అసాధారణ అనుభవం, అంతటి సామర్థ్యం కల నాయకులు దొరక్కపోవచ్చు. అటువంటి నాయకులు పోరాట క్రమంలో తయారవుతారు. వినగలిగే వేలాది చెవులు, ఆయుధాలు చేపట్టటానికి లేచే వేలాది చేతుల నుండే ఆ నాయకులు ఉద్భవిస్తారు.

విప్లవ పోరాటంపై చే మరణం వెనువెంటనే ప్రభావం చూపుతుందని కాదు. చే ఆయుధం చేతపట్టినప్పుడు విజయం వెంటనే వస్తుందని అనుకోలేదు. సామ్రాజ్యవాదుల, విదేశీ తొత్తులైనటువంటి వారిపై అంత త్వరగా విజయం సాధిస్తానని కూడా చే అనుకోలేదు. ఎంతో అనుభవంగల పోరాటయోధునిగా 5, 10, 15 లేక 20 సంవత్సరాల సుదీర్ఘ పోరాటానికి చే సిద్ధపడివున్నాడు. 5, 10, 15 లేక 20 సం॥లు పోరాడటానికి లేక అవసరమైతే తన జీవితాంతం అయినాసరే! ఆ కోణం నుండి తీసుకుంటే అతని మరణం - లేదా అంతటి నమూనా లేకపోవటం విపరీతమైన ప్రతీఘాతంగా వుంటుంది. ఆ నమూనా అందించే బలం అజేయమైనది.

ఏదో అదృష్టవశాత్తు చే ను అంతమొందించిన వారు చే అనుభవాన్ని, అతని శక్తిని అంగీకరించకపోవచ్చు. చే ఓ అసాధారణమైన సైనిక నాయకుడు. అయితే చే ను గుర్తుచేసుకున్నప్పుడు, చే గురించి ఆలోచించినప్పుడు, అతని మిలిటరీ స్వభావాన్ని గురించి మాత్రమే చూడలేము. సైనిక పోరాటాలు సాధనాలు మాత్రమే అవే మొత్తం కాదు. అవి విప్లవానికి పనిముట్లు మాత్రమే. ఇక్కడ ముఖ్యమైనది విప్లవం మాత్రమే. విప్లవకారకాలు,



విప్లవ భావాలు, విప్లవ లక్ష్యాలు, విప్లవ స్వభావాలు విప్లవ విలువలు - ఇవే ప్రధానమైనవి.

చే మరణం వల్ల భావాలకు సంబంధించి, ఆర్ద్రతలకు సంబంధించి విప్లవ వైశిష్ట్యతలకు సంబంధించి, తెలివితేటలకు సంబంధించి ఎక్కువ నష్టం జరిగింది. అతని సైనిక స్వభావాలతోపాటు పై విషయాల్లో విప్లవ ప్రస్థానానికి ఎక్కువగా నష్టం జరిగిందనేది మా భావన.

చే అసాధారణ విలక్షణం ఏమిటంటే అతనిలో పలు రకాల స్వభావాలు ఒక్కచోటే వుండటం. కార్యాచరణలో అతణ్ణి ఎవ్వరూ దాటిపోలేరు. అదొక్కటే కాదు విశాలమైన దృక్పథం, విశాల సంస్కృతి, ఆలోచనలు, భవిష్యదర్శనంలో తెలివితేటలు ఇవన్నీ కలగలిసిన మనిషి. అంటే భావాలు, ఆచరణ - రెండూ కలబోసిన వ్యక్తి.

అత్యున్నతమైన భావాలు, వాటి ఆచరణ ఈ రెండు లక్షణాలే కాదు అతనిలో ఓ విప్లవకారుడు కూడా ఉన్నాడు. విప్లవకారుని లక్షణాలన్నీ వున్నాయి. గౌరవం, నిజాయితీ, సౌశీల్యం, నియమబద్ధమైన అలవాట్లు, మన్నన, మచ్చలేనటువంటి నడవడి ఇవన్నీ ఉన్నాయి. ఈ లక్షణాలన్నింటి వల్ల అతనొక ఆదర్శ విప్లవకారుడైనాడు.

మామూలుగానే ఎవరైనా మరణిస్తే వారి గురించి ఉపన్యాసాలివ్వటం, వారి గుణగణాల్ని ప్రస్తుతించటం జరుగుతుంది. అయితే ఓ వ్యక్తిలోని చే గురించి అలాటి వన్ని చాలా కచ్చితంగా చెప్పొచ్చు - అవన్నీ కలబోసినటువంటి చే విప్లవ స్వభావాల రీత్యా ఓ నిర్మలమైన నమూనా.

వీటన్నిటినీ మించి అతను ఓ సహృదయుడు. మానవతావాది. ఆ సహృదయత మేథవల్లకాని, తలంపువల్లకాని, అనుభవంవల్లకాని, పోరాటాల వల్లకాని వచ్చినది కాదు. అది హృదయానికి సంబంధించిన అంశం. అతను ఓ అసాధారణమైన మానవ మూర్తి, ఓ సున్నిత మనస్కుడు!

అతని జీవితం గురించికాని, అతని ప్రవర్తన గురించికాని ఆలోచిస్తే అతను ఓ అసాధారణ వ్యక్తిత్వం, ఆచరణ, ఆలోచన, నిర్దోషియైన విప్లవ స్వభావాలు కలిగి వుండటమే కాక గొప్ప మానవతావాదిగా, ఇనుములాంటి దృఢత్వం, ఉక్కులాంటి సంకల్పము, ఏదైనా పట్టుకుంటే వదలని తత్వం, సాహసం - ఇవన్నీ చూస్తే మీకే అనిపిస్తుంది. అతని గురించి మేము ఇంత గొప్పగా ఎందుకు చెబుతున్నామో.

అందుకే ముందుతరాల వారికి అతని అనుభవం ఓ అసాధారణ సైనికునిగా తన జ్ఞానాన్ని వదలిపోవటమే కాక అతని ప్రతిభా శక్తి ఫలాల్ని కూడా వదిలి వెళ్ళాడు. మన భాషను కాచి వడబోసిన వాడిలా రాశాడు.

యుద్ధం గురించిన అతని వర్ణనలు ఇంకా వేరే వాటితో పోల్చలేము. లోతు ఆలోచించగల అతని సామర్థ్యం మనల్ని ముగ్ధుల్ని చేస్తుంది. అసాధారణ గంభీరమైన మనస్తత్వంతోనే ఎప్పుడూ రాస్తాడు, లోతుగా రాస్తాడు. మన తరువాత ఎన్నో తరాలకు విప్లవ పంథాను తెలుపగల కావ్యాలుగా అతను చేసిన కొన్ని రచనలు నిలిచిపోతాయి.

అత్యంత కఠోరమైన, ఎంతో బలమైన అతని జ్ఞాన ఫలాలు మనకు లెక్కలేనన్ని

జ్ఞాపకాలను, కథలను మిగిల్చి వెళ్ళాయి. అతని కృషి, అతని శ్రమ లేకుంటే ఇవేవీ లేవు.

మన దేశంలో పని చేసినన్ని సంవత్సరాలూ అలసటలేని ఓ శ్రామికునిగా, ఒక్క రోజు కూడా విశ్రాంతి అనేది తెలియకుండా గడిపాడు. జాతీయ బ్యాంకుకు అధ్యక్షునిగా, కేంద్ర ప్రణాళికా సంఘానికి డైరెక్టరుగా, పరిశ్రమల మంత్రిగా, సైనిక ప్రాంతాల కమాండర్‌గా, రాజకీయ - ఆర్థిక - సోదర ప్రతినిధులకు అధిపతిగా ఇలా అతనికి నిర్దేశించిన పనులే చేశాడు.

ఎన్నో విషయాల్లో బుద్ధికుశలత కలిగినందువల్ల ఏ పని చేపట్టినా అది ఏ రంగానికి చెందినదైనా పూర్తి విశ్వాసంతో స్వీకరించేవాడు. విజయవంతంగా పోరాడిన సైనికునివలె, ఏ సంస్థకైనా పని చేయగల శ్రామికునివలె అతను ఎన్నో అంతర్జాతీయ మహాసభల్లో మనదేశానికి ప్రాతినిధ్యం వహించాడు. అతనికి విశ్రాంతిగా వుండే రోజులు కాని, గంటలు కాని లేవు.

అతని గది కిటికీల వైపు మేమెప్పుడు చూసినా రాత్రంతా చదువుతూనో, పని చేస్తూనో లేదా పని చేస్తూ చదువుతూనో కనిపించేవాడు. అన్ని సమస్యలు తెలుసుకునే వ్యక్తి అయినందువల్ల అతను అలసటెరుగని రీతిగా చదివేవాడు. తీరని అతని జ్ఞానతృష్ణతో తన నిదురకు కేటాయించే సమయంలోంచి చదవటం కోసం సమయాన్ని దొంగిలించేవాడు.

అతని సమయాన్నెప్పుడూ స్వచ్ఛంద సేవకే వినియోగించాడు. ఈ రోజు వందలు, వేల ప్రజలు చేస్తున్న పని వెనుక ఉన్న ఉత్తేజం అతను అందించినదే. మన వాళ్ళు తీవ్రంగా శ్రమిస్తున్నారంటే అది అతను మొదలుపెట్టినపనే.

ఓ విప్లవవాదిగా, ఓ కమ్యూనిస్టు విప్లవవాదిగా, ఓ నిజమైన కమ్యూనిస్టుగా (హద్దులులేని నైతిక విలువలు కలిగి వాటిపై నమ్మకంతో పని చేశాడు) నైతిక విలువలంటే హద్దులేని నమ్మకంతో ఉండేవాడు. మానవ చైతన్యంపై కూడా అతనికి హద్దులేని నమ్మకం ఉండేది. మానవ సమాజంలో ప్రాథమిక పాత్ర వహించేది కమ్యూనిజం నిర్మాణమేనని పూర్తి స్పష్టతతో నమ్మటమేకాదు. నైతిక ప్రేరణతో ఉండేవాడని మేం చూశాము. చెబుతున్నాము.

అతడు ఎన్నో విషయాలు ఆలోచించి, విస్తరింపజేసి రాశాడు. క్యూబా విప్లవ నిర్మాణంలో, లాటిన్ అమెరికా విప్లవ నిర్మాణంలో చే రాతలు, విప్లవ ఆలోచనలు శాశ్వత విలువ కలిగి వుంటాయని ఇటువంటి రోజు తప్పక చెప్పుకోవాలి. పని చేసే వ్యక్తిగా, ఆలోచనా పరుడిగా, అత్యున్నత విలువలు కలవాడిగా, అతిశయంలేని మానవ సున్నితత్వం కలవాడిగా, మచ్చలేని గుణవంతుడిగా అతని ప్రభావం విశ్వవ్యాప్తంగా విలువ కలిగి వుంటుంది. ఈ అభిప్రాయంపై మాకెటువంటి అనుమానాలు లేవు.

పోరాటంలో ఈ గెరిల్లా వీరుణ్ణి అంతమొందించామని సామ్రాజ్యవాదులు విర్రవీగుతూ ఉండవచ్చు. అతని వ్యక్తిత్వంలో ఒకే ముఖం చూసినట్టు మాత్రమే నమ్ముతున్నట్టు లేదా నమ్ముతున్నట్టుగా నటిస్తున్నట్టు సామ్రాజ్యవాదులను చూస్తే తెలుస్తుంది. ఇక మాకు కలిగిన దుఃఖం గురించి చెప్పాలంటే అంతటి విశిష్టతగల వ్యక్తి చనిపోవటం మాకు



బాధకలిగించింది. మానవ సున్నితత్వాలను దాటుకొనిపోలేని వ్యక్తి లేకపోవటం బాధ కలిగించింది. అంతటి మేధను కోల్పోవటం బాధ కలిగించింది. అంత చిన్న వయసులో అంటే 39 సం॥లకో వ్యక్తిని కోల్పోవటం బాధ కలిగించింది. అంతటి అనుభవం నుండి, అంతటి జ్ఞానం నుండి అందవలసిన విస్తృత ఫలాలను కోల్పోవటం బాధ కలిగించింది.

విప్లవపథానికి కలిగినటువంటి ఈ నష్టంగురించి మా కోణం మాకుంది. ఎటు తిరిగీ ఇక్కడ సామ్రాజ్యవాదుల బలహీనకోణం కనిపిస్తుంది. అదేమంటే అతణ్ణి భౌతికంగా వేరు చేసినందువల్ల అతని భావాలను, విశిష్టతలను, ఆదర్శాన్ని వేరు చేశామనుకుంటున్నారు.

ఎంత నిస్సిగ్గుగా వారి ప్రవర్తన ఉందంటే గాయాలతో దొరికిన అతణ్ణి హత్య చేసి ఇదేదో సహజమైన విషయంగా ఎటువంటి అభ్యంతరమూ లేకుండా ప్రచురించారు. ఆ విషయాన్ని ఒప్పుకోవటం, వారు పాటించిన పద్ధతిలో పొంతన లేకపోవటం చూస్తే వారెంత నిస్సిగ్గుగా ఉన్నారో తెలుస్తుంది. గాయపడిన విప్లవకారులను కాల్చి చంపటం ధగ్గులు, కిరాయి సైనికుల హక్కు అన్నట్లుగా వారు ప్రచురించారు.

ఇంకా విచారించదగ్గ అంశం వారెందుకలా చేశారో వివరించారు. చే ను విచారించటం ప్రపంచాన్నే కుదిపివేస్తుందని, అతణ్ణి బోనులో ఉంచటం సాధ్యం కాదని నమ్మ బలుకుతున్నారు. అతని అవశేషాలను లేకుండా చేశామని చెప్పటానిక్కూడా వారు వెనుకాడటంలేదు. నిజమయినా కాకపోయినా అతడి శరీరాన్ని ఖననం చేశామని చెప్పారు. దాంతో ఆ వీరుణ్ణి భౌతికంగా రూపుమాపినా అతని ఆశయాలను, ఓ ఆదర్శంగా అతణ్ణి లేకుండా చేశామని గట్టిగా చెప్పలేకపోతున్నారు.

అణగారిన, దోచబడుతున్న వారున్న ఈ ఖండంలోని వారిని రక్షించదానికి, వారి హక్కులను కాపాడటానికి చేసిన పోరాటంలోనే చే చనిపోయాడు. భూమిని నమ్ముకొన్న వారు, పేద వారు - వీరి రక్షణ తప్ప అతనికి వేరొక ప్రయోజనంలేదు. ఆదర్శప్రాయంగా స్వలాభాపేక్ష లేకుండా అతను దేనికోసమైతే పోరాటం జరిపాడో ఆ విషయంపై శత్రువులకు కూడా అనుమానం లేదు.

ఎవరైతే అతనిలా చేస్తారో, పేద ప్రజల కోసం ఎవరైతే మొత్తం ధారపోస్తారో వారు ప్రజల హృదయాల్లో ఎంతో ఎత్తుగా ఎదుగుతారు. రోజురోజుకూ ఎదుగుతారు. చరిత్రలో నిలిచిపోతారు. సామ్రాజ్యవాద శత్రువులు ఇది గమనిస్తూనే వున్నారు. అయితే అతని మరణం రాగల కాలంలో ఓ విత్తనం వలే ఎందరికో అతనిని అనుకరించటానికి, అతని నమూనాను అనుసరించటానికి దోహదపడుతుంది. ఇదంతా ఎంతో దూరంలో లేదని వారు తెలుసుకుంటారు.

ఈ అనుకోని దెబ్బ నుంచి ఈ ఖండంలోని విప్లవ పోరాటంకాని, విప్లవ ప్రయోజనం కానీ వెంటనే కోలుకుంటాయని మేము మనస్ఫూర్తిగా నమ్ముతున్నాము.

విప్లవకోణం నుంచి కాని, మా ప్రజలకోణం నుంచి కాని చే ను ఎటువంటి ఆదర్శంగా చూస్తున్నామా? చే ను కోల్పోయామని అనుకుంటున్నామా? అతను రాసే అంశాలు కొత్తవి చూడలేము. నిజమే. అతని గొంతును ఇకపై వినలేము. ఇదీ నిజమే. అయితే

ఎంతో సంస్కృతిని, గొప్ప సంస్కృతిని ఈ ప్రపంచానికి చే వదిలి వెళ్ళాడు. అతని గురించి ఎంతో ఎక్కువగా తెలిసిన మేము ఎక్కువగా ప్రయోజనం పొందినవారమే.

తన విప్లవ ఆలోచనలను, విప్లవ స్వభావాలను మాకు వదిలి వెళ్ళాడు. తన ప్రవర్తన, తన పట్టుదల, పనిపై తనకుగల ఉత్సాహాన్ని వదిలి వెళ్ళాడు. ఒక్క మాటలో చెప్పాలంటే తన ఆదర్శాన్ని మాకు వదలి వెళ్ళాడు!

మా విప్లవ పోరాటయోధులను, మా సైనికులను, మా ప్రజలను ఏమి కోరతారని అడిగితే అనుమానంలేకుండా చే లాగా ఉండమని కోరతాము! రానున్న తరాల వారిని ఏమైనా కోరమని అడిగితే మేము కోరేది ఒక్కటే మీరు చే లాగా ఉండమని ! మా చిన్నారులను ఏ విధంగా చదువుకోమని చెబుతామంటే సందేహం లేకుండా చే లాంటి చైతన్యంతో చదువుకోమని కోరతాం! మన కాలంలో కాకుండా భవిష్యత్తులో ఉండబోయే మనిషి ఏ నమూనాలో ఉండాలంటే, ఆ నమూనా ఎలా ఉండాలో నా గుండె లోతుల్నుండి చెబుతాను, తన ప్రవర్తనపై, తన చర్యలపై ఎటువంటి మచ్చలేని చే లాగా ఉండాలని! మా బాలలు ఏమి కావాలో మేము కోరాల్సివస్తే, మండుతున్న విప్లవకారులుగా ఒకటే చెబుతాం చే లాగా తయారవమని!

భవిష్యత్తులో మన వాళ్ళుకాని, లాటిన్ అమెరికాలో వారు కాని ఎటువంటి నమూనాల్లో ఉండాలంటే అది చే నే. విప్లవ సౌశీల్యం, విప్లవ చైతన్యంతో కూడిన త్యాగం, విప్లవ పోరాటం, విప్లవ చైతన్యంతో కూడిన పని - ఇవన్నీ అత్యున్నత స్థాయిలో చే చేసి నిరూపించాడు. మార్క్సిజం-లెనినిజంలో ఉన్న భావాలను నూతనంగా, స్వచ్ఛంగా, విప్లవ తరహాలో మళ్ళీ చూపించాడు చే. మన కాలంలో అట్టడుగు స్థాయిలో ఉన్న అంతర్జాతీయ భావనను అత్యున్నత శిఖరాలకు చే తీసుకెళ్ళినంతగా ఎవరూ తీసుకెళ్ళలేదు.

అంతర్జాతీయవాద భావన గురించి కాని, లేదా అంతర్జాతీయవాది ఏ నమూనాలో ఉండాలి అని అడిగితే, ఉదాహరణగా అందరికంటే ఎత్తులో చే ఉంటాడు. జాతీయ జెండాలు, అపోహలు, విదేశీ దురభిమాన దేశభక్తి, అహం ఇలాంటివి ఏవీ అతని మనసులో కాని, హృదయంలో కాని లేవు. తన ఉదారమైన రక్తాన్ని వెంటనే, ఎప్పుడైనా ఏ ప్రజలకోసమైనా, ఏ ప్రజా ప్రయోజనం కోసమైనా చిమ్మటానికి అతను సిద్ధంగా ఉండేవాడు!

అతని రక్తం ఎన్నో పోరాటాల్లో మన గడ్డపై చిందింది. అలాగే బొలీవియాలో కూడా అక్కడి వారి స్వతంత్ర్యం కోసం, అణగారిన వారి బాగుకోసం తన రక్తాన్ని చిందించాడు. అణగారిన వారి కోసం, దోచబడుతున్న వారి కోసం తన రక్తాన్ని చిందించాడు. అమెరికా ప్రజల కోసం, వియత్నాం ప్రజలు కోసం రక్తం చిందించాడు. ఎందుకంటే బొలీవియాలో పోరాడే సమయంలో, సామ్రాజ్యవాదులతో, విదేశీ కిరాయి సైన్యాలతో పోరాడే సమయంలో వియత్నాం కోసం తాను చూపుతున్న అత్యున్నత సోదరభావం అదేనని అతనికి తెలుసు!

ఈ కారణం కోసమే విప్లవ కామ్రేడ్లుగా మనం భవిష్యత్తును ఎంతో దృఢంగా, ఖచ్చితంగా, ఆశావాదంతో ఎదుర్కోవాలి. చే ను 'నమూనాగా తీసుకొని మనమెప్పుడు ఉత్తేజం కోసం చూడాలి. పోరాటంలో, పట్టుదలతో, శత్రువు విషయంలో రాజీపడక



పోవటంలో, అంతర్జాతీయ భావనలో - వీటన్నింటిలో చే తరహా ఉత్తేజంకోసం చూస్తాము.

అందుకే, కదిలించేటటువంటి ఈ కార్యక్రమం అనంతరం నమ్మశక్యంకాని ఈ మహా ప్రదర్శన సంఖ్యలో కాని, క్రమశిక్షణలోకాని, అంకితభావంలో కాని, దీని అనంతరం, ఒక విషయం ప్రస్ఫుటమౌతుంది; మా ప్రజలు సున్నితత్వం కలవారు, కృతజ్ఞత తెలిపే వారూను. పోరాటంలో అసువులుబాసిన వీరుని ఎలా గౌరవించాలో, తమకు సేవ చేసిన వారిని ఎలా గుర్తించాలో బాగా తెలిసిన వారు. విప్లవ పోరాటాలకు మా ప్రజలు ఎలా మద్దతు ప్రకటిస్తారో, విప్లవ పతాకాలను ఇంకా సమున్నతంగా ఎగరేయడం కోసం, విప్లవ సూత్రాలను పాటించటం కోసం శ్రద్ధాంజలి ప్రకటిస్తున్న ఈ సమయంలో, మన స్ఫూర్తిని, భవిష్యత్తు పై మనకు గల ఆశాభావంతో, అంతిమ విజయం మనదేనన్న ఈ శాశ్వత ఆశాభావాలతో, చే కోసం, అతనితోపాటు పోరాడి మరణించిన వారి కోసం చెప్పండి :

ఎప్పుడూ విజయంవైపే ఉండండి!
మాతృదేశం లేదా మరణం!
అతను గెలుస్తాడు!

# 4

బొలీవియాలో అక్టోబరు 8, 1967 గెరిల్లా దాడిలో చే పట్టుబడ్డప్పుడు అతని డైరీనీ స్వాధీనపరుచుకున్నారు. అందులోని చాలా పేజీలను విలేఖరులు ఫొటో తీసుకోగలిగారు. పెంటగాన్, సిఐఎలకు వాటి ప్రతులు అందజేయబడ్డాయి. తమకు యుద్ధంలో లభించిన జ్ఞాపక చిహ్నంగా బొలీవియా ప్రభుత్వం పేర్కొంది. మూడు లక్షల డాలర్లకు దాని ప్రచురణ హక్కులు అమ్మటానికి ప్రయత్నాలు కూడా చేసింది. ఈ ప్రయత్నాలన్నీ అచిరకాలంలోనే వమ్మయ్యాయి. బొలీవియా అంతరంగిక వ్యవహారాల మంత్రి ఆంటోనియో ఆర్గ్యుదాస్ వద్ద డైరీ ఫొటో ప్రతులు లభించటంతో అతణ్ణి దేశం వదిలి పొమ్మని ఆదేశించారు.

డైరీ నిజమైనదేనా కాదా అని అన్ని విధాలైన పరీక్షలు చేశాకే క్యూబా ప్రభుత్వం దాని ప్రచురణకు పూనుకుంది. ఈ యుద్ధంలో ప్రాణాలతో బయటపడ్డ ముగ్గురు క్యూబన్లకు ఈ పని అప్పగించబడింది. సైన్యం కంటబడకుండా వీరు అదేస్ నుండి చిలీ వరకు కాలినడకన చేరుకున్నారు. జులై 1, 1968న డైరీని ప్రచురించి క్యూబా ప్రజలకు ఉచితంగా పంచిపెట్టారు. దాన్ని తర్జుమా చేసి ఇతర దేశాల్లో ప్రచురించటానికి సన్నాహాలు చేయబడ్డాయి. రాంపార్ట్స్ పత్రికలో డైరీ ఆంగ్ల ప్రతిని 2,00,000 కాపీలకు పైగా ప్రచురించారు.

ఆ డైరీ నిజమైనది కాదని సృష్టించినదని బొలీవియా అధ్యక్షుడు బారియెంటాస్ ప్రకటించాడు. డైరీ మైక్రోఫిల్మ్ నుండి తీసిన ప్రతులను, అంతర్జాతీయ పత్రికలకు ఇవ్వగలమని, వాటిని నిజమైన డైరీతో పోల్చుకోవచ్చునటానికి బొలీవియా ప్రభుత్వం సిద్ధమేనా అని కాస్ట్రో సవాలు విసిరారు.

డైరీ 1968 ప్రచురణలో కాస్ట్రో ముందుమాట ఇది :

గెరిల్లాగా ఉన్నప్పుడు రోజూ సంఘటల్ని తన దృష్టితో డైరీలో రాసుకోవటం (క్యూబా విప్లవ పోరాటంలో) చే అలవాటు. చాలా దూరం కొండల్లో ప్రయాణం చేస్తున్నప్పుడు, పూర్తి అరణ్యం మధ్యలో ఉన్నప్పుడు, తాము మోస్తున్న సామాను అంటే అందులో మందుగుండు, ఆయుధాలు బరువుగా ఉండి ఏ కొద్ది సమయం ఆగినప్పుడో లేదా బాగా అలసిపోయిన సైనికులకు ఆ రోజుకిక ఆగిపొమ్మని ఆజ్ఞ అందినపుడో - చే ఓ చిన్న నోటు పుస్తకం తీసి చిన్నగా, దాదాపు ఎవ్వరికీ అర్థంకాని వైద్యుల రాతతో అతని నోట్సు

రాసుకునేవాడు.

తరువాత అందులో దాచుకోగలిగిన, అమూల్యమైన గొప్ప చారిత్రక వివరణలతో క్యూబాలో జరిగిన విప్లవ పోరాటాలకు సంబంధించిన విషయాలు రాశాడు. అందులోని విషయాలు ఎంతో విప్లవాత్మకంగాను, విజ్ఞానభరితంగాను ఉంటాయి. ఎన్నో మానవ సంబంధవిషయాలు ఉంటాయి.

అతనికున్న ఆ రాసుకునే అలవాటువల్ల ఎంతో మంచి జరిగింది. బొలీవియాలో ఎంతో వీరోచితమైన ఆ చివరి కాలానికి సంబంధించిన పూర్తి సమాచారం మనముందుంది. అది ఎంతో ఖచ్చితమైనది విలువకట్టలేనటువంటిదీను, వివరమైంది కూడా.

ఆ నోట్సు ప్రచురణకోసమని రాయలేదు కాని అక్కడి పరిస్థితులను, సంఘటనలను, మనుషులను అంచనా వేయటంలో మనకు బాగా ఉపయోగపడింది. అతని నిశిత దృష్టిలో విశ్లేషణ, మధ్యలో హాస్య చతురత, కలగలసి అతను రాసుకున్న విషయాలు మనకు పూర్తిగా తెలుస్తాయి. ఎంతో గంభీరమైన వస్తువుతో ఉండి మొదటి నుండి చివరి వరకు ఏకసూత్రతో ఉన్నాయి.

వీరోచితమైన, మానవాతీతమైన పోరాటాల మధ్యలో విశ్రాంతికోసం దొరికిన అతి కొద్ది సమయంలో ఇది రాశాడని మనం గమనంలో పెట్టుకోవాలి. అదీకాక ఈ గెరిల్లా దళం ప్రధాన దళం నుండి దూరంగా ఉంది. అతికష్టమైన పరిసర ప్రాంతాలు, ఉద్యమం ఇంకా మొదటి దశల్లోనే ఉంది. అటువంటి పరిస్థితుల్లో ఆ దళానికి నాయకుడిగా తన సేవలందిస్తూ దీన్ని రాశాడు. అతని పని విధానాన్ని, ఉక్కులాంటి అతని దృఢ చిత్తాన్ని ఇక్కడ చూడవచ్చు.

డైరీలోని అంశాలను విశ్లేషిస్తూ ఉంటే ప్రతి రోజూ జరిగే విశేషాలు, పరిస్థితులు సరిగా లేకపోవటం, పరిస్థితులను అంచనా వేయటం, నిందలు మోయటం - ఇలా ఇవన్నీ విప్లవ గెరిల్లా పోరాటాల్ని వృద్ధి చేయాలంటే తప్పదు మరి.

గెరిల్లా దళంలో అలాంటి అంచనాలను ఎప్పటికప్పుడు బేరీజు వేసుకుంటుండాలి. గెరిల్లాలు కేంద్రంగా ఉండి, చుట్టూ నైసర్గిక పరిస్థితులు అననుకూలంగా ఉండి, శత్రు సైన్యం పెద్ద సంఖ్యలో ఉంటే ఓ చిన్న తప్పు కూడా భయంకర పరిణామాలకు దారి తీస్తుంది. అందుకే వారి నాయకుడు ఎంతో పట్టుకలిగి ఉండాలి. ఎటువంటి మామూలు సందర్భమైనా ఎల్లవేళలా తన గెరిల్లాలకు శిక్షణ నిస్తూ సాగిపోతూ ఉండాలి. భవిష్యత్తు గెరిల్లా దళాలకు కూడా అవి పనికొస్తాయి.

గెరిల్లాలకు శిక్షణ నివ్వటం ఓ నిరంతర కార్యం. ప్రతి వారి మస్తిష్కాన్ని అది మేల్కొల్పుతుంది. విప్లవకారుల హృదయాన్ని ఎక్కడ తాకాలో చే బాగా ఎరిగినవాడు. మార్కోస్‌ను చాలాసార్లు హెచ్చరించవలసిన పరిస్థితి ఓసారి చే కు కలిగింది. గెరిల్లా దళం నుండి అమర్యాదగా తొలగిస్తానని చెప్పాడు. అప్పుడు మార్కోస్ ఇలా అన్నాడు "అంతకన్నా ఓ గుండు దెబ్బకు చావటం నయం". తరువాత అతను వీరోచితంగా మరణించాడు. ఎవరిమీదైతే పూర్తి విశ్వాసం ఉంటుందో వారిని చే అప్పుడప్పుడూ హెచ్చరిస్తుంటాడు.



పోరాటాల్లో ఏదో ఒక సందర్భం చూసుకొని ఈ పని చేస్తుంటాడు. మంచి సోదరభావంతో ఉండే గొప్ప మానవతావాది అతను. అయితే అవసరమయినప్పుడు అధికారయుతంగానూ, కఠినంగానూ ఉండగలడు. అయితే ఈ కఠినత్వం ఇతరులపై కంటే తనపైనే ఎక్కువగా ఉపయోగిస్తాడు. గెరిల్లా మస్తిష్కంపై, పోరాటశక్తిపై క్రమశిక్షణ కావాలంటాడు. ఆ ఆదర్శాలన్నీ తనక్కూడా అన్వయించుకుంటాడు.

డైరీలో (రెగిస్) డిబ్రేకు సంబంధించివ విషయాలు కూడా చాలా రాశాడు. యూరప్‌లో పర్యటించి అక్కడి పరిస్థితులను అంచనా వేయటమనే కర్తవ్యంపై వెళ్ళిన అతణ్ణి నిర్బంధించి జైల్లో పెట్టడం చే ను బాగా కలిచివేసింది. అంతరాంతరాల్లో డిబ్రేను గెరిల్లా యుద్ధానికే వాడుకోవాలని చే కు ఉండేది. అందుకే అతని ప్రవర్తనపై అనుమానాల్ని ప్రకటించటమేకాక అప్పుడప్పుడూ అసహనంగా ఉండేవాడు.

అణచివేత సైన్యం చేతుల్లో డిబ్రే ఎంత ధైర్యంగా, సాహసంగా, ప్రవర్తించిందీ, వారు అతణ్ణి ఎంతటి చిత్రహింసలకు గురి చేసిందీ వగైరా విషయాలు చే కు తెలిసే అవకాశం లేదు. డిబ్రే పై న్యాయ విచారణ ఎంతటి రాజకీయ ప్రాముఖ్యత సాధించింది అన్న విషయాన్ని అక్టోబరు 3వ తేదీన తన డైరీలో రాశాడు. అంటే అతను చనిపోయే ఆరు రోజుల ముందన్న మాట. ఎన్నో చేదు సంఘటనల మధ్య, ఉద్వేగభరితమైన సంఘటనల నడుమ చే ఇలా రాశాడు :

"డిబ్రేతో జరిగిన ఇంటర్వ్యూ గురించి తెలిసింది. రెచ్చగొట్టే విద్యార్థితో మాట్లాడినప్పుడు ఎంతో ధైర్యంగా ఉన్నాడు". ఆ రచయిత గురించిన డైరీలోని చివరి అంశం అదే.

క్యూబా విప్లవం గురించి, గెరిల్లా పోరాటంతో దానికున్న సంబంధాల గురించి డైరీలో చాలా చోట్ల మనకు కనబడుతుంది. డైరీని ముద్రించటం ఓ కవ్వింపు చర్యగా ఎవరైనా పేర్కొనవచ్చు. ఎందుకంటే విప్లవ వ్యతిరేకులైన యాంకీ సామ్రాజ్యవాదులకు, వారి అనుచరులకు, లాటిన్ అమెరికాలోని తొత్తు ప్రభుత్వాలకు ఇదో అవకాశంగా మారి క్యూబాను ఏకాకిని చేసి దాడి చేయవచ్చుననే వాదన వినిపించింది.

ఆ విధంగా భావించేవారు ఓ అంశాన్ని గుర్తుంచుకోవాలి. అదేమంటే ప్రపంచంలో ఎక్కడైనా సరే దాడి చేయటానికి ఈ యాంకీ సామ్రాజ్యవాదులకు ఏ కారణమూ అవసరంలేదు. క్యూబాలో ఎప్పుడైతే మొదటి విప్లవ చట్టాన్ని తెచ్చామో అప్పుడే క్యూబా విప్లవాన్ని అణచటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. సామ్రాజ్యవాదులు ప్రపంచ పోలీసుగా ప్రవర్తిస్తూ ప్రపంచంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా తలదూరుస్తూ విప్లవ ప్రతీఘాత శక్తులకు ఓ పద్ధతి ప్రకారం మద్దతునిస్తూ ఉన్నారు. వెనుకబడ్డ, అమానుషమైన సాంఘిక వ్యవస్థలు ఎక్కడ వున్నా వాటిని కాపాడుతూ ఉన్నారు.

విప్లవ పోరాటాలకు సంఘీభావం ప్రకటించడం యాంకీ సామ్రాజ్యవాదులకు కోపం తెప్పించే మొదటి అంశం. కాని అది ఎప్పటికీ నిజమైన కారణం కాబోదు. వారికి సాకుగా దొరుకుతుందని సంఘీభావం ప్రకటించకపోవటం ఎంతో హాస్యాస్పదం. అది ఏ

మాత్రం సరిపోదు. సంఘీభావం ప్రకటించకపోవటం యాంకీ దురాక్రమణను బలపరచటమే కాక ప్రపంచంలో బానిసత్వ విధానాల్ని బలపరచినట్టు కూడా అవుతుంది.

వలసవాదం, సామ్రాజ్యవాదం కొన్ని శతాబ్దాలుగా తమ స్వలాభాలకోసం కొన్ని దేశాల్ని అణచివేస్తూ వున్నాయి. క్యూబా కూడా అందులో ఒక చిన్న దేశం. ఆర్థికంగా బాగా వెనుకబడి వుంది. అమెరికా సముద్ర తీరానికి కేవలం 90 మైళ్ళ దూరంలో ఉంది. అక్కడ యాంకీ నౌకా స్థావరం కూడా వుంది (గాటనామో), ఆర్థికంగా, సాంఘికంగా వృద్ధి చెందటం కోసం ఎన్నో అడ్డంకులను ఎదుర్కొంటోంది విప్లవంలో విజయం సాధించినప్పటి నుండి. అయితే సామ్రాజ్యవాదం మమ్మల్ని ఏమీ చేసుకోలేదు. ఎందుకంటే విప్లవ పంథాను చాలా కాలంగా అంటిపెట్టుకున్నందువల్ల వచ్చే కష్టాలు మాకంత ప్రధానం కాదు.

చే రాసిన బొలీవియన్ డైరీని ముద్రించటం మినహా విప్లవం వైపు నుండి ఇంకో ప్రత్యామ్నాయం లేదు. అది బారియంటాస్ చేతిలో పడిన వెంటనే సిఐఎ, పెంటగాన్, అమెరికా ప్రభుత్వాలకు ఫొటో ప్రతులను పంపాడు. బొలీవియాలో సిఐఎతో సంబంధం ఉన్న విలేకరులు ఆ ప్రతులను చూడగలిగారు. అవి ఫొటో ప్రతులయినందువల్ల తాము ప్రచురించటం లేదన్నారు.

మిలిటరీ ఉన్నతాధికారులు, బారియంటాస్ ప్రభుత్వం డైరీని ప్రచురించక పోవటానికి చాలా కారణాలు ఉన్నాయి. అతి కొద్ది మందిగానే వున్న గెరిల్లాల చేతిలో ఎన్నో అపజయాల్ని చవి చూసిన తమ సైన్యం చేతకాని తనాన్ని అది బహిర్గతం చేస్తుంది, కొద్ది వారాల్లో వారి వద్ద నుండి రెండు వందల ఆయుధాలను వివిధ పోరాటాల్లో స్వాధీనం చేసుకున్నారు. అదీకాక బారియంటాస్ గురించి, అతని ప్రభుత్వం గురించి సరైన రీతిలో చే వర్ణించాడు. చరిత్రలో చెరిపేయలేని పదాలు వాడాడు.

సామ్రాజ్యవాదులకు తమ సొంత కారణాలు కూడా వున్నాయి. చే ప్రత్యేక తరహాలో ప్రపంచ ఖ్యాతి పొందుతూ ఉన్నాడు. అతని భావాలు, అతని అసాధారణ ఆదర్శం, అతని పేరు అణచివేతకు గురైనవారికి, అన్యాయం జరిగిన వారికి బావుటాలుగా ఉన్నాయి. ప్రపంచం నలుమూలల్లోని విద్యార్థులకు, మేధావులకు ఓ ఉద్విగ్నభరిత ఆసక్తిని కలిగించాయి.

అమెరికాలో కూడా నల్ల జాతి పోరాటం, పురోగామి విద్యార్థులు చే ను తమ వాడిగా చేసుకొని తమ సంఖ్యను పెంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. పౌర హక్కుల కోసం జరుగుతున్న పోరాటాల్లో, వియత్నాంలో పెరుగుతున్న దాడుల్లో అతణ్ణి ఓ ఆదర్శ చిహ్నంగా చేసుకున్నారు. ఆ రూపం, పేరు, ఆదర్శవంతమైన వ్యక్తిత్వం విశ్వవ్యాప్తంగా అతికొద్ది కాలంలో ఓ ప్రతీకగా మారటం, ఓ ప్రేరణ శక్తిగా మారటం చరిత్రలో బహుశా ఇంతకుముందు ఎన్నడూ సంభవించలేదేమో. ఇది ఎందువల్ల జరిగిందంటే స్వచ్ఛమైన, నిస్వార్థమైన ఓ నిర్దిష్టరూపంతో చే అంతర్జాతీయ భావన కలిగి నేటి ప్రపంచ పరిస్థితులను ప్రతిబింబిస్తూ భవిష్యత్తులో ప్రపంచం ఎలా ఉండబోతున్నదీ తెల్పుతున్నాడు.

నిన్నటి వరకు వలస దేశాల అణచివేతలో ఉండి, నేడు యాంకీ సామ్రాజ్యవాదుల చేతుల్లో వారి స్వలాభం కోసం నలిగిపోతూ, వెనుకబాటు తనంతో క్రూరమైన దుర్దశలో



ఉన్న ఖండంలో ఏకైక పోరాట ప్రతీకగా స్ఫూర్తి నిచ్చే ఓ మూర్తి అవతరించాడు. అంతర్జాతీయ విప్లవ పోరాటాలకు చిహ్నంగా ఉంటూ ఈ సామ్రాజ్యవాద, వలస దేశాల రాజధానుల్లో కూడా ఆరాధ్యుడిగా మారాడు.

ఈ ఆదర్శవంతుడి ప్రభావవంతమైన శక్తి. ఆ శక్తిని విస్తరింపచేసే సహాయం ఈ యాంకీ సామ్రాజ్యవాదుల్లో వణుకు పుట్టించింది. ఈ డైరీ ఆ అసాధారణ వ్యక్తి సజీవ భావ ప్రకటన. గెరిల్లా పోరాటాల్లో రోజూ జరిగే విషయాల్ని తెలిపే ఓ పాఠ్యాంశం. అది మందుగుండువలే శక్తివంతమైనది. తొత్తు సైన్యాల చేతిలో, బానిస రాజ్యంలో ఉన్న ప్రజలు బలహీనులు కాదని చాటే సజీవ చిత్రణ. అదే దాని స్వాభావికమైన విలువ. ఆ విలువే నేటి వరకు వారిని ప్రచురణకు పురిగొల్పకుండా ఉంది.

అది ప్రచురణ కాకూడదని కోరే వారిలో కుహనా విప్లవకారులు, అవకాశవాదులు, అన్ని హోదాల్లోని కపట జ్ఞానులూ ఉన్నారు. వీరంతా తమను తాము మార్క్సిస్టులమని, కమ్యూనిస్టులమని, ఇంకా అలాంటి పేర్లతో పిలుచుకుంటుంటారు. వారు చే ను ఓ తప్పుదారి సాహసికునిగా అభివర్ణించటానికి కూడా వెనుకాడలేదు. ఎంతో దయారసంతో చే ను ఓ కాల్పనిక వాదిగా పేర్కొంటూ లాటిన్ అమెరికాలో విప్లవ పోరాటంలో హంస గీతంలా చే మరణాన్ని పేర్కొన్నారు. వారింకా ఇలా అన్నారు "గొప్ప వ్యూహ రచన చేసిన గెరిల్లా యోధుడు, అనుభవజ్ఞుడైన చే నే గెరిల్లా పోరాటంలో చనిపోయాడంటే బొలివియాలో అతని ఉద్యమం విఫలమైందంటే అతనెంతగా పొరబడ్డాడో తెలుస్తుంది...!", ఇంకా ఇటువంటి హీనమైన ప్రాణులు ఎన్ని చే మరణానికి సంతోషించాయో, తమ ఊహలు, వైఖరులు సంపూర్ణంగా సామ్రాజ్యవాదులు ఊహలతో, తొత్తు సైన్యాల ఊహలతో ఏకీభవిస్తున్నాయనే సంగతి వారు అసలు యోచించారా?!

ఆ విధంగా తమని తాము సమర్థించుకుంటున్నారు. ఆ విధంగా వారు తమ విశ్వాస ఘాతకులైన నాయకులను సమర్థిస్తున్నారు. ఒకానొక సమయంలో వీరి నాయకులే సాయుధ పోరాటం పేరుతో గెరిల్లా దళాలను నాశనం చేయజూశారు. ఇదంతా విప్లవ కార్యకలాపాలకు అడ్డుతగిలి జుగుప్సాకరమైన, హాస్యస్పదమైన తమ రాజకీయ ప్రణాళికలను అమలు పరచటానికే, ఎందుకంటే వారికి ఏ సిద్ధాంతమూ తీసుకొనిపోగల సత్తాలేదు కాబట్టి. అందుకే ఏ పోరాటమూ చేయనివారికి, ప్రజల కోసం ప్రజల స్వాతంత్ర్యం కోసం ఏ పోరాటం చేయని వారికి ఇలాటి వారు మద్దతునిస్తారు. వారి విప్లవ భావాలను ఓ వ్యంగ్య చిత్రంగా వేసుకున్న వారిని; నల్లమందు తిని జోగే వారికి, ప్రజలకు సంబంధించినటువంటి ఏ విషయమూ లేని వారిని; దేశ విదేశాలకు చెందిన స్వలాభాపేక్షపరులకు తమ సంస్థలను, ఉద్యమాలను తాకట్టు పెట్టేవారిని; అణచివేతకు గురైన ప్రజల కోసం ఎటువంటి మార్గమూ చూపలేనటువంటి ప్రణాళికలతో ముందుకొచ్చిన వారిని వీరు సమర్థిస్తారు.

పోరాటంలో తన మరణాన్ని అతి సహజంగాను, సంభవంగాను చే భావించాడు. అతను చివరి రోజుల్లో రాసిన దాన్లో ఈ విషయాన్ని చెప్పటానికే ప్రయత్నించాడు. అటువంటిదేదైనా జరిగినప్పటికీ లాటిన్ అమెరికాలో జరుగుతున్న విప్లవ పోరాటాలు

ఆగిపోయే ప్రశ్నేలేదని స్పష్టం చేశాడు. ట్రైకాంటినెంటల్‌కు ఇచ్చిన సందేశంలో తన భావాల్ని చెబుతూ "మా ప్రతీ చర్య సామ్రాజ్యవాదంపై పోరుగానే ఉంటుంది.... ఎక్కడైనా చావు మమ్మల్ని ఆశ్చర్యపరచవచ్చు. అప్పుడు మేము పెట్టే కేక పడవలసిన వారి చెవిలో పడి, మా ఆయుధం చేపట్టటానికి ఇంకో చేయి ముందుకొస్తే మేము మరణాన్ని స్వాగతిస్తాము!"

విప్లవంలో తననుతాను ఓ సైనికునిగానే చే భావించాడు. అందులో నుండి ప్రాణాలతో బయటపడటం గురించిన ఆలోచనే లేదతనికి. ఆ విషయం అతణ్ణి కలతపెట్టనూ లేదు. పోరాటంలో వచ్చిన ఫలితాన్ని చే విప్లవ భావాల వైఫల్యంగా కొందరు పేర్కొన్నారు. వారు అంతే తేలిగ్గా ఎందరో విప్లవ అగ్రగాముల యోచనాపరుల భావాలను వాటి చెల్లుబాటును కూడా తిరస్కరిస్తున్నారు. అందులో మార్క్సిజం బోధకులను కూడా వీరు కాదంటారు, ఎందుకంటే వారి జీవితకాలంలో వారు ప్రభోదించినటువంటి ఫలవంతమైన జీవితాలను చూడలేకపోయారు కదా మరి.

క్యూబాలో మార్టి, మాకియోలను పోరాటంలోనే హతమార్చారు. వెంటనే యాంకీలు చొరబడి స్వతంత్ర్య యుద్ధాన్ని ఆపారు. అందువల్ల ఆ పోరాటాల ఫలితాల్ని భంగపరచారు. సోషలిస్టు విప్లవాన్ని ప్రతిపాదించిన జూలియో ఆంటోనియో యెల్లా లాంటి వారిని కూడా సామ్రాజ్యవాదుల ఏజెంట్లు చంపారు. వంద సంవత్సరాల ముందు మొదలైనటువంటి ఈ పోరాట క్రమాన్ని ఆపలేకపోయాయి. అయితే ఆ పోరాట యోధులు చూపిన మార్గాన్ని, వారు నడిపిన పోరాటాల్ని, వారు ఆ సమయాల్లో వ్యక్తపరచిన భావాల్ని ఎవ్వరూ ప్రశ్నించలేరు. అవే క్యూబా విప్లవకారులకు ఎల్లప్పుడూ ప్రేరణ అంటారు.

చే డైరీని, అతని నోట్సును చూసినట్టయితే నిజంగా విజయసాధనకు అవకాశాలు ఎలా ఉండేవి, గెరిల్లా పోరాటాలు ఎంత అసాధారణ రీతిలో మనుషులను ప్రేరేపిస్తాయి అన్న విషయాలు తెలుస్తాయి. బొలీవియా ప్రభుత్వ బలహీనతల్ని, క్షీణించిపోతున్న దాని పరిస్థితుల్ని ఓ సందర్భంలో ఇలా రాశాడు "ప్రభుత్వ తన దృఢత్వాన్ని త్వరత్వరగా కోల్పోతున్నది. మాతో ఇంకో వంద మంది అదనంగా లేరన్న విషయం మాకు సిగ్గు కలిగిస్తోంది."

ఓ చిన్న గెరిల్లా దళం ఒక్కోసారి దాదాపు తుడుచుకుపోయే స్థితికి ఎలా చేరుకుంటుంది అన్న విషయం క్యూబా పోరాట సమయంలో చే కు బాగా అనుభవమే. అలాంటి స్థితి సంభవిస్తుందా లేదా అనేది యాదృచ్ఛికంగాను, యుద్ధ సమయంలో కొన్ని అనూహ్యమైన పరిస్థితులనిబట్టి ఉంటుంది. అంత మాత్రాన మన పోరాట మార్గాన్ని తప్పుపట్టే అధికారం లభిస్తుందా? దాన్ని ఉదాహరణగా తీసుకొని విప్లవాన్ని నీరుగార్చి ప్రజలను అశక్తులుగా చేసే అధికారాన్నెవరికైనా ఇస్తుందా? చరిత్ర చూస్తే విప్లవ పోరాటాల్లో ఇలాంటి సంఘటనలెన్నో జరిగాయి. మన క్యూబా విషయమే తీసుకోండి విప్లవంలో అఖండ విజయానికి ఆరేళ్ళ ముందు మోంకాడాలో ఏం జరిగింది?

శాంటియాగో డి క్యూబాలోని మోంకాడాపై 1953 జులై 26 నుండి డిసెంబరు 2 వరకు జరిగిన విప్లవ పోరాట సమయంలో అందరూ ఏమన్నారు - అధునాతన



పరికరాలున్న సైన్యం చేతిలో వేళ్ళమీద లెక్కపెట్టగల గెరిల్లాలు గల్లంతవుతారన్నారు. భావవాదులు, కలలు కనే వారు చేస్తున్న విచిత్ర కల్పనగా చెబుతూ "బాగా పొరపాటుపడ్డ వారి"గా పేర్కొన్నారు. డిసెంబరు 5, 1956లో సంభవించిన ఘోర ఓటమితో అనుభవం లేనటువంటి గెరిల్లా దళాలు చెల్లాచెదురవడం చూస్తే ఆ నిరాశావాదులు చెప్పింది నిజంగానే జరిగిందనిపిస్తుంది. కాని కేవలం 25 నెలలు తరువాత అదే సైన్యాన్ని కొద్దిగా మిగిలినటువంటి గెరిల్లాలు సర్వశక్తులూ కూడగట్టుకొని తమ అనుభవంతో నామరూపాలు లేకుండా చేశారు.

అన్ని యుగాల్లో, అన్ని సందర్భాల్లో పోరాటం ఎందుకు చేయలేదు అనే విషయంపై ఎన్నోసాకులు చూపవచ్చు; కాని స్వాతంత్ర్యం అఖ్ఖరలేదు అనుకున్నప్పుడు మాత్రం ఒకటే మార్గం అదే పోరాటం చేయకపోవటం. తన భావాలను తన రక్తంతో పెంచేవరకూ చే బతకడు. అతని విమర్శకులైన నయా విప్లవకారులు తమ రాజకీయ పిరికి తనంతో, శాశ్వతంగా నిశ్చేష్టులై తమ మూర్ఖత్వాన్ని తామే చాటుకుంటున్నారు.

లాటిన్ అమెరికాకు మాత్రమే ప్రత్యేకమైన తరహాలో చేసినటువంటి ఈ విప్లవ పోరాటాల చర్చను మనం డైరీలో చూడవచ్చు. బొలీవియా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శినని తనను తాను చెప్పుకునే మారియో మోంజె రాజకీయ, సైనిక పోరాటాల నాయకత్వానికి సంబంధించిన విషయాల్లో చే తో ఏకీభవించటంలేదు. మోంజె ఈ భారం మోయటానికి పార్టీ నాయకత్వ స్థానానికి రాజీనామా చేసి వెళదామనుకున్నాడట. ఒకసారి ఆ కిరీటం ధరిస్తే చాలా చాలన్న ఉద్దేశమన్నమాట.

మోంజెకు గెరిల్లా పోరాటంలో ఏ మాత్రం అనుభవంలేదు. అతను ఎటువంటి పోరాటంలోనూ పాల్గొనలేదు. తనను తాను ఓ కమ్యూనిస్టుగా భావించినందు కన్నా అతను పచ్చి జాతీయ దురాభిమానాన్ని వీడవలసింది, ఎందుకంటే బొలీవియా ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్న వారే అటువంటి అపోహల్ని వీడ గలిగారు.

ఈ ఖండంలో సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఎలా ఉండాలని భావిస్తున్నారో కాని, కమ్యూనిస్టు నాయకులమని చెప్పుకొనే ఇలాంటి నాయకులు యూరప్ వలసవాదుల చేతుల్లో బానిసత్వానికి గురైన ఆదిమవాసుల అంతర్జాతీయ తత్వాన్ని వారికి ప్రదర్శించలేకపోయారు.

బొలీవియా, దాని రాజధాని సుకర్ పేర్లు తమ దేశపు మొదటి స్వాతంత్ర్య యోధుల పేర్లనుండి వచ్చినవే. (సైమన్ బొలివార్, ఆంటోనియో జోన్ డి సుకర్) వారిద్దరూ వెనిజులా దేశస్థులు. ఈ దేశంలో ప్రజల స్వతంత్ర్యం కోసం జరుగుతున్న ఈ పోరాటానికి రాజకీయంగా, సంస్థాపరంగా ఆ విప్లవ సింహానికి సహాయం అందించగలిగి వుండీ ఈ కమ్యూనిస్టు నాయకుడు అవాంఛితమయిన, హాస్యాస్పదమయిన, విలువలేని నాయకత్వాన్ని పట్టుకొని ఊగిసలాడుతున్నాడు.

బొలీవియాకు ఎక్కడా సముద్ర మార్గం లేదు. స్వతంత్ర్యం కోసమయినా, దేశానికున్న మార్గాల్ని మూసివేయకూడదనుకున్న ఏ దేశమూ ఆశించని రీతిలో తన చుట్టూ

ఉన్న దేశాల్లో విప్లవ విజయాలను బొలీవియా ఆశిస్తుంది. ఎనలేని తన అనుభవంతో, నేర్పుతో, తనదైన శైలితో చే ఈ పని మొదలుపెట్టాడు.

బొలీవియా కమ్యూనిస్టు పార్టీలో చీలిక రాకమునుపు కమ్యూనిస్టు నాయకులతో, సభ్యులతో సంబంధాలు కొనసాగించి దక్షిణ అమెరికా విప్లవ పోరాటాలకు సహాయం కోరాడు. పార్టీ అనుమతి పొంది కొద్ది మంది సభ్యులు వివిధ పనులపైన చే తో కొన్ని సం॥లు పని చేశారు. అయితే పార్టీలో చీలిక తరువాత నెలకొన్న ప్రత్యేక పరిస్థితిలో చే తో కలిసి పని చేస్తూ వున్న వారు. ఆపేశారు. బొలీవియాలో జరుగుతున్న ఈ పోరాటాల్ని ప్రత్యేకంగా చే ఎప్పుడూ చూడలేదు, దక్షిణ అమెరికాలోని ఇతర దేశాలకు వాటిని విస్తరించాలనే చూశాడు. అంతఃకలహాలకతీతంగా దీనిని మలచి బొలీవియా స్వాతంత్ర్యం కోసం ఎవరు పోరాడదలచినా వారిని ఆహ్వానించాడు. సామ్రాజ్యవాదుల చేతిలో దాస్యానికి గురయిన లాటిన్ అమెరికా వాసులందర్నీ ఆహ్వానించాడు.

గెరిల్లా దళానికి ఓ మూలాన్ని తయారు చేసే ముందు కొద్ది మంది ధైర్యవంతులైన వారి సహాయంపైనే ఎక్కువగా ఆధారపడ్డాడు. అయితే పార్టీ చీలిక సమయంలో వారంతా మోంజె వర్గంవైపు వెళ్ళిపోయారు. మోంజె అంటే ఎటువంటి సానుభూతి లేనప్పటికి వారిపట్ల గౌరవంతో అతణ్ణే ముందుగా తమ గెరిల్లా స్థావరానికి చే ఆహ్వానించాడు. తరువాత రాజకీయ నాయకుడు, గని కార్మిక నాయకుడు అయిన మోయిజెస్ గువేరాను ఆహ్వానించాడు. ఆస్కార్ జమోరా నేతృత్వంలోని ఇంకో సంస్థలో చేరటం కోసం మోయిజెస్ గువేరా పార్టీని వదలిపెట్టాడు. జయోరాతో సరిపడక దాన్ని కూడా వదలిపెట్టాడు. జమోరాను ఇంకో మోంజెగా చెప్పవచ్చు. ఒకప్పుడతను బొలీవియాలో సాయుధ గెరిల్లా పోరాటాలకు సహాయం చేస్తానని చే తో ప్రమాణం చేసి వున్నాడు. దాన్నుండి తప్పుకుని పోరాటం మొదలయ్యే సమయానికి భీరువువలె ఆయుధం వీదిలి వెళ్ళాడు. చే మరణం తరువాత జయోరా ఓ విషపూరితమై "మార్క్సిస్టు - లెనినిస్టు" విమర్శకునిగా మారాడు. మోయిజెస్ గువేరా చే తో వెంటనే కలిశాడు. ఎందుకంటే చే బొలీవియాలో ప్రవేశించే నాటికే అతను ఆదే మార్గంలో ఉన్నాడు. తన పూర్తి మద్దతు ఇవ్వటమేకాక విప్లవం కోసం తన ప్రాణాన్ని వీరోచితంగా సమర్పించాడు.

మోంజేతో అంత వరకూ అంటిపెట్టుకుని ఉన్న బొలీవియా గెరిల్లాలు చే తో కలిశారు. ఇంతీ, కోకో పెరెడో లాంటి అసాధారణ యోధులు, ధైర్యవంతులు మోంజేను వదలి చే ను సమర్థించారు. ఇది గిట్టని మోంజే ప్రతీకారం కోసం ఉద్యమాన్నే నీరుకార్చటానికి చర్యలు మొదలుపెట్టాడు. లా పాజ్‌లో బాగా శిక్షణ పొందిన కమ్యూనిస్టు పోరాట యోధులు గెరిల్లాలతో కలవబోతున్న సమయంలో వారిని అడ్డగించాడు. ఈ నిజాలన్నీ మనకేం తెలియజేస్తాయంటే విప్లవకారుల్లో పోరాటానికి తయారుగా ఉన్న వారిని కూడా ఇటువంటి అసమర్థ, మోసకారి నాయకులు కష్టాలకు గురి చేస్తారు.

చే ఎప్పుడూ పదవుల కోసం, నాయకత్వం కోసం, గౌరవాల కోసం ప్రాకులాడిన మనిషి కాదు. అయితే లాటిన్ అమెరికా ప్రజల విముక్తి కోసం చేసే ప్రాథమిక పోరాటం



విప్లవ గెరిల్లా పోరాట తరహాలోనే ఉండాలని చే విశ్వసించాడు. దాంతోనే రాజకీయ, ఆర్థిక, సామాజిక మార్పులు మొత్తం లాటిన్ అమెరికా దేశాలన్నింటిలో వస్తాయనేది అతని నమ్మకం. గెరిల్లాల మిలిటరీ, రాజకీయ నాయకత్వం ఐక్యంగా ఉండాలనేది అతని నిశ్చితాభిప్రాయం. నాయకత్వం గెరిల్లా దళంలోనే ఉండాలి తప్ప పట్టణాల్లోని కార్యాలయాల్లో హాయిగా ఉండే బ్యూరోక్రాట్ల చేతుల్లో కాదని అతను నమ్మాడు. అందుకే అతను కేంద్రీకృత గెరిల్లా నాయకత్వాన్ని వదులుకోవటానికి సిద్ధపడలేదు. తరువాత కాలంలో జరిగేటటువంటి విస్తరణలో పోరాటాల్ని విస్తృతస్థాయిలో తయారు చేసి మొత్తం లాటిన్ అమెరికాలో ప్రసరింపచేయాలనేది అతని ఉద్దేశం. అటువంటి బాధ్యతలుగల నాయకత్వం అనుభవంలేని వారికి, విదేశీ దురభిమానుల చేతిలోకి పోవటం అతనికేమాత్రం ఇష్టం లేదు. అటువంటి విదేశీ దురభిమానం లాటిన్ అమెరికా దేశాల్లోని విప్లవాలను కూడా దెబ్బ తీస్తాయి. ప్రగతి నిరోధకశక్తుల, పరిహాసాస్పద శక్తుల, నిస్సారవంతుల ఆలోచనా విధానంపై పోరాడాలని చే నమ్మాడు.

"మనందరమూ కలిసి క్రింది స్థాయి నుండి నిజమైన అంతర్జాతీయ భావాన్ని వృద్ధి చేసుకుందాం..." అని ట్రైకాంటినెంటల్‌కు ఇచ్చిన సందేశంలో పేర్కొన్నారు. "పవిత్ర పోరాటం చేస్తున్న మనమందరమూ ఒకే పతాకం క్రింద ఉందాం. మానవాళిని విముక్తి చేయడమే మన లక్ష్యం. అప్పుడు మనం వియత్నాం, వెనిజులా, గ్వాటిమాలా, లావోస్, గినియా, కొలంబియా, బొలీవియా పతాకాల నీడలో ప్రాణం వీడవచ్చు... ఈ అసంఖ్యాక ఉదాహరణల నేపథ్యంలో చెప్పాలంటే ఇటువంటి మహిమాన్విత పోరాటాలు లాటిన్ అమెరికాలోను ఆసియాలోను, ఆఫ్రికాలోను, యూరోప్‌లోనూ అవసరమే."

'తాము పుట్టిన పతాకం నీడనకాక వేరొక పతాకం నీడన చిందించే ప్రతి రక్తపు బొట్టు అనుభవరూపంలో తమ దేశ విముక్తి కొరకు వినియోగించాలి. అక్కడ సంపాదించిన స్వాతంత్ర్యం తమ దేశంలో మొదటి అడుగుగా ఉపయోగపడుతుంది."

లాటిన్ అమెరికాలోని వివిధ దేశాలకు చెందిన వీరులు బొలీవియాలో జరిగే గెరిల్లా పోరాటంలో తప్పకుండా పాల్గొనాలని చే కోరిక. ఎందుకంటే అది వారికో పాఠశాలగా ఉపయోగపడి పోరాటయోధుల్ని తయారు చేస్తుంది. ఈ పోరాటంలో బొలీవియన్లతోపాటు కొద్ది మంది అనుభవజ్ఞులైన గెరిల్లా వీరులు తనతోపాటు ఉండాలని చే కోరిక. వారు క్యూబా పోరాటంలో సియారామస్ట్రాలో తనతో కలిసి పోరాడినవారు. వారి పోరాట కౌశలం, ధైర్యం, త్యాగ గుణం – వీటి గురించి చే కు బాగా తెలుసు. వారిలో ఒక్కరు కూడా చే ఇచ్చిన పిలుపు విని వెనక్కుపోలేదు. చే ను ఎవ్వరూ కాదనలేదు. ఎవరూ లొంగిపోలేదు.

దృఢమైన, చాతుర్యమైన, ఆదర్శప్రాయమైన, ఆత్మనిగ్రహంతో కూడిన మనస్తత్వంతో బొలీవియా పోరాటంలో చే పాల్గొన్నాడు. నిజం చెప్పాలంటే తనకై తాను చేపట్టిన మహత్తర కార్యం యొక్క ప్రాముఖ్యత అతణ్ణి మింగేసింది. అతనెప్పుడూ అనింద్యమయిన ఉత్సాహంతోనే ముందుకు సాగాడు. ఎప్పుడైనా గెరిల్లా దళం అశ్రద్ధతో ఏదైనా తప్పు చేసినట్టయితే అతను వెంటనే దానిపై దృష్టిపెట్టి సరిచేసి, తన డైరీలో రాసేవాడు.

నమ్మలేని విధంగా కొన్ని ప్రతికూలంశాలు అతణ్ణి అలుముకున్నాయి. గెరిల్లా దళం నుండి ఒక భాగం విడిపోవటం అందులో ఒకటి. అది కొద్ది రోజులే ఉండవలసింది. అందులో బాగా ధైర్యవంతులైన వారున్నారు. వారిలో కొందరు ఆరోగ్యం బాగా లేక ఇంకొందరు అనారోగ్యం నుండి కోలుకుంటూ ఉన్నారు. అతికష్టతరమైన ప్రాంతంలో దళానికి చెందిన ఇంకో భాగం దూరమైపోయింది. దానిని కనుగొనే పనిలో చే మునిగిపోయాడు. అదే సమయంలో అతణ్ణి ఆస్తమా తీవ్రంగా బాధించింది. ఉపశమనం కలిగించే మందులు లేకపోవడంవల్ల అది ముప్పుతిప్పలు పెట్టింది. ఆ మందులు విడిపోయిన దళం వద్ద ఉండటం శత్రువులు పట్టుకోవటం జరిగింది. ఆగస్టు చివర్లో ఆ దళం సర్వనాశనమవటం, చే ఆరోగ్యం క్షీణించటం ఈ రెండు అంశాలు తరువాత జరిగిన సంఘటల్ని బాగా ప్రభావితం చేశాయి. అయినా తన ఉక్కులాంటి సంకల్పశక్తితో భౌతికపరమైన అడ్డంకుల్ని అధిగమించి ఒక్కసారి కూడా. ధైర్యం సడలకుండా ముందుకు సాగాడు.

చాలా మంది బొలీవియా రైతులతో చే కు సంబంధాలున్నాయి. వారి ప్రవర్తన అనుమానాస్పదంగాను, జాగ్రత్త వహించవలసిందిగాను ఉండటం చే కు పెద్ద ఆశ్చర్యం కలిగించలేదు. ఎందుకంటే అంతకుముందు చాలా సందర్భాలో వారితో కలిసి పని చేశాడు కాబట్టి. వారి మనసులు గెలవటం దీర్ఘమైన, కష్టతరమైన, ఓపికతో కూడిన పని అని ఆయన అది తన లక్ష్యానికి ఉపయోగపడగలదని అతనికి తెలుసు. వారి మద్దతు ఓ దీర్ఘకాలిక అవసరం.

జరిగిన సంఘటనల్ని ఒక్కొక్కటిగా గమనించినట్టయితే ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. సెప్టెంభరులో అంటే అతని మరణానికి కొద్ది వారాల ముందు అతని వెంట ఉన్న అనుచరుల సంఖ్య చాలా కొద్దిగా ఉంది.. అయినా తమ దళాన్ని వృద్ధి చేసుకోవటంలో వారి శక్తితగ్గలేదు. వారిలో ఇంతి, కోకో పెరిడో సోదరుల్లాంటివారు ఇంకా ఉన్నారు. వారిలో ఉన్న అద్భుతమైనటువంటి నాయకత్వ లక్షణాలు అప్పటికే కనబడసాగాయి.

హిగినరాస్‌లో (సెప్టెంబరు 26, 1967) సైనికులు పొంచివుండి గెరిల్లా దళంపై చేసిన దాడి సైన్యానికి బాగా దోహదపడిన చర్య కాగా గెరిల్లా దళానికి కోలుకోలేని దెబ్బగా చెప్పుకోవచ్చు. ఆ దాడి పగటి పూటే జరిగింది. ముందుగా నడిచే రక్షక దళం నాశనం - కాగా చాలా మంది గాయపడ్డారు. తర్వాత మజిలీ రైతులెక్కువగా నివశించే ప్రదేశం రాజకీయంగా వృద్ధి చెందిన ప్రాంతమది. అక్కడికి వెళ్తున్న విషయం డైరీలో లేదుగాని పోరాటంలో బతికి బయటపడ్డ వారికి తెలిసుంటుంది. తాము రోజూ తిరుగుతున్న ప్రాంతంలోనే ఆ రోజు కూడా పగటి వేళలో వెళ్ళటం ప్రమాదకరమని నిస్సందేహంగా చెప్పవచ్చు. అదీకాక వారు వెళ్ళినది జనావాస ప్రాంతం. వెళ్తున్నది మొదటిసారి. ఏదో ఒక చోట సైన్యం తమను అడ్డగిస్తారనేది ఖచ్చితమైన వాస్తవం. ఇదంతా చే కు తెలుసు. అయినా ఈ సాహసం చేయటానికి ఓ కారణముంది. అదేమంటే తమతో ఉన్న వైద్యుడు మోరో పరిస్థితి పూర్తిగా క్షీణించింది.

ఆ సంఘటనకు ముందు రోజు ఇలా రాశాడు : "మేము ప్యూజియో చేరుకున్నాము






క్యూబా విప్లవ సారథులు




1959 జనవరి 8, హవానా విజయోత్సవ సభలో చే, కాస్ట్రో, కామిల్లో



రావుల్, ఫైడల్ కాస్ట్రోలతో చే గువేరా




ఉల్లాస సమయం




ఆదివారం పనిలో



పెద్ద కుమార్తె హిల్డిటాతో చే



క్రాంతదర్శి



సిగార్,
చే
అవిభాజ్యం



బొలీవియా బయలుదేరడానికి కొద్ది రోజుల ముందు కుటుంబ సభ్యులతో



చంపివేయ బడటానికి కొద్ది నిమిషాల ముందు - బంధించిన సిఐఎ అధికారితో



చే మృతదేహం వద్ద బొలీవియా, సిఐఎ అధికారులు

కాని అంతకు రెండు రోజుల ముందు మమ్మల్ని చూసిన ప్రజలు కనిపించారు. అంటే మా గురించి ముందే రేడియో బెంబాలో మాటలు చెప్పారన్నమాట. కంచరగాడిదలపై ప్రయాణం కష్టంకాసాగింది, అయినా డాక్టరు పరిస్థితి క్షీణించటంవల్ల అందుబాటులో ఉన్న మంచిదారిలో వెళ్ళాలనుకున్నాము."

ఆ మరుసటి రోజు ఇలా రాశాడు "మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో జాగ్వే చేరుకోవటానికి రక్షక దళం యోచిస్తున్నది. అలాగే డాక్టరు గురించి, కంచరగాడిదలపై చేయవలసిన ప్రయాణం గురించి కూడా నిర్ణయం తీసుకోవాలి." అంటే అనారోగ్యంతో ఉన్న డాక్టరు గురించి, దారిలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆలోచిస్తున్నాడన్నమాట. అయితే అదే మధ్యాహ్నం రక్షక దళం జాగ్వే చేరుకోవటం, ఈ ఘోరం జరిగిపోవటం గెరిల్లా దళాన్ని చిక్కుల్లో పడవేసింది.

కొద్ది రోజుల తరువాత ఎల్ యూరోలోని ఓ కొండ చీలికలో చుట్టూ సైన్యం మోహరించి ఉండగా, చే తన అంతిమ పోరాటం చేశాడు.

వేళ్ళ మీద లెక్కపెట్టగల తన అనుచరులతో అంతటి వీర కార్యానికి పూనుకోవటం ప్రతి ఒక్కరి హృదయానికి ఎక్కడో తగిలినట్లవుతుంది. ఆ ప్రాంతానికే ప్రత్యేకమయిన అటువంటి వాతావరణ పరిస్థితుల్లో పోరాడుతున్నప్పుడు ఈ సంఘటన జరగటం నిజంగా తిరుగులేని ఓ వీరోచిత అధ్యాయం. చరిత్రలో ఎప్పుడూ ఇంత తక్కువ సంఖ్యలో ఉన్న వారు అంతటి మహోత్కార్యాన్ని మీద వేసుకోవటం జరుగలేదు. లాటిన్ అమెరికా ప్రజల్లో మేలుకొలుపు తేగలమన్న నమ్మకం, దృఢ విశ్వాసం, తమపై తమకు గల ఆత్మ విశ్వాసం, వారు చేపట్టిన లక్ష్యంపై గల గురి - ఈ కొలమానాలతోనే ఆ మనుషులను అంచనా కట్టగలం.

బొలీవియా గెరిల్లా వీరులతో చే ఒక రోజు ఇలా అన్నాడు : "ఇటువంటి పోరాటం మనకు విప్లవకారులుగా మారటానికి అవకాశం కలిగిస్తుంది. ఇది మానవులలో అత్యున్నత జాతి. మనుషులుగా మారటానికి ఇదో అవకాశం. ఈ రెండు దశల్లో ఏదో ఒకటి చేరుకోలేని వారు పోరాటం వదిలి వెళ్ళవచ్చు."

చివరికంటా అతనితో ఉండి పోరాడినవారు ఆ వర్ణనలకు పూర్తిగా అర్హులు. విప్లవకారులకు వారు ప్రతీకలుగా నిలుస్తారు. లాటిన్ అమెరికాలో విప్లవం తీసుకురావటంలాంటి కఠినమైన, కష్టమైన కార్యాన్ని పూర్తి చేయటానికి ఎలాంటి వారు కావాలని చరిత్ర చెబుతుందో అలాంటి వారువీరే.

మన పూర్వీకులు ఎదుర్కొన్న శత్రువులు అంత్యదశలో ఉన్న వలస శక్తులు. అయితే ఈ తరం విప్లవకారులు ఎదుర్కొంటున్న శత్రువు సామ్రాజ్యవాదుల కోటగోడలాంటి వారు. వీరి చేతిలో అత్యంత సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమలు ఉన్నాయి. వీరు బొలీవియాలో వ్యవస్థీకృతమైన, శక్తివంతమైన సైన్యాన్ని నెలకొల్పటమేకాక అంతకుముందు సైన్యాన్ని ప్రజలు తిప్పి కొట్టినందువల్ల గెరిల్లా పోరాటానికి వ్యతిరేకంగా ఆయుధాలను సమకూర్చటమేకాక సలహాదారులను కూడా పంపింది. ఖండంలోని ఏ ప్రాంతంలోనైనా విప్లవ వ్యతిరేక,

ప్రజావ్యతిరేక సైన్యాలకు మిలిటరీ, సాంకేతిక సహాయాన్ని అందిస్తున్నది. ఈ పద్ధతులు పని చేయనపుడు ప్రత్యక్షంగా సైన్యాలతో జోక్యం చేసుకుంటున్నది. డొమినికన్ రిపబ్లిక్‌లో ఇది మనం చూశాం.

ఇటువంటి శత్రువుతో పోరాడాలి. అంటే చే చెప్పినటువంటి విప్లవకారులు కావాలి. వారిలా పని చేసే విప్లవకారులు లేకుండా, వారిలా ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కోగల సాహసం లేకుండా, వెన్నంటి ఉండే మృత్యువుకోసం తయారుగా లేకుండా, యాంకీ సామ్రాజ్యవాదుల్లాంటి శక్తులు వారికున్న మిలిటరీ, సాంకేతిక, ఆర్థిక వనరులు - వారిని ఎదుర్కోవటానికి ప్రజలక్కావలసిన అజరామరమైన శక్తిపై నమ్మకంలేకుండా, న్యాయంపై నమ్మకం లేకుండా - ఇలా ఇవేవి లేకుండా ఉంటే ఈ ఖండంలోని ప్రజలను విముక్తుల్ని గావించలేము.

అమెరికా ప్రజలు వారంతవారుగా ఈ ఘోర రాజకీయ రక్కసి గురించి తెలుసుకున్నారు. 200 ఏళ్ళుగా సాగుతున్న ఈ పాలన గురించి కూడా వారికి బాగా తెలుసు. అనైతికమైన, సంస్కారహీనమైన, అమానుషమైన అమెరికా సామ్రాజ్యవాదపు చర్యలవల్ల ఆ దేశ పౌరులు ఎందరో సైనికుల రూపంలో మరణిస్తున్నారు. వీరంతా ఆ సైన్యం చేపట్టే విప్లవ అణచివేతల్లో, రాజకీయ నేరాల్లో, జాతుల కలహాల్లో పాల్గొంటున్నారు: ఈ చర్యలవల్ల ఎన్నో మానవ వనరులు, ఆర్థిక వనరులు, సాంకేతిక వనరులు మిలిటరీ రూపంలో అనవసరమైన ఖర్చు చేయబడుతోంది. దీనివల్ల ప్రపంచంలో మూడవ వంతు ప్రజలు నిరుద్యోగ సమస్యలతో, ఆకలితో అలమటిస్తున్నారు.

లాటిన్ అమెరికా విప్లవ పరిణామం చెందినపుడు మాత్రమే అమెరికా ప్రజలు సామ్రాజ్యవాదంతో తెగతెంపులు చేసుకొనే వీలు కలుగుతుంది. అదే సమయంలో, అదే తరహాలో వారి దేశంలో సామ్రాజ్యవాద పద్ధతులను అవలంబిస్తున్న ప్రభుత్వంపై ప్రజలు తిరగబడితే అది లాటిన్ అమెరికా విప్లవ పథానికి ఓ నిర్ణయాత్మక స్నేహితుడుగా తోడ్పడుతుంది.

ఈ శతాబ్దం ఆరంభంలో అమెరికాల మధ్య విపరీతమైన తేడాలు, అసమతుల్యతలు ఏర్పడ్డాయి. ఒకవైపు సామ్రాజ్యవాద ఎత్తులకు ఎగబాకే విధంగా అమెరికా ఎంతో బలంగా, పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి సాధించింది. ఇంకో వైపు బలహీనమైన, కదలికలేని ఇతర అమెరికా దేశాలు సామ్రాజ్యవాద భూస్వాముల, అణచివేత సైన్యాల బూటు కింద నలిగిపోతున్నాయి. ఈ భూగోళార్థం విస్తృతంగా రూపాంతరం చెందకపోతే అది నేటి ఆర్థిక, సాంకేతిక, అసమానతల్ని ప్రతిబింబిస్తుంది. అంతేకాక లాటిన్ అమెరికాపై అతివేగంగా సామ్రాజ్యవాదం విధిస్తున్న భయంకర అసమానతల్ని వచ్చే 20 ఏళ్ళలో ప్రతిబింబిస్తుంది.

మనం ఇదే మార్గంలో ఉంటే ఇంకా పేదరికంతో, బలహీనతతో, ఆశ్రితులమై సామ్రాజ్యవాదానికి దాసోహమనాలి. ఇటువంటి భయంకర పరిస్థితి ఆఫ్రికా, ఆసియాలోని దేశాలకు కూడా ఎదురవుతుంది. ఉమ్మడి మార్కెట్ కల యూరోప్‌లోని బాగా చదువుకున్న,



పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన, సాంకేతికంగా ముందున్న దేశాలే యాంకీ సామ్రాజ్యవాదుల చేతిలో వలసలుగా మారిపోతామని, వెనుక బడిపోతామని భయపడుతూ ఉంటే ఇక లాటిన్ అమెరికా దేశాల భవిష్యత్తు ఎలా ఉంటుంది?

రాబోవు పరిస్థితిని నిర్ణయించేది అదేనని ఎటువంటి సందేహం లేకుండా చెప్పవచ్చు. ఇప్పుడు అత్యవసరంగా కావలసిందేమిటంటే పూర్తి విప్లవ రూపాంతరం. దానితోనే మానవపరమైన, నైతికపరమైన, భౌతికపరమైన బలాన్నంతటిని ఒక్క తాటిపైకి చేర్చి ప్రపంచంలోని ఈ ప్రాంతం ఆర్థికంగా, సాంకేతికంగా ఎన్నో శతాబ్దాలుగా వెనుకబడినప్పటికీ ఆ విషయాల్లో అభివృద్ధి సాధించి ప్రపంచంలోని పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలకంటే మరీ ముఖ్యంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలకంటే ముందుండాలన్నది మన కర్తవ్యం. అయితే కొందరు ఉదారవాదులు, బూర్జువా తరహా సంస్కరణవాదులు, లేదా నయా విప్లవకారులు, నిష్క్రియాపరులై వేరే పరిష్కారం చెప్పవచ్చు; ఏదైనా సూత్రం చెప్పవచ్చు; సమ్మోహన మార్గం చూపవచ్చు; అది చే భావాలకు దూరంగా ఉండవచ్చు; అది తొత్తు ప్రభుత్వాలను, నిరంకుశ ప్రభువులను, అల్ప రాజకీయ నాయకులను అంటే యాంకీ నిరంకుశులకు ఊడిగం చేసేవారికి తుడిచి పెట్టవచ్చు - అంటే పరిస్థితులను బట్టి అత్యవసరంగా చేయవచ్చు; అటువంటి వారు ధైర్యంగా నిలబడి చే ను సవాలు చేయవచ్చు.

లాటిన్ అమెరికాలో ఉన్నటువంటి 30 కోట్ల ప్రజలకు నిజంగా నమ్మకం కలిగించే ఖచ్చితమైన విధానం కాని, నిజాయితీతోకూడిన సమాధానం కాని ఏ ఒక్కరి దగ్గరలేదు. వచ్చే 25 ఏళ్ళలో 60 కోట్లకు చేరనున్న ఈ బీద ప్రజలు జీవించటానికి అవసరమైన భౌతిక అవసరాలు, సంస్కృతి, నాగరికత మొదలైనవన్నీ పొందటానికి హక్కును కలిగివున్నారు. అందుకే చే, అతని అనుచరులు ఎవరైతే వీరోచితంగా నేలకొరిగారో వారి భావాల గురించి, వారి గురించి నోరుమెదపకపోవటం ఉత్తమమైన పని. వేళ్ళమీద లెక్కపెట్టగల వ్యక్తులు ఓ ఖండాన్ని విముక్తి చేయాలన్న ఓ ఉదాత్తమైన ఆశయం మార్గం చూపిస్తుండగా కొనసాగించిన మహత్తర కార్యం వారి వీరత్వానికి, దృఢ సంకల్పానికి ప్రతీకగా మానవుడు సాధించగల గొప్పకార్యంగా నిలబడిపోతుంది. లాటిన్ అమెరికా ప్రజల చైతన్యంపై వెలుగురేఖలు ప్రసరించటానికి, వారి పోరాటానికి మార్గదర్శకత్వం నెరపటానికి ఇదో ఉదాహరణ. చే చివరి అరుపు అతను ఎవరికోసమైతే పోరాటం చేశాడో వాళ్ళ చెవిలో పడుతుంది; చాలా చేతులు ముందుకొచ్చి వారి ఆయుధాల్ని స్వీకరించి స్వతంత్ర్యాన్ని సాధించగలవు.

అక్టోబరు 7వ తేదీ చే తన చివరి పంక్తులు రాశాడు. ఆ మరుసటి రోజు మ. 1.00 సమయానికి కొండల మధ్య ఓ ఇరుకైన పాయలో తన చుట్టూ మోహరించిన సైన్యం నుండి తప్పించుకోవటానికి రాత్రి వరకూ వేచివుందామని చే అనుకున్న సమయంలో అకస్మాత్తుగా పెద్ద సంఖ్యలో శత్రు సైన్యం అతనిపై దాడి చేసింది. ఎంత చిన్న సంఖ్యలో ఉన్నప్పటికీ మునిమాపువరకూ పోరాటం కొనసాగించారు. కింది నుండి, పై నుండి వారు తమను చుట్టు ముట్టిన సైన్యం పెద్ద సంఖ్యలో ఉన్నా సరే ఎదుర్కొన్నారు. చే కు అతి దగ్గరగా ఉండి పోరాడిన వారిలో చే సహచరులు ఒక్కరు కూడా మిగల్లేదు. పరిస్థితి విషమించిన వైద్యుడు,

దాదాపు అదే విధంగా ఉన్నటువంటి పెరూలియా గెరిల్లా చే దగ్గర ఉన్నారు. తను నేలకొరిగే వరకూ వాళ్ళను కాపాడటానికి ఏవైతే చేయాలో అదంతా చేశాడు చే. వారిని ఓ సురక్షిత ప్రదేశానికి తీసుకుపోవాలన్నదే అతని సంకల్పం. అదే పోరాటంలో డాక్టరును చంపలేదు. అయితే కొద్ది రోజుల తరువాత ఎల్‌యూరోకు దూరంగా ఓ పాయలో చంపారతణ్ణి. ఎగుడుదిగుడుగా ఉన్న కొండ ప్రాంతం, పోరాటానికి అనువుగా లేని ప్రాంతం అయినందున గెరిల్లాలకు శత్రువు కనిపించే అవకాశం లేదు. ఆ పాయకు అటువైపు ముఖద్వారం అంటే చే నుండి కొన్ని వందల మీటర్లు దూరంలో ఉన్న ఇంతి పెరిడో, మరికొంత మంది చీకటి పడేవరకు శత్రువుతో పోరాడి తాము అంతకుముందు అనుకున్న ప్రాంతాన్ని చేరుకోగలిగారు.

తీవ్రంగా గాయపడి తన ఎమ్ 2 రైఫిల్ బ్యారెల్‌ను నాశనం చేసే వరకూ చే పోరాటం చేశాడన్న దానికి సాక్ష్యాలున్నాయి. చే వద్ద ఉన్న పిస్టల్ తూటాలు వుంచే మేగజైన్ లేదు. ఈ పరిస్థితులన్నింటినీ గమనిస్తే చే ను ఎలా బందీని చేశారో అర్థమవుతుంది. అతని కాళ్ళలో తగిలిన గాయాలు మరీ ప్రాణాపాయమైనవేమీ కావు. అతను నడువగల స్థితిలోనే ఉన్నాడు.

హిగెవెరాస్ పట్టణానికి తరలించినపుడు 24 గంటల దాకా బతికేవున్నాడు. తనను బంధించిన వారితో ఒక్కమాట మాట్లాడటానిక్కూడా చే నిరాకరించాడు. తాగినమైకంలో ఓ సైనికాధికారి చే ను చికాకు పెట్టబోతే అతని చెంప చెళ్ళుమనింది.

లాపాజ్‌లో జరిగిన ఓ సమావేశంలో బొరియంటాస్, ఓవాండో, ఇతర సైనిక ఉన్నతాధికారులు చే ను హత్య చేయటానికి నింపాదిగా నిర్ణయించారు. మోసపూరితమైన ఈ నిర్ణయం హిగు వెరాస్‌లోని ఓ పాఠశాలలో ఎలా తీసుకున్నారో తెలిసింది. యాంకీల వద్ద శిక్షణ పొందిన రేంజర్లు మేజర్ మిగుయెల్ అయెరా, కల్నల్ యాండ్రిస్ సెల్నిచ్ ఇద్దరూ వారంట్ అధికారి మారియో టెరాన్‌కు హత్య చేయటానికి పురమాయించారు. బాగా తాగి టెరాన్ పాఠశాల భవనంలోకి చేరుకున్నాడు. బొలీవియాకు చెందిన సైమన్ క్యూబా (విల్లి)ను, పెరూవియన్ గెరిల్లా యోధుడు జువాన్ పాబ్లో చాంగ్ (చినో) మీద కాల్చిన బుల్లెట్ శబ్దం చే కు వినబడుతూనే ఉంది. వారిని చంపాక టెరాన్ చే వద్దకు చేరుకున్నాడు. చే వద్దకు వణుకుతూ అడుగులేస్తున్న టెరాన్ సందిగ్ధాన్ని చూసిన చే స్థిరంగా ఇలా అన్నాడు. "కాల్చు! భయపడకు"! వెనుదిరిగిపోయిన అతణ్ణి పై అధికారులైన అయెరా, సెల్నిచ్‌లు చే ను చంపవలసిందని తిరిగి ఆదేశించారు. అతను మెషిన్‌గన్ తీసుకొని బెల్టు కింది భాగంలో కాల్చాడు. మనకు ముందే అందిన సమాచారం ప్రకారం పోరాటం తరువాత కొన్ని గంటలకు చే మరణించాడు. దీన్ని బట్టి చూస్తే అతణ్ణి ఛాతీ, తలపై కాల్చలేదు. ఎందుకంటే తీవ్రమైన గాయాలతో వెంటనే చనిపోవటం వారికిష్టం లేదు. బాగా తాగివచ్చిన ఓ సార్జంటు చే ఛాతీలో కాల్చేవరకు చే అదే నరకయాతన అనుభవించాడు. చే అనుసరించిన పద్ధతులకు ఇది పూర్తిగా విరుద్ధం. తను పట్టుబడ్డ బొలీవియా సైనికుల్ని కానీ, అధికారుల్ని కానీ చే హింసించలేదు, చంపలేదు.

తుచ్ఛమైన శత్రువుల చేతిలో అతని చివరి సమయం గడవటం మాత్రం అతనికి



ఓ చేదు అనుభవం. కాని ఇటువంటి పరీక్షకు చే కంటే సిద్ధంగా ఎవరూ ఉండరు.

చే డైరీ మా చేతికి ఎలా వచ్చిందన్న విషయం ఇప్పుడు చెప్పలేము; అయితే దాని కోసం ఎలాంటి డబ్బు చెల్లించలేదని చెప్పవచ్చు. నవంబరు 7, 1966 నాన్‌చువాజాలో అతను అడుగు పెట్టినప్పటి నుండి అక్టోబరు 7, 1967 (సాయంకాలం వరకు) ఎల్ యూరో వద్ద పోరాటం వరకు డైరీలో ఉంది. కొన్ని పేజీలు తప్పిపోయి ఉండవచ్చు. ఇంకొన్ని మా చేతికి ఇంకా రాలేదు; అయితే అవి పెద్దగా ప్రాముఖ్యతలేని తేదీలకు సంబంధించినవి, అందుకే అవి డైరీలోని విషయాన్ని ఏ కోణంలోను మార్చలేవు.

డైరీ విశ్వసనీయతపై ఎటువంటి చిన్న అనుమానం రానప్పటికీ, ఫొటో ప్రతుల్ని పూర్తిగా పరీక్షించి ఎటువంటి చిన్న తేడా లేదని నిర్ధారించుకున్నాము. పోరాటం నుండి బతికి బయటపడిన ఇంకో గెరిల్లా డైరీలోని తేదీలతో కూడా పోల్చి చూశాము. రెండు డైరీల్లోను అనుసంధానం ఉంది. పోరాటంలో పాల్గొని వచ్చిన గెరిల్లాల సాక్ష్యాధారంగా సంఘటనల తీరును, తేదీలను ప్రతిష్టించటంలో ఎంతగానో తోడ్పడ్డాయి. ఒక్కమాటలో చెప్పాలంటే అవి చే డైరీకి సంబంధించిన ఫొటో ప్రతులేనని ఎటువంటి అనుమానం లేకుండా తేల్చాము.

చిన్నగా ఉన్న చేతిరాతను చదవటం చాలా కష్టమైన పని. ఈ మహత్కార్యాన్ని చే అనుచరుడు అలీడా మార్చ్ డి గువేరాకు అప్పగించాం.

డైరీని ఫ్రాన్స్‌లోని ఫ్రాంకోయిస్ మాస్పిరో ముద్రణా సంస్థ ద్వారా, ఇటలీ నుండి ఫెల్ట్రినెల్లి ముద్రాపకుల ద్వారా, జర్మనీ రిపబ్లిక్ నుండి ట్రికాంట్ వెర్లాగ్ సంస్థ ద్వారా, అమెరికాలోని రాంపార్ట్స్ పత్రిక ద్వారా, ఫ్రాన్స్‌లోని స్పానిష్ ముద్రణ ఎడిసియోన్స్ రూడో ఎబిరికో ద్వారా, చిలీలోని పుంటో ఫైనల్ పత్రిక ద్వారా మెక్సికో నుండి ఎడిటోరియల్ సిగ్లో 21 ద్వారా, ఇంకా ఇతర దేశాల్లో ఒకేసారి ప్రచురించబడుతుంది.

మన పయనం ఎప్పుడూ విజయంవైపే!

# 5

**1971**లో ఫైడెల్ కాస్ట్రో చిలీ వెళ్లాడు. ఆయన మరో లాటిన్ అమెరికా దేశానికి వెళ్లడం పదేళ్లలో అదే ప్రథమం. అప్పటి చిలీ అధ్యక్షుడు సాల్వడార్ ఆలెండీ పిలుపుపై వెళ్లాడు. తర్వాత రెండేళ్లకు అలెండీని అమెరికా ప్రేరిత సైనిక కుట్రతో తొలగించి ప్రాణం తీశారు. చిలీ రాజధాని శాంటియాగో డీ చిలి లో చే విగ్రహావిష్కరణ సందర్భంగా శాన్ మైగెల్ హాలులో ఇచ్చిన ప్రసంగమిది.

కొద్ది రోజుల కిందటే నేను జోస్ మార్టి విగ్రహావిష్కరణ కోసం వచ్చినపుడు మాట్లాడుతూ చే విగ్రహాన్ని సందర్శించేందుకు వస్తానని, ఇక్కడి వారితో కలుస్తానని చెప్పాను.

ఈ జనసముదాయానికి చెందిన 'ఆదర్శ పుత్రుడు' అనే బిరుదుతో మీరు నన్ను గౌరవించారు. అందుకు నా కృతజ్ఞతలు.

చే గురించి ఆయన వ్యక్తిత్వం, జీవితం గురించి నా భావనలు, జ్ఞాపకాలు పంచుకోవడం నా కర్తవ్యం.

నేను ఇక్కడికి వచ్చి స్మారక స్థూపం దగ్గర పుష్పగుచ్చాలు వుంచినపుడు నా మనసులో ఎన్నో భావాలు చెలరేగాయి.మొదటిది- పోరాటంలో సహచరుడు. మాప్రజల, యోధుల సోదరుడుగా ఆయన గురించిన స్మృతులు. ఒకప్పుడు ఎవరిగురించైతే బాగా తెలుసుకునే అవకాశం నాకు కలిగిందో ఒకప్పుడు ఎవరితోనైతో కలిసి పోరాడే అవకాశం లభించిందో ఆయన కాంస్యవిగ్రహంగా మారి నాకు కనిపించినపుడు కలిగే భావాలు.

జీవితంలో నాకు పరిచితుడైన వ్యక్తి స్థూపాన్ని నేను చూడటం ఇదే ప్రథమం. మానవాళి కోసం పోరాటంలో తమ విన్యాసాలతో విజయాలతో ప్రత్యేక ముద్ర వేసిన వారి జ్ఞాపకార్థం విగ్రహాలను కళాకారులు సృష్టిస్తారు. అవి చాలా కాలం కిందట జీవించిన, బహుశా కొన్ని వందల వేల ఏళ్ల కిందట మనకు దూరమైన వ్యక్తులకు ప్రతీకలుగా మిగిలిపోతాయి. మరీ ప్రత్యేకమైన పరిస్థితులలో తప్ప తనకు తెలిసిన వ్యక్తి శిలావిగ్రహాన్ని చూసే అవకాశం లభించదు. ఎందుకంటే చరిత్ర చాలా ఏళ్లు గడిస్తే గాని ఇలాటి స్మారక చిహ్నాలను నిర్మించాలని భావించదు. అయితే ఈ విషయంలో శాన్ మైగెల్ విప్లవకర కార్మిక వర్గం చే స్మారక చిహ్నం నిర్మించాలని భావించింది. అందువల్లనే 1970 అక్టోబరులో

చే మరణానంతరం మూడేళ్లకు ఈ స్మృతిచిహ్నం ఆవిష్కరించబడుతున్నది.

నేను చేను 1955లో మెక్సికోలో కలుసుకున్నాను. ఆయన జన్మత: అర్జెంటీనా దేశస్తుడు. లాటిన్ అమెరికా స్ఫూర్తికి ఆయన సంకేతం. అప్పుడే గ్వాటిమాలా నుంచి తిరిగివచ్చాడు.

మిగిలిన విప్లవకారులందరి గురించి వున్నట్టే చే గురించికూడా అనేక కథలు పుట్టాయి. ఆయనను ఒక కుట్రదారుడిగా, పథకాలు విప్లవాలతో గడిపే సందేహాస్పదమైన విచ్చిన్నకుడుగా ఆ కథలు ఆయనను చిత్రిస్తాయి. యువకుడైన చే తనలాటి చాలామంది యువ విద్యార్థులలాగే ఆయన చదువుకున్నాడు. డాక్టర్ చదివాడు. చేలో లాటిన్ అమెరికాకు సంబంధించిన అంశాలు తెలుసుకోవాలనే ప్రత్యేకమైన కుతూహలం వుండేది. అధ్యయనం పట్ల, విజ్ఞానం పట్ల ప్రత్యేకాసక్తి వుండేది. మన దేశాలన్ని సందర్శించాలనే ప్రత్యేకాకాంక్ష వుండేది. ఆయన చాలా దేశాలు పర్యటించాడు. తన డిగ్రీ తప్ప ఆయనకు మరేమీ లేదు.

కొన్నిసార్లు కాలినడకన, కొన్ని సార్లు మోటార్‌సైకిల్‌పైన ఆయన ఒకదేశం నుంచి ఒక దేశం సంచరిస్తూ వెళ్లాడు. నిజానికి మేము ఉత్తర చిలీలోని చాక్వికామాటాలో వున్నప్పుడు మాకో స్థలం చూపించారు. తన పర్యటన సందర్భంగా చే ఒకరోజు బసచేసిన చోటు అని చెప్పారు. ఆయన దగ్గర డబ్బువుండేది కాదు. ఆయన పర్యాటకుడు కాదు. పని చేసే స్థలాలు, ఆస్పత్రులు, చారిత్రిక ప్రదేశాలు చూడాలని ఆయన కోరిక. ఆయన ఆండెస్ నది దాటాడు. పడవనో తెప్పనో తీసుకుని అమేజాన్‌లోని కుష్టుఆస్పత్రి వరకూ వెళ్లివచ్చాడు. అక్కడ కొంత కాలం డాక్టర్‌గా పనిచేశాడు.

అతను తన ప్రయాణం కొనసాగించాడు. గ్వాటిమాలా చేరుకున్నాడు. నాకు జ్ఞాపకమున్నమేరకు చెప్పాలంటే అంతకు ముందు బ్రెజిల్, వెనిజులా, కొలంబియాలు సందర్శించాడు. గ్వాటిమాలాలో జాకబ్ అర్బెంజో నాయకత్వాన ఒక ప్రగతిశీల ప్రభుత్వం వున్నప్పుడు ఆయన దాన్ని సందర్శించాడు. అక్కడ వ్యవసాయ సంస్కరణలు సాగుతున్నాయి. అదే సమయంలో 1956 మంకాడా దాడిలో బయటపడిన వారిలో కొందరు అక్కడుండేవారు. వారు చేతో స్నేహం ఏర్పరుచుకున్నారు. ఆయన బహుశా ఒక డాక్టర్‌గా పనిచేస్తున్నాడనుకుంటాను.

ఆయనకు గ్వాటిమాలా పరిణామాల పట్ల ఆసక్తి వుండేది. విజ్ఞాన దాహంగల అధ్యయనశీలితత్వం వుండేది. అన్వేషణాపటిమ వుండేది. విప్లవదీక్ష, దక్షత, స్పష్టమైన మేధాశక్తి వుండేవి. సరే ఆయన కారల్ మార్క్స్, ఎంగెల్సు, లెనిన్‌ల రచనలు కూడా చదివే వున్నాడు. పార్టీ సభ్యుడు గాకపోయినా చే ఆలోచనలు మార్క్సిస్టుపద్ధతిలోనే వుండేవి.

అయితే ఆయన చేదుఅనుభవాలతో బతకాల్సివచ్చింది. గ్వాటిమాలాలో వుండగా సామ్రాజ్యవాదులు తలదూర్చారు. ఈ జోక్యానికి సిఐఏ నాయకత్వం వహించింది. పొరుగునున్న ప్రాంతం నుంచి దాన్ని ఆక్రమించు కోవడానికి సిఐఏ ఆధ్వర్యం వహించింది. ఆయుధాలు, విమానాలు, అన్ని రకాలైన పరికరాలతో ఈ ఆక్రమణ చర్య సాగింది. తర్వాత కాలంలో వారు గైరాన్(బే ఆఫ్ పిగ్స్)లో చేసిన దాన్ని పోలిన



ఇది. అయితే గ్వాటిమాలలో వారు ఎలాటి చిక్కులు లేకుండా ఈ పనిచేయగలిగారు. వారి విమానాలు ఉపయోగించుతూ నేలపై ముందుకురుకుతూ వారు విప్లవకర ప్రభుత్వాన్ని కూలదోశారు.

ఆ ప్రభుత్వానికి మద్దతుగా అక్కడ వున్న క్యూబన్లు, ఇతర లాటిన్ అమెరికన్లు అక్కడినుంచి తరలివెళ్లాల్సి వచ్చింది. వారు రాజకీయ కర్తవ్యాలు చేసేవారు కాకపోయినా కేవలం సాధారణమైన పనులు చేసేవారైనా సరే అక్కడి నుంచి వెళ్లాల్సివచ్చింది. వారు మెక్సికో వెళ్లారు.

1955లో మొదటి మంకాడా యోధులు జైలు నుంచి బయిటపడి క్యూబా నుంచి వచ్చేశారు. ఆ సందర్భంగా నిరంతరాయంగా వేధింపులకు, చిత్రహింసలకు గురిచేయబడిన మొట్టమొదటి కామ్రేడ్లలో రావుల్(కాస్ట్రో) ఒకరు. ఆయన మెక్సికోకు బయలుదేరాడు. నేను కొన్ని వారాల తర్వాత వచ్చాను. రావుల్ అప్పటికే ఇతర కామ్రేడ్లతో సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. చేను కూడా కలుసుకున్నాడు. మెక్సికోకు వచ్చిన తర్వాత కొన్నాళ్లకు నేను చేను కలిశాను. ఎంపరన్ వీధిలో క్యూబన్లు వుంటున్న ఒక ఇంట్లో నేనాయన్ను కలిశాను.

అప్పుడు చే చే కాదు. ఆయన ఎర్నెస్టో గువేరా. చే అనిపిలిచే అర్జెంటీనా సంప్రదాయం ప్రకారం క్యూబన్లుఆయనను చే అని పిలుచుకున్నారు. ఆ పేరు ఆయనకు అలా వచ్చింది. తర్వాత అది సుప్రసిద్ధమైంది. ఒక ప్రతీకగా నిలిచిపోయింది.

మేము అలా కలుసుకున్నాము. కొన్ని గంటలు చర్చించిన తర్వాత వెంటనే క్యూబా ఉద్యమంలో చేరిపోయాడు. ఈ విషయం తనే ఎక్కడో రాశాడు.

ఆయన గ్వాటిమాలలో జీవించిన అనుభవం చాల గడ్డది. ఆ దేశంపై పిరికితనంతో దురాక్రమణ చేయడం, ప్రజలలో ఆశలు రేకెత్తించిన ప్రక్రియను విఘాత పరచడం ఆయన చూశాడు. ఆయనలో విప్లవ దీక్ష పోరాట స్ఫూర్తి వున్నాయి. కనక ఆయన ఈ నిర్ణయం తీసుకోవడానికి గంటలతరబడి చర్చించామని చెప్పలేను. కొన్ని నిముషాలు మాట్లాడగానే చే మా దేశంలో కొత్తదశ పోరాటం పెంపొందించేందుకు కృషి చేస్తున్న మా చిన్న బృందంలో చేరిపోవాలని నిర్ణయించుకున్నాడు.

మేము మెక్సికోలో ఏడాదికి కొంచెం ఎక్కువ కాలమే వున్నాము. కష్టమైన పరిస్థితుల్లో అతి పరిమితమైన వనరులతో వున్నాము. అయితే అది నిజానికి పెద్ద సమస్యే కాదు. పోరాటంలో అలా జరగడం వూహించగలిగిందే. ఏ పోరాటంలోనైనా జరిగేదే క్యూబా పోరాటంలోనూ జరిగింది. చివరకు 1956 నవంబరు 25న మేము క్యూబాకు బయిలుదేరాము.

సందేహాలతో తలమునకలయ్యేవారికోసం, పోరాటం కొనసాగింపు గురించి నమ్మకం లేనివారి కోసం మా ఉద్యమంలో ఒక నినాదం తీసుకున్నాము. ఎందుకంటే వారు ఇంతకన్నా పరిష్కారం లేదనే మా వైఖరితో విభేదించేవారు. వారికి మేము ఒకటే చెప్పాము. 1956లో మేము స్వేచ్ఛయినా పొందుతాము లేదా అమరులైనా అవుతాము.

విజయమో వీరస్వర్గమో అన్నట్లు పోరాడతామనే మాదృఢ సంకల్పాన్ని క్యూబా దేశానికి మరోసారి చాటిచెప్పే ప్రకటన అది. పోరాటం జాప్యం లేకుండా పున:ప్రారంభమవుతుందని చెప్పే విశ్వాసం అది.

మేము ఒక నిర్ణీత దినాన క్యూబాకు తిరిగి వెళతామని వాగ్దానం చేయడానికి కారణమేమిటో చాలా మందికి అర్థం కాలేదు. అంటే మన సంస్థలో వారు కాదనుకోండి. ఎందుకంటే మన నినాదం అర్థమేమిటో వారికి బాగా తెలుసు. కానీ ఇతరులకు అర్థం కాలేదు. అనేక నిరాశలవల్ల, సంప్రదాయక రాజకీయవేత్తలు అనుసరించిన కుటిలోపాయాలవల్ల మన దేశంలోని అనేక మంది ప్రజల్లో అలాంటి సందేహక స్థితి ఏర్పడింది. అంతేగాక స్వార్థపర వర్గాలకు ప్రతినిధ్యం వహించే అనేక మంది రాజకీయ మాయోపాయాలకు పాల్పడే వారు బాటిస్టా నియంతృత్వ ప్రభుత్వంతో రాజకీయ ఒప్పందాలు చేసుకోడానికి, విప్లవ పోరాటంపట్ల ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీయడానికి నానా పాట్లు పడేవారు.

అందువల్లనే మనం తప్పైనా, ఒప్పైనా అలాంటి నినాదం చేపట్టవలసి వచ్చింది. మనం దాన్ని ఇప్పుడు చర్చించబోవడంలేదు. సైద్ధాంతికపరమైన పరిశోధనకు అది వనరుగా ఉపయోగపడవచ్చు. ప్రజలు ఎప్పుడూ ఒక రేఖ ప్రకారమే నడవరు. ప్రజలు తమ ఇష్టాయిష్టాలను బట్టి చరిత్రను సృష్టించలేరు. ప్రజలు చరిత్ర నిర్మాణానికి దోహదపడవచ్చు. కానీ చరిత్ర కూడా ప్రజలను రూపొందిస్తుంది. అందువల్ల గొప్పగానో, తప్పుగానో మేము ఆ నినాదం చేపట్టాము. దాన్ని కొనసాగించాలనుకున్నాము.

ప్రత్యేక పరిస్థితులు తలెత్తవచ్చు. తలెత్తాయికూడా. మేము వెళ్ళే సమయానికి చాలా తీవ్రమైన పర్యవసానాలు కలిగాయి. అయితే మా దగ్గర ఎప్పుడూ కొన్ని ఆయుధాలు దాచి ఉండేవి. మేము అందరూ వెళ్ళలేకపోయినా కొంత మంది ఎట్టి పరిస్థితుల్లోనైనా వెళ్ళడం జరుగుతుందని చెప్పాము. కనుక 82 మంది యోధులు గ్రాన్మా అనే చిన్న నౌకలో బయలుదేరారు. 2400 కిలో మీటర్లు ప్రయాణించి 1956 డిసెంబరు 2న క్యూబా తీరం చేరుకున్నారు. మరో రెండు మూడు రోజుల్లో మన దేశం ఆ నౌక రాక 15వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోంది. అదే మా చిన్న సైన్యానికి ప్రారంభ దినోత్సవం. ఇప్పటికీ డిసెంబరు 2 మా సాయుధ దళాల దినోత్సవంగా జరుగుతుంది.

అందువల్ల ఆ విధంగా పోరాటం ప్రారంభమైంది. నేను ఆ చరిత్ర అంతటిని ఇవ్వబోవడంలేదు. కేవలం ఆ పోరాటం ప్రారంభమైన పరిస్థితులను రేఖామాత్రంగా వివరించడానికే ప్రయత్నం చేస్తాను.

మరి చే ఏమిటి? చే మా దళానికి డాక్టర్. ఆయన కమిస్సార్ కాదు. ఆయన కింద ఎలాంటి దళాలు ఉండేవి కాదు. ఆయన కేవలం డాక్టర్ మాత్రమే.

ఆయన నిశిత దృష్టివల్ల ప్రతిభవల్ల, స్వభావంవల్ల చే మెక్సికోలోని ఒక యింటిలో క్యూబన్ల బృందానికి నాయకుడుగా నియమితునైనాడు. ఒక రోజున చిన్న ఘటన జరిగింది. అది ఆమోదించదగింది కాదు. అక్కడ 20, 30 మంది క్యూబన్లు ఉండేవారు. వారిలో



కొందరు- బహుశా ఇద్దరు ముగ్గురు కూడా కావచ్చు- ఎందుకంటే ఒక్కోసారి ఇద్దరు ముగ్గురు చాలు- ఇబ్బందికరమైన పరిస్థితి సృష్టించడానికి. ఆ కొద్ది మంది ఆయన నాయకత్వాన్ని సవాలు చేశారు. ఆయన అర్జెంటీనాకు చెందిన వాడు అని క్యూబన్ కాదని వారి అభ్యంతరం.

సరే మేము మానవ విలువలను విస్మరించే అలాంటి వైఖరి సరైందికాదని చెప్పాము. మన గడ్డపై పుట్టకపోయినా దాని కోసం రక్తమోడడానికి సిద్ధంగా వున్న మనిషి పట్ల అలాంటి కృతఘ్నత తగదని చెప్పాము. ఆ ఘటన నాకు చాలా బాధ కలిగించడం ఇంకా గుర్తు ఉంది. ఆయన కూడా అలాగే బాధపడి ఉంటాడనుకుంటాను.

అంతేగాక ఆయన ఎలాంటి అధికార కాంక్షలేని వ్యక్తి. ఆయనకు కనీసమైన దురాశకూడా ఉండేది కాదు. ఆయన ఏ విధంగానూ స్వార్థపరుడు కాదు. పైగా ఆయన ఎవరైనా తనతో విభేదిస్తే ముడుచుకుపోయే మనిషి.

ఆయన మన దేశానికి వచ్చినప్పుడు సైన్యంలో మా దళం డాక్టర్గా వచ్చాడని మళ్ళీ చెప్పదలిచాను. చే సైనికుడుగా ఎలా మారాడు. తన ప్రత్యేకత ఎలా నిరూపించుకున్నాడు. ఆయన లక్షణాలేమిటి అన్నది మరింత ఆసక్తికరమైన విషయం.

కొన్ని ఉదాహరణలు ఇస్తాను. డిసెంబరు 5న ఎత్తుగడల లోపం కారణంగా మా చిన్న విభాగంపై ఆశ్చర్యకరమైన దాడి జరిగింది. పూర్తిగా చెల్లాచెదురైంది. దారుణమైన కష్టాలను అధిగమించిన తరువాత కొద్ది మంది పునస్సమీకృతులయ్యారు. వారి చుట్టూ దిగ్బంధనం ఉన్నా అతి కష్టం మీద ఆ పని చేశారు. మూడు బృందాలు ఏర్పడ్డాయి. రావుల్తో ఒకటి. దాంట్లో చే కూడా ఉండేవాడు. అప్పటికి ఇంకా ఆయన దాని బాధ్యుడు కాదు. కామ్రేడ్ అల్మయిదా కూడా ఆ బృందంలో ఉండేవాడు. నాతో మరో బృందం. అల్మయిదా బృందం ముందుగా నాతో వచ్చి కలిసింది. కొన్ని రోజుల తరువాత రావుల్ కూడా వచ్చి చేరాడు. మేము పోరాటం కొనసాగించాము.

మా మొదటి పోరాటం 1957 జనవరి 17న జరిగింది. మా దగ్గర 17 మంది వుండేవారు. మొదట్లో మేము తెచ్చిన అన్ని ఆయుధాల్లోను కేవలం ఏడింటిని మాత్రమే ఉపయోగించగలిగాము. డిసెంబరు 5న చే తుపాకి కాల్పుల్లో బ్యాప్టిజం పొందాడని చెప్పొచ్చు. అలాగే ఇతర కామ్రేడ్లు కూడా. అయితే మేము గెలిచిన మొదటి చిన్న పోరాటం జనవరి 17న జరిగింది.

రెండవ పోరాటంతోనే చే తన ప్రత్యేకత చాటుకున్నాడు. మమ్మలను వెంటాడే దళాలతో పోరాడటంలో ఆయన తన సాహసాన్ని ప్రదర్శించగలిగాడు. మొత్తం యుద్ధంగా ఒక శత్రు సైనికుడితో దాదాపు వ్యక్తిగతంగా జరిగిన పోరాటంలో ఆయన వాడ్ని కాల్చేసాడు. తూటాల వర్షం కురుస్తున్నప్పటికీ పాక్కుంటూ వెళ్ళి తన ఆయుధం స్వాధీన పర్చుకున్నాడు. దాంతో ఆయన పై ప్రశంసలు కూడా కురిశాయి.

తరువాత వారం రోజులు కూడా గడవకముందే జనవరి మాకు ఒక విద్రోహి కారణంగా నష్టం కలిగింది. మా చిన్న బృందం 30 మందితో విస్తరించింది. వారిలో

ఐదారుగురు రైతులు. తమ కుటుంబాలను చూసి వస్తామని వారు అనుమతి తీసుకొని వెళ్ళారు. మా చిన్న బృందంలో క్రమశిక్షణ అప్పటికి ఇంకా గట్టిగా నెలకొనలేదు. వారు తమ తుపాకులను దళంతోనే ఉంచి వెళ్ళారు. ఒక రోజు ఉదయం యుద్ధ విమానాలు దాడి చేశాయి. బాంబుల వర్షం కురిపించాయి. సరిగ్గా ఆ దళం ఉన్న చోటనే దాడి కేంద్రీకృతమైంది. అంతకు ముందు మాకు కొంత యుద్ధరంగ అనుభవం ఉన్నప్పటికీ ఇంత తీవ్రమైన పరిస్థితి ఎదురవ్వడం ఇదే ప్రథమం.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే పోరాడేవారు కాల్పులు కేంద్రీకృతమైన చోట నుంచి వైదొలగడానికి ప్రయత్నిస్తున్నారు. మేము ఒక కొండపైకి ఎక్కుతున్నాము. ఆ క్షణంలో మాకో విషయం గుర్తొచ్చింది. ఆ ఐదారుగురు రైతులకు సంబంధించిన ఆయుధాలు ఉండిపోయాయని. వాటిని వెలికి తీయాలి. నేను వలంటీర్లు కావాలని అడిగాను. ఏ మాత్రం ఆలోచనగానీ, తటపటాయింపుగాని లేకుండా చే ముందుకు వచ్చాడు. నేను వెళతానన్నాడు. బాంబు దాడికి గురవుతున్న ప్రదేశానికి వెళ్ళి ఆయుధాలు తీశాడు. వాటిని సురక్షితంగా భద్రపరిచి తిరిగి వచ్చి మాతో కలిశాడు.

చాలా ఉదంతాలు జరిగాయి. చే అప్పటికి ఇంకా వైద్యుడిగానే ఉన్నాడు. ఆయన దళాలపై ఎలాంటి అజమాయిషి చేయడంలేదు. అయితే ఆ ఏడాది మే 28న మరేదో జరిగింది. మా దళంలో ఇప్పటికే 100 మంది ఉన్నారు. నేను సరిగ్గా గుర్తుంచుకొనేటట్లయితే ఇతర రాజకీయ సంస్థల నుండి క్యూబన్ విప్లవకారులు వచ్చి ఉత్తర భాగంలో చేరారు. మేము మా నౌకా గమనాన్ని మాకు ఎదురైన ఇబ్బందులను గుర్తు చేసుకున్నాము. కనుక ఇప్పుడు వచ్చిన బృందానికి మద్దతుగా ఏదైనా చేయాలనుకున్నాము. శత్రు సైనికులు మకాం చేసి ఉన్న తీరానికి బయలుదేరాము. అక్కడ వారు అగడ్తలు వగైరా ఏర్పాటు చేసుకొని ఉన్నారు.

మాకు అందిన సమాచారాన్ని బట్టి ఉదయం నుంచి దాడి ప్రారంభించాలని త్వరితంగా సాధించాలని పథకం రూపొందించుకున్నాము. మేము వెళ్ళి దాడి ప్రారంభించే సమయానికి పరిస్థితి క్లిష్టంగా తయారైంది. మాకు అందిన సమాచారం అంత ఖచ్చితమైంది కాదు. శత్రు బలగాలు మేము అనుకున్న చోట లేవు. ఏమైనా మేము ముందుకు పోవల్సిందే. మా చిన్న దళాలు ఒక వలయంగా విడిపోయాయి. ఒకటిన్నర కిలోమీటరు పరిధిలో దాడి కొనసాగించడంతప్ప మేము తిరోగమించే అవకాశం లేదు.

ఆ పోరాటం సందర్భంలో చే సైన్యంలో భాగంగా ఉన్నాడు. అప్పటికే ఆయన పై కొన్ని బాధ్యతలున్నాయి. మేము రెండు మూడు చర్యలు చేపట్టాల్సి ఉంది. అల్మెయిదా దళాన్ని త్వరితంగా ముందుకు పోయి శత్రువు సైన్యానికి సాధ్యమైనంత దగ్గరగా చేరాలని చెప్పాము. అది చాలా సాహసోపేతమైన పని. మేము చాలా మందిని కోల్పోయాము.

ఒక బృందాన్ని పశ్చిమ దిశగా వెళ్ళమన్నాము. మేము పరిస్థితిని అంచనా వేస్తూ చేపట్టవల్సిన చర్యల అవసరాన్ని చర్చిస్తున్నప్పుడు చే స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు. కొంత మంది మనుషులను ఒక ఆటోమేటిక్ రైఫిల్ ఇస్తే వెళ్తానన్నాడు. మేము జనరల్



స్టాఫ్‌కు చెందిన రైఫిల్‌ను, మనుషులను ఇచ్చాము. అతను వెంటనే పశ్చిమ దిశలో త్వరితంగా కదిలిపోయాడు. ఒక వలంటీరు కావల్సి వచ్చినప్పుడు చే తనంతతానుగా ముందుకు రావడం ఇది మూడోసారి. ఎలాంటి క్లిష్ట పరిస్థితిలోనైనా అతను వెనువెంటనే రంగంలోకి వస్తాడు. ఇప్పుడూ అదే చేశాడు.

అది చాలా కఠోరమైన పోరాటం. మూడు గంటలపాటు జరిగింది. రెండువైపులా 30 శాతం మంది చనిపోయారు. లేదా గాయపడ్డారు. ఉత్తరానికి చేరుకున్నవారికి సహాయపడాలన్న ఉద్దేశంతో జరుగుతున్న దాడి అది. మేము ఎంత చేసినప్పటికీ వారిని చుట్టుముట్టి బంధించి చంపివేశారు. ఒక్కరిని కూడా వదిలి పెట్టలేదు. మేము శత్రు శిబిరానికి చేరుకున్నాక మూడు గంటల తరువాత చూస్తే చాలా మంది గాయపడ్డారు. శత్రువులు మా వాళ్ళు కూడా. డాక్టర్‌గా చే ఇరువైపులా గాయపడినవారికి సేవ చేశారు. మొత్తం పోరాటం కాలం అంతటలోనూ ఈ పద్ధతినే, నియమాన్నే అతను పాటిస్తూ వచ్చాడు.

ఆ తరువాత చూస్తే సహజంగానే పోరాటంలో శత్రు బలగాలు కేంద్రీకృతమైనాయి. మమ్మల్ని వేటాడటానికి భారీ ఎత్తున ప్రయత్నం జరిగింది. తీవ్రంగా గాయపడిన మా వారిని కాపాడుకోవడం పెద్ద సమస్య అయింది. మేము వారిని పోరాట స్థలంలోనే వదిలి వెళ్ళాము. మేము వెళ్ళిపోయిన తరువాత వాళ్ళ వాళ్ళు తమ వారిని తీసుకుపోవచ్చు. చే డాక్టర్‌గా వెనకవైపున ఉండి మా క్షతగాత్రులకు ఒంటరిగా సేవ చేసేవాడు. ఆ క్లిష్ట పరిస్థితిని ఆయన జాగ్రత్తగా చూసుకున్నాడు. శత్రు సైన్యాలు పెద్ద సంఖ్యలో ఉన్నా తన పని తను చేశాడు.

మా దళం కష్టభూయిష్టమైన దుర్గమమైన దారులగుండా సాగింది. శత్రువలయాన్ని ఛేదించాము. అయితే చే మాత్రం గాయపడిన వారితోపాటు వెనకే ఉండిపోయాడు. చాలా కొద్ది మందే అతనితో ఉన్నారు. అలా చాలా వారాలు ఉండి వారు కోలుకునే వరకు సేవ చేశాడు. ఆ చిన్న బృందం తరువాత వచ్చి ప్రధాన దళంతో కలిసింది. పైగా యుద్ధ సమయంలో సేకరించుకున్న అయుధాలతో మరింత గట్టిపడింది కూడా.

అందువల్ల మేము మరో సైనిక దళాన్ని ఏర్పాటు చేసినప్పుడు దాని నాయకత్వం చేకు అప్పగించాము. అతన్ని మా దళాలకు రెండవ కమాండర్‌గా చేశాము. తన సరికొత్త చిన్న దళంతో అతను ఒక నిర్ణీత ప్రాంతంలో పని చేశాడు. మొదటి దళం ఉన్నచోటికి అదేమంత దూరంలోలేదు. చే సైనికుడుగా మారిన క్రమం అది. అతను చిన్న దళానికి కమాండర్ కూడా అయ్యాడు. అయినా అవే లక్షణాలు ప్రదర్శించాడు. అతన్ని మేము ప్రత్యేక జాగ్రత్తలతో చూసుకోవాల్సి వచ్చింది.

అలా అనడంలో నా ఉద్దేశం ఏమిటో చెప్తాను. సరే అతని దూకుడు, సాహస ప్రవృత్తివల్ల చాలా సాహసోపేతమైన దాడులకు వ్యూహం వేసేవాడు. తరువాత దశలో అతను పోరాటంలో ప్రవేశించినప్పుడు అది చాలా నెలలపాటు సాగింది. అతని చిన్న దళానికి అవసరమైన బలగాలు కానీ ఆ ప్రాంతానికి గురించి అనుభవంగాని లేదు. అయినా గొప్ప సాహసం, నిబ్బరం ప్రదర్శించాడు. కొన్నిసార్లు ఒక ప్రదేశం కోసం శత్రువుతో

పోరాడతాననేవాడు. అక్కడే ఉండి గంటలతరబడి కొన్నిసార్లు రోజులు తరబడి కూడా పోరాడేవాడు.

ఒక విధంగా అతను నిబంధనలు కూడా ఉల్లంఘించాడని చెప్పొచ్చు. సాధారణంగా అనుసరించాల్సిన పద్ధతులు అత్యుత్తమమైన పద్ధతులు అతను పాటించేవాడు కాదు. తన ప్రాణాలకు కూడా తెగించి పోరాడేవాడు. అతని స్వభావం, సాహసప్రవృత్తి, స్ఫూర్తి దానికి కారణం. తన దళం చాలా చిన్నదైనప్పటికి కూడా ఒక ప్రదేశాన్ని వదులుకోవడానికి సిద్ధపడేవాడు కాదు. అపారమైన సంఖ్యలో శత్రు సైన్యాలు వస్తున్నప్పటికీ వెనక్కి తగ్గేవాడు కాదు. ఒక ప్రదేశాన్ని కాపడుకోవడం ఇంక ఎంత మాత్రం ప్రయోజనం కాదని తెలిసినా వదిలేవాడు కాదు. అదీ ఆయన స్వభావం. అదీ ఆయన నిబ్బరం. పోరాట లక్షణం.

అందువల్ల సహజంగానే అతను అనుసరించాల్సిన కొన్ని నిబంధనలు మార్గదర్శక సూత్రాలు రూపొందించాల్సి వచ్చింది.

అతనిలో మనం ప్రశంసించిన లేదా ఆకర్షించిన విషయాలు ఏమిటి? చే మనోధృతి, చిత్తశుద్ధి ఖచ్చితంగా పట్టి యిచ్చే లక్షణాలేమిటి? ఆయన నైతికత, సాహసం, తిరుగులేని నిస్వార్థత. ఆయన ఒక క్యూబన్ల బృందాన్ని కలుసుకున్నాడు. వారి పోరాటం సరైందని విశ్వసించాడు. ఆ మరుక్షణం నుంచి అతను మహత్తరమైన నిస్వార్థతను, ఔదార్యాన్ని ప్రదర్శించసాగాడు. తొలిక్షణం నుంచి అతను తన ప్రాణాలు అర్పించడానికి సిద్ధంగానే ఉన్నాడు. మన దేశానికి వేల కిలోమీటర్ల దూరంలో పుట్టిన వ్యక్తి కొంత మంది క్యూబన్ల అభ్యంతరాలను కూడా ఎదుర్కొన్న వ్యక్తి వారి కోసం ప్రాణాలర్పించేందుకు సిద్ధమైనాడు. ప్రమాదకరమైన ప్రతి సందర్భంలో అపాయాలు నిండిన అన్ని కార్యక్రమాల్లో అతను ఐచ్ఛికంగా ముందుకు వస్తుండేవాడు.

ఎలాంటి వ్యక్తిగత పేరాశలు లేని వ్యక్తి అతను. తన పని తాను బాగా చేయాలన్న కాంక్షతప్ప మరేమీలేని వ్యక్తి. ఏ పరిస్థితినైనా వెనువెంటనే ఎదుర్కొనడానికి ముందుకు వచ్చే వ్యక్తి. ఎలాంటి సంకోచం లేకుండా ఒక గొప్ప విప్లవ యోధుడు ఎలా ప్రవర్తించాలో అలా ముందుకు వచ్చే వ్యక్తి.

ఆ తొలి రోజుల్లో చే ను తలచుకుంటే ఇలా ఒక నాడు తన స్మారక చిహ్నం ముందు సమావేశం జరుగుతుందని ఊహించి ఉండడని అనిపిస్తుంది.

చే కీర్తి కోసం పోరాడలేదు. భౌతిక సంపద కోసంగానీ, అత్యాశతోగానీ పోరాడలేదు. పేరు ప్రఖ్యాతులు కోరుకోలేదు. ఇతర సైనికులందరిమాదిరే తన ప్రాణాలర్పించడానికి తొలి రోజు నుంచి సిద్ధంగా ఉన్నాడు. అతను మొదటి పోరాటంలోనే చనిపోయి ఉంటే వ్యక్తిగా అతని జ్ఞాపకాలు మిగిలిఉండేవి. అప్పటికి తెలిసిన అతని వ్యక్తిత్వం లక్షణాలు మాత్రమే మాట్లాడుకొనేవాళ్ళం. అతను రెండవ, మూడవ, నాల్గవ, ఐదవ పోరాటాల్లో చనిపోయినా అంతే జరిగి ఉండేది. అతను అలా చనిపోలేదు. చాలా పోరాటాలు మాత్రం చేశాడు. అందువల్ల చే విధి నిర్వహణ, త్యాగం మరేమీ పట్టించుకోలేదని అత్యంత స్వచ్ఛతతో, సంపూర్ణమైన స్వార్థరాహిత్యంతో పని చేశాడని మనం చెప్పొచ్చు.



సిరియామెస్త్రా పోరాటంలో చే బతికి బయటపడ్డాడంటే దానికి మనం అనుసరించిన విధానాలే కారణం. నాయకుడుగా ప్రతిభావంతుడైన వ్యక్తి చిన్న చిన్న పోరాటాల్లో బలికాకూడదని మరింత ప్రధానమైన కార్యక్రమాల కోసం అట్టిపెట్టుకోవాలని మనం భావించాం.

1958మేలో ఒక పోరాటం ప్రారంభమయ్యింది. 10 వేల మంది (బాటిస్టా నిరంకుశ సైనికులు) మాపైకి దూసుకొచ్చారు. అప్పుడు మాకు మహా అయితే 300 మంది సైనికులుండేవారు. చే దళం మరికొన్ని దళాలతోసహా. దాదాపు 70 రోజులపాటు పోరాటం తరువాత మేము ఆ దాడిని ఛేదించగల్గాము. మా సైనికులు అప్పటికే అనేక సమరాలలో రాటుదేలిన యోధులు. ఆయుధాలు, సైనికుల సంఖ్య తక్కువకావడంవల్ల ఇబ్బంది ఉన్నా తట్టుకోగలవారు. కనుకనే ఇది సాధ్యమైంది. మేము ఆ దాడిని తిప్పికొట్టడంతోపాటు గణనీయమైన సంఖ్యలో ఆయుధాలు సంపాదించగలిగాము. వేర్వేరు దళాలను ఏర్పాటు చేశాము. యుద్ధం మొదలైనప్పుడు మా దగ్గర 300 మంది సైనికులు ఉన్నారు. యుద్ధం ముగిసేసరికి 805 మంది సాయుధులు సమకూరారు.

ఆ తరువాతనే మేము రెండు దళాలను నిర్మించాము. ఒక దానికి క్యామిలో, మరోదానికి చే కమాండర్లు. వాటికి ఉన్నంతలో అత్యాధునిక ఆయుధాలు ఇచ్చాము. వారు దాదాపు ఒక అసాధారణ కృత్యం చేశారు. సియరామస్త్రా నుంచి 90 మంది సైనికులతో క్యామిలో, 140 మందితో చే పశ్చిమ దిశగా ప్రస్థానం సాగించారు. 500 కిలోమీటర్ల మైదానాలను అనేక చోట్ల నిర్మానుష్య ప్రదేశాలను దాటుకుంటూ లాస్ విలాస్ రాష్ట్రానికి చేరుకున్నారు. ఆ రెండు దళాలు సియరామస్త్రా నుంచి సెప్టెంబరు ప్రాంతంలో బయలుదేరారు. శత్రువు సమీపంలో సంచరిస్తుండగానే ముందుకు పోయారు. అనేక సందర్భాల్లో చాలా కష్టతరమైన పరిస్థితిని ఎదుర్కొంటూ నడిచారు. ఆ ద్వీపం మధ్యభాగానికి చేరుకోవాలనే లక్ష్యాన్ని పూర్తి చేశారు.

డిసెంబరు చివరకు మా దళాలు దాదాపుగా ఓరియంటే రాష్ట్రాన్ని స్వాధీన పర్చుకున్నాయి. లాస్‌విలాస్ రాష్ట్రం మీదుగా దాన్ని రెండుగా విభజించాము. చే క్యూబాలో నిర్వహించిన చివరి సైనిక విన్యాసమది. అతను 300 మంది సైనికులతో శాంతాక్లారా మీదుగా నడిచాడు. నగరం పొలిమేరల్లో నిలిచివున్న ఆయుధాల రైలుపై దాడి చేశాడు. ట్రాక్‌లు కత్తిరించాడు. దాన్ని పట్టాలు తప్పించి లోపలికి చొరబడి అక్కడి దళాలను లొంగదీసుకొని అన్ని ఆయుధాలను స్వాధీన పర్చుకున్నాడు. ఒక ముక్కలో చెప్పాలంటే కేవలం 300 మంది మనుషులతో శాంతాక్లారా నగరంపై దాడి చేశాడు.

చివరగా జనవరి 1న బాటిస్టా నిరంకుశ ప్రభుత్వం కుప్పకూలింది. అప్పుడు కూడా క్యూబా విప్లవ విజయాన్ని వమ్ము చేసే కుట్ర జరిగింది. క్యామిలో, చే లను వెనువెంటనే హవానా వైపుగా రావల్సిందిగా కోరాము. వారు ఆ పని చేశారు. జనవరి 2 నాటికి ఆ రెండు దళాలు రాజధానిలోకి ప్రవేశించాయి. విజయోత్సాహం జరిగింది. మహా ప్రస్థానం ప్రారంభమైంది. అందరి జీవితం మారిపోయింది. అనేక కర్తవ్యాలు వచ్చిపడ్డాయి. అనేక

మంది యోధులు పాలనాపరమైన బాధ్యతలు చేపట్టవల్సి వచ్చింది. చాలా నెలల తరువాత చే ను పరిశ్రమ మంత్రిగా నియమించడం జరిగింది. అతను ఆ పనిలో చాలా సంవత్సరాలు మునిగిపోయాడు.

నేను ఒక సైనికుడుగా చే లక్షణాల గురించి చెప్పాను. కానీ అతనిలో అనేక రకాలైన గొప్ప గుణాలు ఉన్నాయి. మొట్టమొదటి విషయం అతను అసాధారణ సంస్కృతికల్గిన వ్యక్తి. నాకు తెలిసినంతలో అత్యంత ప్రగాఢమైన మేధస్సుగల వ్యక్తుల్లో ఒకడు. అత్యధిక ఔదార్యం కల్గిన మనుషుల్లో ఒకడు. ఇది కూడా విప్లవకారుల్లో అతి ముఖ్యమైన లక్షణం. అతని భావాలు, ఇతరుల పట్ల అతని తపన. ఆసియా, ఆఫ్రికాల్లో ఉద్యమంపట్ల అతని శ్రద్ధాశక్తులు ఇవి మొత్తం ప్రపంచానికి వర్తించే విషయాలు.

ఆ సమయంలో అల్జీరియన్లు తమ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్నారు. (ఇందుకోసం ఫ్రాన్స్‌పై 1954 నుంచి 1962 వరకు పోరాడారు) ఇతర ఖండాల్లోని పేద, వెనుకబడిన దేశాలు కూడా రకరకాలైన పోరాటాల్లో మునిగి వున్నాయి. ఈ ప్రపంచాలతో సంబంధం ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరాన్ని అతను పూర్తి స్పష్టతతో గుర్తించాడు. వేర్వేరు పనుల మీద అనేక దేశాలు సందర్శించాడు. సన్నిహిత సంబంధాలు, వ్యాపార వాణిజ్య సంబంధాలు కోరుకున్నాడు. మా దేశంపై విధించిన ఆర్థిక దిగ్బంధాన్ని అధిగమించడానికి ఎంతో కష్టపడ్డాడు.

ప్లయాగైరాన్ (బే ఆఫ్ పిగ్స్) దురాక్రమణ జరిగినప్పుడు చే పినార్ డెల్ రియో రాష్ట్ర దళాలకు కమాండర్‌గా ఉన్నాడు. ఆ ద్వీపపు దక్షిణ మధ్య ప్రాంతంలో దాడి ప్రారంభం కాగానే మాకు మొదట్లో ప్రధాన దాడి ఎటు ఉండాలనే దానిపై స్పష్టత లేదు. స్థూలంగా చెప్పాలంటే అత్యంత అనుభవజ్ఞులైన నాయకులు కూడా నిర్ణీత సైనిక జోన్స్ బాధ్యతలు మాత్రమే చూసేవారు. చే అప్పట్లో పరిశ్రమల మంత్రిగా ఉన్నప్పటికీ దాడికి వ్యతిరేకంగా సమీకరణ ప్రారంభం కాగానే పినార్ డెల్ రియో రాష్ట్రానికి పంపించబడ్డాడు. 1962లో మిసిలీ సంక్షోభం తలెత్తినప్పుడు చే మరోసారి ఆ సైనిక ప్రాంత కమాండ్ బాధ్యత స్వీకరించాడు. నిజంగా అది మరో ప్రమాదకరమైన ఘట్టం.

ఆ విధంగా అనేక సమయాల్లో క్లిష్టమైన పరిస్థితుల మధ్య మేము కొన్ని తీవ్ర ప్రమాదాలను ఎదుర్కోవల్సి వచ్చింది. అతను ఒక యోధుడుగా పోరాటం కొనసాగించాడు. తన బాధ్యతలు నిర్వహించాడు. సైనిక శాస్త్రాన్ని చాలా శ్రమపడి అధ్యయనం చేశాడు.

ఆయన ఎంతో కష్టపడి చదివే వ్యక్తి. తన పని భారం నుంచి బయటపడే అవకాశం లభించగానే నిద్రను, విశ్రాంతిని వదులుకొని చదువులో మునిగిపోయేవాడు. పరిశ్రమల మంత్రిత్వ శాఖలో నిరంతరాయంగా పని చేయడం ఒక్కటే కాదు. అతను సందర్శకులను కలుసుకునేవాడు. యుద్ధానికి సంబంధించిన లెక్కలు రాసేవాడు. ఏదో ఒక పనిపై తాను సందర్శించిన దేశాలలో అనుభవాలు రాసేవాడు. ఆ అనుభవాలను, ఆసక్తికరమైన, సరళమైన స్పష్టమైన శైలిలో వివరించేవాడు.

చే రాయడంవల్లనే విప్లవ సమరానికి సంబంధించిన అనేక ఘట్టాలు



కాపాడబడ్డాయి. వివిధ సందర్భాల్లో తమ తోటి దేశభక్తులు రాసిపెట్టిన అనుభవాల నుంచి మన ప్రజలు తెలుసుకొనే అవకాశం ఉండాలన్న అతని ఆసక్తి ఇందుకు కారణం.

క్యూబాలో స్వచ్ఛంద శ్రమ (వలంటీర్ల కృషి) ప్రారంభించిన వ్యక్తి చే. పరిశ్రమల శాఖ అజామాయిషీలో ఉండే పని ప్రదేశాలతో అతను చాలా సన్నిహిత సంబంధం కల్గి ఉండేవాడు. వాటిని సందర్శించేవాడు. కార్మికులతో మాట్లాడేవాడు. సమస్యను విశ్లేషించేవాడు. ప్రతి ఆదివారం చే కొన్ని పని ప్రదేశాలకు వెళ్ళేవాడు. కొన్నిసార్లు రేవులకు వెళ్ళి డాక్ కార్మికులు బరువులు ఎత్తడాన్ని పరిశీలించేవాడు. మరికొన్నిసార్లు గనుల్లోకి వెళ్ళి గని కార్మికులు ఎలా పని చేసేవారో చూసేవాడు. ఇంకా కొన్నిసార్లు చెరకు తోటకు వెళ్ళి చెరుకు తోటలను ఎలా నరికే తీరు గమనించేవాడు. ఇంకొన్నిసార్లు నిర్మాణ కార్మికులను పరామర్శించేవాడు. ఒక్క ఆదివారం కూడా అతను వృథా పోనిచ్చేవాడు కాదు.

అంతేకాదు ఇవి కానీ ఇంతకు ముందు చెప్పుకున్న సాహస కృత్యాలు కానీ చే ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని చూడాల్సి ఉంటుంది. ఆయనకు కొన్ని రకాలైన అలర్జీలు ఉండేవి. అనేక సార్లు ఆస్తమాకు గురయ్యేవాడు. మొత్తం దాడి జరిగినంత కాలం ఆస్తమాతోనే రాత్రిబవళ్ళు పని చేశాడు. ఆస్తమాతోనే రాశాడు. ఆస్తమాతోనే దేశం, ప్రపంచం మొత్తం తిరిగాడు. ఆస్తమాతోనే గనుల్లోకి, పొలాల్లోకి ఎక్కడికిపడితే అక్కడికి వెళ్ళాడు. ఒక్కక్షణమైనా విశ్రాంతి తీసుకోలేదు. తన మంత్రిత్వ శాఖలో బాధ్యతలు నిర్వహించని సమయాల్లో నిద్రమానుకొని చదువుకోవడం, వలంటరీ శ్రమ చేశాడు.

మానవాళి పట్ల విశ్వాసం, అపారమైన ఆత్మవిశ్వాసంగల వ్యక్తి చే. అతనొక సజీవ ఉదాహరణ. ఒక ఉదాహరణగా ఉండటం అతని శైలి. గొప్ప మనోస్ఫూర్తి, ఆత్మత్యాగంగల వ్యక్తి. నిజంగా ధీరోదాత్త స్వభావం స్వార్థ త్యాగం ఏదైనా చేయగల వ్యక్తి. ఆదర్శంగా నిలవడమే ఆయన పద్ధతి.

అతని మొత్తం జీవితం ప్రతి రంగంలో ఒక ఆదర్శం నెలకొల్పిందని మనం చెప్పొచ్చు. ఆయన తిరుగులేని నైతిక స్థైర్యం కలిగిన వ్యక్తి. ఆయనవి అచంచలమైన దృఢ సిద్ధాంతాలు. ఎప్పుడూ భవిష్యత్‌కేసి చూసే సంపూర్ణ విప్లవకారుడు. అన్నింటినీ మించి మానవతా విలువలను, మానవ నైతిక విలువలను నొక్కి చెప్పిన వ్యక్తి. మీదుమిక్కిలి అతను నిస్వార్థతను నిష్కాముకతను, స్వీయ నిరాకరణను ఆచరించాడు.

అతని గురించి నేను ఉపయోగించిన పదాల్లో ఏమాత్రం అతిశయోక్తిలేదు. ఏమాత్రం అతి అంచనాలేదు. మనకు తెలిసిన ఆ వ్యక్తిని గురించి వర్ణన అది.

ఇక్కడ అతని స్మృతి చిహ్నం ఉంది. కళాకారుడు ఉద్దేశించిన ఆయన మూర్తి ఉంది. అయితే ఒక స్మృతి చిహ్నం వ్యక్తి యొక్క సంపూర్ణ సరూపాన్ని ఆవిష్కరించగలగటం అసాధ్యం. మన దగ్గర చే రచనలు ఉన్నాయి. అతడు చెప్పిన కథనాలు, ప్రసంగాలు ఉన్నాయి. అతనితో ప్రత్యక్ష పరిచయం ఉన్న వారిలో చే గురించిన స్వంత స్మృతులున్నాయి. మన చాలా ఫ్యాక్టరీలలో కార్మికులు చే తమ పని ప్రదేశాలను సందర్శించినప్పటి జ్ఞాపకాలను గర్వంగా నెమరేసుకొంటారు. అతను వలంటీరుగా పని చేసిన చోట్ల కూడా ఇదే

జరుగుతుండేది.

కొద్ది కాలం కిందట మేము ఒక జౌళి మిల్లు సందర్శించాము. దానిలో యంత్రాలను ఆధునీకరిస్తున్నారు. మాతోపాటు ఒక విదేశీ ప్రముఖుడున్నాడు. అక్కడున్న కార్మికులు ఒక విభాగంలోకి తీసుకెళ్ళారు. దాన్ని దాదాపు కుటుంబ సంపదలా కాపాడుకొంటున్నారు. అక్కడి మగ్గాలపై చే వలంటీరుగా పని చేశాడట. చే సందర్శించిన గనులు, ఆయన పని చేసిన ప్రదేశాలు, కార్మికులతో మాట్లాడిన చోట్లు అన్ని ఆయన స్మతి చిహ్నాలే. మన కార్మికులు వాటిని అసాధారణమైన ఆప్యాయతతో చూసుకుంటారు.

కానీ చే చరిత్ర కోసం బతకలేదు. గౌరవాలకోసంగానీ, ఘనతకోసంగానీ బతకలేదు. నిజమైన ప్రతి విప్లవకారుడిలాగే సంపూర్ణమైన ప్రతి విప్లవకారుడిలాగే చేకు కూడా ఒక అసాధారణ వ్యక్తిత్వం అంటే ఏమిటో తెలుసు. మహా దేశభక్తుడైన జోస్ మార్టిని కూడా మీరు గౌరవించారు. మొత్తం ప్రపంచ ఖ్యాతి అంతా ఒక పూరేకులో ఇమిడిపోతుందని ఆయన అందుకే అన్నాడు.

విప్లవకారులు గౌరవం కోసమో, ఘనతకోసమో పోరాటాలు చేయరు. చరిత్రలో స్థానం కోసం ప్రాకులాడరు. చే చరిత్రలో గొప్ప స్థానం ఆక్రమించాడు. ఆక్రమిస్తాడు. ఎందుకంటే అది ఆయనకు పెద్ద ముఖ్యమైన సంగతి కాదు. ఎందుకంటే ఆయన మొదటి పోరాటంలోనే మరణించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఎందుకంటే ఆయన స్వార్థం అనేదానికి పూర్తి అతీతంగా ఉన్నాడు. అందువల్ల ఆయన జీవితం ఒక ఇతిహాసం. ఆయన జీవితం ఒక ఉదాహరణ. మేము ఈ విషయమే మా ప్రజలకు చెప్తాము. ఇది ఒక ప్రాథమిక భావన. ఒక ప్రామాణిక వాక్యం. మన పిల్లలు ఎలా ఉండాలని మనం కోరుకుంటామంటే చే లాగానే తమ జీవితాలకు చే ను ఆదర్శంగా తలవని కుటుంబంగానీ, పెద్దలుగానీ, పిల్లలుగానీ క్యూబాలో ఉండరు.

ఈ రోజటి ప్రపంచం, ఈ సమకాలిన ప్రపంచం మానవజాతి కొత్త చరిత్ర రాస్తున్నది. మరింత మెరుగైన మానవతా పూరితమైన సమాజాన్ని నిర్మించడానికి ప్రయత్నిస్తున్నది. అత్యంత క్లిష్టమైన సమస్యలు, కఠినమైన పోరాటాలను ఎదుర్కొంటున్నది. ఇలాంటి నేటి ప్రపంచం ఒక ఉదాహరణ కోసం చూస్తున్నది. ఆ ఉదాహరణ ఎలా ఉండాలని మీరు ఆలోచించినట్లయితే చే గురించి తెలుసుకునే అవకాశం కల్గినవారు ఆయనను నమూనాగా ఎందుకు తీసుకుంటారో తెలుస్తుంది. అది అసాధారణమైన సమున్నత జీవితమని మేము విశ్వసిస్తాము.

ఈ నమూనాను రానున్న తరాలలో నిజం చేయడంలో మనం జయప్రదం అయినట్లేయితే ఎంత అద్భుతంగా ఉంటుంది అప్పుడు మనకు రానున్న తరాల్లో చే లక్షణాలు ప్రతిఫలిస్తాయి. చే వంటి వారితో కూడిన తరాలతో భావి సమాజాలు రూపొందుతాయి. చే లాంటి వారితో కూడిన తరాలు మరింత మెరుగైన సమాజాన్ని కమ్యూనిజాన్ని సాధిస్తాయి.

ఆయన మనకొక ఆదర్శాన్ని వదిలి వెళ్ళారు. ఆయన విస్పష్టమేధ, ఆయన నిష్కళంక వ్యక్తిత్వం, ఉక్కు గుండె ఇచ్చిన అంతిమ ఫలితమది. అది ఆత్మత్యాగం, కష్టాలను



సహించడంలో గట్టిపడిన గుండె. అది ఉదాత్తమైన, సున్నితమైన, దయార్ద్రమైన, స్ఫూర్తి. ఒక లక్ష్యానికి ఇతరుల కోసం పోరాడటానికి త్యాగం చేయడానికి తన మేధస్సును, హృదయాన్ని అంకితమిచ్చే ఉదాహరణ. ఆయన దృఢ హస్తం అంతిమంగా మనకు ఆయన డైరీని వదిలి వెళ్ళింది. వాటిలో ఆయన జీవితపు చివరి రోజుల వీరగాథను కథనం చేసాడు. ఆయన చిక్కటి, సూటి, పొదుపైన శైలిలో తన జీవితపు చివరి క్షణాలను అక్షర బద్ధం చేశాడు. సాహిత్యంలో నిజమైన వీరగాథను సృష్టించాడు. అది ఏ విధంగా చూసినా అసాధారణమైంది.

అందువల్లనే ప్రపంచ యువత చే ను ఒక ప్రతీకగా చూస్తారు. ఆయన అల్జీరియా, వియత్నాం, లాటిన్ అమెరికాలతో తాదాత్మ్యం చెందారు. కనుక చే పేరు రూపం అంటేనే ఖండాంతారల్లో అపారమైన గౌరవం, ప్రశంస, అప్యాయత వెల్లివిరుస్తాయి. చే పేరు, రూపం అమెరికా సమాజంలో కూడా ప్రతి హృదయంపైనా ముద్రితమై ఉంది. పౌరహక్కుల కోసం పోరాడేవారు, దురాక్రమణ వ్యతిరేక యోధులు, శాంతికాముకులు, ప్రగతిశీలురు ఏదైనా లక్ష్యం కోసం పోరాడేవారు చే పేరును, పతాకాన్ని చేబూని నడుస్తున్నారు. ఆ విధంగా ఆయన ఒక విరాట్ స్వరూపంగా ఆవిర్భవించారు. నిజంగా ఆయన ఇలా కనిపిస్తున్నారు. అయితే ఇది ఎవరి ఊహవల్లనో, మహేంద్రజాలంవల్లనో, స్వార్థ ప్రయోజనంవల్లనో ఇక్కడ సృష్టించబడలేదు. ఇంత నికరమైన వేదికపై ఇలాంటి పతాకం ఇంతకు ముందు ఎప్పుడూ ఎగురవేయలేదు. ఇంత దృఢమైన పునాదులు కల్గిన ఆదర్శం ఇంతకు ముందు ఎప్పుడూ లేదు.

సంక్లిష్టమైన అదే సమయంలో ఉద్విగ్నమైన తన జీవితంలో చే ఈ విధమైన ప్రతీకగా మారిపోయాడు. ఇది ఆయన లక్ష్యం కాదు. ఇది ఆయన కోరుకున్నదీ కాదు. అయితే ఆయన జీవితం, ఆయన నిస్వార్థతత, ఆయన ఔన్నత్యం, ఆయన సాహసం, ఆయన వీరత్వం అన్నీ కలిసి ఈనాడున్న రూపం చేరుకున్నాడు. ఆయనొక పతాక, ఒక నమూనా, ఒక యోధుడు, ఒక మార్గదర్శి. ఉదాత్తమైన దానంతటికీ ఆయన ఒక స్మృతి చిహ్నం, ఆయనొక న్యాయస్ఫూర్తి, క్లుప్తంగా చెప్పాలంటే ఒక విప్లవకారుడుగా, ఒక యోధుడుగా, ఒక కమ్యూనిస్టుగా ప్రపంచ ప్రజలందరికీ ఆదర్శప్రాయుడు చే.

# 6

**చే** 20 వ వర్ధంతి సందర్భంగా ఇటాలియన్ పాత్రికేయుడు గియాని మినా కాస్ట్రోతో జరిపిన ఇంటర్వ్యూ ఇది

గియాని మినా : ప్రెసిడెంట్ కాస్ట్రో, మీరు సమకాలీన చరిత్రకు ఒక సాక్షి. మీలాటివారు తక్కువగానే వుంటారు. ఈ ఇంటర్వ్యూ అందుకో సాక్ష్యం. పోరాటంలో మీ సహచరులు -ముఖ్యంగా చే, కామిలో సెన్‌ఫ్యూజ్‌ల గురించి మీకున్న అత్యంత సన్నిహిత జ్ఞాపకాలు తెలుసుకోవాలని అనుకుంటున్నాను. ఉదాహరణకు చే ఒక ప్రతీక. ఒక ఆదర్శం. కనీసం ఐరోపాలో , ప్రపంచంలో మూడు తరాల వారికి ఆయన అలా కనిపిస్తారు. మీరు మీ స్నేహితుడైన చే గురించి ఆలోచించినపుడు మీకు కలిగే మొట్టమొదటి ఆలోచన ఏమిటి?

ఫైడెల్ కాస్ట్రో : నాకు కూడా చే మరణించాడనే విషయం ఆమోదించడమే చాలా కష్టమైన విషయం. నేను చాలా సార్లు కలగన్నాను. మా ప్రజలకు కూడా చెప్పాను. ఆయనతో మాట్లాడినట్టు, ఆయన బతికేవున్నట్టు కలలుగన్నాను. అది చాలా ప్రత్యేకమైన విషయం. మీరు ఒక మనిషి మరణంతో రాజీపడలేకపోవడం. చాలా కష్టం. ఇందుకు కారణమేమిటి? నా ఉద్దేశంలో ఆయన అన్ని విషయాల్లో ప్రగాఢమైన ప్రభావం నెరపడమే.

ఆయన చాలా దూరప్రదేశంలో చనిపోయాడు. మా దేశం నుంచి చాలా కిలోమీటర్ల ఆవల. చే చనిపోయాడనే భావనకు అలవాటు పడటం ఎంతోకష్టమైంది. ఇతర కామ్రేడ్ల మరణం నన్ను మరో రకంగా బాధించేది. కామ్రేడ్స్ చనిపోవడం మేము చూశాం. చే ఇప్పటికి బతికేవున్నాడన్న భావన వుందంటే అందుకు కారణం ఆయన ప్రసరించిన ప్రభావమే. ఆయన స్వభావం, ప్రవర్తన, ఆయన అనుసరించిన సూత్రాలు కూడా ఇందుకు కారణం. ఆయనలో అసాధారణ లక్షణాలు పుష్కలంగా వుండేవి. మెక్సికోలో ఆయనను మొదటిసారి కలుసుకున్నప్పటి నుంచి చివరి సారి క్యూబానుంచి వెళ్లిపోయేవరకూ అతను నాకు బాగా తెలుసు.

చే మరణంతో ఒక గొప్ప మేధస్సు కోల్పోయామని నాకు నిజంగా దు:ఖం

కలుగుతూ వుంటుంది. ఆయన ఇప్పటికి సోషలిజం నిర్మాణ సిద్ధాంతానికి, ఆచరణకు చేయగలిగింది ఎంతో వుంది.

గియానీ మినా : చే వెళ్లిపోయేముందురాసిన చివరి లేఖలో మీ నాయకత్వ లక్షణాలు అంతకు ముందే గుర్తించనందుకు చాలా బాధ వ్యక్తం చేశాడు. మిమ్మలను గుర్తించడానికి చాలా కాలం పట్టిందన్నాడు

కాస్ట్రో : అందుకు కారణమేమై వుంటుంది? మొదటి సంగతి- చే చాలా నెమ్మదస్తుడు. ఆయన అంతగా బయటపడే వాడు కాదు. ఈ సంగతులు చెప్పేవాడు కాదు. ఆయన ఏదైనా అనుకునేవాడు కాని చెప్పేవాడు కాదు. ఆ విధంగానే అతను నాగురించి ఎంతో ఆర్ద్రంగా రాసిన కవితలు బయటకొచ్చాయి. కొందరు వాటిని కాపాడారు.

సహజంగానే అతను లాటిన్ అమెరికా గురించి లాటిన్ అమెరికా రాజకీయ వేత్తల గురించి కొంత సందేహంగా వుండేవాడు. ఇతర విప్లవాలలాగే మా విప్లవమూ దెబ్బతినిపోతుందని అతను సందేహించి వుండొచ్చు. అయితే ఆచరణలో అతను అలాటిసందేహాలు వున్నట్టు ఏ కాస్తసూచనగా కూడా తెల్పలేదు. అతను నాతో ఎప్పుడూ అత్యంత గౌరవాస్పదంగానూ సౌహార్దతతోనూ మెలిగేవాడు. అతనికి (జులై 26) ఉద్యమం గురించి కొంత సందేహం వుంటే వుండివుండొచ్చు. మా ఉద్యమం ఏకోన్ముఖంగా లేదని అతను భావించి వుండొచ్చు. ఎందుకంటే అనేక రంగాలకు చెందిన వారు దానిలో వుండేవారు.

అతనికి అప్పటికే అసాధారణమైన విప్లవ విజ్ఞానం వుంది. మార్క్సిస్టు అవగాహన వుంది. చాలా లోతుగా చదివేవాడు. వైద్యకళాశాల నుంచి వచ్చాడు. పరిశోధన చేశాడు. మార్క్సిజానికి సంబంధించిన సమస్యలు కూడా చాలా కష్టపడి చదివేవాడు. కనుక ఈ కారణంగా అతను కొంచెం సందేహాలు కలిగివుండేవాడు. అతను ఆ విషయాలు రాశాడంటే దానికి శ్రుతిమించిన నిజాయితీ కూడా కారణమని అనుకుంటాను. వాస్తవంలో అతను అనేక అంశాలు సమన్వయం చేసుకుని ఐక్యతను పెంపొందించాడు. ఇతర కామ్రేడ్లు వెలిబుచ్చిన అనేక అభ్యంతరాలను కూడా సర్దుబాటు చేశాడు. నేనైతే వారితో వ్యవహరించేప్పుడు ఎంతో సహనం చూపాల్సివచ్చేది.

చే చాలా ఉద్రేకి. ధైర్యవంతుడు, సాహసికుడు. కొన్ని సార్లు నిర్లక్ష్యంగానూ వ్యవహరించేవాడు. నాకెప్పుడూ ప్రత్యేకగౌరవం. ఒకటికి రెండు సందర్భాల్లో అతను వలంటీర్‌గా ముందుకొచ్చాడు. ఏ కర్తవ్యమైనా సరే- మొదట ముందుకొచ్చే వాలంటీర్ చే. అతను చాలా కష్టభూయిష్టమైన చర్యలు తాను చేస్తానంటూ వలంటీర్‌గా ముందుకొచ్చేవాడు. అదీ యుద్ధరంగం మధ్యలో. అతనికేమాత్రం స్వార్థచింతన వుండేది కాదు. సాహసం కూడా ఎక్కువే. క్యూబా అతని స్వదేశం కాదు. అయినా మాతో కలిశాడు. విప్లవానికై ప్రాణాలర్పించడానికి రోజూ సిద్ధమయ్యేవాడు.

అయితే మేము కార్యకర్తల ప్రాధాన్యతను బట్టి వారిని ఉపయోగించుకునే వాళ్లం. కార్యకర్తలు మరింత నైపుణ్యం, మరింత అనుభవం సమకూర్చుకొన్నట్లయితే మేము కొత్తవారిని ఎంపిక చేస్తాము. తద్వారా వారు కూడా నేర్చుకోవటానికి, అభివృద్ధి చెందటానికి అవకాశం



కలుగుతుంది. యుద్ధంలో మీరు ప్రమాదకర పరిస్థితులు ఎదుర్కొనడానికి ఎప్పుడూ ఒక్కడినే ఉపయోగిస్తూ ఉండలేరు. ఎందుకంటే ఏదో ఒక్క క్షణంలో మీరు వారిని కోల్పోవచ్చు. మేము నిజంగా కార్యకర్తలను రక్షించుకోవాలి. నిలబెట్టుకోవాలి. వాళ్ళు పని చేయాలని కోరుకుంటారు. వారిని రక్షించుకొనే ప్రయత్నం సాధ్యమైనంత ఎక్కువగా చేసే బాధ్యత నేను స్వీకరించాను. అత్యంత ప్రధానమైన కార్యక్రమాలకు వారిని వాడుకొన్నాను.

ఇలాంటి పనుల్లో మనుషులను నేను తరచూ మార్చుతూ వచ్చాను. కానీ చే కు సంబంధించినంత వరకు నిజం చెప్పాలంటే అలా ఎప్పుడూ మార్చలేదు. దీనికి అతని స్వభావమే కారణం. చే యుద్ధంలోంచి ప్రాణాలతో తిరిగి రాడు. అయితే అతను అత్యంత సూటిగా వ్యవహరించే వ్యక్తి. ఎప్పుడైనా సరే ఏదైనా విషయం గురించి సందేహం కల్గితే అతను నోరు తెరవకుండా ఉండడు. అదీ అతని పద్ధతి.

గియానీ మైనా : క్యూబా విప్లవం అసాధారణమైంది. చే వంటి ఒక మేధావిని, మీవంటి మేధావిని, క్యామిలో వంటి సాధారణ వ్యక్తిని ఇలా విభిన్నమైన నేపథ్యాలు, విద్యా స్థాయిలు కల్గిన వ్యక్తులను కలిసి మెలిసి పని చేసేటట్లు చేసింది. అక్కడ స్పష్టంగా ఒక ఉమ్మడి లక్ష్యం ఉంది.

కాస్ట్రో : ఆ ముగ్గురు మూడు భిన్నమైన మూలాల నుంచి వచ్చినవారు. విభిన్నమైన స్వభావాలు కలవారు. చేకు సంబంధించినంత వరకు అసాధారణమైన విషయమేమంటే అతను క్యూబన్ కాదు. అర్జెంటీనియన్. మేము మెక్సికోలో కలుసుకున్నప్పుడు అతను గ్వాటిమాలాలో డాక్టర్‌గా పని చేస్తున్నారు. అక్కడ సాగుతున్న రాజకీయ ప్రక్రియ, వ్యవసాయ సంస్కరణలు అతన్ని ఎంతగానో ఉత్సాహపరిచాయి. అమెరికా జోక్యాన్ని అతను చూసాడు. దానంతటిగురించి చాలా కష్టపడ్డాడు. ఆ ప్రభావం ఎప్పుడూ అతనితో ఉండేది. అతను నేరుగా మాతో చేరిపోయాడు. అతనే చెప్పినట్లుగా మాతో మాట్లాడగానే ఏకీభావానికి వచ్చాడు.

అతను ఒక సామ్రాజ్యవాద వ్యతిరేక విప్లవాన్ని ఒక జాతీయ విమోచనాన్ని ఊహించాడు. అప్పటికి అతను ఇంకా సోషలిస్టు విప్లవాన్ని గురించి ఆలోచించలేదు. అది కొంచెం దూరంగా ఉందనుకున్నాడు. అయినా దానికి పూర్తిగా అంకితమయ్యాడు. అంతేకాదు చే మా డాక్టర్. అతను గొప్ప సైనికుడని ఎవరూ అనుకోలేదు. అతనికి ఆటలంటే ఇష్టం ఉండేది. ఎప్పుడూ పర్వతారోహణ చేసేవాడు. ఎప్పుడూ శిఖరం చేరుకోకపోయినా ప్రతివారం ప్రయత్నిస్తునే ఉండేవాడు. అతన్ని ఆస్తమా పట్టి పీడిస్తుండేది. అయినా ఆ పర్వతాన్ని ఎక్కాలని చూసేవాడు. అది కూడా అతని గొప్ప స్వభావాన్ని తెలియజేస్తుంది. అతను మా డాక్టర్. ఆ లోపం ఉన్నందుకే అతను డాక్టర్‌గా వెళ్ళాడు. ఎవరూ అతడ్ని సైనికుడిగా ఊహించలేదు. అయితే అతను కేవలం మేధావి కాదు. ఒక గొప్ప సైనికుడుగా కూడా అయ్యాడు.

క్యామిలో ప్రజల మనిషి మొదట్లో ఎవరూ ఈ లక్షణాలను ఊహించలేదు. తరువాత అతను నిజంగా ప్రతిభ ప్రదర్శించాడు. చాలా మంది కూడా అలా చేసి ఉంటారని నేను అనుకుంటాను. ఎందుకంటే మా బృందంలోని 82 మందిలో 40 మంది నాయకత్వ

లక్షణాలు కలిగి ఉండేవారు. నేను ఈ విషయం తరువాత ఆలోచించుకొన్నాను. ప్రాణాలతో బయటపడినవారిలో అనేక మంది ప్రతిభావంతులైన నాయకులు రూపొందారు. క్యామిలో, చే తదితరులు. అంతగా పేర్కొనబడని మరో ప్రముఖనాయకుడున్నాడు. అతనే రావుల్.

గియానిమైనా : క్యామిలో, చే లమధ్య తేడాలేమిటి?

కాస్ట్రో : వారు విభిన్న వ్యక్తులు. ఒకరినొకరు చాలా ప్రేమించుకున్నా, గౌరవించుకున్నా, ఆ తేడా ఉండేది. క్యామిలో చాలా తమాషాలు చేసేవాడు. అతనిలో ఎప్పుడూ హాస్యదృష్టి ఉండేది.

గియానిమైనా : క్యూబన్?

కాస్ట్రో : అతనిలో క్యూబన్ హాస్యదృష్టి ఉండేది. ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారు. ధైర్యశాలి. ప్రతిభావంతుడు, చే అంత మేధావి కాదుకానీ, అద్భుతమైన నాయకుడు. శత్రువుకు ఎప్పుడూ అవకాశమిచ్చేవాడు కాదు. చాలా ధైర్యవంతుడేకాని చే వలే నిర్లక్ష్యంగా ఉండేవాడు కాదు. చే ఎప్పుడూ మృత్యువును కోరుకునేవాడిలా ప్రవర్తించేవాడు. క్యామిలో చావును ధిక్కరించేవాడు. దాన్ని గురించి భయపడేవాడు కాదుగానీ నిర్లక్ష్యంగా వుండేవాడు కాదు. వారిద్దరి మధ్య ఇవి తేడాలు. ఒకరిపట్ల ఒకరికి చాలా అభిమానం ఉండేది.

గియానిమైనా : మరి మీ తమ్ముడు రావుల్?

కాస్ట్రో : ఈ సందర్భంగా ప్రస్తావించబడని మరో నాయకుడుగా నేను ఇదివరకే చెప్పాను. రావుల్ సమర్థుడు. బాధ్యాతాయుత వ్యక్తి. ప్రతిభావంతుడు. చాలా కీలకమైన పాత్ర పోషించాడు. మిగిలి ఉన్న బృందంలో చాలా మంది మంచి నాయకులు రూపొందారు. అందుకే నేను తొలి పోరాటంలో బతికి ఉన్నట్లయితే చాలా మంది యువజనులు నాయకులై ఉండేవారని అనుకొంటుంటాను. మా బృందం నుంచి 15 నుంచి 20 మంది వరకు మంచి నాయకులు రూపొంది ఉండేవారు. ఎందుకంటే ఎవరైనా నాయకులు కావాలంటే అవకాశాలు, బాధ్యతలు కూడా లభించాలి.

గియానిమైనా : చే బొలీవియాలో పోరాడ్డం కోసం క్యూబా వదిలి వెళ్ళి 20 ఏళ్ళు దాటి పోయింది. హవానా నుంచి బయలుదేరాక బొలీవియా చేరుకొనేలోగా అతను ఎక్కడ ఉన్నాడని మీరు అనుకుంటున్నారు?

కాస్ట్రో : చే కు దక్షిణ అమెరికా వెళ్ళాలని చాలా బలంగా ఉండేది. అది అతని పాత వాంఛ. ఎందుకంటే మెక్సికోలో మాతో చేరినప్పుడే అతను షరతు పెట్టకపోయినా ఈ విషయం అడిగాడు. 'విప్లవం విజయవంతం అయిన తరువాత నాకు ఉన్న ఒకే కోరిక అర్జెంటీనాకు వెళ్ళడం. అలా చేయకుండా మీరు అడ్డుకోకూడదు. రాజ్యానికి సంబంధించిన కారణాలేమైనా నాకు ప్రతిబంధకం కాకూడదు. అంటూ తన స్వదేశం



వెళ్ళాలనే కోరిక వెలిబుచ్చాడు. నేను అతనికి ఆ విధమైన వాగ్దానం చేశాను. అప్పటికి అది చాలా దూరంలో ఉన్న విషయం. విప్లవం విజయం సాధిస్తుందో లేదో ఎవరికీ తెలియదు. చివరి వరకూ బతికుండేవాళ్ళు ఎవరో తెలియదు. కానీ అతను మాత్రం అతని ఉద్రేక స్వభావాన్ని బట్టి చూస్తే బతికి బట్టకట్టే అవకాశం చాలా తక్కువే. అయినా అలా అడిగాడు. సియరామస్ట్రాలోనూ తరువాత కూడా అప్పుడప్పుడూ అతను ఈ విషయంలో తన ఆలోచనలు, మా హామీలు గుర్తు చేస్తుండేవాడు. దీనికి సంబంధించి చాలా దూరదృష్టి కల్గి ఉండేవాడు.

సియరామస్ట్రాలో అనుభవం సంపాదించిన తరువాత అతను తన స్వదేశంలో, దక్షిణ అమెరికాలో విప్లవం సాధించడం గురించి మరింత ఉత్సాహం పొందాడు. మా మహత్తర అనుభవాలు చే కు ప్రత్యక్షంగా తెలుసు. మా సైన్యాన్ని ఎలాంటి కష్టతరమైన పరిస్థితుల్లో పునర్నిర్మించుకున్నామో, పోరాటం ఎలా సాగించామో తెలుసు. కనుకనే దక్షిణ అమెరికాలో విప్లవోద్యమానికి గల అవకాశాల గురించి అతను గొప్ప నమ్మకం పెంచుకున్నాడు. అతనికి వాగ్దానం చేశాము. 'భయపడవద్దు. మా మాట నిలబెట్టుకుంటాము' అని చెప్తుండేవాడ్ని. రెండు మూడు సార్లు ఈ విషయం లేవనెత్తినట్లు గుర్తు.

విప్లవం విజయం తరువాత అనేక బాధ్యతలు వచ్చిపడ్డాయి. అన్ని రకాల సమస్యలు పరిష్కరించాల్సి వచ్చింది. రాజకీయ సమస్యలు, మా దళాల ఏకీకరణ సమస్యలు, రాజ్యసంబంధమైన సమస్యలు, ఆర్థిక సమస్యలు వగైరాలన్నీ. ఇప్పుడు గొప్ప సైనికుడైన చే ఎలా ఉండబోయేది ఎవరికీ తెలియదు. నేను ఇందాకే చెప్పినట్లు అతను మా డాక్టర్. తొలి పోరాటంలోనే ప్రకాశించి గొప్ప సైనిక నాయకుడుగా రుజువు చేసుకున్న వ్యక్తి అతను. క్యామిలో కూడా యుద్ధంలో మహా కీలక కర్తవ్యాలు నెరవేర్చాడు. దేశపు కేంద్ర భాగాన్ని క్లిష్ట పరిస్థితిలో స్వాధీన పర్చుకున్నారు. దాని గురించి చాలా చెప్పవచ్చును కానీ ఇది సమయం కాదు.

మేము విప్లవ విజయం తరువాత అన్ని రకాల కర్తవ్యాలు ఎదుర్కొన్నాము. ఇది వరకటి రాజ్యానికి సంబంధించి ఏదీ మిగలలేదు. ఆ సైనిక దళాలు, ఆ పాలనా యంత్రాంగం ఏవీ. అనేక విప్లవకర సంస్థలు జనాభాలో అత్యధికుల మద్దతు కల్గి ఉన్నాయి. మాకు ప్రధాన స్థానం ఉన్న మాట నిజమే. దాన్ని ఉపయోగించి మేము ఐక్యత తీసుకొచ్చాము. ఒట్టెత్తువాదంతో ఎప్పుడూ పోరాడుతూ వచ్చాము. విప్లవకర శక్తుల మధ్య ఐక్యతను చూసాము. దీనంతటిలో క్యామిలో భాగం పంచుకున్నాడు. కానీ అతను అకాలమరణం పాలయ్యాడు. కామగ్వే ఘటనలకు సంబంధించి హ్యూబర్ మాటోస్ సమస్యకు సంబంధించి అతను చనిపోయాడు.

తరువాత చే పరిశ్రమల మంత్రిత్వ శాఖ నాయకత్వం చేపట్టాడు. ఒక పద్ధతి ప్రకారం పని చేశాడు. అతను అనేక బాధ్యతలు నిర్వహించాడు. ఒక ముఖ్యమైన కామ్రేడ్ అవసరమొచ్చిన ప్రతిసారీ చే దాన్ని నెత్తినేసుకొనేవాడు. అతన్ని నేషనల్ బ్యాంకు అధ్యక్షుడుగా నియమించాము. అప్పుడు బ్యాంకుల్లోని సాంకేతిక నిపుణులు రాజకీయంగా నికరంగా

ఉండేవారు కాదు. దేశాన్ని వదిలి వెళ్తున్నారు. చాలా జోకులు, కథలు విన్పించేవి. చే స్వచ్ఛందంగా ముందుకు వచ్చాడు. నీవు ఆర్థికవేత్తవా? అని మేము అడిగాము. లేదు అని చెప్పాడు. 'కానీ నేను కమ్యూనిస్టును' దేశంలో పోరాడ్డం ఇప్పుడే ప్రారంభమవుతున్నది. మితవాద శక్తులు చే కమ్యూనిస్టు అని ఇంకా ఏవేవో ఆరోపణలు చేస్తున్నారు.

అయితే చే కు చాలా పట్టు ఉండేది. అతనికి ఏ బాధ్యత ఇచ్చినా చాలా ఖచ్చితంగా ప్రతిభావంతంగా నిర్వహించేవాడు. చాలా కష్టపడి పని చేసేవాడు. జాతీయ పరిశ్రమల రంగంలో సోషలిజాన్ని నిర్మించే తొలి అనుభవాలు సంపాదించాడు. ఉత్పత్తిని నిర్వహించడంలో పర్యవేక్షించడంలో స్వచ్ఛంద శ్రమలో కష్టపడి పని చేశాడు. స్వచ్ఛంద శ్రమలో అతనొక అగ్రగామి. ప్రతి కార్యక్రమంలో పాలుపంచుకునేవాడు. తను ఏది చేసినా నికరంగా చేసేవాడు. ఆదర్శం చూపేవాడు.

విప్లవం అతని తొలి సంవత్సరాలు ఆ విధంగా గడిపాడు. తరువాత బహుశా అతను తన అదివరకటి పథకాలు, భావాలు అమలు జరపాలని అసహనానికి గురి అయినట్టు కనిపిస్తుంది. కాలం గడిచిపోతుందనే భావం కూడా అతనికి కలిగిందనుకుంటాను. ఈ పనికి ప్రత్యేకమైన భౌతిక పరిస్థితులు అవసరమని భావించాడు. అలా చేయగల్గిన శక్తి తన దగ్గర ఉన్నదని తన శారీరక, మానసిక శక్తులు అత్యున్నత స్థాయిలో ఉన్నాయని అనుకున్నాడు. క్యూబాలో గడించిన అనుభవం నుంచి అతనికి చాలా భావాలు కలిగాయి. వాటిని తన దేశంలో ఎలా ఉపయోగించాలని ఆలోచించాడు. ప్రాథమికంగా తన దేశాన్ని గురించి ఆలోచించినా దానికే పరిమితం కాలేదు. మొత్తం అమెరికన్ల అందరి గురించి దక్షిణ అమెరికా గురించి ఆలోచించాడు.

అతనిలో అసహనం పెరిగింది. మా అనుభవాన్ని బట్టి చెప్పాలంటే అతను కోరుకుంటున్న క్రమంలో ఉన్న చిక్కులేమిటో నాకు తెలుసు. అతను అనుకున్నది చేయడానికి మరింత మెరుగైన పరిస్థితులు సృష్టించాల్సి ఉంటుంది. అసహనం పెంచుకోవద్దని అతనికి నచ్చచెప్పడానికి ప్రయత్నించాము. మరింత సమయం అవసరమని చెప్పాము. కాని అతను మొట్టమొదటి రోజునే బయటికి వెళ్ళిపోవాలని అన్ని చేసేయాలని అనుకున్నాడు. తొలి చర్యలు చేపట్టడానికి ఇతరులు,, అంతగా పేరు లేని కార్యకర్తలు ఉండాలని మేము అనుకున్నాము.

చే కు అంతర్జాతీయ సమస్యలపైనా, ఆఫ్రికా ఎదుర్కొనే సమస్యలపైనా కూడా చాలా ఆసక్తి ఉండేది. ఆ సమయంలో పూర్వపు బెల్జియన్, కాంగో (ఇప్పుడు జెయరే)లోనూ కిరాయి సైనికులు తలదూర్చారు. లుముంబాను హత్య చేసి ఒక నయావలస దేశాన్ని స్థాపించారు. జెయరేలో సాయుధ పోరాట ఉద్యమం ప్రారంభమయ్యింది. ఇది మేము ఎప్పుడూ బయటపెట్టలేదు. అయితే విప్లవోద్యమం మా సహాయం కోరింది. మేము అంతర్జాతీయ కర్తవ్యంగా పోరాట యోధులను పంపిచాము.

గియాని మైనా : లుముంబా ఉద్యమం?

క్యాస్ట్రో : ఆ సమయంలో సమ్యాలోట్ దాని నాయకుడిగా ఉన్నాడు. ఉద్యమం అదే కాని లుముంబా చనిపోయాడు.



నేను చే కు ఒక సూచన చేశాను. నిరీక్షించాలని చెప్పాను. అదే సమయంలో అతను కార్యకర్తలకు శిక్షణనిచ్చి వారి అనుభవం పెంచాలని కోరుకున్నాడు. దాంతో అతన్ని నేటి జెయరిలో విప్లవకారులకు సహాయపడే బృందానికి బాధ్యుడుగా నియమించాము. వారు టాంజనికా సరస్సు దాటి టాంజానియాకు వెళ్లారు. మొత్తంపైన వంద మంది క్యూబన్లు వెళ్ళి చాలా నెలలు ఉన్నారు.

అతను జెయరే దేశస్థుల బోధనా పద్ధతులు అనుసరించాడు. క్యూబన్లు, జెయరే దేశభక్తులు కిరాయి సైనికులపైన ప్రభుత్వం పంపిన సైనికులపైన పోరాడారు. జెయరే దేశస్థుల బదులు పోరాడ్డం కాదు ఇక్కడి ఉద్దేశం. వారికి సహాయపడడం, ఎలా పోరాడాలో నేర్పించడం అసలు లక్ష్యం.

అయితే ఆ ఉద్యమం అప్పుడే మొదలవుతున్నది. దానికి తగినంత శక్తిగానీ, ఐక్యతగాని లేదు. చివరకు ఆ మాజీ బెల్జియన్ వలస దేశపు విప్లవ నాయకులందరూ పోరాటం ఆపేయాలని నిర్ణయించాడు. మా వాళ్ళందరూ ఉపసంహరించుకున్నారు. ఆ నిర్ణయం చాలా సరైంది. పోరాటం పెంపొందించే పరిస్థితులు లేవని స్పష్టమైంది. క్యూబన్లతో కూడా కలిసి జెయరే దేశస్థులు పరిస్థితిని విశ్లేషించారు. వారి అంచనాతో మేము ఏకీభవించాము. చివరకు ఆ విభాగాన్ని ఉపసంహరించుకొని వెనక్కు తిరిగి వచ్చారు.

జెయరేలో ఆరు నెలల ఉన్న చే కొంత కాలం పాటు టాంజానియాలో ఉండిపోయాడు. అప్పుడప్పుడే కల్గిన అనుభవాలు అంచనా వేసుకున్నాడు. ఆ సందర్భంగా అతని ప్రవర్తన ఎప్పటిలాగే ఆదర్శప్రాయమైంది. ఆఫ్రికాలో అతని మకాం తాత్కాలికమైంది. దక్షిణ అమెరికా వెళ్ళేందుకు అవసరమైన పరిస్థితులు సృష్టించుకోవడానికి ఉద్దేశించింది.

ఈ మొత్తం కాలంలో పరిస్థితి మాకు చాలా ఇబ్బందిగా తయారైంది. చే అప్పటికే వీడ్కోలు చెప్పేసాడు. వెళ్ళే ముందు ఉత్తరం రాసి నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు. రహస్యంగా అని కూడా మీరు చెప్పొచ్చు. మేము ఆ లేఖను బయటికి రాకుండా ఉంచాము. ఇది అనేక పుకార్లకు కొన్ని నిజమైన దుష్ప్రచారాలకు కూడా అవకాశమిచ్చింది. చే ను మాయం చేసినట్లు కొందరు చెప్పారు. అతను చనిపోయాడని, విభేదాలు ఉన్నాయని ఏవేవో కథలు వచ్చాయి. మేము ఆ వదంతుల వర్షాన్ని, కుట్రలను మౌనంగా భరించాము. అతను చేపట్టిన కర్తవ్యం ప్రమాదం పడకూడదని దక్షిణ అమెరికాకు అతనితో తీసుకు వెళ్ళదల్చిన వారికి ఇబ్బంది కలగకూడదనే అన్నీ సహించాము.

అందువల్ల జెయరేలో పని ముగించుకొని అతను టాంజానియా వెళ్ళాడు. అక్కడ కొన్ని నెలలు గడిపి తూర్పు యూరప్‌లోని ఒక సోషలిస్టు దేశానికి చేరుకున్నాడు. నిజానికి... సరే నేను అంతకన్నా చెప్పదల్చుకోలేదు. ఎందుకంటే అలా చెప్పాలంటే ఆ దేశం వారితో నేను మాట్లాడి ధృవీకరించుకోవల్సి ఉంటుంది. అతను అక్కడ ఉన్నాడు. క్యూబాకు తిరిగి రావాలని అనుకోలేదు. ఆ లేఖ ప్రచురితమైన తర్వాత తిరిగి రావడం చాలా ఇబ్బందిగా ఉంటుంది.

చివరకు ఆ ఉత్తరాన్ని ప్రచురించడం అనివార్యమైపోయింది. ఏ జవాబు చెప్పకుండా ప్రపంచ ప్రజలకు ఎలాంటి వివరణ ఇవ్వకుండా దుష్ప్రచారం అలా

కొనసాగించడం చాలా హాని కరంగా తయారయ్యింది. ఇంక మిగిలిన ఒకే ఒక్క ప్రత్యామ్నాయం ఆ లేఖ ప్రచురించడమే. నిజానికి ఆ లేఖలో అతను చేయదల్చుకున్న దాని గురించి నిర్దిష్టంగా ఏమీ లేదు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో పోరాడాలని మాత్రమే పేర్కొన్నాడు.

ఈ ఉత్తరం గురించి ఒకసారి బయటపెట్టాక రాజకీయంగా దాన్ని ప్రచురించక తప్పలేదు. తనదైన స్వభావంగల చే వీడ్కోలు చెప్పిన తరువాత తిరిగి క్యూబాకు రావడం చాలా వికృతంగా ఉంటుందనీ భావించాడు. చివరకు నేను అతన్ని తిరిగి రావడానికి ఒప్పించాను. ఎందుకంటే అతనికి ఇష్టమైన విషయాలను దృష్టిలో పెట్టుకుంటే అదే చాలా ఉత్తమమైన పని. కనుక అతను రహస్యంగా క్యూబా తిరిగి వచ్చాడు. చాలా నెలలపాటు మారుమూల పర్వత ప్రాంతాల్లో శిక్షణనిస్తూ గడిపాడు. తనతో వచ్చే వారికి నెలల తరబడి శిక్షణ ఇచ్చాడు.

ఆయన తనతో సహకరించడానికి కొంతమంది కామ్రేడ్స్ కావాలని అడిగాడు. కొందరు కాకలు తీరిన గెరిల్లా యోధులు. కొంధరు కొత్తవారు. అదివరలో జైరేలో అతనితో వున్నవారు. ఆతను వారి సహాయం కోరాడు. వారిలో ప్రతివారితో మాట్లాడాడు. ఆయనతో వెళ్లేందుకు బాగా అనుభవజ్ఞులైన కామ్రేడ్లతో ఒక బృందాన్ని మేము సిద్ధం చేశాము. ఎందుకంటే ఆయన చేయతలపెట్టిన కార్యక్రమానికి బాగా అనుభవజ్ఞులైన వలంటీర్లు అవసరం. ఆయన వారికి అనేక మాసాల పాటు శిక్షణనిచ్చాడు. అతన్ని, వారందరినీ బొలీవియోకు చేరవేడయానికి రంగం సిద్ధం కాసాగింది.

చే తాను పనిచేయదలుచుకున్న భూభాగాన్ని ఎంచుకున్నాడు. పోరాట పథకాన్ని సిద్ధం చేసుకున్నాడు.సహజంగా మేము దానిలో వున్న చిక్కులను గురించి ఆందోళన చెందాము. అప్పటికే ఉద్యమం మరింత అభివృద్ధి చెందితే బావుండేదని మేము భావించాము. చే దానిలో చేరడం అప్పుడు సులభమై వుండేది. అయితే ఆయన అక్కడ ప్రారంభం నుంచే వుండాలని కోరుకున్నాడు. కొంత ప్రాథమిక కృషి జరిగేవరకు అతన్ని అక్కడే అట్టిపెట్టగలిగాము. దానివల్ల అతనికి మరికొంత భద్రత వుంటుందని తలచాము. మొదటి దశలు మరింత కష్టంగా వుండేవి.

నిజానికి ఇదంతా చాలా పకడ్బందీగా అమలు జరిగింది. చిన్నచిన్న అంశాలు కూడా వదలిపెట్టలేదు. చే ఇతర కామ్రేడ్లు ఎంపిక చేసిన ఒక ప్రాంతానికి చేరవేయబడ్డారు. వారు అనేక కఠోర పరిస్థితులను ఎదుర్కోవలసి వచ్చింది. చాలా దుర్గమమైన ప్రదేశాలను దాటవలసి వచ్చింది. అదేమంత సులభమైన పని కాదు. నాచాజూ ప్రాంతంలో ఒక కామ్రేడ్ల బృందం వచ్చి వారితో కలిసింది. బొలీవియాలో వాళ్లు ఎన్నుకున్న ప్రాంతం పేరు అదేననుకుంటాను..

అది ఇంచుమించు ఒక పర్యటన లాటిది. ఆఫ్రికాలో వుండటం. టాంజానియా మీదుగా తూర్పు జైరే వెళ్ళి టాంజానియా తిరిగిరావడం. ఐరోపాలో ఒక సోషలిస్టు దేశానికి వెళ్లడం. మళ్లీ క్యూబాకు రావడం. అంతిమంగా తను ఎంచుకున్న బొలీవియా యాత్ర.

గియాని మైనా : ఆయన బొలీవియాను ఎంచుకోవడం పొరబాటా? అక్కడ జనం ఇంకా విప్లవానికి సిద్ధంగా లేరు కదా. ఎత్తుగడల రీత్యాగాని, వ్యూహాత్మకంగా గాని సమర్థనీయం గాని భౌగోళిక ఎంపికగా దాన్ని పేర్కొనవచ్చునా?



కాస్ట్రో : నేను అలా చెప్పలేను. అతనికి అర్జెంటీనాపై ఆసక్తి వుంది.అక్కడ విప్లవం తీసుకురావలనే భావన అతన్ని నిజంగానే ఉత్తేజపరచింది. కాని ఆ సమయంలో మాకు దక్షిణ అమెరికాలో మరే దేశంతో సంబంధాలు లేవు. ఆ ప్రభుత్వాలన్ని క్యూబాకు వ్యతిరేకంగా అమెరికాతో చేతులు కలిపాయి. తొలిరోజులలో చే జార్జ్ రికార్డో మాసెటీతో సహా ఒక అర్జెంటీనియన్ల బృందాన్ని రిక్రూట్ చేసుకున్నాడు. వారు మాతో కలసి సియర్రా మస్త్రాలో పనిచేశారు. వారిలో జార్జి రికార్డో జర్నలిస్టుగా వున్నాడు. అతను తర్వాత లాటిన్ ప్రెస్ అనే వార్తాసంస్థను స్థాపించాడు. చే అతన్ని అర్జెంటీనాలో తన పోరాటాల గురించిన భావాలవైపు ఆకర్షించాడు. మాసేటి చే భావాలతో ఏకీభవించి ఉత్తర ఆర్జెంటీనాలోని సాల్టా ప్రాంతంలో ఒక రంగాన్ని తెరవడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నంలో మాసెటీ చనిపోయాడు.

చే ఎ ప్పుడూ సున్నితమైన మనిషిగా వుండేవాడు. తన కామ్రేడ్ల పట్ల ఎంతో అంకితభావం ప్రదర్శించేవాడు. తను ప్రారంభించిన కృషిలో పోరాటంలో అప్పటికే కొందరు కామ్రేడ్లు తమప్రాణాలర్పించడం అతనిలో తన పథకాల అమలు జాగుపట్ల అసహనం పెంచిన అంశాల్లో ఒకటి అని నిస్సందేహంగా చెప్పొచ్చు. అతను అప్పటికే సంబంధిత ప్రాంతాన్ని గురించి అధ్యయనం చేశాడు. అలా ఎంపిక చేసిన ప్రాంతం అర్జెంటీనా సరిహద్దుకు దగ్గరగా వుండటం కూడా అతని ఎంపికకు ఒక కారణమై వుండొచ్చు.

బొలీవియా రైతులు చాలా నెమ్మదస్తులు గుంభనగా వుండేవారు విశ్వాసం లేని వారని చేకు తెలుసు. వారు క్యూబా రైతుల కన్నా భిన్నమైన వారని కూడా అతనెరుగును. వైద్యవిద్యలో పట్టభద్రుడైన తర్వాత అతను దక్షిణ అమెరికా అంతా ఒకమోటారుసైకిల్పై పర్యటించాడు. అమెజాన్ వరకూ అనేక ప్రదేశాలు చూశాడు.అక్కడి ప్రజలతో విస్తారమైన సంబంధాలు ఏర్పాటు చేసుకున్నాడు. ఇండియన్ల విషాద పరిస్థితులు, వారి స్వభావాలు అతనికి తెలుసు. బాగాలోతుగా తెలుసు.అతను ఆ విషయంలో చాలా స్పందించాడు కూడా. వారు ఎలా వుంటారో అతను అనేక సార్లు నాకు చెప్పాడు. వారితో ఎలా పనిచేయాలో దానికి ఎంత సమయం పట్టిందో కూడా చెప్పాడు. అదేమంత తేలికైన విషయం కాదు. తన కర్తవ్యం ఎంత కష్టమైందో అతనికి తెలుసు.

మరి జరిగిందేమిటి? అతను మా అనుభవాన్నిచూశాడు. దాదాపు నమ్మశక్యం కాని మా అనుభవాలు చూశాడు. తొలుత ఎదురుదెబ్బలు తగిలినా ఒకచిన్న బృందం పునస్సమీకృతమై చాలా కష్టమైన పరిస్తితుల మధ్యనే పోరాటం సాగించడం అతను చూశాడు. ఇలాటి పోరాటం పట్ల అతనిలో గుడ్డి విశ్వాసముండేది. దాని అవకాశాలను అతను నమ్మాడు. దాని గురించి మరింత అనుభవం వచ్చిన కొద్దీ అది పెరిగింది.

కనక చే తను పని చేసే స్థలాన్ని ప్రదేశాన్ని ఎంచుకున్నాడు. అతను ప్రధానంగా

తన ఎంపికలో ఎలాటి పెద్ద పొరబాటు చేయలేదని నేను చెప్పగలను. ఏ పొరబాటూ చేయలేదు. అతను సంఘటితంగా వున్న రాజకీయ శక్తుల మద్దతు పొందేందుకు ప్రయత్నించాడు. బొలీవియన్ కమ్యూనిస్టు పార్టీ ఇతర శక్తులు తనతో కలసి వస్తాయని అతను అనుకున్నాడు. ఆ సమయంలో ఇతర శక్తులు కలసి వచ్చాయి. కాని వామపక్షంలో కమ్యూనిస్టులలో అంతర్గత విభేదాలుండేవి.

గియాని మైనా : ఈ విషయంలో చే తండ్రి చేసిన ప్రకటన వుంది. చే మరణానికి బొలీవియా కమ్యూనిస్టు పార్టీ కారణమని ఆయన బహిరంగంగా ప్రకటించాడు.వారు అతనికి ద్రోహం చేసి వుండకపోతే వారు అతన్ని చావుకు వదిలేసి వుండేవారు కాదని ఆయన అన్నాడు. రెగిస్ డెబ్రే చెప్పినట్టు యువ బొలీవియన్ కమ్యూనిస్టులు గనక కొచాబామా నుంచి యాత్ర ప్రారంభించి వుంటే చే బతికి వుండేవాడన్న మాట నిజమేనా?

కాస్ట్రో : ఇలాటి అభిప్రాయాలు కొన్నింటితో నేను పాలు పంచుకుంటాను. ఈ సమస్యలపై నా దగ్గర చాలా సమాచారం వుందనే నా నమ్మకం

కమ్యూనిస్టుపార్టీలో చాలామంది నాయకులుంటారు. ప్రధాన కార్యదర్శి మేరియో మంజో ఇప్పటికే దీనిపై మాట్లాడాడు. ఒక విధమైన అవగాహన కుదిరింది. అయితే ఇతర నాయకులు కూడా అలాగే కలిసి వచ్చారు. అది అంతే. నిజానికి అదే మంజోతో ఘర్షణకు కారణమైంది. అది చరిత్రలో భాగమైన సంగతి బాగా తెలిసిందే. చే మంజోల మధ్యన ఘర్షణ తలెత్తింది. మంజో వైఖరులు కొన్నింటిపై ముఖ్యంగా నాయకత్వానికి సంబంధించి అతని నటనలపై ఇవి తలెత్తివుండొచ్చు. ఎందుకంటే చే నటనలు అంగీకరించడు.

మంజో వైఖరిపై ఇదివరకటి అంశాలు ప్రభావం చూపాయని నేననుకుంటాను. చర్య ప్రారంభం కానున్న దేశం తనదని అతను అనుకొనివుంటాడు. అతను పార్టీ ప్రధాన కార్యదర్శి. అయితే వాస్తవానికి బొలీవియా సరిహద్దులను దాటి సాగే కార్యాచరణనునడిపించడానికి చే కన్నా తయారుగా వున్న వ్యక్తి గాని కార్యకర్తగాని నాయకుడు గాని మరెవరూ లేరు. దీనివల్లనే అపార్థాలు తలెత్తివుంటాయి. వారు ఒక ఒప్పందానికి రాలేకపోయారు. మంజో తనమద్దతు ఉపసంహరించుకున్నాడు.

మాకు ఈ సమాచారం అందింది. వెనువెంటనే మేము ఇతర ముఖ్యమైన నాయకులతో ప్రతిష్టగలవారితో సమావేశం ఏర్పాటు చేశాము. కోల్లే సైమన్ రేయస్ తదితరులతో. ఆయన చాలా ప్రసిద్ధుడైన కార్మికనాయకుడు. ఆయనను నేను క్యూబాకు రావలసిందిగా కోరాను. ఆయనతో ఇలా చెప్పాను' సంక్షోభం ఏర్పడింది.ఇది చాలా క్లిష్టమైన పరిస్థితి. మీరు చేకు ఏదో విధమైన సహాయం చేయడం చాలా అవసరమని చెప్పడానికే మిమ్మలను పిలిపించాను' అని చెప్పాను.

వారు సహాయం చేస్తామని వాగ్దానం చేశారు. సాయపడటానికి, సహకరించడానికి వారుసిద్ధంగా" వున్నారు కూడా. పార్టీ ప్రధాన కార్యదర్శితో ఏకీభవించకపోయినా వారు చేయగలిగినంతా చేశారు. కాని ఘటనలు వేగంగా జరిగిపోయాయి. వారు సహాయం అందించే అవకాశం లేకుండా పోయింది. కాని వారిలో అద్భుతమైన అవగాహన వుండింది.



నేను జరిపిన సమావేశంలో వచ్చిన ప్రతి అంశాన్ని వారు అర్థం చేసుకున్నారు. కొల్లే తర్వాత కాలంలో మంజో స్థానంలో పార్టీ నాయకుడైనాడు. సోనే రేసే కూడా ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించాడు. వారు కమ్యూనిస్టుపార్టీలో భాగంగా నిబద్ధతతో పనిచేశారు.

మాకు ఈ పరిస్థితి గురించి సమాచారం రాగానే మేము ఆ విధంగా పరిష్కారాల గురించి ఆలోచించాము. ఇతర ఉద్యమాల నుంచి కొందరు లాటిన్ అమెరికన్ల నుంచి మద్దతు పొందగలిగాము. అలాటి తరుణంలో పరిస్థితులు క్లిష్టంగా మారిపోసాగాయి. నిజానికి వారెక్కడ వున్నారో కూడా తెలిసిపోయింది. కారణమేదైనా సరే, అనేక అంశాల వల్ల ఆ దళం ఇంకా ప్రారంభదశలో వుండగానే ఆచూకి తెలిసిపోయింది. వారికి మరి కొంత సమయం అవసరమై వుండిందని నా నమ్మకం.

మంజోపై కొంత బాధ్యత వుంది. కాని మొత్తంగా కమ్యూనిస్టుపార్టీని నిందించడం చారిత్రికంగా తప్పవుతుంది. అనేకమంది కమ్యూనిస్టులు చే తో కలిశారు. వారిలో పెరోడో సోదరులు వున్నారు. చాలా అద్భుతమైన వ్యక్తులు. చాలా మంచి కార్యకర్తలుగా నిరూపించుకున్నారు. వారు చే తో కలసి ఎన్నో విధాల సహాయపడ్డారు. పార్టీలో ముఖ్యులైన నాయకులు మంజోతో విభేదించి చే కు సహాయపడాలనుకున్నారు. కనక జరిగిన దానికి బాధ్యత ఎవరిదో చెప్పాల్సివస్తే మంజోపై వుంటుంది. అంతేగాని ఆ ఘటనలు అలా జరగడానికి మొత్తం కమ్యూనిస్టు పార్టీ బాధ్యత వహించాలని మీరు చెప్పలేరు.

గియాని : యూరప్‌లో మరో విధంగా చెప్తుంటారు...

కాస్ట్రో : డెబ్రేకు సంబంధించిన వరకు నేను దానికి స్పందించడం కూడా చేయలేదు. ఎందుకంటే అది కాల్పనికతకు సంబంధించింది. నిజంగా అది కల్పన మాత్రమే. ఎందుకంటే చే కు సహాయం చేయడానికి తాను ఒక దళాన్ని ఏర్పాటు చేయడానికి అవసరమైన కనీస పరిస్థితులు కూడా లేవు. ఆయుధాలు లేవు. శిక్షణ పొందిన యోధులు లేరు. శిక్షణ పొందేవారు కూడా లేరు. ఆయన చెప్పేది కేవలం సిద్ధాంత రీత్యా మాత్రమే సాధ్యం. కేవలం సిద్ధాంతం మాత్రమే. అందుకే అది ఒక ఊహా కల్పన. ఇది సాధారణ పద్ధతుల్లో సాగే యుద్ధం కాదని మీరు అర్థం చేసుకోవాలి. ఇది గెరిల్లా యుద్ధం. క్రమ పద్ధతిలో ఉండదు. ఇలాంటి యుద్ధానికి ప్రత్యేకమైన నియమాలు ఉంటాయి. అది అలా ఉండదు. మీరు సమస్యలను అంత తేలిగ్గా పరిష్కరించలేరు.

గియాని : ప్రచురణ కర్త ఫెట్రినెల్లి కూడా ఉద్దేశ్య పూర్వకంగా కాకపోయినా ఇందుకు కారకుడయ్యాడని యూరప్‌లో చెబుతుంటారు. వెల్లెగ్రాండే సమీపంలోని అడవుల్లో చే తాలూకు చిన్న బృందం జాడలు సిఐఎ పట్టుకోవడానికి దోహదపడినట్లు చెప్పే ఈ మాటల్లో ఏమైనా నిజం ఉందా.

కాస్ట్రో : నిజంగా నేను మొదటి సారి ఈ విషయం వింటున్నాను. ఆ వదంతిని, ఆ కథనాన్ని వినడం ఇదే ప్రథమం. ఫెట్రినెల్లి ఆ పరిస్థితిపై ఏ విధంగానైనా ప్రభావం చూపే అవకాశం ఏ కోశానా లేదు. ఈ రోజున

అందుకు సంబంధించిన మొత్తం సమాచారం తెలుసు. దానిపై చాలా పుస్తకాలు వచ్చాయి. నేను వాటిని చదివాను. అన్నింటినీ మించి చే డైరీ కూడా అందుబాటులో ఉంది. దాన్ని నేను చాలా జాగ్రత్తగా చదివాను. చే నాకు బాగా తెలుసు కూడా. తెలుసు. ఆ డైరీ చదివినప్పుడు ఆయన మానసిక స్థితి ఎలా ఉందో క్షుణ్ణంగా చూడగలిగాను. ఎందుకంటే ఆయనతో అంత పరిచయముంది.

ఇంకో విషయమేమంటే అవన్నీ బొలీవియా సైన్యం రాసిపెట్టిన పత్రాలు. తమకు అందిన సమాచారాన్ని వాటిలో కూలంకషంగా పొందుపరిచారు. ఆ సమయంలో వారు దాన్ని ఎలా వ్యాఖ్యానించదల్చుకున్నారన్నది అందులో ఉన్నది. వారి ప్రయోజనాలు వారికి ఉంటాయి. ఈ మొత్తం కథ రాసింది కేవలం విప్లవకారులు కాదు. పైగా బతికి బయటపడిన ఇతర కామ్రేడ్లు రాసిన డైరీలు కూడా ఉన్నాయి. చివరి క్షణాల వరకు చే తో ఉన్న సహచరులు రాసిన డైరీలు కూడా ఉన్నాయి. అవి బొలీవియా సైన్యం చేతుల్లో చిక్కాయి. మా దగ్గర సాక్ష్యాధారాలున్నాయి. జరిగిందేమిటో దశల వారీగా మాకు తెలుసు. క్రమశిక్షణకు సంబంధించి కొన్ని లోపాలు జరిగాయి. కొన్ని సందర్భాల్లో సరైన నిర్ణయాలు తీసుకోలేదు. ఇవి శత్రువుకు ఏదో జరుగుతుందన్న సూచనలు అందించాయి. దాని తీవ్రత ఎంతనేది మాత్రం వారికి తెలియదు. అయితే ఇది ఫెట్రినెల్లిని కానీ మరెవరికీ గానీ సంబంధించిన విషయం కాదు. ఈ వివరాలన్నీ సమగ్రంగా వెల్లడయ్యాయి.

ఇక్కడొక విషయముంది. వారు అప్పటికే శిబిరాలు ఏర్పాటు చేసుకున్నారు. కావలసిన పరిస్థితులు సృష్టించుకున్నారు. అంతకు ముందు మాకు చెప్పిన సంగతులు ఇవి. ఏదో విచిత్రమైంది జరుగుతున్నట్లు సైన్యం తెలుసుకోగల్గింది. అయితే ఇది దీంతోపాటే ఇతర పరిస్థితులు కూడా వచ్చిపడ్డాయి. చాలా పెద్ద దళంతో సహా చే ఒక ప్రదేశాన్ని గురించి తెలుసుకోవడానికి అక్కడ చొరబడ్డాడు. ఆ మొత్తం ప్రాంతాన్ని గురించి తెలుసుకోవాలనుకున్నాడు. ఆ శిబిరంలో అప్పుడే వచ్చిన అతి కొత్తవాళ్ళను అట్టిపెట్టారు. అయితే ఆ పర్యటన చాలా వారాలు సాగింది. వాస్తవానికి అదొక మహా ప్రయాణమే అయ్యింది. మహా పర్వతాలను, దుర్గమ ప్రాంతాలను పొంగిపొర్లే నదులను ఎలా దాటవల్సి వచ్చిందో చే డైరీ వివరిస్తుంది. ఆ యాత్ర సందర్భంగా వాళ్ళకు కొన్ని నష్టాలు కూడా కలిగాయి. ఒకరిద్దరు మునిగి చనిపోయారు.

ఆ ప్రస్థానం తరువాత దళాలు పూర్తిగా అలిసిపోయి కొన్ని వారాలకు తిరిగి వచ్చాయి. చే లేనప్పుడు కొన్ని సమస్యలు ఉత్పన్నమయ్యాయని శిబిరానికి తిరిగి వచ్చాక తెలుసుకున్నాడు. క్రమశిక్షణకు సంబంధించి కొన్ని ఉల్లంఘనలు చోటు చేసుకున్నాయి. కొన్ని చిక్కులు వచ్చాయి. అన్నింటికంటే ఘోరం ఏమంటే దళాలు అలసిపోయినప్పటికీ కొన్ని చిక్కులు... చాలా కొద్ది కొద్దిమంది జబ్బు పడినప్పటికీ వారు తేరుకోవటానికి సమయం దొరకలేదు. చాలా కొద్ది రోజుల్లోనే సైన్యం సరికొత్త దాడులు మొదలుపెట్టింది. తొలిపోరాటం చోటు చేసుకుంది. ఈ అనుభజ్ఞులైన చే మనుషులు ఏమీ నష్టపోలేదు. నిజానికి వారు చేసిన దాడుల్లో ఆయుధాలు పట్టుబడ్డాయి. శత్రువును గట్టిగా దెబ్బతీశాయి.



అయితే ఇదంతా అపరిపక్వదశలోనే జరిగిందని నేను చెప్పాల్సి ఉంటుంది. వారు ఇంకో చొరబాటుకు పాల్పడ్డారు. మళ్ళీ శిబిరంలో కొంత మందిని వదిలివెళ్ళారు. దాని వల్ల అక్కడ రెండు వర్గాలుగా చీలిక వచ్చింది. వారు మళ్ళీ ఒకరితో ఒకరు ఎలాంటి సంబంధం పెట్టుకోలేదు. అంతేకాక చే దగ్గర ఆస్తమాకు సంబంధించి ఎలాంటి మందులు లేవు. గ్రాన్మా విషయంలోనూ ఇదే జరిగింది. మందులు ఉండేవి కావు. సియరామస్త్రాతో కూడా ఎంత ఖర్చుఅయినా సరే చే కు అవసరమైన మందులు తెప్పించడానికి మేము విపరీతంగా కృషి చేశాము. ఎందుకంటే భయకరమైన ఆ ఆస్తమా అతన్ని కదలకుండా చేసింది. అతనికి మందులు చాలా అవసరం. అయితే ఈ మొత్తం కాలంలో అతను మందులు లేకుండానే గడిపాడు.

ఈ విషయాలన్ని చే డైరీలో చాలా శక్తివంతంగా, ఖచ్చితంగా, కథాత్మకంగా వర్ణించబడ్డాయి. ప్రతిఘటన చాలా స్పష్టంగా వర్ణించబడింది. నిజంగా ఇది ఒక అద్భుతం. ఎందుకంటే వారు సైన్యాన్ని తప్పించుకుంటూ దాంతో పోరాడుతూ చాలా నెలలు గడిపారు. మద్దతుగా దళాన్ని ఏర్పాటు చేయడాన్ని గురించి చర్చించే సమయం కాదు అది. వారు ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. శత్రువు అన్ని రకాల సమాచార సంబంధాలు తెంచివేశాడు. నగరాల్లో అలాంటి సంబంధాలున్న కేంద్రాలపై నిఘా వేశారు.

ఆ సమయంలో గెరిల్లా దళం భవిష్యత్తు వారేంచేస్తారనే దానిపైనే ఆధారపడి ఉంటుంది. తమ గెరిల్లా దళాన్ని మరో చోటుకి మారిస్తే నిలదొక్కుకోవచ్చని చే నమ్మాడు. ఇంటి, కోకో పెరిడోలకు బాగా తెలిసిన చోటుకు సాంఘికంగా మద్దతు ఉన్న చోటుకు మార్చాలని ప్రతిపాదించాడు. చివరి దశలో వారు అక్కడికే బయలుదేరాడు. ఇదే తమకున్న అతి గొప్ప అవకాశం అని చే కు తెలుసు.

జరిగిన ప్రతిదాన్ని గురించిన వర్ణన చూస్తే వారు సాధించింది. చాలా బాగున్నట్లు అర్థమవుతుంది. అతని డైరీ ద్వారానే కాక బొలీవియా సైన్యం కథనాలను బట్టి కూడా తెలిసేది అదే. సైన్యంతో కూడా వారు అనేక పోరాటాలు చేశారు. వారు సాధించింది. నిజంగానే గొప్ప వీర కావ్యం లాంటిది. ఇదంతా తెలిసిన విషయమే.

మరి ఆయనపై ప్రభావం చూపిన అంశాలు ఏమైఉంటాయి. ఈ విషయంలో నాకో అభిప్రాయం ఉంది. మరో బృందం చంపివేయబడ్డం అతన్ని తీవ్రంగా ప్రభావం చేసింది. వైరు సర్వీసుల ద్వారా వారి మృతి గురించిన సమాచారం అందినట్లు మాకు తెలుస్తున్నది. అది ఎలా జరిగిందో వర్ణించబడింది. మేము నిర్ధారించుకున్నదాన్ని బట్టి కూడా ఆ సమాచారం నిజమని తేలింది. తమార, జాక్విన్ మొత్తం దళం చంపివేయబడింది. కానీ చే దాన్ని నమ్మడానికి నిరాకరించాడు. అతను నెలలు తరబడి దాన్ని నమ్మకుండా ఉండిపోయాడని డైరీ చదివినప్పుడు తెలుస్తుంది. అంతకు ముందు చాలా సార్లు చేసినట్టే సైన్యం అబద్ధాలు చెప్తున్నదని అనుకుంటూ వచ్చాడు. మా వరకు మేము ఆ సమాచారం అందగానే నిజమేనని నిర్ధారించుకున్నాము.

ఆ దళంతో సంబంధం పెట్టుకోవడానికి అతను చేసిన అన్ని ప్రయత్నాలు, అన్ని యాత్రల తరువాత - అది ఇంకెంత మాత్రం లేదని అతనికి నచ్చజెప్పగల్గిన తరువాత -

అతనికి నిజంగా నమ్మకం కుదిరినతరువాత మాత్రమే  చే సాంఘికంగా మద్దతుగల ప్రాంతానికి సాగిపోవాలని నిర్ణయించుకున్నాడు. అప్పటికల్లా అతనికి కొంత మంది మెరికల్లాంటి మంచి బొలీవియా కార్యకర్తలు కొందరు లభించారు. ఆ నిర్ణయం సరైందే. దాని ప్రకారం అతను ఇంకా బతికి బయటపడే అవకాశం ఉండింది.

ఇతర కామ్రేడ్ల మరణం అతని మానసిక స్థితిపై ఏ మాత్రం ప్రభావం చూపింది? చివరి దశలో అతను కొంత నిర్లక్ష్యం వ్యవహరించాడని నేను అనుకుంటాను. వారు ఒక దారిలో నడిచిపోతున్నారు. ఒక బిందువు దగ్గర అతను ఆగిపోయాడు. 'రేడియో బెంబా (నోటిమాట) మనకన్నా ముందే పోతున్నది. ప్రతివారు మనకోసం చూస్తున్నారు' ఇంచుమించుగా అతను చెప్పిందీ అదే. మీరు అతని డైరీలో చదవచ్చు. ఆ ప్రదేశానికి ఒక రోడ్డు మీదుగా వారు పోతున్నారు. ఒక చిన్న బ్రిడ్జి దగ్గరికి చేరగానే అతను ఇలా రాశాడు. 'రేడియో బెంబా మన రాకను ప్రకటిస్తున్నది' అంటే ప్రతి వారు వాళ్ళకోసం ఎదురు చూస్తున్నారనమాట.

జాక్విన్ దళం హత్య చేయబడడం అతని మానసిక స్థితిని ప్రభావితం చేసిందని నేను నిజంగానే నమ్ముతాను.  అతను అలాంటి విషయాలకు ఎంతగా స్పందిస్తాడో నాకు తెలుసు. అతనితో అంత పరిచయం. ఆ క్షణంలో అతను తన స్వభావానికి అనుగుణంగా ఒక విధమైన నిర్లక్ష్యంతో వ్యవహరించాడని అనుకుంటాను.

అతను అలాగే ముందుకు సాగిపోయాడు. పొద్దునపూట ఒక పట్టణంలోకి ప్రవేశించాడు. అది నిర్మానుష్యంగా ఉంది. ఒక పట్టణం అలా బోసిగా ఉందంటే అది ఒక ప్రమాద సూచిక లాంటిది. ఒక పోరాటం జరగబోతున్నదని ప్రజలు గ్రహించారు. ఏ సైన్యం - ప్రపంచంలో ఏ సైన్యమైనా సరే ఇలాంటి పరిస్థితుల్లో నిరీక్షించాలి. రోడ్డు మీద ఎక్కడో దాపున ఉండి దాడి చేయాలి. ఆ మొండి పర్వతాల్లో పట్టపగటిపూట అసలు సైన్యం అనేదే లేనట్లుగా అగ్రగామి దళం బయలుదేరింది. దానిపై పట్టపగలే ఆకస్మిక దాడి జరిగింది. అనేక మంది చనిపోయారు. అది చాలా పెద్ద దెబ్బ.

ఆ దళం కొంత మంది వ్యాధిగ్రస్తులను మోసుకుపోతున్నది. వారిలో ఒక డాక్టర్ కూడా ఉన్నాడు. అలా మూసుకుపోవడం వారి కదలికలకు తీవ్ర ఆటంకమైనప్పటికీ తీసుకుపోవల్సిందేనని చే పట్టుపట్టాడు. మా వరకు మేము కొన్ని సందర్భాల్లో ఇలాంటి పరిస్థితులు ఎదురైతే నడవలేని  వాళ్ళను వదిలి వెళ్ళటానికి ఎక్కడైనా ఒక స్థలం చూసేవాళ్ళం. వారిని జాగ్రత్తగా కనిపెట్టి ఉండే వాళ్ళను ఏర్పాటు చేసి వెళ్ళేవాళ్ళం. చే కూడా అలాంటి అవకాశం కోసం చూసి ఉండాలి. కాని అప్పటికే తన అగ్రగామి దళాన్ని కోల్పోయాడు. ఒక లోయలో వారి ఆచూకీ తెలిసిపోయి దిగ్బంధంలో చిక్కుకున్నారు. చనిపోయిన వారిలో కొంత మంది ఉత్తమ బొలీవియన్ యోధులు కూడా ఉన్నారు. వారిలో పెరోడో సోదరులు కూడా ఉన్నారు.

ఆ దాడి చే కు చాలా చిక్కు పరిస్థితిని సృష్టించింది. కష్టతరమైన పరిస్థితుల్లోకి నెట్టింది. నిరంతరంగా పోరాడుతూనే అతను అనేక మాసాలపాటు సైన్యానికి దొరక్కుండా తప్పించుకోగలిగాడు. మహా వీరోచితమైన కార్యాలు నెరవేర్చాడు. కాని అతను ఇప్పుడు



చాలా క్లిష్టమైన పరిస్థితిలో చిక్కుకుపోయాడు. అతని ఆచూకీ తెలిసిపోయింది. దాడి జరిగింది. గాయపడ్డాడు. అతని రైఫిల్ ధ్వంసమైంది. అతన్ని బందీగా పట్టుకొని దగ్గర్లో ఉంచారు.

20 మందితో తాము అనుకున్న చోటికి చేరేందుకు సాగిపోతున్నప్పుడు కూడా బతికిబయటపడే అవకాశాలు ఉండిఉంటాయి. గెరిల్లా ఉద్యమాన్ని పెంపొందించే అవకాశాలు కూడా అప్పటికి ఇంకా ఉండే ఉంటాయి. ఆ సమయం వరకు చే కు తెలిసిందాన్ని బట్టి చూసినా నా అనుభవాన్ని బట్టి చూసినా అలాంటి అవకాశం ఉండింది. అగ్రగామి దళం ధ్వంసం అయిన తరువాత కూడా మొండి పర్వతాల గుండా బహిరంగ రహదారిపై, పట్టపగలు నడిచిపోయినప్పుడే నిజంగా పరిస్థితిలో మార్పువచ్చింది.

దీన్ని బట్టి చూస్తే అతనిపై ఏదో విషయం గొప్ప ప్రభావం చూపిఉండాలి. మృత్యువు పట్ల అతనిది ధిక్కార ధోరణి. కొన్నిసార్లు అతను మృత్యువును ఆహ్వానిస్తున్నట్లుగా కనిపించేవాడు. నిజానికి అలాంటి పరిస్థితుల్లో అతను మరింత జాగ్రత్తగా వ్యవహరించి ఉండాలి. రోడ్డు మీద వెళ్ళకుండా వేరే స్థలాలు చూసుకొని ఉండాలి. రాత్రిపూట మాత్రమే ప్రయాణించి ఉండాలి. వారిపై దాడి రాత్రిపూట జరిగి ఉండే అంత తీవ్ర నష్టం కలిగేది కాదు. ఎందుకంటే శత్రువు చీకట్లో కాల్పులు జరుపుతాడు. ఏదో ఒక కాంతి పడితే తప్ప వారు కన్పించరు. కాని జరిగింది వేరు. చే స్వభావంలోని ఏవో లక్షణాలవల్ల ఆ ఘటనలు అలా జరిగాయని నాకు అన్పిస్తుంది.

నేను అతన్ని బాగా యెరుగుదును. అతని డైరీ ఒకటికి రెండు సార్లు శ్రద్ధగా చదివాను.

గియాని : ఆ సమయంలో అతనికి సహాయం చేయటానికి ఏమైనా అవకాశం ఉండిందా? అంటే అతని వీరోచిత పోరాటపు చివరి దశలో.

కాస్ట్రో : అసాధ్యం. ఏమి చేసి ఉండొచ్చు? ఒక పటాలాన్ని పంపగలమా? సైన్యాన్నే పంపగలమా? కాని గెరిల్లా యుద్ధ తంత్రం భిన్నంగా ఉంటుంది. సంబంధిత గెరిల్లా విభాగం ఏంచేస్తున్నదనేదే అక్కడ కీలకం. నిజంగానే వారు ఒక వీరోచిత పోరాటం చేశారు. ఒకానొకనాడు వారి విజయాలు మరింత వాస్తవికంగా అంచనా వేయబడ్డాయి. బొలీవియా సైన్యం కూడా అలాగే వర్ణించింది.... ఒక సైనికాధికారి ఉన్నాడు. జనరల్ ప్రాడో నేను అతని పుస్తకం చదివాను. (నేను చే ను ఎలా పట్టుకున్నాను- హౌ ఐ క్యాప్చర్డ్ చే) అన్న ఆ పుస్తకం ప్రభుత్వ వర్గాల కథనం తెలుపుతుంది. కానీ అందులో కూడా తన శత్రువు పట్ల ప్రశంసలు చేయకుండా ఉండలేకపోయాడు.

సైన్యంతో చాలా సార్లు ఘర్షణలు జరిగాయి. అలాంటి సమయాల్లో ఏమి చేయాలో మాలాగే అతనికి తెలుసు. మేము సియరామస్త్రాలో ఉన్నప్పుడు చెల్లాచెదురైపోయాము. ఏడు రైఫిళ్ళు సేకరించగలిగాము. మళ్ళీ పోరాటం ప్రారంభించాము. అక్కడ మాకు ఎవరూ తెలియకపోయినా కేవలం ఏడు రైఫిళ్ళతో పోరాటం సాగించాము. మా బలం 20కి చేరుకోగానే గుర్తించదగిన శక్తి వచ్చింది. గెరిల్లా పోరాట అవకాశాలపై చే

కు విశ్వాసం ఉంది. అది ఎలా చేయాలో కూడా అతనికి తెలుసు.

అలాంటి పరిస్థితుల్లో గెరిల్లా విభాగం దానిపైనే అది ఆధారపడాలి. దానికి విదేశాల నుంచి సహాయం వస్తుందని ఆశించజాలదు. అందదు కూడా. అది సాధ్యమయ్యే విషయం కాదు. రహస్యంగా కూడా సహాయం అందించలేము. సహాయక వ్యవస్థ మొత్తం ముక్కచెక్కలైంది. ఆ సమయంలో ప్రతిదీ వారి స్వంత చర్యలపైనే ఆధారపడి ఉంది. అందువల్లనే సంప్రదాయక యుద్ధ తంత్ర సూత్రాలు బయలుదేరే దళాలకు సంబంధించిన ఊహాగానాలు ఇక్కడ వర్తించవు. అవన్నీ కాల్పనికతకు సంబంధించినవి మాత్రమే.

గియాని : ప్రెసిడెంట్ కాస్ట్రో మీరు ఐరోపాలో పంచిపెట్టిన చే మరణగాథకు సంబంధించిన నాటకీయ క్షణాలు. న్యూజెర్సీలోని గ్లాస్‌బోరోలో సోవియట్ ప్రధాని కోసిగిన్‌కు అమెరికా అధ్యక్షుడు జాన్సన్‌కు మధ్య జరిగిన శిఖరాగ్ర సమావేశంలో ఆసియా, లాటిన్ అమెరికాలకు సంబంధించి సంధి కుదుర్చుకోవాలని సోవియట్ అమెరికాలు అవగాహనకు వచ్చాయని చెప్పబడింది. అందువల్లనే బొలీవియాలో చే కు మరింతగా సహాయపడేందుకు క్యూబా ముందుకు రాలేకపోయిందని అంటున్నారు.

కాస్ట్రో : ఐరోపాలో ప్రచారమవుతున్న వదంతులు కట్టుకథలు చూస్తే నాకు దిగ్భ్రాంతి కల్గుతుంది. ప్రపంచంలోకెల్లా ఐరోపాలోనే చాలా తక్కువగా సమాచారం తెలుస్తుందేమోనని అనిపిస్తుంటుంది.

గియాని : కావచ్చు.

కాస్ట్రో : అసలు ఆ సమావేశం గురించే నాకు జ్ఞాపకం లేదు. అప్పుడు వియత్నాం యుద్ధం తారా స్థాయిలో ఉంది. చే కార్యాచరణ సాగుతున్నది. ఆ రెండింటికి పరస్పర సంబంధంలేదు. దానిలో సోవియట్ భాగస్వామ్యంలేదు. వ్యూహంపై చర్చించే ప్రశ్నలేదు. నిజమేమిటంటే గొప్ప విశ్వాసంతో మేము చే అడిగిన సహాయం చేశాము. కార్యకర్తలను సమకూర్చాము. సహకరించాము. ఇచ్చిన మాట ప్రకారం ప్రతిదీ చేశాము.

కానీ మా ఉద్దేశంలో మరింత మెరుగైన పద్ధతి ఏమిటంటే చే కొంత కాలం వేచి ఉండాల్సింది. ఒక పరిణిత గెరిల్లా రంగం పెంపొందేవరకు అతను వేచి ఉండాల్సింది. అయితే అలాంటి నిర్ణయాన్ని అతనిపై రుద్దలేము.

మేము రాజకీయ సమస్యలు ఎదుర్కోవల్సి రావచ్చని మాకు తెలుసు. రాజ్యసంబంధమైన సమస్యలు, ఖండనలు వగైరాలన్నీ అయితే మేము అలాంటి అసౌకర్యాలకు సిద్ధపడ్డాము. కేవలం అతనికిచ్చిన వాగ్దానాన్ని నిలుపుకోవడం కోసమే మా హామీని గౌరవించాము. దాన్ని గౌరవించడమే కాదు అతను చేసినదాన్ని విశ్వసించాము. అతను అనుకున్నదాన్ని చేయగలడని నమ్మాము.

ఒక విధానం సరైందా కాదా అని చెప్పడానికి దాని విజయం, అపజయం సూచిక



కాదని నేను ఎప్పుడూ చెబుతుంటాను. మేము అందరం మా పోరాట కాలంలో చనిపోయి ఉండొచ్చు. చాలా సార్లు మేము మృత్యువు దరిదాపుల్లోకి వెళ్ళాము. మేమే కనక చనిపోయి వుంటే చాలా మంది మేము పొరపాటు చేశామని చెప్పి ఉండేవాళ్ళు. మేము చనిపోయినప్పటికీ దానివల్ల మాది తప్పు అని రుజువు కాదనే నేను అనుకుంటాను. మా మార్గం సరైంది. అనేక అంశాలు అనేక అసంబద్ధమైన అంశాలు ఎదురవుతాయి. అదృష్టంతో సహా. మేము దాదాపు అద్భుతమైన రీతిలో ఆ కష్టకాలం నుంచి బతికి బయటపడ్డాము. అది మరో పెద్ద కథ అవుతుంది. అయితే అలాంటి పరిస్థితిలో మీరు విజయం ఒక్కటే మీ పంథా సమంజసత్వానికి కొలబద్ద అని చెప్పలేరు. కొన్ని కారణాలు ప్రతికూల పరిస్థితులకు దారితీస్తాయి. కాని నేను చే పంథా సమంజసత్వాన్ని ప్రశ్నించడంలేదు. నేను చెప్పేదేమంటే మొదట్లో ఎదురైన అతి ప్రమాదకర దశను అతను తప్పించి ఉండొచ్చు అని మాత్రమే. మొదటి దశను దాటిన తరువాత ఆ బృందంలో రాజకీయ, సైనిక నాయకుడుగా వ్యూహ కర్తగా అతను చేరి ఉండొచ్చు.

చే ధైర్యం అతని లక్షణాలు అతని ప్రాధాన్యత కారణంగానే మా యుద్ధంలో అనేక ముఖ్యమైన బాధ్యతలు అప్పగించాము. ఈ బాధ్యత మేము అతనికి అప్పగించలేదు. ఆ భావం, ఆ పథకం అన్ని అతనివే అతని భావాలు సరైనవని భావించినందునే మేము కూడా పాలుపంచుకున్నాము. మేము అలా చేసి ఉండవచ్చు. అతను కూడా చేసి ఉండవచ్చు. కొన్ని అంశాలు ప్రభావం చూపాయి కనుక గెరిల్లా దళం నిర్మూలనకు చే మరణానికి దారి తీశాయి కనుక దాన్ని బట్టి అతని మార్గం తప్పు అని నేను చెప్పబోవడంలేదు. విజయాన్ని లేదా వైఫల్యాన్నిబట్టి మీరు ఒక పంథా సమంజసతత్వాన్ని బేరీజు వేయలేరు. నా ఉద్దేశంలో అలా చేయడం పొరపాటు అవుతుంది.

అలాంటి ఉదాహరణ ఇదొక్కటే కాదు. మా దగ్గర మరొక సందర్భం ఉంది. అదే (ఫ్రాన్సిస్కో) క్యామనోకు సంబంధించినవి. అతను కూడా చాలా ధైర్యవంతుడే. తన స్వదేశానికి (డొమినికన్ రిపబ్లిక్) తిరిగి వెళ్ళాలనే అసహనాన్ని అధిగమించలేక వెళ్ళాడు. నేను అతనితో చాలా మాట్లాడాను. నాకు అతను బాగా తెలుసు.

ఆ విధంగా నాకు ఇద్దరు గొప్ప కార్యకర్తల ఉదంతాలు - తమ అసహనంవల్ల మరణం పాలైన ఉదంతాలు - తెలుసు. కేవలం చావు గురించి కాదు మనం ఇక్కడ మాట్లాడేది. ఆ చావుల వల్ల వచ్చిన విషాదం గురించి. వారిద్దరూ గొప్ప కార్యకర్తలు, గొప్ప విప్లవకారులు ఇలా చనిపోయారు. చే కంటే కూడా క్యామనో ముందున్న అవకాశాలు మరీ తక్కువ. క్యామనో బాగా శిక్షణ పొందిన మంచి సైనికుడు. కానీ పరిస్థితులు కూడా క్లిష్టంగానే ఉన్నాయి. అతని బృందం చాలా చిన్నది. ఈ విలువైన కార్యకర్తలను మరింత అనుకూలమైన తరుణం కోసం అట్టిపెట్టుకొని ఉంటే బాగుండేది.

మేము వారిపై మా అభిప్రాయాలు రుద్దలేదు. వారి వీరోచిత చర్యలను నిషేధించనూ లేదు. మాకు మహత్తరమైన స్నేహ విశ్వాస సంబంధాలుండేవి. చే నా దృక్పథానికి అభిప్రాయాలకు గొప్ప సావధానత చూపేవాడు. చివరి వరకు చాలా లోతైన విశ్వాస పాత్రమైన స్నేహం కల్గి ఉన్నందువల్ల నేను నా అభిప్రాయాలు చెప్తుండేవాడ్ని. కాని

అది అతని భావన. దాన్ని అమలు జరపకుండా నిరోధించడం ఇలాంటి సంబంధాల పరిధిలోని విషయాలు కాదు. రాజ్యానికి సంబంధించిన కారణాలవల్లనైనా సరే నేను అతనిపై నా అభిప్రాయాలు రుద్దను. మేము చేసింది అతనికి సహాయం. సాధ్యమనుకున్న సహాయం చేశాను. అసాధ్యమైన సహాయం చేయలేకపోయాను. మాకు నమ్మకంలేనిది మేము చేయలేము. ఎందుకంటే అది సాధ్యం కాదని అతనికి చెప్పవలసిన బాధ్యత మాపై ఉంటుంది. మేము అలా చేయలేము. ఈ కార్యక్రమంలో కామ్రేడ్స్‌ను త్యాగం చేయలేము. కానీ అతను తను అనుకున్నది చేశాడు. మేము దానిలో పాలుపంచుకున్నాము. నమ్మాము.

ఒక విషయంలో మాత్రం నేను భిన్నంగా చేసి ఉండొచ్చు. బలమైన ఉద్యమం పెరిగేవరకు అతనిలాంటి స్థాయి నాణ్యత వ్యూహాత్మక ప్రాధాన్యత కల్గిన కార్యకర్త దానిలో చేరి ఉండకూడదు. దాని ప్రారంభదశలోనే అతను చేరి ఉండకూడదు. అది చాలా కష్టమైన, ప్రమాదకరమైన దశ. వాస్తవాలు చెప్పేది అదే. అది అతని మరణానికే దారి తీసింది.

గియాని : బొలీవియా అధికారులు చే భౌతిక కాయాన్ని కూడా ఎందుకు స్వాధీన పర్చలేదు. చనిపోయాక కూడా అతనంటే వారికి బెదురేనా.

కాస్ట్రో : వారు చే భౌతిక కాయాన్ని వదిలించుకోవాలని అనుకున్నారు. ఎందుకంటే అతని స్మారక చిహ్నం నిర్మిస్తే ప్రజలు సందర్శిస్తారని, పవిత్రత లభిస్తుందని భయపడ్డారు. వారు చే మృతదేహాన్ని ఏమి చేశారో, అది ఎక్కడుందో మాకు ఇప్పటికీ తెలీదు. అది ఎప్పుడూ స్పష్టం చేయలేదు. అతని వస్తువులూ చాలా బయటపడ్డాయి. ఇరుపక్షాలు చెప్పినదాన్ని బట్టి జరిగిందేమిటో మాకు క్షుణ్ణంగా తెలిసింది. కానీ చే ను ఎక్కడ ఖననం చేశారనేది మాత్రం ఇప్పటికీ తెలీదు. అతను ఐపు లేకుండా పోవాలని వారు అనుకున్నారు. యాంకీలు కూడా అతని అదృశ్యాన్నే కోరుకున్నారు.

అయినప్పటికీ చే మొత్తం ప్రపంచానికి గొప్ప ప్రతీక కాగలిగాడు. వీరోచితమైన విప్లవకర వ్యక్తిత్వానికి తిరుగులేని ఉదాహరణగా నిలిచాడు. తృతీయ ప్రపంచంలో పోరాటానికి, విప్లవానికి అత్యంత ప్రముఖమైన ఉదాహరణలో ఒకడుగా నిలిచిపోయాడని కూడా నేను చెప్పాల్సి ఉంటుంది. ఆ మాటకొస్తే పారిశ్రామిక ప్రపంచంలో అతనికి ఆ స్థానం ఉంది. ఇలాంటి భావాలు కానీ చే గురించిన చిత్రణకానీ సముచితమైనదే.

గియాని : చే మరణానికి సంబంధించి ఒక అంశం కొట్టచ్చినట్లు కన్పిస్తుంది. బొలీవియాలో అతని హత్యకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో బాధ్యులైన 16, 17 మంది చనిపోయారు. చాలా సందర్భాల్లో వారి మరణాల కారణం పూర్తిగా అంతుబట్టలేదు.

కాస్ట్రో : అతని హత్యలో పాలుపంచుకున్నవారు ఈ విధంగా చనిపోవడం కన్పిస్తుంది. బహుశా ఇది ఎవరో పథకం ప్రకారం చేసి ఉండకపోవచ్చు. ప్రజలు అక్కడికక్కడే చూపిన ప్రతిస్పందన కావచ్చు. నీచకృత్యానికి పాల్పడినవారిపట్ల న్యాయబద్ధంగా వ్యవహరించాలనే ప్రజా దృష్టి



కావచ్చు. చే కు వ్యతిరేకంగా పోరాడిన సైనికుల గురించి నేను మాట్లాడ్డంలేదు. ద్రోహులు, గూఢచారులుగా, తొత్తులుగా వ్యవహరించిన వారి గురించే చెప్తున్నాను.

గియాని : కింది స్థాయిలోని రైతు... వరకు

కాస్ట్రో : అతని పేరు హోనోరాటో అనుకుంటాను.

గియాని : హోనోరాటో రోజాస్

కాస్ట్రో : నేను అతన్ని గురించి బొలీవియా జనరల్ గేరీప్రాడో రాసిన పుస్తకంలో చదివాను. గేరీ ఇప్పుడు నిరర్థకపు వ్యక్తిగా ఉన్నాడు. అతను ఇప్పుడు వాషింగ్టన్‌లో సైనిక సహాయకుడిగా ఉన్నట్టున్నాడు. అతనొక వాస్తవికమైన గౌరవప్రదమైన గ్రంథం రాశాడు. దాంట్లో బొలీవియా సైన్యంపై ప్రశంసలున్నా సరే ఒక బొలీవియన్ సైనికుడిగా అలాంటి మనోభావాలు తన వ్యవస్థపట్ల ఉండడాన్ని నేను తప్పు పట్టను. బొలీవియా సైన్యానికి శిక్షణ చాలా తక్కువ. అది ఆ కాలంలోనే అనుభవం గడిస్తున్నది. అది నిర్వివాదాంశం. యాంకీలు చాలా ప్రయత్నం చేశారు. శిక్షణా పథకాలను వేగిరపర్చారు. ఎందుకంటే వారు చే ను నిర్మూలించ దలచారు.

గియాని : ఎంతో ముక్తసరిగా ఉండే మీరు చే చివరి సారి విడిపోయే ముందు ఒకరినొకరు ఎలా అభినందించుకున్నారు. పాత స్నేహితులవలే ఆలింగనం చేసుకున్నారా? లేక కరచాలనంతో విడిపోయారా?

కాస్ట్రో : మేము చాలా సార్లు ఒకరినొకరం చూసుకున్నాము. చాలా ప్రేమగా, ఆప్యాయంగా చూసుకున్నాము. లేదు. ఏమంత ఆవేశంలేని ఆలింగనం. ఎందుకంటే మేము అలాంటి ఉప్పొంగే ఆవేశాలకు లోనయ్యేవాళ్ళం కాదు. అతనూ కాదు. నేనూ కాదు. కాని మేము ప్రగాఢంగా స్పందించేవాళ్ళం. గొప్ప విశ్వాసం కలిగించేవాళ్ళం. చాలాసార్లు మాట్లాడుకున్నాం. తనతో వచ్చే వారికి శిక్షణ ఇస్తున్న సమయంలో అతన్ని చూసేందుకు చాలాసార్లు వెళ్ళాను. పినార్ డెల్ రియో రాష్ట్రంలో వారు చాలా కాలం గడిపారు.

గియాని : మరి అతను వెళ్ళిపోయిన రోజు

కాస్ట్రో : అతను వెళ్ళిపోయిన రోజు నేను చలోక్తులు విసిరే వరకు వెళ్ళాను. అతను మంచి కోసం వెళ్ళిపోతున్న రోజున నేను చాలా మంది పార్టీ నాయకులను అత్యంత విశ్వాస పాత్రమైన నాయకులను పిలిచాను. ఒక సరికొత్త సందర్శకుడితో విందుకు రమ్మని వారిని ఆహ్వానించాము. ఆ సందర్శకుడే చే. అతను మారువేషంలో ఉన్నాడు. అతన్ని ఆ మారువేషంలో ఏ ఒక్కరు గుర్తుపట్టలేదు. తను వెళ్ళడానికి ముందు రోజు ఇక్కడ హవానాలోని ఒక ఇంట్లో చే కొంత మందితో కలిసి భోజనం చేశాడు. వారు అతన్ని గుర్తుపట్టలేదు. భోజనానికి వచ్చింది చే అని ఆ కామ్రేడ్స్‌కు చెప్పాల్సి వచ్చింది. కనుక అతను వెళ్ళడానికి

బాగా సిద్ధమయ్యాడని అర్థమవుతుంది. అతన్ని ఎవరూ గుర్తు పట్టలేదు. నిజంగా అని చాలా పకడ్బందీగా జరిగింది. అత్యంత సన్నిహితులైన వారు కూడా గుర్తు పట్టలేదు. ఎవరో కొత్తవారితో మాట్లాడినట్లే మాట్లాడారు. కనుక మేము అతను వెళ్ళడానికి ముందు రోజు ఇలాంటి తమాషాలతో గడిపాము.

గియాని : ఈ విషయాలన్నీ చెప్పినందుకు మీ ధన్యవాదాలు. మన కాలపు చరిత్రలో కొంత భాగం మన జీవితం, ఆలోచనలు, ఆశలలో కొంత భాగం ఇలా మీ మాటల్లో వినడంలో సంతోషం పొందానని అనుకుంటాము. అందుకే మీ ధన్యవాదాలు.

కాస్ట్రో : న్యాయంగా ఉండడం మా బాధ్యత. ఆరోపణలు చేయాల్సిన అవసరంలేదు. మేము బాధ్యత వహించాల్సిన విషయాలు ఉన్నాయి. అయితే మోంజే బాధ్యత మరొకటి.... సరే అందుకే నేను మీకు కథ వివరంగా చెప్పాల్సి వచ్చింది.

అందుకే నేను చే (బొలీవియా) డైరీకి ఉపోద్ఘాతం రాయాల్సి వచ్చింది. అది ఆవశ్యక ఉపోద్ఘాతమని పేర్కొన్నాను. నేను అందులో ప్రతిదీ వివరించాను. మరిన్ని వివరాలతో. ఎవరి పాత్ర ఏమిటో కూడా పేర్కొన్నాను. చాలా విషయాలు చెప్పడానికి ఆ ఉపోద్ఘాతం రాశాను. దాన్ని విస్తారంగా ప్రచురించాము. తరువాత ఆ డైరీ ప్రపంచం అంతా పంపిణీ అయ్యింది. ఆ విధంగా వాస్తవికత ప్రదర్శించాల్సిన బాధ్యత మాపై ఉంది.

జరిన దాన్ని గురించి నాకు బాగా తెలుసుననుకుంటాను. దాని గురించి చాలా ఆలోచించాను. అన్ని పత్రాలు పరిశీలించాను. చే నాకు బాగా తెలుసు. బాగా బాగా బాగా చాలా బాగా తెలుసు. వాస్తవాలకు సంబంధించినంత వరకు నేను చాలా రూఢిగా ఉన్నాను. అవి ఎలా జరిగాయి, ఘటనా క్రమానికి కారణమైన అంశాలేమిటి అన్నీ నిర్దిష్టంగా తెలుసుకున్నాను. నేను ఈ విషయాలు ఇంతకుముందు ఎప్పుడూ మాట్లాడలేదు. చరిత్రలో రాయవల్సిన అధ్యాయాలు ఇంకా అనేకం ఉన్నాయి. వాటిని రాసేవారే ఉండడంలేదు. ఎందుకంటే వాటిని రాసేవారికి అందుకు అవసరమైన సమయం ఉండడంలేదు.



# 7

**చే గువేరా 20వ వర్ధంతి సందర్భంగా కాస్ట్రో 1987 అక్టోబరు 8న చేసిన ప్రసంగం ఇది. పినార్ డెల్ రియో నగరంలో కొత్తగా నిర్మించిన ఎలక్ట్రానిక్ విభాగాల ఫ్యాక్టరీలో ఈ ఉత్సవం జరిగింది.**

కామ్రేడ్ ఎర్నెస్టో చే గువేరా గౌరవార్థం దాదాపు 20 ఏళ్ళ క్రితం 1987 అక్టోబర్ 18న ఇక్కడ విప్లవ సముదాయంలో మనం పెద్ద సంఖ్యలో సమావేశమైనాము. అవి చాలా దుర్భరమైన కష్టతరమైన రోజులు. యూరో కొండ ప్రాంతాల్లోని వాడో డెల్ యసో ప్రాంతంలో జరిగిన పరిణామాల గురించి మనకు సమాచారం అందింది. చే యుద్ధ భూమిలో నేలకొరిగాడని వార్తా సంస్థలు ప్రకటించాయి.

ఆ వార్తలు నిజమేనని తెలుసుకోవటానికి ఎక్కువ కాలం పట్టలేదు. ఎందుకంటే అవి వార్తలు,ఫొటోలతో నిస్సందేహమైన ఆధారాలు కల్గి ఉన్నాయి. చాలా రోజులు వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇప్పుడు మనకు తెలిసిన చాలా వివరాలు అప్పట్లో తెలియవు. కాని విషయం మాత్రం రూఢి అయ్యింది. దాంతో మనం గంభీరమైన సంస్మరణ సభ జరిపాము. నేలకొరిగిన సహచరుడికి తుది నివాళులర్పించాము.

అప్పటి నుంచి ఇప్పటికి దాదాపు 20 ఏళ్ళు గడిచిపోయాయి. ఇప్పుడు మళ్ళీ అక్టోబరు 8న వర్ధంతి జరుపుకుంటున్నాము. ఇప్పుడు మనం మన దగ్గర నున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం అతను ఆ రోజున హత్యకావించబడ్డాడని అర్థమవుతుంది. యుద్ధంలో అతని ఆయుధాలు ధ్వంసమైపోయాయి. నిరాయుధుడుగా పట్టుకొని బంధించి చంపివేశారని తెలిసింది. అప్పటి నుంచి అక్టోబరు 8న సంస్మరణ దినంగా జరుపుకోవటం సంప్రదాయంగా మారింది.

వర్ధంతి తరువాత 5, 10, 15 సంవత్సరాలు దాటి ఇప్పుడు 20వ ఏట ప్రవేశించాము. ఆ ఘటన చారిత్రక కోణాలను గుర్తు చేసుకోవటం ముఖ్యంగా ఆ వ్యక్తిని స్మరించుకోవటం ఇప్పుడు చాలా అవసరమవుతున్నది. చాలా సహజమైన పద్ధతిలో, చాలా సుస్పష్టమైన, ఆలోచనాత్మకమైన రీతిలో ప్రజలందరూ ఇటీవలి నెలలలో ఆ తేదీని గుర్తు చేసుకుంటున్నారు. 20వ వర్ధంతిని ప్రశాంత గంభీర వాతావరణంలో జరుపుకోవటం ఎలా సాధ్యమో ఇప్పుడు మనం చూస్తున్నాము. సంగీతం, కవాతు, నికోలస్ బులియన్

రాసిన అద్భుతమైన కవిత ఇవన్నీ 20 ఏళ్ళనాటి గొంతును మనకు ప్రతిధ్వనింపచేస్తున్నాయి.

నేను చాలా గంభీరమైన ఉదాత్తమైన ప్రసంగం చేయడానికి ప్రయత్నిస్తాను. లిఖిత పూర్వకంగా కూడా చేయాలనుకుంటాను. కానీ ఈనాడున్న పని వత్తిడిలో ఆ ఘటనలన్నింటినీ మరింత జాగ్రత్తగా ఆలోచించుకోవడానికి ఒక నిముషం కూడా వ్యవధి ఇవ్వడంలేదు. ఇక ప్రసంగం రాసుకోవడం ఎలాగూ సాధ్యం కాదు. అందుకే నేను చే గురించి గుర్తు చేసుకుంటాను. నా ఆలోచనలు మీతో పంచుకుంటాను. ఎందుకంటే నేను చే గురించి చాలా ఆలోచించాను.

ఇటాలియన్ పాత్రికేయుడు (గియానిమైనా) టెలివిజన్ కెమెరాల ముందు దాదాపు 16 గంటలపాటు ఇంటర్వ్యూ చేశారు. దాన్ని నిన్ననే బహిరంగంగా ప్రకటించాము. (ఈ పుస్తకంలో మరో చోట చూడవచ్చు) చాలా అంశాలపై 100కి పైగా ప్రశ్నలు వేశాడు. అయితే ఆ జర్నలిస్టుకు చే పట్ల చాలా ఆసక్తి ఉంది. తెల్లవారుజామున 3, 4 గంటల వరకు మేము ఆ అంశాన్ని చర్చించాము. అందులో ప్రతి ప్రశ్నకు జవాబు చెప్పేందుకు ప్రయత్నించాను. చే గురించిన నా జ్ఞాపకాలను క్రోడీకరించుకోవడానికి ప్రత్యేకంగా కృషి చేశాను.

చే శాశ్వత ప్రభావం గురించి నేను ఎలా భావించానో నాలాగే చాలా మంది కామ్రేడ్స్ ఏమనుకుంటున్నారో అతనికి చెప్పాను. చే తో ఉన్న ప్రత్యేక సంబంధాన్ని ఆప్యాయతను, సౌహార్ద్ర సహచర బంధాలను మనం గుర్తుంచుకోవాలి. మేము తొలిసారి మెక్సికో కలుసుకున్నది మొదలు దాదాపు 12 ఏళ్ళపాటు సాగిన సమైక్య పోరాటాన్ని చారిత్రిక సంఘటనలతో నిండి ఉన్న కాలాన్ని గుర్తుంచుకోవాలి. చే గ్రాన్మా యాత్రలో వెళ్ళడానికి మాతో కలిసినప్పటి నుంచి జరిగిన కాలం చాలా వీరోచితమైన, మహత్తరమైన చర్యలతో నిండి వుంది. ఆ నౌక తీరం చేరడం, ఎదురు దెబ్బలు, చాలా కష్టమైన రోజులు, పర్వతాలలో పోరాటాలు పునఃప్రారంభం, దాదాపు శూన్యం నుంచి సైన్యాలను పునర్నిర్మించడం, తొలిపోరాటాలు, తొలి సమరాలు అన్నీ.

తరువాత విప్లవ విజయానంతరపు ఉద్విగ్న కాలం. విప్లవపు తొలి ఘట్టాలు. వాటిలో మేము ప్రజలకిచ్చిన హామీలపట్ల పూర్తి విశ్వసనీయంగా ఉండటానికి ప్రయత్నించాము. తరువాత దేశంలో ప్రజాజీవితాన్ని సమూలంగా పరివర్తన చేయడానికి ప్రయత్నించాము. తరువాత ఒకదాని వెంట ఒకటిగా ఘటనలు చోటు చేసుకున్నాయి. సామ్రాజ్యవాదుల శత్రుత్వం విప్లవంపై దుష్ప్రచారాలు. వేలాది మంది మన దేశ పౌరులను హత్య చేసిన నేరస్థులు, దుండగుల విషయంలో న్యాయమైన చర్యలు తీసుకోవడం ప్రారంభించగానే ఈ గగ్గోలు బయలుదేరింది. ఆర్థిక దిగ్బంధన వచ్చింది. బే ఆఫ్ పిగ్స్ దురాక్రమణ విప్లవపు సోషలిస్టు ప్రభావపు ప్రకటన, కిరాయి సైనికులపై పోరాటం, అక్టోబరు (మిసిలీ) సంక్షోభం ఏమీ లేనిచోట సోషలిజాన్నిన నిర్మించేందుకు తొలి చర్యలు ఇవన్నీ వచ్చాయి. అనుభవంలేదు, కార్యకర్తలు లేరు, ఇంజనీర్లు, ఆర్థిక వేత్తలు, సాంకేతిక నిపుణులు ఎవరూ లేరు. దాదాపు డాక్టర్లు కూడా లేరు. మూడు నుంచి ఆరు వేల మంది డాక్టర్లు దేశం వదిలి వెళ్ళిపోయారు.



అలాంటి తరుణంలో ప్రథమ ద్వితీయ హవానా ప్రకటనలు వెలువడ్డాయి. మన దేశాన్ని ఒంటరిని చేయడం మొదలైంది. మెక్సికో తప్ప తక్కిన లాటిన్ అమెరికన్ దేశాలన్నీ దౌత్య సంబంధాలను తెంచివేసుకున్నాయి. ఈ పరిణామాలన్నింటితోపాటు మనం దేశ ఆర్థిక వ్యవస్థను నిర్మించుకోవాల్సి వచ్చింది. అది చాలా స్వల్పకాలమే కానీ మరపురాని ఘటనలతో నిండిన కాలం.

చే కు ఒక కోరిక అలాగే ఉండిపోయిందని గుర్తుంచుకోవాలి. అది ఆయన పాత కోరిక. దక్షిణ అమెరికాలో తన దేశానికి తిరిగి వెళ్ళాలని. మన దేశంలో సాధించిన అనుభవం ఆధారంగా అక్కడ విప్లవం విజయవంతం చేయాలని అతని కోరిక. అతన్ని రహస్యంగా పంపడం ఎలా జరిగిందో విప్లవంపై దుష్ప్రచారాలు ఎలా సాగాయో మనం గుర్తు చేసుకోవాలి. చే తో ఘర్షణలు విభేదాలున్నాయని కథలు వెలువడ్డాయి. విప్లవ శ్రేణులలో చీలికలవల్లనే అతను హత్య చేయబడ్డాడని కూడా చెప్పారు.

మరో వైపున విప్లవం ఈ భీకరమైన దాడిని ప్రశాంతంగా, దృఢంగా ఎదుర్కొంది. ఎందుకంటే దీనివల్ల కల్గిన జుగుప్సా, క్రోధం కంటే చే తన లక్ష్యాలను సాధించే అవకాశం ఇవ్వడం ముఖ్యమని తలచాము. చారిత్రిక కర్తవ్యంతో బయలుదేరిన అతనికి, అతని సహచరులకు భద్రత ముఖ్యమనుకున్నాము.

నేను ఇందాక చెప్పిన ఇంటర్వ్యూలో చే భావాల గురించి, దక్షిణ అమెరికాకు తిరిగి వెళ్తానంటూ అతను పెట్టిన ఒకే ఒక్క షరతు గురించి చెప్పాను. రాజ్యానికి ఏదో నష్టం కల్గుతుందనే కారణంగా అతన్ని ఆపే ప్రసక్తి ఉండదని హామీ ఇచ్చాను. అతను ముందుకు సాగిపోవచ్చని మా మద్దతు ఉంటుందని చెప్పాను. అతను తను వెళ్ళిపోయే సమయం ఆసన్నమైందని నిర్ణయించుకునే వరకు ఈ హామీని పునరుద్ఘాటిస్తూ వచ్చాము. అతని ప్రయాణానికి ఒప్పుకోవడమే కాదు, అన్ని విధాలా సహాయం చేసే విషయంలో కూడా ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాము. అతని ప్రయాణాన్ని కొంత కాలం జాప్యం చేయడానికి మాత్రమే ప్రయత్నించాము. గెరిల్లా అనుభవాన్ని మరింత మెరుగు పర్చుకునేందుకు ఇతర కర్తవ్యాలు అప్పగించాము. గెరిల్లా దళాన్ని నిర్మించే తొలి రోజుల్లో అత్యంత కష్టమైన పరిస్థితి ఉంటుందని మా అనుభవాన్ని బట్టి తెలుసు. కనుక దాన్ని అధిగమించేందుకు అవసరమైన కనీస పరిస్థితులు సృష్టించేందుకు ప్రయత్నించాము.

చే సామర్థ్యం, అనుభవం గురించి అతని పాత్ర గురించి మాకు బాగా తెలుసు. ప్రధానమైన వ్యూహాత్మక కర్తవ్యాలకు తగిన కార్యకర్త అతను. అందువల్ల తొలి నిర్మాణ బాధ్యతలు మరెవరైనా కార్యకర్తలు చేపట్టడం మంచిదని అనుకున్నాము. కొంత ముందుకు సాగిన తరువాత అతను వెళ్ళి చేరవచ్చునని అనుకున్నాము. యుద్ధ కాలంలో శక్తివంతులైన కార్యకర్తలు మరింత కీలకమైన వ్యూహాత్మకమైన బాధ్యతల కోసం అట్టిపెట్టుకోవడమనే మా విధానం అదే. మన దగ్గర అనుభవజ్ఞులైన కార్యకర్తలు ఎక్కువ మంది లేరు. దాడికి వెళ్ళే ప్రతి దళంతో వాళ్ళను పంపలేము. దానికి బదులుగా వారి శక్తి సామర్థ్యాలకు అనుభవానికి తగినట్టుగా మరింత ముఖ్యమైన బాధ్యతలు అప్పగించేవాళ్ళం.

సియరామస్త్రాలో బాటిస్టా తుది దాడి చేసినప్పుడు మాకు సమరశీలత ఉన్న సంఖ్య చాలా తక్కువ. బాగా అనుభవజ్ఞులైన కార్యకర్తలు ముందు పీఠిన ఉండేవారు కాదు. వారికి వ్యూహాత్మక నాయకత్వ బాధ్యతలు అప్పగించేవాళ్ళం. తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేయడానికి వారిని అట్టిపెట్టుకొనేవాళ్ళం. చే, క్యామిలో (సెన్ ఫ్యూజోస్) వంటి వారు అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. అలాంటి వారిని ఒక దళానికి నాయకులుగా పంపడం అర్థంలేని పని అయి వుండేది. వారిని వెనకతట్టున ఉంచి, తరువాత కాలంలో ప్రమాదకరమైన అతి కీలక దాడులకోసం ఉపయోగించుకున్నాము. అలాంటి బాధ్యతలతో వారిని శత్రువు భూభాగంలోకి పంపించాము. ఉన్న చిక్కులు తెలిసినప్పటికీ పూర్తి బాధ్యతతో పంపించాము. క్యామిలో, చే లు లాస్‌విలాస్ దాడికి వెళ్ళడం అటువంటి ఉదాహరణే. అది చాలా కష్టతరమైన బాధ్యత. అపారమైన అనుభవం దళాధిపతులుగా పట్టు. లక్ష్యాలు చేరుకునే సామర్థ్యం ఉన్న వారు చేయాల్సిన పని అది.

ఈ విధమైన హేతుబద్ధ పద్ధతి పాటిస్తే లక్ష్యాలను దృష్టిలో ఉంచుకున్నప్పుడు దీన్ని అమలు జరిపి చే తదుపరి దశలో పోరాటంలో చేరి ఉంటే బాగుండేది. కానీ అతను చాలా అసహనంగా ఉన్నాడు. కొంత మంది అర్జెంటీనియన్ కామ్రేడ్స్ తొలిప్రయత్నాల్లో చనిపోయారు. చాలా ఏళ్ళ క్రిందట అతను చేసిన ఆ ప్రయత్నాల్లో ప్రెస్‌నా లాటినా సంస్థాపకుడు రికార్డో మాస్‌సేటితో సహా పలువురు చనిపోయారు. అతను వారిని తరచూ గుర్తుకు తెచ్చుకునేవాడు. తొందరగా వెళ్ళి చేరిపోవాలని చాలా అసహనంగా ఉండేవాడు.

ఎప్పటిలాగానే మేము ఇచ్చినమాట నిలబెట్టుకోవాలనే ప్రయత్నించాము. అతని అభిప్రాయాలను గౌరవించాము. ఎందుకంటే మా సంబంధం సంపూర్ణ విశ్వాసంపై, సహోదరత్వంపైనా ఆధారపడినది. అతను పోరాటంలో చేరడానికి సరైన సమయం ఏది అన్న విషయంలో మా అభిప్రాయాల మధ్య తేడాలు ఉన్నా అది చెరిగిపోదు. అందుకే మేము అతనికి పూర్తి సహాయం చేశాము. పోరాటం ప్రారంభించడానికి అవసరమైన సదుపాయాలను కల్పించాము.

తొలి ఘర్షణల గురించి నా సమాచారం అప్పుడు వచ్చింది. సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. గెరిల్లా ఉద్యమం నిర్మిస్తున్నట్లు తొలిదశలోనే శత్రువు కనుగొన్నాడు. ఈ దశ చాలా నెలలపాటు కొనసాగింది. కేవలం అంతర్జాతీయ వార్తా సంస్థల ద్వారా అందే సమాచారం తప్ప మరేమీ లేకుండా పోయింది. దాన్ని యథాతథంగా తీసుకోవడానికి ఉండదు. కానీ మా విప్లవం ఆ విషయంలో చాలా అనుభవం గడించింది. ఒక కథనం విశ్వసనీయమైనదా? బూటకమైనదా? అని నిర్ధారించుకునే అవగాహననిచ్చింది.

ఉదాహరణకు జాక్విన్ బృందం (అతని అసలైన పేరు విలో అకునా) మరణవార్త వచ్చింది. మేము దాన్ని విశ్లేషించాము. అది నిజమేనని నిర్ధారణకు వచ్చాము. ఎందుకంటే ఆ బృందం నదిని దాటుతుండగా హతమార్చబడిందని వర్ణించిన తీరును బట్టి. మాకున్న గెరిల్లా అనుభవాన్నిబట్టి. అలాంటి బృందాన్ని నిర్మూలించడానికి ఉండే కొన్ని అసాధారణ అవకాశాలు ఏమిటో మాకు తెలుసు.



సైన్యంతో ఒక రైతు సంబంధం పెట్టుకున్నాడని ఈ బృందం ఉనికి, పథకాల గురించి వివరమైన సమాచారం ఇచ్చాడని తెలియవచ్చింది. అప్పుడది నది దాటడానికి మార్గం వెదుకుతున్నది. సైన్యం నదికి అటువైపున ఒక చోట మాటు వేసి ఉంది. ఆ రైతు గెరిల్లా యోధులకు సూచించిన మార్గం కూడా అదే. వారు ప్రవాహ మధ్యంలో ఉండగా సైన్యం కాల్పులు ప్రారంభించింది. ఈ కథనంలో వాస్తవాన్ని ప్రశ్నించవల్సిన అవసరం లేదు. అదే కట్టుకథలు సృష్టించేవారైతే చాలా గజిబిజిగా అబద్దాలు వదులుతుంటారు. ఆ పని చాలా సార్లు జరిగింది. కానీ ఇక్కడ పరిస్థితి అది కాదు కనుకే ఆ కథనం నిజమే అయివుంటుందని నిర్ధారించుకున్నాము.

ఇప్పటికే వివరించినట్లుగా కేవలం 20 మందిమి మాత్రమే ఉన్నప్పుడు కూడా ఆశలు వదులుకునేవారం కాదు. చాలా క్లిష్ట పరిస్థితుల్లో కూడా గెరిల్లాలకు అవకాశం ఉంటుంది. వారు రైతులు సంఘటితమై ఉన్న చోటుకి వెళ్తున్నారు. అక్కడ పట్టుకల్గి ఉన్న కొంత మంది మంచి బొలీవియా కార్యకర్తలు ఉన్నారు. అందువల్లనే ఆఖరి క్షణం వరకు చిట్టచివరి క్షణాల వరకు కూడా ఆ ఉద్యమం నిలదొక్కుకుని అభివృద్ధి చెందే అవకాశం మిగిలే ఉండింది.

చే తో నా సంబంధాలు పెరిగిన పరిస్థితులు చాలా విలక్షణమైనవి. అవి దాదాపు ఊహాజనితమైనవిగా కన్పిస్తాయి. విప్లవపు తొలి దశ చాలా సంక్షిప్తమైనప్పటికీ సంఘటనాత్మకమైనది కూడా. అప్పుడు మేము అసాధ్యాన్ని సాధ్యం చేయటానికి నిమగ్నమై ఉన్నాము. నేను ఆ జర్నలిస్టుకు చెప్పినట్లుగా చే చనిపోలేదు బతికే ఉన్నాడని అనిపిస్తుండేది. ఎందుకంటే ఆయనది అలాంటి ఆదర్శవ్యక్తిత్వం, మరుపురానిది, సుపరిచితమైనది. అలాంటి వ్యక్తి చనిపోయాడన్న వాస్తవాన్ని అంగీకరించడం కష్టం.

కొన్ని సార్లు నేను కలగంటుంటున్నాను. మనందరం కూడా మన జీవితాలు, పోరాటాలు గురించి కలగంటుంటాము. అలాగే నేను చే తిరిగి వచ్చినట్టు సజీవుడుగా ఉన్నట్టు కలగంటాను. అలా ఎన్నిసార్లు జరిగిందో. మీరెప్పుడు నోరు విప్పి చెప్పని ఇలాంటి భావాలు చే వ్యక్తిత్వం వేసిన ప్రగాఢ ముద్రను చెప్తాయి. ఈ మాటే నేను జర్నలిస్టుకు చెప్పాను. చే భావాలు, చర్యలు ఆదర్శాలు, అతను సృష్టించిన అంశాలు ఇవన్నీ అతని ప్రాధాన్యతను ఇంకా కొనసాగిస్తూనే ఉన్నాయి. అతని పట్ల లాటిన్ అమెరికాలోనేకాక ఐరోపాలో మొత్తం ప్రపంచంలోనే గౌవరం ఉంది.

20 ఏళ్ళ క్రిందట అక్టోబరు 18న మేము చెప్పినట్లుగానే చే పీడితులు, బాధితులందరికి ప్రతీకగా తయారయ్యాడు. దేశభక్త ప్రజాతంత్ర శక్తులంటినికీ విప్లవకారులన్నింటికీ ఆయనొక ప్రతీక అయ్యాడు. ఆయన ఒక శాశ్వత అజేయ సంకేతంగా రూపొందాడు.

ఇన్ని కారణాలవల్ల మేము చే ఉన్నట్టు భావిస్తుంటాము. ఈనాటికీ ఆయన ప్రసరించే నిజమైన శక్తి మా అందరి స్ఫూర్తిలో ప్రతిబింబిస్తుంది. మేము కవిత విన్నప్పుడు, కవాతు సంగీతం విన్నప్పుడు ఒక నిమిషం సంతాపానికి ముందు ఈల శబ్దం విన్నప్పుడు, పత్రికలు

తెరిచినప్పుడు, తన జీవితం వివిధ దశలకు సంబంధించిన చే ఫొటోలు చూసినప్పుడు అతని గురించి ప్రపంచమంతా తెలుస్తుంది. చే లో మానవ నైతిక విలువలన్నీ ఉండటం ఒక్కటే కాదు. ఆయనకొక ప్రతీకగా కనపడేందుకు అవసరమైన రూపం కూడా ఉందేది. ఆయన చూపులు, చూపుల శక్తి, సూటిదనం, ఆయన ముఖం, ముఖవర్చస్సు తన స్వభావాన్ని ప్రతిబింబించేవి. కార్యాచరణలో తిరుగులేని స్వభావాన్ని చెప్పేవి. అదే సమయంలో గొప్ప మేథస్సును ప్రగాఢ స్వచ్ఛతను కూడా ప్రతిఫలించేవి. ఆయన రాసిన కవితలు విన్నప్పుడు ఆ గాథలు తిరిగి తలచుకున్నప్పుడు మేము నిజంగా చే ఉన్నాడని అతని ప్రభావానికి గురవుతాము.

చే బతికే ఉన్నాడని కార్యాచరణలో ఉన్నాడని, అతనెప్పుడూ చనిపోలేదని ఊహించుకొనేటట్లయితే అప్పుడు దైనందిన జీవితంలోనేకాక కలలల్లో కూడా అతని ఉనికిని చూడగల్గటం పెద్ద వింతేమి కాదు. చివరగా మనం ఒక నిర్ధారణకు రావచ్చు. మన విప్లవ జీవితానికి సంబంధించిన లక్ష్యాలు, ప్రయోజనాల కోణం నుంచి చూస్తే చే ఎప్పుడూ చనిపోనే లేదు. అతను ఎప్పటికంటే సజీవుడుగానే ఉన్నాడు. ఏనాటికంటే కూడా ఇప్పుడు అతను సామ్రాజ్యవాదానికి ప్రగాఢ శక్తివంతమైన శత్రువుగా ఉన్నాడు.

ఆయన మృతదేహాన్ని గల్లంతు చేసి తనొక ప్రతీకగా మారకుండా చేయాలనుకున్నవారు తమ సామ్రాజ్యవాద యజమానుల ఆదేశాల మేరకు దానికి సంబంధించిన అవశేషమేదీ మిగలకుండా చేయాలకున్నవారు ఒక విషయం గుర్తించవలసి వచ్చింది. అతని భౌతికకాయం లేకపోయినా సామ్రాజ్యవాదాన్ని భయకంపితం చేసే ప్రత్యర్థి, ప్రతీక, శక్తి అలాగే మిగిలిపోయింది. దాన్ని ఎప్పటికీ నాశనం చేయలేరు.

వారు చే మృతదేహాన్ని దాచిపెట్టడం ద్వారా తమ బలహీనతను పిరికితనాన్ని వెల్లడించుకున్నారు. ఆ ఆదర్శం, ఆ సంకేతం అంటే తమకు భయమని చాటుకున్నారు. ఈ భూఖండంలో దోపిడీకి గురైన రైతులు, కార్మికులు, విద్యార్థులు, మేధావులు, యువకులు, ప్రజాతంత్రవాదులు, ప్రగతిశీలవాదులు, లేదా దేశభక్తులు చే కు నివాళులర్పించే ప్రదేశం అంటూ ఉండకుండా చేయాలనుకున్నారు. ఈనాటి ప్రపంచంలో చూస్తే చే కు నివాళులర్పించే ప్రత్యేక స్థలం ఏమీ లేదు. కానీ ప్రతి చోటా ఆ పని జరుగుతున్నది.

చే కు ఏడాదికి ఒకసారి కాదు 5, 10, 15 20 ఏళ్ళకు ఒకసారి కాదు ప్రతి ఏటా, ప్రతి నెలా, ప్రతి రోజూ, ప్రతి చోటా, ఫ్యాక్టరీలో, పాఠశాలలో, సైనిక నిలయాల్లో, గృహాల్లో, పిల్లల్లో, అగ్రగాముల్లో అందరి నుంచి నివాళులందుతున్నాయి. ఈ 20 ఏళ్ళల్లో అగ్రగాములైన వారు ఎన్నిసార్లు 'మేము చే వలే ఉంటాము అని చెప్పారు, విన్నాం'.

ఇప్పుడు నేను చెప్పిన ఈ ఒక్కభావం, ఈ ఒక్క ఆచారం చాలు. చే శాశ్వత ప్రభావాన్ని, స్ఫూర్తిని చాటడానికి. అగ్రగాములు మాత్రమే కాదు మన పిల్లలు మాత్రమే కాదు, ఈ ఖండంలోని పిల్లలు మాత్రమే కాదు, ప్రపంచమంతటా కూడా ఇదే నినాదం విన్పిస్తుంది. 'మేము చే వలె ఉంటాము'.

నిజంగానే ఇంతకన్నా మెరుగైన ప్రతీక, ఇంతకన్నా మెరుగైన ప్రతిష్ఠ, ఇంతకన్నా



ఖచ్చితమైన భావం, ఇంకేమీ ఉండదు. ఒక విప్లవకర వ్యక్తిత్వానికి, విప్లవకర కమ్యూనిస్టుకు నమూనా కోసం వెదికేటప్పుడు ఇదే అర్థమవుతుంది. ఈ విషయంలో చాలా గాఢమైన నమ్మకం ఉండబట్టే ఈ మాట చెప్తున్నాను. ఆ అక్టోబరు 18న మాట్లాడినప్పుడు నేను ఇదే విషయం ఇంతకంటే గట్టిగా చెప్పాను. మన యోధులు, విప్లవకారులు, పార్టీ సభ్యులు, పిల్లలు ఎలా ఉండాలంటే చే లా ఉండాలని అనుకుంటారని చెప్పాను. కేవలం సోషలిజం మాత్రమే కాక ఉన్నత స్థాయి సోషలిజం నిర్మించాలనుకుంటే ఒకనాటికి కమ్యూనిస్టు సమాజంలో జీవించాలనే పవిత్రమైన అసాధారణమైన ఆశయాన్ని మానవజాతి వదులుకోనట్లయితే కమ్యూనిస్టు సమాజంలో మనిషి ఎలా ఉండాలనేదానికి అతను ప్రతీక అవుతాడు.

ఈ ఉన్నత ఆశయాల కోసం మనకొక పోలిక, ఒక నమూనా, ఒక ఆదర్శం కావాలనేట్లయితే అప్పుడు చే వంటి వ్యక్తులు చాలా అవసరమవుతారు. స్త్రీ, పురుషులు వారినే అనుసరిస్తారు. వారిలా ఉండాలనుకుంటారు. వారిలా ఆలోచిస్తారు. ప్రవచిస్తారు. ప్రతి చిన్న విషయంలో ప్రతి వివరణలో ప్రతి కార్యక్రమంలో తమ బాధ్యత నిర్వహించేటప్పుడు అతనిలా ప్రవర్తించాలని స్త్రీ పురుషులు కోరుకుంటారు. ఒక ఆదర్శం నెలకొల్పటం ద్వారా బోధించడం, నేర్పించడం అతని అలవాటు. ప్రతి విషయంలో ముందు ఉండాలని అతి క్లిష్టమైన పనులు చేయడానికి కూడా ఐచ్ఛికంగా ముందుకు రావాలని అత్యంత ఆత్మత్యాగం ప్రదర్శించాలని అతను అనుకునేవాడు. తన శరీరాన్ని ఆత్మను కూడా ఒక లక్ష్యానికి ధారబోసేవాడు. ఇతరుల కోసం అర్పించేవాడు. నిజమైన సంఘీభావం ప్రదర్శించేవాడు. ఒక కామ్రేడ్‌ని ఎప్పుడూ వదులుకొనేవాడు కాదు. చాలా నిరాడంబర వ్యక్తి, లోపరహితుడైన వ్యక్తి, చెప్పేదానికి, చేసేదానికి మధ్యలో ఎలాంటి వైరుధ్యం లేకుండా బతికిన వ్యక్తి. బోధనకు, ఆచరణకు మధ్య తేడా చూపని వ్యక్తి. ఆలోచనా శీలి, ఆచరణ శీలి కూడా. ఇవి చే వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే అంశాలు.

ఈ దేశంలో జన్మించకపోయినా చే వంటి వ్యక్తిని మన ప్రజల పుత్రుడుగా కలిగి ఉండడం గొప్ప గౌరవం, గొప్ప అవకాశం. ఈ దేశపు పుత్రుడుగా పరిగణించుకుని, పరిగణించబడాలని కోరుకున్నాడు గనుకనే అతనికి ఆ హక్కు వచ్చింది.

అసాధారణ వ్యక్తులు అరుదుగా ఉంటారని నేను చెప్పడంలేదు. జనబాహుళ్యంలో వందలు వేలు లక్షల సంఖ్యలో కూడా అసాధారణ వ్యక్తులు ఉండరని నేను చెప్పడంలేదు. క్యామిలో అదృశ్యమైన తరువాత ఆ కష్ట కాలంలో ఒకసారి నేను ఇలా అన్నాను. క్యామిలో ఆ స్థానానికి ఎలా చేరుకున్నాడు అని ఆలోచించినప్పుడు 'మన ప్రజల్లో చాలా మంది క్యామిలోలు ఉన్నారు అని నేను అన్నాను' అలాగే ఇప్పుడు మన ప్రజల్లో చాలా మంది చే లు ఉంటారని కూడా అంటాను.

కాని నేను వారిని అసాధారణ ఉదాహరణలుగా పరిగణించడానికి కారణమేమిటి. ఎందుకంటే వాస్తవంగా వారున్న ప్రపంచంలో పరిస్థితుల్లో వారు తామేమిటో నిరూపించుకున్నారు. మనుషులందరూ తమ దయాగుణంతో, సంఘీభావంతో ఏమి

చేయగలరో నిరూపించారు. నిజంగానే అలాంటి పరిస్థితుల్లో మనుషులు తమలో ఉన్న సామర్థ్యాన్ని పూర్తిగా వెల్లడించుకుంటారు.

ఈ ప్రజల్లో వీరత్వం ప్రదర్శించగలవారు అసంఖ్యాకంగా ఉంటారన్నది స్పష్టం. ఇతరుల ఉదాహరణలు చూసి, కొన్ని కొత్త విలువలను చూసి వారు అలాంటి వీరత్వానికి సిద్ధపడతారు. ఒక విధమైన నిశ్శబ్ద వీరత్వం కూడా ఉంటుంది. అజ్ఞాతంగా కూడా ఉంటుంది. దాన్ని నేను ఎంతో గొప్పగా ప్రశంసిస్తాను. అదొక అనామక లక్షణం కావచ్చు. కానీ అదేమంత అసాధారణం కాదు. చే వంటి ఒక వ్యక్తి ఉద్భవించడానికి అవసరమైన పరిస్థితులు అలాగే సృష్టించబడతాయి. వారు ఈనాడు ప్రపంచమంతటికి ప్రతీకగా పెంపొందుతారు. ఈ గొప్ప మూర్తి మన విప్లవంలో ఉద్భవించడం గొప్ప గౌరవం, మహదవకాశం కూడా.

ఇంతకు ముందు నేను నేటికీ కనిపించే చే ఉనికి గురించి శక్తి గురించి చెప్పాను. దాని గురించి ఒక మాట అడుగుతాను. చే ను చేపట్ల మనందరి విశ్వాసాన్ని, ప్రగాఢ భావాలను ప్రశంసాదృష్టిని, కృతజ్ఞతను వెల్లడించడానికి ఈ తేదీకన్నా ఈ సందర్భంకన్నా మెరుగైనది మరేమి ఉంటుంది. మనం ఇప్పుడు దిద్దుబాటు క్రమంలో ఉన్నాం కదా.

మనం దేన్ని దిద్దుబాటు చేసుకుంటున్నాము. చాలా ఉన్నాయి. వాటన్నింటినీ. విప్లవ స్ఫూర్తి నుంచి, విప్లవ కృషి నుంచి, విప్లవ విలువల నుంచి, బాధ్యతల నుంచి వైదొలగిన అంశాలన్నింటినీ దిద్దుబాటు చేసుకుంటున్నాం. మన ప్రజల్లో సంఘీభావ దృష్టిలోపించిన అంశాలన్నింటినీ దిద్దుకుంటున్నాము. చే భావాలను, విప్లవకర ఆలోచనలను, శైలిని, స్ఫూర్తిని, ఆదర్శాన్ని వమ్ముచేసే మూర్ఖత్వం, మొరటుతనం వంటి వాటినన్నింటినీ దిద్దుకుంటున్నాము.

నేను నిజంగా నమ్మకంతో, గొప్ప సంతృప్తితో చెప్పగలను. చే కనుక ఈ రోజు మన మధ్య ఉంటే చాలా సంతోషించి ఉండేవాడు. మనం ఈ రోజు చేస్తున్నదాన్ని చూసి చాలా సంతోషించేవాడు. అస్థిరత్వంతో కూడిన కాలంలో సోషలిజం నిర్మాణానికి సంబంధించిన కష్టకాలంలో అనేక భావాలు ఈ యంత్రాంగాలు, చెడ్డ అలవాట్లు ప్రబలాయి. అవి చే లో చాలా తీవ్రమైన వ్యతిరేకతను తెచ్చి ఉండేవి. అందుకు భిన్నమైన ప్రస్తుత పరిస్థితి చే కు ఎంతైనా సంతోషం కలిగిస్తుంది.

ఉదాహరణకు స్వచ్ఛంద శ్రమనే తీసుకుందాం. అది చే సృష్టించిందే. అతను మన దేశంలో ఉండి విప్లవంలో భాగం పంచుకుని వెళ్ళిపోయేటప్పుడు వదలిపెట్టిన అత్యుత్తమ అంశాల్లో అదొకటి. అదిప్పుడు క్రమేణా క్షీణిస్తున్నది. దాదాపు మొక్కుబడిగా తయారైంది. ఒక రోజున ఒక ప్రత్యేక సందర్భాన ఆదివారం మాత్రమే చేస్తున్నారు. ప్రజలు తరచూ హడావిడి పడుతూ చెల్లాచెదురుగా ఆ పని చేస్తున్నారు.

స్వచ్ఛంద శ్రమకు సంబంధించి నిరంకుశాధికారులు సాంకేతిక నిపుణుల భావాలు మౌలికంగానే అత్యవసరమైనవిగాని కావు. అయినా అవే అంతకంతకు బలపడుతున్నాయి. ఒక మూర్ఖమైన దండగమారి వ్యవహారంగా తతంగంగా దాన్ని చూస్తున్నారు. సమస్యలను ఓవర్‌టైమ్‌తో ఇంకా ఇంకా ఎక్కువ ఓవర్‌టైమ్‌తో పరిష్కరించాలని అనుకుంటున్నారు.



అదే సమయంలో మామూలు పని దినాన్ని మాత్రం సమర్థంగా ఉపయోగించడంలేదు. మనం అధికార యంత్రాంగపు గాడిలో పడిపోయాం. ఎక్కువ ఉద్యోగులను పెంచుకోవటం. కాలం చెల్లిన పని పద్ధతులు, మోసకారి తనం, అబద్ధాలు వంటివాటికి లోబడ్డాము. చే కు కంపరమెత్తించే అనేక చెడ్డ అలవాట్ల ఊబిలో పడిపోయాం.

క్యూబా విప్లవం నుంచి వచ్చిన సంస్థలు కొన్ని లాభదాయకంగా కన్పించడానికి దొంగతనం చేస్తున్నాయని, నటిస్తున్నాయని ఎవరైనా, ఎప్పుడైనా చే కు చెప్పి ఉంటే అతను దిగ్భ్రాంతుడై ఉండేవాడు. సంస్థలు లాభదాయకం కావాలంటే బహుమానాలు ఇవ్వాలని, బోనస్‌లు ఇవ్వాలని ఇంకా నాకు తెలియనివి ఏవేవో ఉంటాయని నిర్మించడం కోసం తమకు కేటాయించిన సరుకులను అమ్మివేసి నిర్మించినట్టుగానే ఛార్జీ వసూలు చేసే సంస్థలు ఉంటాయని చే కు చెప్పి ఉంటే అతని దిమ్మతిరిగి ఉండేది.

మన రిపబ్లిక్ రాజధానిలో, 15 మున్సిపాలిటీలలో ఇలాంటివి జరిగాయని నేను మీకు చెప్పగలను. ఇళ్ళ మరమ్మత్తులకు సంబంధించిన 15 సంస్థలు ఇందుకు బాధ్యత వహించాల్సి ఉంది. ఇవి కేవలం ఒక్క ఉదాహరణ మాత్రమే. ఏడాదికి 8 వేల పెసోల విలువైన ఉత్పత్తి చేసినట్టు అవి చెప్పుకున్నాయి. గందరగోళం సర్దుమణిగాక చూస్తే అవి కేవలం 4 వేలు, అంతకన్నా తక్కువే చేసినట్టు తేలింది. అవీ లాభదాయకమైనవి కావు. తమ ఉత్పత్తి లక్ష్యాలు పూర్తి చేసేందుకు అధిగమించేందుకు మోసానికి కూడా పాల్పడే సంస్థలు ఉన్నాయని, జనవరి పని డిసెంబర్‌లోనే పూర్తి చేసినట్లు చూపుకుంటాయని చే కు తెలిస్తే తప్పనిసరిగా దిగ్భ్రాంతి చెందేవాడు.

తమ ఉత్పత్తి పథకాలు పూర్తి చేసి బహుమతులు ఇచ్చే సంస్థలు – అంటే మరింత విలువగల ఉత్పత్తులు చేయడంగాక ఎక్కువ విలువ చూపడం ద్వారా ఆ లక్ష్యాలు పూర్తి చేసే సంస్థలు ఉన్నాయని, తక్కువ లాభాలు వచ్చే పనులు అవి చేయవని తెలిస్తే కూడా అతను చాలా హతాశుడై ఉండేవాడు. ఉత్పత్తి ప్రమాణాలు అత్యంత బలహీనంగా తక్కువ స్థాయిలో ఉన్నాయని నైతికత కూడా ఉండడంలేదని కొన్ని సందర్భాల్లో కార్మికులు వాటికి రెండు మూడు రెట్లు చేయగల్గుతున్నారని తెలిస్తే చే దిగ్భ్రాంతి చెందేవాడు. డబ్బు ప్రజలకు ప్రధాన దృష్టిగా మారిందని అదే వారికి ప్రాథమిక ప్రేరణ అయ్యిందని తెలిస్తే కూడా అతను బాధపడి ఉండేవాడు. ఎందుకంటే అలాంటిది తగదని అతనెప్పుడూ హెచ్చరించేవాడు. పని గంటలు తగ్గించడం, లక్షలాది గంటలు ఓవర్ టైమ్‌లు మన కార్మికుల మానసిక స్థితిని కలుషితం చేయడం ఇవన్నీ డబ్బు కోసం జరుగుతున్న పనులు.

కుళ్ళిపోయిన పెట్టుబడిదారీ పద్ధతులను అనుసరించడం ద్వారా కమ్యూనిజం ఎప్పటికీ సాధించలేమని చే కు తెలుసు. ఆ మార్గాలు అనురించడం అంటే సౌహార్ద్రత, అంతర్జాతీయత అనే లక్షణాలన్ను మర్చిపోవడం అని కూడా అతనికి తెలుసు. తద్వారా నిజమైన మానవులు దాని నూతన సమాజంగానే ఎప్పటికీ సాధ్యం కావు.

ఉత్పత్తితో ఏ మాత్రం సంబంధం లేకుండా బోనస్‌లు, మరిన్ని బోనస్‌లు చెల్లించే రోజు వస్తుందని ఎవరైనా చెబితే చే హతాసుడై ఉండేవాడు.

పాక్షిక పెట్టుబడిదారీ సంస్థలను అయన చూసి వుంటే పెట్టుబడిదారీ పద్ధతులు అనుసరిస్తూ, వారిలా వ్యవహరిస్తూ దేశాన్ని, ప్రజలను, ఉన్నత ప్రమాణాలను మర్చిపోయే స్థితి చూస్తే కూడా అతను దిగ్భ్రాంతి చెందేవాడు. (ఉన్నత ప్రమాణాలు ముఖ్యం కాదు, తక్కువ ప్రమాణాలను అనుసరించడం ద్వారానే ఎక్కువ లాభం కలుగుతుంది కదా!)

మానవ శ్రమకు మాత్రమే కాక మేధాశ్రమకు కూడా ఉత్పత్తి ప్రమాణాలు నిర్ణయించడం జరుగుతున్నది. అంటే చెరుకు నరకడం, ఇంకా అనేక శరీర కష్టాలకు సంబంధించిన పనులకు ఉత్పత్తి లక్ష్యాలు నిర్ణయించడంలో కొంత అర్థం ఉంటుంది. కానీ రేడియోలో, టెలివిజన్‌లో పని చేయడం, సర్జన్‌గా పని చేయడం వంటి వాటికి కూడా లక్ష్యాలు నిర్ణయించి ప్రతివారి మెడపై కత్తి వేలాడదీయడం, వారి ఆదాయాన్ని రెట్టింపు మూడు రెట్లు చేసుకోవడం. ఇదంతా చే కు మింగుడు పడి ఉండేది కాదు. ఎందుకంటే ఈ మార్గాలేవి కమ్యూనిజానికి చేర్చేవి కావు. పైగా అవి చెడ్డ అలవాట్లకు, పెట్టుబడిదారీ విధానానికి సంబంధించిన, పరాయీకరణకు మాత్రమే దారి తీస్తాయి. ఈ మార్గాలు నిజమైన సోషలిజానికి ఎప్పుడూ దారి తీయవని చే కు బాగా తెలుసని నేను మళ్ళీ చెప్తున్నాను. ఎందుకంటే సోషలిజమే కమ్యూనిజానికి వెళ్ళే మొదటి పరివర్తన దశ.

అయితే చే అమాయకుడని, ఆదర్శవాది అని వాస్తవంతో సంబంధం లేనివాడని అనుకోవద్దు. అతను వాస్తవాని అర్థం చేసుకొని గమనంలోకి తీసుకునేవాడు. అయితే మానవులపట్ల చే కు నమ్మకం ఉండేది. మనం మానవుల మీద నమ్మకం కలిగి ఉండనట్లయితే వారు జంతువుల వలే ఆడించదగినవారేనని అనుకుంటే అప్పుడు పరిస్థితి మరోలా ఉంటుంది. మీరు గడ్డిపెడితే అవి ఇంకా బాగా పని చేస్తాయని వాటి ముందు కాయలు కడితే గుడ్డిగా అనుసరిస్తూ వస్తాయని అనుకుంటారు. ఇలాంటి నమ్మకాలు వున్న వారు ఎవరైనా సరే ఎన్నటికీ విప్లవకారులు కాజాలరు. ఇందులో నమ్మకం ఉన్న వారు ఎవరైనా సోషలిస్టులు కాజాలరు, కమ్యూనిస్టులు కాజాలరు.

మనుషులపైన విశ్వాసం అంటే ఏమిటో చెప్పే ఉదాహరణ మన విప్లవం. ఎందుకంటే మన విప్లవం చాలా కింది స్థాయి నుంచి దాదాపు శూన్యం నుంచి ప్రారంభం అయ్యింది. మన దగ్గర ఒక్క ఆయుధం కూడా లేదు. ఒక పెన్నీ కూడా లేదు. పోరాటం ప్రారంభించిన వారు కూడా అనామకులే. అయినా మేము దాన్ని అంతటినీ ఎదుర్కొన్నాము. వారి దగ్గర అపారమైన ధనరాశులు ఉన్నా వేలాది మంది సైనికులు ఉన్నా ఎదుర్కొన్నాము. మానవాళిపైన విశ్వాసం ఉన్నందుకే విప్లవం విజయం సాధించింది. విప్లవం సాధ్యమవ్వటమే కాదు సామ్రాజ్యాన్ని ఎదుర్కొని ఇంత వరకు నిలబడింది. మరికొద్ది రోజుల్లో విప్లవం 30వ వార్షికోత్సవం జరుపుకోవల్సి ఉంది. మానవులపై విశ్వాసం లేకపోతే మనం ఇదంతా ఎలా సాధించగలిగేవాళ్ళం?

చే కు మానవులపై అంతులేని విశ్వాసం ఉండేది. ఆయన ఒక వాస్తవిక వాది. పాదార్థిక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ఆయన వ్యతిరేకం కాదు. సోషలిజం నిర్మాణ పరివర్తన దశలో అవి అవసరమేనని అతను భావించాడు. కానీ చైతన్యానికి నైతిక అంశానికి అంతకంటే



ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చాడు. అయినా సరే చే అవాస్తవిక వాది అని సమాజ పరిస్థితులు తెలియనివాడని అలాగే పెట్టుబడిదారీ విధానం నుంచి అప్పుడే బయటికి వచ్చిన ప్రజల మానసిక స్థితి తెలుసుకోలేనివాడని అనుకోవడం అపహాస్యమే అవుతుంది.

అయితే చే ప్రధానంగా ఆచరణాత్మక వ్యక్తిగా పరిచితుడు. ఒక సైనికుడు, ఒక నాయకుడు, ఒక సైనిక మూర్తి, ఒక గెరిల్లా ఏ పనైనా చేయడంలో మున్ముందు నిలబడే ఆదర్శప్రాయుడు. తను చేయలేని పని ఇతరులను ఏదైనా చేయమని అడిగేవాడు కాదు. సత్యనిరతి, నిజాయితీ, స్వచ్ఛతా, ధైర్యం వీటన్నింటికీ ప్రతిరూపమనదగిన వ్యక్తి. తన సాటి మనుషులతో సౌహార్ద్రత ప్రదర్శించేవాడు. అతనిలో ఉన్న లక్షణాలు ఇతరులు గుర్తుంచుకొనే అంశాలు ఇవి.

చే కు చాలా లోతైన ఆలోచనా శక్తి ఉండేది. విప్లవం తొలి రోజుల్లో అతనికి ఒక అసాధారణమైన అవకాశం లభించింది. సోషలిజం నిర్మాణానికి సంబంధించిన అతిముఖ్యమైన అంశాల్లోకి వెళ్ళే అవకాశం అది. తన లక్షణాలను బట్టి చే ముఖ్యమైన పని ఏది వచ్చినా అందుబాటులో ఉండేవాడు. నిజానికి ఆయనది బహుముఖ వ్యక్తిత్వం ఏ పనైనా సరే సంపూర్ణంగా, లోతుగా, బాధ్యతగా చేసేవాడు.

ఆయన ఐఎన్‌ఆర్‌ఏ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రేరియన్ రిఫాం)లో ఉండేవాడు. తన ఆధ్వర్యంలో కొన్ని పరిశ్రమలు నిర్వహించాడు. అప్పటికి ప్రధాన పరిశ్రమలు ఇంకా జాతీయం కాలేదు. కొన్నింటిని మాత్రమే చేపట్టాము. అతను జాతీయ బ్యాంకుకు అధ్యక్షుడుగా ఉన్నాడు. ఇంకా తనకు అప్పగించిన ఇతర బాధ్యతలు నిర్వహించాడు. పరిశ్రమల శాఖకు ఆధ్వర్యం వహించాడు. అప్పటికి అన్ని పరిశ్రమలు జాతీయమయ్యాయి. ప్రతిదాన్ని నిర్వహించాల్సి వచ్చింది. ఉత్పత్తిని నిలబెట్టాల్సి వచ్చింది. చే ఆ పని చేపట్టాడు. పూర్తి అంకిత భావంతో అహోరాత్రులు పని చేశాడు. శనివారం, ఆదివారం అన్ని గంటలూ. చాలా గడ్డు సమస్యలకు పరిష్కారాలు కనిపెట్టాడు. అప్పుడే ఉత్పత్తి ప్రక్రియకు మార్క్సిజం, లెనినిజం సూత్రాలను అన్వయించడం నేర్చుకున్నాడు. దాన్ని అర్థం చేసుకున్నాడు.

అలా అతను సంవత్సరాలు గడిపాడు. ఎన్నో విషయాలు మాట్లాడాడు. ఈ అంశాలన్నిటి పైనా చాలా చాలా రాశాడు. కమ్యూనిజానికి సాగిపోయేలా సోషలిజాన్ని ఎలా నిర్మించాలో తన అభిప్రాయాలు తెలియజేశాడు. ఇటీవలనే వాటి అన్నింటినీ ఒక సంకలనంగా వేశారు. ఒక ఆర్థికవేత్త రాసిన పుస్తకానికి బహుమానం కూడా లభించింది. చే ఆర్థిక భావాల సారాంశాన్ని అందులో రచయిత పొందుపరిచాడు. చాలా ప్రసంగాల నుంచి, రచనల నుంచి తీసుకొని సంకలనం చేశాడు. ఆ పుస్తకం పేరు చే ఆర్థిక భావాలు. ఈ విషయంలో ఆయనలోని ఇతర లక్షణాలను వెలికి తీయడానికి చాలా కృషి జరిగింది. నిజానికి మన దేశంలోనే దాన్ని చాలా వరకు పట్టించుకోలేదు. చే కు నిజంగా ప్రగాఢమైన సాహసోపేతమైన భావాలు ఉండేవి. అప్పటికే ఉన్న వాటి నుండి అనేక విధాల భిన్నమైన భావాలు ఆయనవి.

దీనంతటి సారాంశం చెప్పాలంటే సోషలిజం నిర్మాణంలో పెట్టుబడిదారీ ఆర్థిక

చట్టాలు తరహాలు ఉపయోగించడానికి చే ఒద్ద వ్యతిరేకి. నేనెప్పుడూ చెబుతున్నట్లుగా ఆయన సోషలిజం కమ్యూనిజం నిర్మాణం అనేది కేవలం సంపద ఉత్పత్తి పంపిణీ మాత్రమే కాదని, విజ్ఞానం చైతన్యాలకు సంబంధించినది కూడానని వాదించేవాడు. ఈ తరహాలు ఉపయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించేవాడు. పెట్టుబడిదారీ సమాజం నుంచి సంక్రమించిన ఈ పద్ధతులను నూతన సమాజ నిర్మాణానికి వాడుకోలేమని నొక్కిచెప్పేవాడు.

ఒకానొక సమయంలో చే భావాలకు పొరబాటు భాష్యాలు వెలువడ్డాయి. అంతకంటే కూడా వాటిని తప్పుగా అన్వయించడం జరిగింది. వాటిని అమలులో పెట్టేందుకు తీవ్రమైన ప్రయత్నం జరగలేదన్నమాట నిజమే. ఒకానొక సమయంలోనైతే చే భావాలకు పూర్తి వ్యతిరేకమైనవి పై చేయి సాధించడం మొదలైంది.

ఈ అంశాన్ని మరింత లోతుగా చర్చించడానికి ఇది సమయం కాదు. నేను ఒక్క విషయం చెప్పాలని చాలా ఆసక్తిగా వున్నాను. ఈరోజు చే 20 వ వర్ధంతి. ఈనాడు ఇక్కడ మనం అందరం లోతైన దిద్దుబాటు కార్యక్రమంలో నిమగ్నమై వున్నాము. దిద్దుబాటు అంటే తీవ్రవాదం కాదు. అది ఆదర్శవాదమూ కాదు. వాస్తవికవాదం తప్ప మరేదీ దిద్దుబాటు కాదు. ఆ పేరుతో ఆకస్మిక మార్పులు చేయడమూ దిద్దుబాటు కాదు.

దిద్దుబాటు అంటే ఏమిటి అన్నదానితో మొదలు పెడతాను. ఆ విషయం ఇంతకు ముందే చెప్పాను. పాత సమస్యలకు కొత్త పరిష్కారాలు వెదకడం, ముందుకొస్తున్న అనేక ప్రతికూల పరిణామాలను చక్కదిద్దడం, మనకున్న వ్యవస్థను యంత్రాంగాన్ని మరింత ఖచ్చితంగా ఉపయోగించుకోవడం ఇవన్నీ అందులో భాగాలే. ఆర్థిక విధానాలు ప్రణాళికా వ్యవస్థ .........

ఇప్పుడు జరగాల్సింది ఏమంటే ఆ గుర్రాన్ని ఉపయోగించుకోవాలి. దాని చెడ్డ అలవాట్లను తెలుసుకోవాలి. తద్వారా కలిగే చిక్కులను దృష్టిలో వుంచుకోవాలి. ఇది ఎలా తన్నింది ఎలా మొండికేసింది వగైరాలన్ని. దాన్ని మన దారిలో నడిపించడానికి ప్రయత్నించాలి. అంతేగాని అది ఎటు నడిస్తే మనమూ అటే పోవడం కాదు. నేను చెప్పేదేమంటే పరిస్థితిని మన అదుపులోకి తెచ్చుకోవాలి.

ఇవి నిజంగా చాలా తీవ్రమైన విషయాలు. క్లిష్టమైనవి కూడా. మనం చీకట్లో తుపాకి పేల్చలేము. ఎలాటి దుస్సాహసాలకు ఆస్కారం లేదు. మనం అనేక సంవత్సరాల విప్లవ క్రమంలో గడించిన అనుభవాలకు ఎంతోకొంత విలువవుంటుంది. అందుకే మనం ఈనాడు ఈ స్థితిలో వున్నాము. విలువను బట్టి మనం ప్రణాళికను పూర్తిచేయలేము. డిమాండ్, తయారయ్యే సరుకులను బట్టి చేయాలి. ఈ విషయం మేము సుస్పష్టంగా చేస్తున్నాము. ఇందుకు భిన్నంగా వ్యవహరించేవారెవరైనా సరే- తొలగించాల్సిందే. మరో మార్గమే లేదు.

అన్ని ప్రాజెక్టులను త్వరగా ప్రారంభించి త్వరగా ముగించాలనేది మా అభిప్రాయం. అప్పుడే గుర్రం మొండి వేషాల కారణంగా కలిగే నష్టాన్ని నివారించడం సాధ్యమవుతుంది. మట్టిపని చేయడం, లోతుగా పునాదులు వేయడం చాలా ముఖ్యమైన పని. అయితే భవన



నిర్మాణం అంత విలువైంది కాదని వదిలేయడం కూడా జరుగుతుంటుంది.' నేనులెక్క ప్రకారం చేయవలిసినంత విలువ మేరకు పని చేశాను. అయితే నేను ఒక్క భవనం కూడా పూర్తి చేయలేదు అని చెప్పడం జరుగుతుంది. ఆ విధంగా లక్షలాది ధనం మట్టిపాలై పోతుంది. మనం ఏదీ పూర్తి చేయం.

ఒక హోటల్ కట్టడానికి పదిహేను సంవత్సరాలు పట్టింది. ఇనుప కడ్డీలు, ఇసుక, రాయి, సిమెంటు, రబ్బరు, ఇంధనం, మనుషులు అన్నీ వ్యర్థమై పోయాయి. దేశం ఆ హోటల్ వల్ల నయాపైస లాభం పొందకముందే. పినార్ డెల్ రోలో మన ఆస్పత్రిని పూర్తి చేయడానికి పద్నాలుగేళ్లు. చివరకు మనం దాన్ని బాగానే పూర్తిచేశామన్నది నిజమే కావచ్చు. అయితే అలాటి పరిస్థితి మళ్లీ ఎప్పుడూ రాకూడదు.

చిన్న దళాలు(బ్రిగేడ్‌లు) అలాటి యంత్రాంగాల కోసం ధ్వంసమైనాయి. అవి ఇప్పుడు మళ్లీ పునర్జన్మ పొందినట్టు లేస్తున్నాయి. ప్రజా ఉద్యమాల సత్తా ఏమిటో చూపిస్తున్నాయి. సిద్ధాంత కర్తలు, సాంకేతిక నిపుణులు, మానవులపై నమ్మకం లేనివాళ్లు ఒక తరహా పెట్టుబడిదారీ విధానంపై నమ్మకం వుంచేవాళ్లు నిలిపేసిన విప్లవకర మార్గం అది. అందువల్లనే మనం ఇలాటి సంకట పరిస్థితిని ఎదుర్కోవలసి వచ్చింది.

రాజధానిలో మినీ బ్రిగేడ్‌లు పుట్టుకొచ్చాయి. పదిహేనేళ్ల కిందట మేము ఇలాటి తీవ్ర సమస్యకు ఒక అద్భుత పరిష్కారం కనుగొన్నాము. అయినా వాటిని పూర్తిగా నాశనం చేశారు. కనుకనే మాకు రాజధానిలో గృహ నిర్మాణం చేపట్టడానికి అవసరమైన శ్రామికబలగం దొరకడం లేదు. సమస్యలు పేరుకుపోతూనే వున్నాయి. వేలాది గృహాలు పైకి పచ్చాయి. అవి కుప్పకూలి జనం ప్రాణాలు తీసే ప్రమాదం ఏర్పడింది.

ఇప్పుడు మళ్లీ మినీ బ్రిగేడ్‌లు మొదలయ్యాయి. రాజధానిలో 20 వేలమందికి పైగా మినీ బ్రిగేడ్ల సభ్యులున్నారు. వారికి నాగ్‌తో కాని , ప్రణాలికా వ్యవస్థతో కాని, ఆర్థిక విధానంతో గాని ఎలాటి వైరుధ్యం లేదు. వారిని అక్కడికి పంపే ఫ్యాక్టరీ లేదా సంస్థ వారికి జీతం ఇస్తుంది. ప్రభుత్వం వాటికి తిరిగి ఆ మొత్తం చెల్లిస్తుంది. తేడా ఏమంటే మామూలు కార్మికుడు అయిదు ఆరు గంటలు పనిచేస్తే ఈ మినీ బ్రిగేడ్‌లో 10,11,12 గంటలు పని చేస్తారు. ఇద్దరు ముగ్గురు చేసే పని చేస్తారు. సంస్థకు ధనం మిగులుతుంది.

మన తరహా పెట్టుబడిదారులు ఈ సంస్థ దీనివల్ల నాశనమై పోయిందని చెప్పలేరు. అందుకు భిన్నంగా వారు ఇలా చెబుతారు: వారు సంస్థకు సహాయం చేస్తున్నారు. మేము 30,40,50 మందిని తక్కువగా పెట్టుకుని పని చేయించుకుంటున్నాను. జీతాలపై తక్కువ ఖర్చు చేస్తున్నాను. నేనులాభాలు గడిస్తాను. కనీసం ఖర్చు తగ్గిస్తాను. జీతాల ఖర్చు తగ్గుతుంది గనక బహుమతులు, బోనస్‌లపై మరింత ఖర్చు చేస్తాను. అతను ఉత్పత్తిని మరింత మెరుగ్గా నిర్వహిస్తాడు. తన కార్మికులకు ఇళ్లు కట్టిస్తాడు. వారు సంతోషం చెందుతారు. అతను కమ్యూనిటీ ప్రాజెక్టులు కడతాడు. ప్రత్యేక పాఠశాలలు, వైద్యశాలలు, ఉద్యోగినుల కోసం శిశు సంరక్షణ కేంద్రాలు ఏర్పడతాయి. ఒక్కముక్కలో చెప్పాలంటే ఆ విధమైన అనేక ఉపయోగకర కార్యక్రమాలు జరుగుతాయి. వాటికోసం ప్రభుత్వం ఏమీ అదనపు

ఖర్చు చేయవలసిన అవసరముండదు.

పెట్టుబడిదారీ తరహా ఇలాటి అద్భుతాలు సాధించగలదా అని మనం అడుగుతున్నాము. జీతాలపై ఏమీ అదనంగా ఖర్చు చేయకుండా రాజధానిలో మీరు 20 వేల గృహాలు అదనంగా కట్టగలరా?జీతాలపై అదనంగా ఏమీ ఖర్చు చేయకుండా 20 వేల శిశు సంరక్షణ కేంద్రాలు మీరు కట్టగలరా? అయిదేళ్లలో యాభై కట్టాలనుకుంటే ఇప్పటికి పూర్తి కానేలేదు. 19500మంది తల్లులు తమ పిల్లలకు కేంద్రాల కోసం ఎదురు చూస్తున్నా ఫలితం కనిపించడం లేదు.

ఈ రోజున చూస్తే రాజధానిలో ప్రతి ఎనిమిది మంది కార్మికులలో ఒకరిని సమీకరించవచ్చునిపిస్తుంది. నేనుగట్టిగా చెప్పగలను. కాని అవసరం లేదు. ఎందుకంటే అంతమందిని సమీకరిస్తే హవానాలో లక్షమంది పనిచేయడానికి అవసరమైన సరంజామా మనం సమకూర్చలేము. ఒక్కొక్కరూ ముగ్గురి పని చేస్తారు కూడా. పనిలో అద్భుతాలు చేయడం మనం చూస్తున్నాము. ఇది ప్రజలందరి భాగస్వామ్యంతో జరుగుతుంది. విప్లవ కర పద్ధతులతో కమ్యూనిస్టు పద్ధతులతో ప్రజల ప్రయోజనాలను ఫ్యాక్టరీల అవసరాలను మేళవించడం ద్వారా జరుగుతుంది.

నేను వివిధ రకాల సిద్ధాంతాలపై తీర్పు చెప్పాలనుకోవడం లేదు. నా సిద్ధాంతాలేవో నాకూ వున్నాయి. వాటిపై నమ్మకమూ వుంది. నేను నమ్మినివీ వున్నాయి. నేటి ప్రపంచంలో ఆ విషయాలు తరచూ చర్చించుతున్నారు. ఇప్పుడుఈ దిద్దుబాటు కార్యక్రమం సాగుతున్న సందర్భంలో చే 20 వర్ధంతి సందర్భంగా ఆయన ఆర్థిక భావాలను తెలియజేయాలని మాత్రమే వినయపూర్వకంగా ప్రయత్నిస్తున్నాను. వాటిని లాటిన్ అమెరికాలో ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో తృతీయ ప్రపంచంలో తెలియజెప్పాలి.

అలాగే మనం సోషలిస్టు శిబిరంలోనూ అనేక పుస్తకాలు చదువుతాం. అన్ని రకాలుగానూ గ్రంథాలు చూస్తాం. చే ఆర్థిక భావాలు కూడా తెలియాలి. వారువాటిని అమలు చేయాలని నేను అనడం లేదు. ఆ చర్చలోకే పోవాలనుకోవడం లేదు.ప్రతివారూ తమకు ఏది సరైందని భావిస్తారో ఆ ఆలోచనను, ఆ సిద్ధాంతాన్ని అమలు చేయాలి. ఆ విషయం ఏ దేశానికి ఆ దేశం నిర్ణయించుకోవాలి. దాన్ని నేను పూర్తిగా గౌరవిస్తాను.

నేను చెప్పేది ఒకటే. నాగరికత గల దేశంలో- నాగరిక ప్రపంచంలో భావాలపరమైన చర్చ జరిగినప్పుడు చే ఆర్థిక భావాలు కూడా తెలియాలి. ముఖ్యంగా మనకు అర్థశాస్త్ర విద్యార్థులకులోటులేదు. వారు అన్ని రకాలైన సిద్ధాంతాలు, గ్రంథాలు, పెట్టుబడిదారీ భావాలు కూడా చదువుతుంటారు. వారు చే సిద్ధాంతాలు కూడా చదవాలనే నేను కోరేది. అది వారి జ్ఞానాన్ని సంపన్నం చేస్తుంది.

ఒకానొక నిర్దిష్ట కాలంలో నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల్లో నుంచి ఉత్పన్నమయ్యే నిర్దిష్ట అనుభవాన్ని బట్టి ఒకే విధంగా పనులు చేయడం సరైందని భావించడం అజ్ఞానమే అవుతుంది. నేను చెప్పదలచుకున్నది ఒక్కటే. మన దృక్పథాన్ని గురించి తెలుసుకోవాలంటే మనం గౌరవించే భావాలను తెలుసుకోవాలంటే చే తరహా సమగ్ర దృక్పథాన్ని అధ్యయనం



చేయాలి. మన భావి ఆర్థికవేత్తలు ఇతర జంతుజాలంలా పెరుగుతారని, వ్యవహరిస్తారని నేను భావించను. వారు చదవాలి. కొన్ని రకాల భావాలు, కొన్ని అభిప్రాయాలు వదిలించుకోవాలి. ఇతర వాటిని కూడా చూసి నేర్చుకోవాలి. విశ్లేషించుకోవాలి.

మనం చే గురించి ఆలోచిస్తున్నట్లయితే, మాకు ఇలా అయిందని అతనికి చెప్పేట్లయితే అతను ఇది నేను ఎప్పుడో చెప్పాను అని ఉండేవాడు. నేను హెచ్చరించాను అని కూడా అనేవాడు. చే భావాల్లో కొన్ని విప్లవ తొలిదశలతో ముడిపడి వున్నవనేది నిజమే కావచ్చు. కాని వాటిలో చాలా భాగం ఇప్పటికీ వర్తిస్తాయి. అవి లేకుండా కమ్యూనిజాన్ని నిర్మించలేము. మానవాళిని అవినీతి లేకుండా చేయలేమన్న భావం కానీ, వారిని దూరం చేసుకోకూడదనే అభిప్రాయం కానీ అలాంటిదే. చైతన్యం లేకుండా సంపద మాత్రమే ఉత్పత్తి చేస్తూ పోతే ఉన్నత స్థాయి సమాజమైన సోషలిజాన్నిగానీ, కమ్యూనిజాన్నిగానీ నిర్మించలేము అన్న మాట నిజం. చే భావాలను కనుక వంటబట్టించుకొని ఉంటే మనం వంద రెటు ఎక్కువ అప్రమత్తంగా ఉండేవాళ్ళం. ఆయన భావాలను కనుక విస్మరించినట్లయితే మనం ముందుకు పోవడం చాలా కష్టమని గట్టి నమ్మకంతో ఇవన్నీ చెబుతున్నాను. అదొక నేరంతో సమానం. అందుకే ఇంతగా చెప్తున్నాను. చాలా మంది చే ను ఒక సాహస సైనికుడుగా, స్వచ్ఛమైన వ్యక్తిగా, ఋషిగా, అమరవీరునిగా, స్వార్థరహితుడుగా మాత్రమే భావిస్తారు. చే ఒక విప్లవకారుడు, ఒక ఆలోచనాపరుడు, సిద్ధాంతకారుడు, గొప్ప భావాలు కలవాడు. విప్లవ పంథాకు తప్పనిసరి అవసరాలైన సూత్రాలను, సాధనాలను అచంచలంగా రూపొందించే సమర్థుడు. అందుకే నేను ఈ 20వ వర్ధంతి సందర్భంగా చే రాజకీయ, ఆర్థిక భావాలు అధ్యయనం చేయాల్సిందిగా మన పార్టీ సభ్యులకు, విద్యార్థులకు, యువతకు పిలుపునిస్తున్నాను.

చే గొప్ప ప్రతిష్టకల్గిన వ్యక్తి. అతని ప్రభావం పెరుగుతూనే వుంటుంది. ఈ వర్ధంతి సందర్భంలో లాంఛనంగా ఏమి చేస్తామనేదానికంటే ఎలాంటి గౌరవాలు కురిపిస్తామనేదానికంటే ఏమి చేస్తామనేదే నిజమైన నివాళి అవుతుంది. అనేక చోట్ల చే స్ఫూర్తి పునరావృతం అవుతున్నది.

చే లెక్కలకు చాలా ప్రాధాన్యత ఇచ్చేవాడు. పైసా పైసా లెక్కించేవాడు. సరైన నిర్మాణం సమర్థవంతమైన అజమాయిషీ, ఖచ్చితమైన ఖాతాలు లేకుండా సోషలిజాన్ని నిర్మించడం, ఆర్థిక వ్యవస్థను నడిపించడం సాధ్యంకాదని చెప్పాడు. శ్రమ ఉత్పాదకత పెరగకుండా అభివృద్ధి జరుగుతుందని చే ఊహించలేదు. ఆర్థిక శాస్త్ర అవసరాల కోసం అతను గణిత శాస్త్రం కూడా చదివాడు. ఆ ఫార్ములాల సహాయంతో లెక్కలు చూడడానికి ఇందతా చేశాడు. సోషలిజం సమర్థతతను అంచనా వేయడానికి కంప్యూటర్లను కూడా ఉపయోగించాలని చే కలలుగన్నాడు. చే ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్లు, గణితం అన్నింటిపట్ల ఆసక్తి చూపాడు కనుకనే పార్టీ నాయకత్వం 20వ వార్షికోత్సవాన్ని ఇక్కడ ఈ అధునాతన ఫ్యాక్టరీ దగ్గర జరపాలని నిర్ణయించింది. ఎర్నెస్టో చే గువేరా మహత్తర వారసత్వానికి

ప్రియతమ స్థానానికి ఇది చక్కటి జ్ఞాపక చిహ్నం. ఈ ఫ్యాక్టరీ కార్మికులు చే పేరు నిలబెడతారనడంలో నాకు ఎలాంటి సందేహంలేదు.

ఇంకా ఈ రాత్రి చెప్పకుండా మిగిలిందేమైనా ఉందంటే ఒక్కటే. మన దగ్గర ఎప్పటికంటే తక్కువగా డాలర్లు ఉన్నప్పటికీ కరువు పరిస్థితులు ఎదురవుతున్నప్పటికీ సామ్రాజ్యవాద దిగ్బంధనం తీవ్రమవుతున్నప్పటికీ నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా ప్రజలు వాటిని తట్టుకొని తగు రీతిలోనే స్పందిస్తున్నారు. నాకు పూర్తి విశ్వాసం, ఆశాభావం కల్గుతున్నాయి. మన ఆలోచనల ప్రకారం పని చేయగల్గిన సత్తా మనకుందనే విశ్వాసం నాలో ఉంది. మనం అది ప్రజలందరితో చేస్తాం. సిద్ధాంతాలు, సూత్రాలతో చేస్తాం. పార్టీ సభ్యులు, కార్మికులు, యువత, రైతులు, మేథావులు ప్రతి ఒక్కరి గౌరవ మర్యాదలు నిలబెడతాం.

చే కు మనం సముచితమైన నివాళులు, గౌరవాలు అర్పిస్తున్నామని నేను సగర్వంగా చెప్పగలను. ఎప్పటికంటే ఇప్పుడే అతను మరింతగా జీవిస్తాడు. అలాగే మన జన్మభూమి కూడా. ఆయన సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎంత గట్టిగా నిలబడ్డాడో అలాగే మన జన్మభూమి కూడా దానికి, దాని శిథిల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా మరింత గట్టిగా నిలబడుతుంది. మనం విప్లవ మార్గాన్ని సోషలిస్టు, కమ్యూనిస్టు విప్లవ మార్గాన్ని ఎంచుకున్నాం. కమ్యూనిజం నిర్మాణం చేపట్టాము. ఈ రోజు మనం ఆ మార్గాన్ని ఎంచుకున్నందుకు ఎంతగానో గర్వపడుతున్నాము. చే వంటి యోధులకు అది ప్రేరణనిచ్చింది. మార్టీ చెప్పినట్లుగా గౌరవంలేని ప్రజలు ఉన్నట్టే తమలో అనేక మంది గౌరవాన్ని ఇముడ్చుకున్నవారు కూడా ఉంటారు. మొత్తం ప్రపంచ గౌరవాన్ని తమలో ఇముడ్చుకున్న వారు కూడా ఉంటారు. అటువంటి వారిలో చే ఒకడు.



# ముగింపు

మనం ఎప్పుడూ చే క్యూబా గురించి చేసిన ఆలోచనలను చాలా శ్రద్ధగా పరిశీలిస్తూ వచ్చాం. దిద్దుబాటు కార్యక్రమం మొదలుపెట్టినప్పటినుంచీ దాన్ని గురించి నేను ఆలోచిస్తూనే ఉన్నాను. సోషలిస్టు శిబిరంలో ఈ సమస్యలు తలెత్తక ముందు నుంచి భూతలంపై పెరిస్త్రోయిక అన్నది రాకముంధు నుంచి కూడా. చే 20వ వర్ధంతి సందర్భంలో అనుకుంటాను నేను ఆ విషయాలన్నీ వివరంగా మాట్లాడాను.

సోషలిస్టు శిబిరంలో జరిగిందంతా చూసినప్పుడు చే పట్ల నా గౌరవం, సహచర భావం. మరింత పెరిగాయి. సోషలిజం నిర్మాణానికి పెట్టుబడిదారీ పద్ధతులు ఉపయోగించడాన్ని అతను ఎప్పుడూ సుస్పష్టంగా వ్యతిరేకించే వాడు. అలాంటి పద్ధతుల కారణంగానే సోషలిస్టు దేశాల్లో పరాయీకరణ భావం పెరిగింది.

ఈ దేశాల్లో సోషలిజం కూలిపోవడానికి కారణం ఏమిటని మీరు అడుగుతున్నారు. ఈ విషయంలో చే కు చాలా దూరదృష్టి ఉందనిపిస్తుంది. 1960వ దశకం తొలినాళ్ళలోనే అతను తూర్పు యూరప్‌లో సోషలిజం నిర్మాణానికి అనుసరిస్తున్న పద్ధతుల లోపాలు పర్యవసానాల గురించి చెప్పగలిగాడు.

పెట్టుబడిదారీ తాత్వికత నిండిన పద్ధతులను చేపట్టవల్సిన అవసరంలేదని అతను చెప్పాడు. ఒక సందర్భంలో మనం యూరోపియన్ సోషలిస్టు దేశాల అనుభవాలను అనుకరించడం మొదలుపెట్టాము. క్యూబాలో సోవియట్ యూనియన్‌కు ఇతర సోషలిస్టు దేశాలకు ఉన్న గొప్ప ప్రతిష్ట కారణంగా ఆ దృక్పథాలే బలం పుంజుకున్నాయి. విప్లవం తొలి సంవత్సరాల్లో మనం ఆదర్శవాదంతో చేసిన తప్పులు కూడా అందుకు కారణం. సోవియట్ యూనియన్‌లోనూ, ఇతర సోషలిస్టు యూనియన్‌లోనూ అనుసరించిన పద్ధతులనే క్యూబాలో కూడా సోషలిజం నిర్మాణానికి అనుసరించేందుకు ఇవి దారితీశాయి.

నేనెప్పుడూ సోవియట్ యూనియన్‌కు ఇతర దేశాలకు మధ్య తేడా చూస్తూ వచ్చాను. ఎందుకంటే సోవియట్ యూనియన్‌లో కేవలం ఆ పద్ధతులవల్లనే సోషలిజం నిర్మించబడలేదు. ముఖ్యంగా నేను సోషలిస్టు శిబిరంలోని చిన్న దేశాల గురించి మాట్లాడుతున్నాను. ఎందుకంటే సోవియట్ యూనియన్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చాలా శక్తివంతంగా సాగాయి. దాన్ని

ఒక గొప్ప ఆర్థిక శక్తిగా చేశాయి. పెట్టుబడిదారీ తరహా ఆదాయ దృష్టిగానీ అలాంటి ఇతర పద్ధతులుగానీ దాన్ని సృష్టించలేదు.

మన దేశంలో అలాంటి పద్ధతులు అనుసరించాము. 10, 11 సంవత్సరాల తరువాత మనం ఫలితాల కోసం ఎదురు చూస్తున్నాము. అనేక వక్రీకరణలు, పెడధోరణులు చోటు చేసుకున్నాయి. నేను ఒకసారి ఆగి ఆలోచనలో పడ్డాను. చే గురించి, సోషలిజం నిర్మాణంలో అలాంటి పద్ధతులను నిరాకరించిన అతని ముందు చూపు గురించి ఎప్పుడూ గుర్తు చేసుకుంటున్నాను. సోషలిస్టు శిబిరంలో వచ్చిన పరిణామాలను చూస్తే సోషలిజం నిర్మాణానికి సంబంధించిన చే భావనలు ఇప్పుడు మరింతగా వర్తిస్తాయనిపిస్తుంది.

దిద్దుబాటు కార్యక్రమం మొదలైనప్పుడు చే పైన వచ్చిన ఆ పుస్తకాలను ప్రచురించవల్సిందిగా నేను ప్రోత్సాహించాను. చే ఆర్థిక భావాలను వ్యాప్తి చేయాలన్నాను. దాని అర్థం బాలశిక్షలా చదవాలని కాదు. లోపరహితంగా చూడాలనీ కాదు. ఎందుకంటే మీరు ఎలాంటి ఆలోచనలు కానీ, ఏ సిద్ధాంతావేత్త, రాజకీయకర్త భావాలను కానీ పట్టువిడుపు లేనివిగా పిడివాదంగా చూడకూడదు. నా జీవితమంతా నేను పిడివాదాన్ని వ్యతిరేకిస్తూ వచ్చాను. ఎందుకంటే ఏ ఆలోచన అయినా ఒక సందర్భానికి, పరిస్థితులకు అప్పుడు అందుబాటులో ఉన్న సమాచారం, అనుభవం పరిమితులకు లోబడి ఉంటుంది. కనుక అత్యంత ప్రతిభావంతులైన రాజకీయవేత్తలు, విప్లవకారుల బోధనలను మనం పిడివాదంగా మారనివ్వకుండా జాగ్రత్తపడాలి. ఆ విధంగా చూసినప్పుడు ఒకానొక పరిస్థితికి సంబంధించి లెనిన్ అనుసరించిన దృక్పథం అంతకంటే భిన్నమైన కాలానికి సరిపోకపోవచ్చు.

మార్క్స్, లెనిన్, చే ల భావాలు పిడిపాదాలు కాదు. అవి ఒకానొక చారిత్రక దశలో ఉద్భవించిన రాజకీయ, సామాజిక, విప్లవకర దృష్టికి ప్రతిభావంతమైన ఉదాహరణలు. వాటిని తిరుగులేని పిడివాదంగా చేయనంతవరకు అన్వయిస్తూనే ఉండవచ్చు. అలా చేస్తే మాత్రం వాటిలోని శాస్త్రీయ, రాజకీయ, విప్లవ సారాంశాన్ని తీసివేసినట్టు అవుతుంది. మతభావంలా మారిపోతుంది.

సోవియట్ యూనియన్ ఇతర సోషలిస్టు శిబిరం భిన్న మార్గంలో పయనిస్తున్నప్పుడు నేను చే భావాలను విస్తృతంగా వ్యాపింపచేయడానికి ప్రయత్నించాను. ఆ దేశాలు చే ఆలోచనల నుంచి సుదూరంగా పోవడానికి కారణాలేమిటో అవి అంతకంతకూ పెట్టుబడిదారీ తరహాలవైపు యంత్రాంగాల వైపు పోతున్నాయని చెప్పాను. సోషలిజాన్ని మెరుగుపరిచే ప్రయత్నంలో వారు సోషలిజాన్ని హతమార్చే విషాన్ని అంతకంతకూ ఎక్కువగా ఉపయోగించారు. సోషలిస్టు శిబిరంలో జరిగిన పరిణామాలకు అది కూడా ఒక కారణం.



# చే జీవిత గమనం

| | | |
|---|---|---|
| జూన్ 14, 1928 | : | అర్జెంటీనాలోని రొసారియోలో ఎర్నెస్టో గువేరా లించ్, సెలియా డి లా సెర్న దంపతులకు ఎర్నెస్టో చేగువేరా జన్మించారు. ఐదుగురు సంతానంలో ఆయనే మొదటి వాడు. |
| 1947 | : | గువేరా కుటుంబం బ్యూనస్ ఎయిర్స్‌కు మకాం మార్చింది. |
| 1947-53 | : | బ్యూనస్ ఎయిర్స్ వైద్య కళాశాలలో చే విద్యాభ్యాసం. |
| డిసెంబరు 1951- జులై 1952 | : | చిలీ, పెరు, కొలంబియా, వెనిజులాలో చే పర్యటన. |
| మార్చి 10 1952 | : | క్యూబాలో బాటిస్టా తిరుగుబాటు చే పర్యటన. |
| మార్చి 10, 1953 | : | చే వైద్య శాస్త్ర పట్టభద్రుడయ్యారు. |
| జులై 6, 1953 | : | వైద్యునిగా లాటిన్ అమెరికాలో పర్యటన. 1952 విప్లవ ప్రభావాన్ని పరిశీలించేందుకు బొలీవియా పర్యటన. |
| జూలై 26, 1953 | : | మోంకాడా సైనిక శిబిరంపై ఫైడేల్ కాస్ట్రో నేతృత్వంలో దాడి |
| డిసెంబరు 1953 | : | మోంకాడా దాడిలో ప్రాణాలు దక్కించుకున్న విప్లవకారులతో సాన్ జోస్ (కోస్టారికా) లో పరిచయం. |
| జనవరి- జూన్ 1954 | : | మార్క్సిజం అధ్యయనం, రాజకీయ కార్యకలాపాలు |
| జూన్ 17, 1954 | : | సిఐఎ ప్రోద్బలంతో తిరుగుబాటుదారులు గ్వాటిమాలా ఆక్రమణ, వారికి వ్యతిరేకంగా పోరాడడానికి గువేరా సంసిద్ధత |
| ఆగష్టు 1954 | : | తిరుగుబాటుదారుల మారణహోమం |
| సెప్టెంబరు 21, 1954 | : | గ్వాటిమాలా వీడి మెక్సికో నగరానికి చేరిక. కేంద్ర వైద్యశాలలో ఉద్యోగం. |
| మే 15, 1955 | : | జైలు నుండి కాస్ట్రో విడుదల |
| జులై 7, 1955 | : | కాస్ట్రో మెక్సికో చేరిక, క్యూబా సాయుధ యాత్రకు వ్యూహరచన |
| జులై 1955 | : | కాస్ట్రోను కలుసుకున్న గువేరా. సాయుధ యాత్రలో మూడవ సభ్యునిగా చేరిక |
| జూన్ 24, 1956 | : | కాస్ట్రో, గువేరాలను అదుపులోకి తీసుకున్న మెక్సికో పోలీసులు. 57 రోజులపాటు గువేరా నిర్బంధం. |
| నవంబరు 25, 1956 | : | టుక్స్పాన్ (మెక్సికో) నుండి గ్రాన్మా పయనం |

| | |
|---|---|
| నవంబరు 30, 1956 | సాంటియాగో డి క్యూబాలో ఉద్యమం |
| డిసెంబరు 2,1956 | లాస్ కొలొరాడస్ ( క్యూబా)కు గ్రాన్మా చేరిక |
| డిసెంబరు 5, 1956 | బాటిస్టా సైన్యంతో పోరాటం, గువేరాకు గాయాలు |
| జనవరి 17, 1957 | లాప్లాటో సంఘర్షణలో సైన్య శిబిరాన్ని ఆక్రమించుకున్న విప్లవ సైన్యం. |
| మార్చి 13, 1957 | హవానా అధ్యక్ష భవనంపై దాడి విఫలం. |
| మే 27-28, 1957 | ఎల్ ఉవేరో యుద్ధం,విప్లవ సైన్యం జయకేతనం |
| జులై 1957 | విప్లవ సైన్యం ద్వితీయ విభాగం ఆవిర్భావం, గువేరా సారథ్యం. |
| ఏప్రిల్ 9, 1958 | సార్వత్రిక సమ్మె విఫలం |
| మే 1958 | బాటిస్టా సైన్యంతో సియర్రా మాయెస్ట్రాలో భీకరపోరు. అణచివేత విఫలం |
| జులై 1958 | ఎల్ జిగ్యూ యుద్ధంలో విజయం |
| అగష్టు 31, 1958 | గువేరా నాయకత్వంలో లాస్ విల్లాస్‌కు దండయాత్ర |
| అక్టోబరు 16, 1958 | గువేరా సైన్యం ఎస్కాంబ్రే పర్వతాలకు చేరిక |
| డిసెంబరు 1958 | లాస్ విల్లీస్ రాజధాని శాంటా క్లారా ఆక్రమణ |
| జనవరి 1, 1959 | క్యూబా నుండి పారిపోయిన బాటిస్టా, సైనిక పాలన సాయుధ పోరాటం కొనసాగుతుందని కాస్ట్రో ప్రకటన |
| జనవరి 2, 1959 | సార్వత్రిక సమ్మె: గువేరా, సియన్ ఫ్యూగస్ ఆధ్వర్యంలోని విప్లవ సైన్యాలు హవానా చేరిక, లా కబానా కోట స్వాధీనం |
| జనవరి 8, 1959 | హవానా చేరుకున్న కాస్ట్రోకు ఘన స్వాగతం |
| ఫిబ్రవరి 9, 1959 | క్యూబా పౌరునిగా గువేరాకు గుర్తింపు |
| ఫిబ్రవరి16,1959 | ప్రధానమంత్రిగా కాస్ట్రో |
| మే 17,1959 | భూ సంస్కరణల అమలు |
| జూన్ 12 – సెప్టెంబరు 8, 1959 | ఐరోపా, ఆఫ్రికా, ఆసియాలలో గువేరా పర్యటన |
| అక్టోబరు 7, 1959 | వ్యవసాయ సంస్కరణలు, పరిశ్రమల శాఖ అధిపతిగా గువేరా నియామకం |
| నవంబరు 26, 1959 | క్యూబా జాతీయ బ్యాంకు అధ్యక్షునిగా గువేరా నియామకం |
| మార్చి 19, 1960 | క్యూబా శరణార్థుల సైన్యంతో క్యూబా ఆక్రమణకు అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హవర్ ఆదేశం |
| అక్టోబర్ 21,1960 | సోవియట్ యూనియన్, తూర్పు జర్మనీ చెకొస్లోవేకియా, చైనా, ఉత్తర కొరియాలలో గువేరా పర్యటన |
| జనవరి 3, 1961 | క్యూబాతో దౌత్య సంబంధాలు తెంచుకున్న అమెరికా |
| జనవరి 6, 1961 | సోవియట్ యూనియన్‌తో కుదుర్చుకున్న ఆర్థిక ఒప్పందాల గురించి ప్రజలకు గువేరా వివరణ |
| ఫిబ్రవరి 23, 1961 | పరిశ్రమల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన గువేరా |
| ఏప్రిల్ 15,1961 | శాంటియాగో డి క్యూబా, హవానాపై అమెరికా ప్రోద్బలంతో వైమానిక దాడులు. |
| ఏప్రిల్ 17-19, 1961 | బే ఆఫ్ పిగ్స్ వద్ద తిరుగుబాటు అణచివేత |
| ఆగష్టు 8, 1961 | ఆర్గనైజేషన్ ఆఫ్ అమెరికన్ స్టేట్స్ సమావేశంలో క్యూబా ప్రతినిధిగా గువేరా ప్రసంగం |
| ఆగస్టు27 - సెప్టెంబరు 7, 1962 | రెండవ సారి రష్యాలో పర్యటించిన గువేరా |
| అక్టోబరు 22,1962 | క్యూబా క్షిపణి సంక్షోభం |
| జులై 3-17, 1963 | గువేరా అల్జీరియా పర్యటన |
| మార్చి 25, 1964 | ఐక్యరాజ్య సమితి వాణిజ్య, అభివృద్ధి మండలి సమావేశంలో గువేరా ప్రసంగం |
| డిసెంబరు 11, 1964 | ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో గువేరా ప్రసంగం |
| మార్చి 14, 1965 | మూడు నెలల విదేశీ పర్యటన ముగించుకొని క్యూబా చేరుకున్న గువేరా , రాజకీయ కార్యకలాపాల విరమణ |
| ఏప్రిల్1, 1965 | ఫైడెల్ కాస్ట్రోకు వీడ్కోలు లేఖ సమర్పించిన గువేరా కాంగోలో టాతు పేరుతో కార్యకలాపాలు |
| డిసెంబరు 1965 | క్యూబాలో రహస్య పర్యటన , బొలీవియాకు పయనం |
| మార్చి 23, 1967 | బొలీవియాలో విప్లవ యుద్ధం ప్రారంభం |
| జులై 31 - ఆగస్టు 10, 1967 | లాటిన్ అమెరికా సంఘీభావ సంస్థ గౌరవ అధ్యక్షునిగా గువేరా ఎన్నిక. |
| అక్టోబరు 8, 1967 | బొలీవియా సైనికులతో పోరాటం, గువేరాకు గాయాలు |
| అక్టోబరు 9, 1967 | గువేరాతో సహా ఇద్దరు నిర్బంధ గెరిల్లాల హత్య |
| అక్టోబరు 15, 1967 | గువేరా మరణవార్తను అధికారికంగా ప్రకటించిన కాస్ట్రో , మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా సంతాపం. |
| అక్టోబరు 18, 1967 | పది లక్షల మందితో హవానాలో గువేరా స్మారక సభ , కాస్ట్రో ప్రసంగం |
| మార్చి 1968 | గువేరా బొలీవియా డైరీ , ప్రచురణ, ప్రజలకు ఉచితంగా పంపిణీ. |
| జూన్ 28,1997 | మూడు దశబ్దాల తర్వాత గువేరా భౌతిక అవశేషాలను వెలికితీసిన బొలీవియా అధికారులు |
| అక్టోబరు 1997 | గువేరా అవశేషాలను సాంటాక్లారా (క్యూబా)లో ఖననం చేసిన క్యూబా అధికారులు |